ఆంధ్ర వీరులు



శేషాద్రి రమణ కవులు

ఆంధ్రవీరులు

1వ భాగము

గ్రంథకర్తలు:

శ్రీ శేషాద్రి రమణకవులు.

(శతావధానులు)

వేంకటరామ్ అండ్ కో.,
బెజవాడ.

ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు
క. కోదండరామయ్యగారిచే
ముద్రింపఁబడియె.

1929.

సర్వస్వామ్య సంకలితము]　　　[వెల రు. అణా

విషయ సూచిక.

పీఠిక.

సహృదయులారా ?

ఆంధ్రవీరరత్నావళి యను పేరుతో ఆంధ్రులందు బ్రసిద్ధులైన లోకోత్తర పురుషుల జీవితములు కథలుగ వ్రాసి బాలురకు పద్యార్థిదశలోనే మాతృదేశాభిమానము గలిగించుట యుచితమని యీ పుస్తకమును వ్రాయ దొరకొంటిమి. మాయుద్యమము వే. సత్యనారాయణమూర్తి గారి వలన విని వేంకటరాం అండుకో వారు తాము స్వయముగ బ్రకటించి కొందుమనియు ద్వరలో బూర్తిచేయుమనియు, బ్రోత్సహించిరి. వారి యాదరణము నూతగా గొని ఉన్నత పాఠశాలయందలి మా పండిత పదవి యందలి యనుభవమును బురస్కరించుకొని యీ చరిత్ర కథాగ్రంథమును రచించితిమి.

విస్తృతమగు నాంధ్రదేశమునందు బలువురు మహనీయు లుద్భవించిరి. వారి త్యాగదీక్ష, కౌశలము ప్రపంచమునందలి యేజాతీయ నాయకునకు దీసిపోవదనుట కీ చిన్నిపొత్తము సాక్ష్యము గాగలదు. ఆంధ్రవీరుల వికాసము, రాజ్యవిస్తృతి. పతనము క్రమముగా నీపుస్తకమునందు దెలుపబడినవి. ఆంధ్రుల చరిత్రము చాల వఱకు బురాణ యుగమున నజ్ఞాతముగ గున్నదనుటకు జాణక్యుని చరిత్రమును దార్కాణముగ దీసికొన వచ్చును. తరువాత నాంధ్రులు జాతీయతా ధర్మ నిర్వహణ ప్రవీణులై పొందిన మహత్తరమగు నభ్యున్నతికి గౌతమీపుత్ర శాతకర్ణి చరిత్రము దృష్టాంతము. తరువాత బశ్చిమ చాళుక్యులు, రాష్ట్రకూటులు తమలో దాము పోరాడుకొనుటయు జోడులు విజృంభించుటయు జరిత్ర విశేషములు. వీనిని గమనించితిమేని అసల నాంధ్రదేశము నంతయు నేకధాటిగ బాలించిన వీరుడు కులోత్తుంగ ఛోళదేవుడు. ఈతని యనంతరము ఆంధ్రదేశమును జీలికలు గావించుకొని చిన్న చిన్న రాజులు పాలించుటయు బ్రజలలో స్వాతంత్ర్యభావ ముదయించి తమలో దాము పోరాడు కొనసాగిరనుటకు బాలచంద్రుడు ఖడ్గ తిక్కనల చరిత్ర ముదాహరణముగ గొననగును. చీలిపోయిన యాంధ్ర తేజమును గేంద్రీకరించి స్వతంత్రమగు సామ్రాజ్యమును బ్రజా క్షేమకరముగా బాలించిన మహోదారుడు ప్రతాపరుద్ర చక్రవర్తి. ఈతని కాలముననే సమస్త కళలు, భాష ఆంధ్రజాతీయిత అభివృద్ధికి వచ్చినవి. పరాధీన దుర్దశ బ్రాప్తింపవలసి యుండుటచే నీ చక్రవర్తి బంధీకృతుడు గావలసి వచ్చినది. ఈయన యనంతరము దేశీయువీరులు చిన్న చిన్న రాజ్యములు స్థాపించి యెటుల నభివృద్ధిమార్గముల నన్వేషించిరో బ్రాహ్మణు వీరు లెటుల సామ్రాజ్య నిర్మాణమునకు దోడుపడిరో తెలిసికొనుటకు హరిహరరాయల బుక్కరాయల మాధవవిద్యారణ్యుల చరిత్ర సంగ్రహము సాధనము కాగలదు. ఆంధ్రసామ్రాజ్యము పునరుద్ధరించి తనకత్తి కెదురులేకుండ బోయినతావున నెల్ల జయము నొంది ద్రవిడాంధ్రోత్కలు దేశములను లోగొని ఆంధ్రదేశమును యపనులపాలుగాకుండ గాపాడినది శ్రీకృష్ణదేవరాయలు.

ఈ మహాత్ముని వాఙ్మయసేవ, దేశసేవ, మాతృదేశాభిమానము నద్వితీయము. సమగ్రమగు నాంధ్రత్వ మంతయు నితనియెడ నిండి నిబిడీకృత మయ్యెను. ఆంధ్రుల పతనమునకు సూచనలు కృష్ణదేవరాయల తుది కాలము నుండియే యేర్పడెను. తరువాత నేకామిషవాంఛతో హిందూ మహమ్మదీయులకు రాజకుటుంబమునకు గలతలు సంభవించెను. అన్నింటిని సవరించి రాజ్యము పునరుద్ధరించిన వాడు రామరాజు. పూర్వులకంటె నీత డత్యున్నత వహించెను గాని యీతడు ఘోర మృత్యు ముఖమున నదృశ్యు డగుటతో నాంధ్రుల సంపద, పెంపు, ఉన్నతి నసించెను. ఇవియే పరాధీనతకు మొదటి దినములు. తరువాత నెంత వీరుడేని స్వతంత్రరాజ్యము స్థాపింప వీలు లేకపోవుటయు బరస్పరాసూయలు ప్రజల టయు ధర్మ సంస్థాపనార్థము వీరు లాత్మార్పణము గావించుటయు యాచశూరుని చరిత్రమువలన దెలియును. అంతటితో ఆంధ్రుల స్వాతంత్ర్య వికాసము కడబట్టి చిన్న చిన్న జమీనులతో దృప్తిపడవలసి వచ్చినది. మొగలు రాజ్యములలో నొకటగు గోలకొండ రాజ్యమునందు మంత్రులుగ నుండి ఆర్షధర్మములను యవనులు ద్రోహము గావింపకుండ జెల్లెలి కట్టవలె నడుపడి మంత్రిపదవిని నామమాత్రముగా నుంచుకొని ఆంధ్రదేశము నేక హేలగా బాలించిన యక్కన్న మాదన్నలనాడు మఱల నాంధ్ర వికాసము తలయెత్తినది.

దురాగతులగు రాజద్రోహులచే మిగుల ఘోరముగా అక్కన్న మాదన్న లేనాడు గోలకొండ రాజవీధిలో జంప బడిరో ఆంధ్రజాతీయ పతనము దర్శింపజాలక యాత్మ రక్తముతో నాంధ్రమాత పదము లభిషేకించి యేనాడు అక్కన్న మాదన్నలు త్యాగము ప్రకటించిరో యానాటితో నాంధ్రులు చరిత్రశరణ్యులై పూర్వ వికాసము నంతయు గోలుపోయిరనియు నాటినుండి స్వతంత్ర రాజ్యస్థాపకుడగు వీరుడు జనింప లేదనియు నెఱుంగనగును.

ఈవిధముగా గ్రీస్తుశకము పూర్వము నుండి పదునెనిమిదవ శతాబ్దము వఱకు గల సంగ్రహచరిత్ర యీగ్రంథమున నిముడ్పబడెను. ప్రకాశకు నీ పొత్తములు ఆంధ్రవీర రత్నావళి అనుటకంటె ఆంధ్రవీరు లనుట యుక్తమని పేరు మార్చుటలో స్వతంత్రించిరి. ఈ చిన్ని పుస్తకము ఆంధ్రుల హృదయమున నాంధ్రప్రతిభను ద్యోతకము చేయునేని ధన్యులము. గ్రంథము గ్రాంథికభాషలో జరిత్రానుకూలముగ వ్రాసితిమని పాఠకులకు విన్న వించుచున్నారము.

ఇట్లు భాషాసేవకులు,
నందిగామ, శేషాద్రి రమణకవులు,
29-4-1927. శతావధానులు.

శ్రీరస్తు.

ఆంధ్ర వీరులు.

చాణక్యుడు.

భరతఖండమునందలి దేశములన్నిటిలో మగధ మిగుల బ్రసిద్ధమైనది. మగధదేశము చిరకాలము వీరాధివీరులు, పరాక్రమశాలురు, ధర్మస్వరూపులు నగు రాజులకు రాజధానిగ నుండెను. పాండవులను శ్రీకృష్ణుని ఉఱ్ఱూతలూపిన వీరవతంసుడగు జరాసంధుని రాజధాని యీ మగధదేశమందలి గిరివ్రజము. దీనిచెంతనే బింబిసారుడు రాజగృహ మను నగరమును నిర్మించెను. తరువాత గొంతకాలమునకు అజాతశత్రుడు రాజ్యమునకువచ్చి గంగాతీరమునందున్న పాటలియను నొక పల్లెచెంత గొప్ప దుర్గమును గట్టెను. అతని మనుమడగు ఉదయనుడు పాటలీదుర్గముచెంత పాటలీపుత్రమను గొప్పనగరము నిర్మించెను.

పాటలీపుత్రము గంగ, శౌణ, గోగ్ర మొదలగు నదులు సంగమస్థలము చెంత నిర్మింపబడెను. బుద్ధాది మహానుభావు లచే నీ పాటలీపుత్రము పవిత్ర మొనర్పబడియెను. మన కథాకాలమున నీ రాజ్యమును మహాపద్మనందుడు తన యెనమండ్రు కుమారుల సాయముతో బాలించుచుండెను. మహాపద్మునకు ఇళ, మురయను నిరువురు రాణులు గలరు. ఇళ యందు ఎనిమిదిమంది కుమారులు జనించిరి. మహాపద్మునితో గలిపి వీరిని నవనందు లని యాకాలమున బేర్కొనుచుండిరి. రెండవ భార్యయగు మురయందు జన్మించిన వాడు చంద్రగుప్తుడు. తేజశ్శాలియు బుద్ధిమంతుడు నగు చంద్రగుప్తునియెడ సవతియన్న లెనమండ్రును పగ బూని యెటులేని మట్టుపెట్ట జూచుచుండిరి. మహాపద్ముడు ముదుసలియగుట చేతను జంద్రగుప్తుడు మిగుల జిన్నవాడగుట చేతను, రాజ్యభారమంతయు ఎనమండ్రునందులకు గైవసమయ్యెను. చంద్రగుప్తుని మట్టు పెట్ట నెన్నియో కపటోపాయములను బన్నుచు నందులెనమండ్రు దురాలోచనము జేయుచుండిరి. చంద్రగుప్తుడు మిగుల శ్రమలందుచు దైవ సహాయమున నెటులో యాపదనుండి గట్టెక్కుచు గాలయాపనము దినమొక యేడుగ జేయుచుండెను. కడకు జంద్రగుప్తుడు పొట్టకూటికి వెరవు చాలక సత్రాధికారిగనుండి దీనుడై కాలము గడుపుచుండెను.

నందు లహంకరించి మహామంత్రియు నేర్పరియునగు రాక్షసుని మాటనేని పాటింపక మిగుల స్వతంత్ర భావముతో వర్తించుచుండిరి. ఒకదినమున చాణక్యు డను యువకుడు పండితవతంసుడు నందరాజుల సభకువచ్చి యటగల యొక యున్నతాసనమున నాసీనుడై యుండెను. నందు లచటకువచ్చి యుత్తమ పీఠమునందున్న యాపేదబాపని మిగుల

దిరస్కారభావముతో జూచి సింహాసనమునుండి పడ లాగిరి. అమాత్యరాక్షసుం డిది యక్రమమనియు బండితులు పూజనీయులనియు బోధించెను కాని లాభములేకపోయెను. సిగముడి వీడ నున్న తాసనమునుండి లాగబడిన చాణక్యుడు నందులను గోపముతో దేఱి పాఱజూచి "ఓ నందాధము లారా! బహుజనమధ్యమునందు నన్నిటుల అవమానించితిరి. మిమ్మిటులే సింహాసనమునుండి లాగి మీతలలను నరికి మీచే నూడ దీయబడిన యీ తలవెండ్రుకల ముడి వేసు కొనను" అని సభామందిరమును వదలి వెడలిపోయెను.

చాణక్యు డిటుల గోపించి పోవుటజూచి చంద్రగుప్తుడు మాఱుత్రోవను బోయి యొక యేకాంత ప్రదేశమున జాణక్యుని గలిసికొని సాగిలి నమస్కరించి నందాదులచే దానొందు నవస్థల దెలిపి తన్నను గ్రహింపుమని వేడుకొనెను. చంద్రగుప్తుని లేవనెత్తి చాణక్యు డాదరించి నందరాజ్యమునకు నిన్ను బట్టాభిషిక్తునిగావించుట నారెండవ ప్రతిజ్ఞయని నాడు మొదలు చంద్రగుప్తుని తనయొద్దనే యుంచుకొని నందకుల నిర్మూలమునకై ప్రయత్నములు చేయుచుండెను.



చాణక్యుడు

సర్వశాస్త్ర పారంగతుడు, రాజనీతివిదుడు, దూరాలోచనపరుడు నగు చాణక్యుడు తన మిత్రుడును సహాధ్యాయయు నగు నిందుశర్మను సమీపించి జరిగిన యంశము తన ప్రతిజ్ఞయు దెలిపి 'నీ వెటులేని క్షపణక వేషముతో అభిచారిక విద్యచే నందులను, రాక్షసుని లోగొని యచటి రహస్యములను చారులచే నెఱింగించుచు, జంద్రగుప్తునకు నందరాజ్యమును ధారవోయుటకు దోడ్పడు' మని కోరెను. ఇందుశర్మ యటులె యని యంగీకరించి నందుల చెంతకేగి చెలిమిగడించి రాక్షసుని చెంత బ్రాపకము నార్జించి తలలో నాలుకవలె గలిసిమెలసి యుండి రాజ్యరహస్యము లన్నియు నెప్పటికప్పుడు చాణక్యున కెఱింగించుచుండెను. చాణక్యుడు చంద్రగుప్తుని వెంటగొని హిమాలయపర్వత ప్రాంతమునందున్న యరణ్య భాగములను బాలించుపర్వతరాజు చెంత జేరి

యతని స్నేహమును సంపాదించి నందసంహారమున కాతని బ్రోత్సహించెను. గెలిచిన యెడల నందరాజ్యమునందు సగము పర్వతరాజునకొసంగుటకు గూడ జాణక్యుడు వాగ్దానము గావించెను. జయించితిమేని జాణక్యుని జంద్రగుప్తుని వంచించి నందరాజ్యము నంతయు హరింప వచ్చునని పర్వతరాజు తలంచి సామంతుల యొద్దనుండి మిత్రుల యొద్దనుండి యసంఖ్యాకమగు సైన్యమును రప్పించి చాణక్యుడు పెట్టిన సంమూర్తమున నందరాజ్యముపైకి దా వెడలెను. పర్వతరాజు వెంట నాతని సైన్యమె కాక శక, యవన కిరాత, కాంభోజ, పారసీక, బాహ్లి కాది సైన్యములుగూడ వచ్చెను. చాణక్యుడు, చంద్రగుప్తుడు సైన్యమును మూడు భాగములుగా భాగించి తాము చెరియొక భాగమును దీసికొని గండకీ ప్రాంతమునకు బోయి పాటలీపుత్రమును ముట్టడించిరి. పర్వతరాజు కడమ మూడవభాగమును వెంటగొని గంగా శోణా సంగమప్రదేశము చెంత పాటలీపుత్రమును ముట్టడించెను. ఇందుశర్మ నందులనందఱ జీలదీసి చాణక్యునకు మోసముగా బట్టియిచ్చెను. చాణక్యుడు ఎనమండ్రు నందులను సంహరించి తన మొదటిప్రతిజ్ఞను నిర్వహించి యప్పుడు తల వెండ్రుకలను ముడివైచికొనెను.

నందుల నాశము జూచి మంత్రియగు రాక్షసుడు మిగుల జింతించి చీలిన సైన్యమునంతయు గూడబఱచి పర్వతరాజు సైన్యముతో బాటలీపుత్రసైన్యమును భయంకరముగా యుద్ధము జేయించెను. నందరాజులమరణము విన్న రాక్షసుల సైన్యము కొంతసేపటికి బర్వతరాజు సైన్యమునకు లొంగిపోయెను. పాటలీపుత్రమునందు అమాత్య రాక్షసున కెక్కుడు పలుకుబడి యుండుటచేతను వెంటనే రాజ్యమున బ్రవేశించినచో జంద్రగుప్తునకైనను దనకైనను నపాయము గలుగవచ్చుననియు బర్వతరాజు నందరాజ్యమంతయు దానే లోగొను నేమోయనియు సంశయించి చాణ క్యుడు జయించిన రాజ్యమున బ్రవేశింప నగరబహిర్భాగమున బరిజనముతో విడిసి యుండెను.

రాక్షసు డెటులేని జంద్రగుప్తుని జాణక్యుని జంప దలంచి మాయోపాయములు దక్క వేఱు గతిలేదని యొక యుపాయము పన్నెను. రాక్షసు డొకబాలికను విస మలవాటు చేసి పెంచుచుండెను. ఆబాలిక విసము జీర్ణించుకొనుట కలవాటుపడి యౌవనవతియై సర్వాంగసుందరియై యుండెను. ఆసుందరి తాకినయెడ విసముసోకి మనుజులు మరణింతురు. ఆమెను బిలువనంపి రప్పించి తనచెంత విశ్వాసపాత్రునివలె క్షపణకవేషధారియై వర్తించుచు జీవసిద్ధియను పేరుతోనున్న ఇందుశర్మను బిలిచి యీబాలికను జంద్రగుప్తునకు నేను సమర్పించితి ననియు బరిగ్రహించి మమ్ముల ననుగ్రహింపు మనియు జెప్పి పంపెను. జీవసిద్ధి 'చిత్త మటులనే కావింతు'నని విసకన్యను వెంటగొని చాణక్యునికడకు బోయి జరిగిన యుదంత మంతయు రహస్యముగా దెలిపి విషకన్యను సమర్పించెను. నందరాజ్యము నంతయు హరింపనెంచిన పర్వతరాజును జంప నిదియ తరుణమని చాణక్యుడు విషకన్యను బర్వతరాజునొద్దకు బంపెను. కామాతురుడగు పర్వతరాజు విషకన్యనుజూడగనే యొడలుప్పొంగి కౌగిలించుకొని విషము తల కెక్కి మరణించెను. రాక్షసుని యాన యడుగంటెను. నందరాజ్యమునంతయు హరింపదలంచిన పర్వతేశ్వరుడు గతించుట చాణక్యుని సంకల్పమునకు సర్వవిధముల సహాయకారి యయ్యెను. పర్వతరాజుమరణము విని యతని కుమారుడగు మలయ కేతువు విచారపడుచుండ బ్రతిపక్షుల సేనానయకుడగు భాగురాయణుడు వచ్చి చెలిమి సంపాదించుకొని 'మలయ కేతూ! చాణక్యుడు నీతండ్రిని జంపించినటులె నిన్నును జంపింప నున్నాడు. బ్రదుక దలచిన నిటనుండి వెడలిపోవుట మంచి'దని తెల్పెను. అతని మోసపుమాటలు నమ్మి మలయ కేతువు భాగురాయణుని మంత్రిగ జేసికొని తన పర్వత రాజ్యమునకు వెడలిపోయెను.

పర్వతరాజ కాలమరణ మొందుటయు మలయకేతువు పాఱిపోవుటయు జూచి యిదియె యదనని చాణక్య చంద్రగుప్తులు మంగళవాద్యములతో బాటలీపుత్రమున బ్రవేశించిరి. రాక్షసుడు సైన్యముల బ్రోత్సాహపఱచి చాణక్య చంద్రగుప్తుల బలము మీదికి దన బలమును నడపెను. ఉభయ బలములకు భయంకరమగు సంగరము జరిగెను. రాక్షసుడు ఈ యదును గనిపెట్టి నందులపక్షమున జేరి, చంద్రగుప్తునకు బట్టాభిషేకము చేయరాదని చాటించెను. అంతతో బోక మహానందుని ఒక సురంగ మార్గమున దపము జేసికొనుటకు బంపి యతని స్వీకారపుత్రుని రాజ్యమునందు బ్రతిష్ఠింపవలయునని రాక్షసుడు నిశ్చయించెను. చంద్రగుప్త చాణక్యులు పాటలీపుత్రమున బరిచయము సంపాదించుకొనిన కొలది తన కపకారము కలుగక తప్పదని

రాక్షసుడు గర్భవతి యగు తన భార్యను పుత్రుని ప్రాణమిత్రుడగు చందనదాసునియింట రహస్యముగా నుంచెను. తన యంతరంగ మిత్రుడగు శకటదాసునకు గోశాగారమునందలి ధనము నంతయు నొసంగి నందపక్షమునకు సహాయముచేయు నేర్పాటు చేయించెను. అంతతో దృప్తినందక చంద్రగుప్తుని మట్టుపెట్టిన గాని చాణక్యుడు లొంగడని యమాత్యరాక్షసుడు తలంచి దారు వర్మయను శిల్పిని బిలిపించి చంద్రగుప్తుడు నగరమున జేరునపుడు ద్వారము కూలునటుల జేయుమనెను. ఏనుగు నెక్కి నపుడు చంద్రగుప్తుని చుఱకత్తితో బొడిచి చంపుమని మావటీనిని బ్రోత్సహించెను. రాజవైద్యునితో జంద్రగుప్తునకు విషప్రయోగము చేయుమనియు, శయనాధికారితో నిదురించునపుడు తలనఱకు మనియు గొందఱు ఘాతుకులను గోడ సందులలో బంధించి సమయము జూచి చంపుమనియు రాక్షసుడు కట్టుదిట్టములు చేసెను. చాణక్యుడు తన యసాధారణ ప్రజ్ఞచే రాక్షసుని మాయోపాయము లన్నియు గమనించి చంద్రగుప్తున కెట్టి యపాయము గలుగకుండ గాపాడి హంతకుల నందఱ జంపించెను. సర్వార్థసిద్ధిని వెదకించి చాణక్యుడు కొందఱు హంతకుల బంపి చంపునటుల జేసెను. తన ప్రయత్నము లన్నియు విఫలమగుటయు బర్వతరాజు, సర్వార్థసిద్ధి మరణించుటయు మలయ కేతువు పాఱిపోవుటయు జూచి రాక్షసుడు తాన్విక బాటలీపుత్రమున నున్న గావంతయేని లాభములేదని సురంగమార్గమున నగరుదాటి పర్వతరాజ్యమునకు వెడలి పోయెను. ఇట్లు రాక్షసుడు మలయ కేతువు నొద్దకేగి యతనితో చాణక్యుడె నీతండ్రియగు పర్వతరాజును జంపించెననియు బాటలీపుత్రమును ముట్టడించి తండ్రిని జంపిన పగ దీర్చు కొమ్మనియు బ్రోత్సహించెను. మలయ కేతువునకు శక, గాంధార, యవన, శచీన, హూణాదిరాజులు సైన్యసహితముగా సాయము రానుండిరి.

చంద్రగుప్తుని బట్టాభిషిక్తుని జేయుటతో దనభారము తీరలేదని చాణక్యుడు తలంచి తన యంతరంగ మిత్రుడగు జీవసిద్ధిని బిలువనంపి నీవు విషకన్యను బ్రయోగించి పర్వతరాజును జంపితివి గాన రాజ్యమునం దుండదగవని వెడల నంపెను. ఈయవకాశమును బురస్కరించుకొని జీవసిద్ధి మలయ కేతువును శరణుగోరి రాక్షసునకు మలయ కేతువునకు విరోదము కలుగజేయుచు విషకన్యను బ్రయోగించి రాక్షసుడె పర్వతరాజును జంపెనను ప్రవాదము నందందు గలుగ జేసెను. జీవసిద్ధి యవకాశమున్నపుడెల్ల నచటి రహస్యములు చాణక్యాదులకు గూడచారులచే దెలియబఱచుచు బయటికి మలయ కేతువు పక్షమువానివలె నటించుచుండెను. చాణక్యుడు పాటలీపుత్రమున రాక్షసుని పక్షము వారెటనుండిరొ తెలిసికొనుటకు జారులను నియోగింప వారు వెదకి వెదకి చందనదాసుని యింటిలో రాక్షసుని భార్యయు బిడ్డలు నుండిరని తెలిసి కపటో పాయములతో దామార్జించిన రాక్షసుని ముద్రికను జాణక్యున కొసంగిరి. చాణక్య డాముద్రికా సహాయమున గొన్ని పత్రికలను సృష్టించి జీవసిద్ధి చేతికిచ్చి ప్రచారము లోనికి దెప్పించి, రాక్షసునకు మలయ కేతువునకు విరోధము కలుగు నటుల జేసెను. అందుచే మలయ కేతువు నిశ్చయించిన దాదియు విఫలమయ్యెను. రాక్షసునకు మలయకేతువు నొద్ద ప్రాపకము తగ్గెను. తనతండ్రిని రాక్షసుడే చంపెనని మలయ కేతువు ద్వేషముగూడ వహించెను. 'మృతినొందిన నందాదుల యాత్మ శాంతికొఱకు జాణక్యుని గాని చంద్రగుప్తుని గాని సాధింపలేక పోతినిగదా, నేను జీవించి ఫలమేమని రాక్షసుడు పరితపించు చుండెను. రాక్షసుని నెటులేని చంద్రగుప్తునకు మంత్రినిగా జేసిన బాగుండునని సర్వవిధముల జాణక్యుడు ప్రయత్నించెను గాని నందపక్షపాతియగు రాక్షసుడందుల కంగీకరింపక పోయెను.

రాక్షసుని లోబఱచికొన నేవెరపుగానక చాణక్యుడు కడకొక యుపాయమును బన్నెను. రాక్షసుని భార్య సుతులు చందనదాసుని యింట బాటలీపుత్రమున నుండిరి. చందనదాసుడు రాక్షసునియెడ భక్తివిశ్వాసములు గలవాడు. చాణక్యుడు చందనదాసుని రప్పించి రాక్షసుని భార్యా శిశువుల దన యధీనము గావింపుమని నిర్బంధించెను. స్వామి భక్తిపరాయణుడగు చందనదాసు డందుల కంగీకరింపక తిరుగబడుటచే జాణక్యుడాతని కురిశిక్ష విధించెను; ఈసంగతి రాక్షసుడు విని నిరపరాధియు దన ప్రాణమిత్రుడు నగు చందనదాసునకు దన మూలమున ఘోరమరణము ప్రాప్తింప దున్నందులకు మిగుల వగచి యెటులేని యంత్యకాలమునందేని పరమ విశ్వాసపాత్రుడగు చందనదాసుని గలిసికొని తన ప్రాణము లొసంగియేని యాతని గాపాడనెంచి వధ్యస్థానమునకు జేరెను. హంతకులు చందనదాసుని వధ్యస్థానమునకు జేర్చి యురిదీయబోవు తరుణమున రాక్షసు డడ్డుపడి నిరపరాధియగు చందనదాసుని వదలి నన్ను జంపుడని ముందునకు వచ్చెను. చాణక్యు డది యంతయు జూచి రాక్షసామాత్యా! నీవు చంద్రగుప్తునకు

మంత్రిగానుండుటకు ఇష్టపడెదవేని దోషియగు చందనదాసుని వదలుదుము. లేకున్న ఉరిదియక తప్పదని చెప్పెను.మిత్రసంరక్షణమె తన కవశ్యకర్తవ్యము గావున విథిలేక రాక్షసుడు చంద్రగుప్తునకు మంత్రిగానుండుట కంగీకరించెను. చంద్రగుప్తుడు రాజనీతివిశారదుడగు రాక్షసుడు మంత్రిగనుండుట కెంతయో సంతసించెను. తన ప్రతిజ్ఞలగు నందసంహారము, చంద్రగుప్త పట్టాభిషేకము నీవిధముగా ముగించి రాజ్యము బ్రశాంత మొనరించి చాణక్యు డాధ్యాత్మికవిచారము గావింపనెంచి రాజకీయరంగమునుండి తొలంగెను. గతము నంతయు మఱచి రాక్షసుడు చంద్రగుప్తునిచే ననేక దండయాత్రల నొనరింప జేసి పరాజయము నెఱుంగని విజయములతో పాటలీపుత్రరాజ్యమును మిగుల విస్తరింప జేయుటయేగాక హిమాలయమున కావలి దుర్గమ రాజ్యభాగములుగూడ సాధించెను. మలయ కేతువు చంద్రగుప్తునకు సామంతుడై యుండెను. పర్వతరాజు ఫిలిప్పాస్ అను గ్రీకురాజనియు శల్యూకసు మలయకేతు వనియు నిప్పటి చరిత్రవిదు లూహించుచున్నారు.

చాణక్యుడు ఉత్తమచరిత్రుడు. క్షాత్రమున నీతడు పరశురామునకు, స్వామిభక్తియందు సుగ్రీవునకు, గార్యదక్షత యందు నాంజనేయునకు సమానుడు. చాణక్యుని గుణప్రశంస పురాణాదులయందును కామందకాది రాజనీతి గ్రంథములందును గలదు. రాజనీతిశాస్త్రము లన్నిటియందును దొలుదొలు చాణక్యునిప్రశంస గనబడుచున్నది. చాణక్యుడు వ్రాసిన నీతి శాస్త్రము నీతిగ్రంథములన్నిటిలో మిగుల బ్రశస్తిగాంచియున్నది. చాణక్యుడు "ఇదంక్షాత్ర మిదం బ్రాహ్మ్య"మను ధర్మ సూక్తికి దార్కాణముగ బ్రాహ్మణధర్మములగు పారమార్థిత విజ్ఞానములయందును క్షాత్రధర్మములగు చతురుపాయముల యందును సమర్థుడై మౌర్యరాజ్యమును భరతఖండమున జిరకాలము నిలుచునటుల జేసి సామ్రాజ్య సంరక్షణమునకు బరపక్షకోటిలోనివాడగు రాక్షసుని నియోగించి తాను తపోవనంబున కగెను.

చాణక్యుడు చందనదాసుని స్వామిభక్తికి సంతసించి యాతని విడుచుటయు రాజనీతివిదుడగు రాక్షసుని మంత్రిగ నేర్పాటు చేయుటయు బర్వతరాజును భాగము గోరకుండు జంపుటయు జూడ గుణము గ్రహించుటయం దప్రతిమానుడనియు రాజనీతికొఱకై యెట్టి దురంత కార్యమునకు జంకువాడుకాడనియు దెలిసికొనవచ్చును. చాణక్యు డాంధ్ర బ్రాహ్మణుడని యాధునికులు విశ్వసించుచున్నారు. కాదనుటకు అగుననుటకు బలవత్తరములగు నాధారములు లభించువఱకు ననుమానమె శరణ్యము.

నాడు చంద్రగుప్తుని కైవసమాచరించిన మౌర్యరాజ్యము రూపుమాసినను జాణక్యుని ప్రశస్తిమాత్రము దేశీయులు మఱచిపోవలేదు. మహాత్ముల జీవితము లజరామరములై భవిష్యత్సంతతికి మార్గదర్శకములుగ నాచంద్రార్క స్థాయిగ నుండుననుటకు సంశయములేదు.

చంద్రగుప్తుడు రాజ్యమును బాలించిన కాలము క్రీస్తు శకమునకు బూర్వము 322 - 297 వఱకు నైయుండు నని చరిత్రములవలన దెలియుచున్నది. చంద్రగుప్తునికంటె జాణక్యుడు వయస్సున బెద్దవాడు గాన నతనికి గొంతముందుగ బ్రసిద్ధికివచ్చి చంద్రగుప్తునకు ముందె గతించి యుండును.

చాణక్యుని పాండిత్యమును విద్యాకౌశలమును గూర్చి విశేషించి వ్రాయవలసియున్నను, ఇందు వీరజీవితమును జేర్చుటయే మాసంకల్పముగాన నింతటితో విరమించు చున్నారము.

గౌతమీపుత్ర శాతకర్ణుడు.

ఆంధ్రదేశము నందలి పురాతననగరములలో ధాన్యకటకము తొలుత యెన్నదగినది. బెజవాడకు మూడామడల దూరమున బశ్చిమదిశను గృష్ణాతీరమున అమరావతి చెంత నీజీర్ణనగరము గలదు. దీనినే మనమిపుడు ధరణికోట యని వ్యవహరించుచున్నారము. మిగుల నున్నతములగు మంటిదిబ్బలతో మనోహరములగు బౌద్ధస్థూపములతో నొప్పి పూర్వశోభల గోలుపోయిన యీప్రదేశము నొకమారు సందర్శించి మన పూర్వచరిత్రము స్మరింతుమేని ఆంధ్రరాజుల రాజధాని నగరమునకా యీదుర్దశ యని పరితాపము కలుగకమానదు.

ధరణికోట రాజధానిగ జేసికొని పాలించిన శాతవాహన వంశజులగు నాంధ్రరాజులలో గౌతమీపుత్ర శాతకర్ణి ప్రథమగణ్యుడు. విజ్ఞానమునందును బరాక్రమమందును బరిపాలనాచాకచక్యమునందును నీత డసమానుడు. ఇతడు పలుమాఱు విజయయాత్రల కేగి యవనులను, శకులను, పహ్లవులను లోబఱచికొని ధాన్యకటక సింహాసనాశీనుడైన వెంటనే తన పెద్దకుమారుడగు వులమాయిని యువరాజపట్టాభిషిక్తుని గావించి ప్రతిష్ఠానపురమునం దాతని నుంచి తనపూర్వులు కోలుపోయిన రాజ్యములన్నింటిని గడించెను. ఈనృపాలుని వంశమును శాతవాహనవంశ మని యందురు. శాతవాహన నామము ఎటుల వచ్చినదో తెలుపు చిత్రకథయొకటి వాడుక లోనున్నది. ఆకథయందలి సత్యాసత్యముల జర్చింపక హృదయరంజకమగు నాకథ నిట వ్రాసెదము.

పరాక్రమశాలియు ధర్మమూర్తియు నగు దీపకర్ణిమహారాజు దక్షిణాపథమును బాలించుచుండెను. ఆతనికి రూపవతియు విద్యావతియునగు శక్తిమతియను భార్య కలదు. ఇరువురును మిగుల సౌఖ్యముగ గలసిమెలసియుండ వారి దాంపత్యము గాంచి దైవము కన్ను కుట్టెనేమోయన శక్తిమతి సర్పదష్టురాలై మరణించెను. దీపకర్ణి అనుకూలపత్నీ వియోగమునకు మిగుల దు:ఖించి యుత్తరక్రియ లన్నియు నిర్వహించి తనజీవితమునంతయు బ్రహ్మచర్యావస్థలోనే గడపుచుండెను. నాయనంతర మీమహారాజ్య మెవరిపాలుగానున్నదో, సంతానము లేదుగదా యను చింత దీపకర్ణిహృదయమును దహించు చుండెను. ఒకనాటి వేకువజామున సుఖనిద్రలోనుండ దీపకర్ణి కొక స్వప్నమువచ్చెను. కలలో నీశ్వరుడు కనిపించి నీవరణ్యములకు ఱేపు వేటకుబొమ్ము. నీకు సింహరాజముపై స్వారిచేయు నొకబాలుడు గనిపించును. వానిని గొనితెచ్చి పెంచి యీరాజ్యమును వానికి నిమ్మని చెప్పి యదృశ్యమయ్యెను.



బౌద్ధస్తూపము

తెల్లవారుగనే దీపకర్ణి పరిజనమును వెంటగొని వేటలాడుట కొక యరణ్యమునకుబోయి విహరించుచుండ మార్గమున బరుగెత్తుచున్న యొకసింహరాజము కనబడెను. దానిపై నమితతేజోరాశియు, సుందరాకారుడు నగు నొకబాలుడు

కూర్చుండియుండెను. దీపకర్ణి స్వప్నమున గాంచినదెల్ల ప్రత్యక్షమగుటచే మిగుల సంతసించి పదునైన బాణమును వెంట సంధించి పరుగెత్తు సింగముపై బ్రయోగించెను. సింగము వెంటనే మరణించెను. సింహ దేహము నుండి యక్షుడొకడు బయలు వెడలి నమస్కరించి దీపకర్ణి నృపాలా! నేను సాతుడను వాడను. యక్షుడను. కుబేరుని సఖుడను. నే నొకముని కన్యను వలచి మునియనుజ్ఞ గొనకమున్ను గాంధర్వవిధి బెండ్లాడితిని. నాసాహసమునకు గోపించి మమ్మిరువుర

సింగముల గండని ముని శపించెను. నాభార్య గర్భవతియై యీ బాలుని గని యకాలమరణ మొందెను. తల్లిలేని బిడ్డనెటులో పెంచుచుంటిని. నాశాపము తొలంగినది. నే నేగుచున్నాడను. ఈబాలుని పోషించు భారమంతయు నీదెయని సాతు డదృశ్యమయ్యెను. సాతుడే వాహనముగనున్న యా బాలకునకు సాతవాహనుడను నామమొసంగి దీపకర్ణి యాబాలుని మక్కువతో బెంచి పెద్దవాని గావించి శుభదినమున దన రాజ్యము నాబాలకున కొసంగి పట్టాభిషేకము గావించెను. సాతవాహనునే ప్రాకృత గ్రంథములందు శాలివాహనుడని వ్యవహరించిరి. ఈతని వంశమె శాతవాహనవంశమని వ్యవహరించుచుండిరి.

శాతకర్ణుడు బౌద్ధుడు. అతనికాలమున జైనబౌద్ధ శైవమతములు పరస్పర భిన్నాభిప్రాయములతో ద్వేషము పెంచుకొనుచున్నను దానందు బాల్గొనక సర్వమత సామరస్యమునకె పాటుపడెను. బౌద్ధభిక్షువులకేకాక యితరమతముల వారికి గూడ నీరాజు మిగుల సహాయము చేసెను. ఆ కాలమున బేరుగల రాజ్యము లన్నియు శాతకర్ణునకు బన్నుగట్టుచుండెను. శాతకర్ణుడు బౌద్ధమతావలంబియైనను విరోధిసంహారమున దయాదాక్షిణ్యములు వదిలి యెన్నియో కుటుంబములను రూపుమాపెను. తనకు దిరుగబడి సామంతులుగా నుండనీయ కొననందులకు గోపించి విరోధుల వంశములను నిర్మూలము గావించెను. యవన శక పహ్లావవంశములు పెక్కు రూపుమాపెను. సౌరాష్ట్రదేశముమీదికి దండెత్తి యాభాగమును బాలించు రాజవంశమును కూకటివ్రేళ్లతో బెరికి కూలార్చెను. పలువురు రాజులు శాతికర్ణికి లోబడి తమపూర్వమతములు వదలి బౌద్ధులుగా మాఱిపోయిరి. ఇతని పుత్రుడగు పులమాయి (పౌలోమి) గూడ విజయ యాత్రల యందు దండ్రికిదోడ్పడి విజయములు సమకూర్చి సామ్రాజ్యమును మిగుల విస్తరము గావించెను.

శాతకర్ణుని రాజ్యమును హరింపదలంచి యవనులు, శకనులు, పహ్లావులు పలుమారు దండెత్తివచ్చి పరాభవము నొంది పోవుటయేకాని జయము నొకమాఱేని గాంచి యెఱుంగరు. ఆకాలమున సుప్రసిద్ధులుగానున్న చేరదేశపాలకుడగు చెంకుడువాను భూపతియు సింహళమును బాలించు గజబాహున్నృపుడును మాళవదేశమును బరిపాలించు చస్తనుడును శాతకర్ణి కనుసన్నల మెలగుచు స్నేహము వాంఛించుచుండిరి. పశ్చిమాంధ్రదేశము పులమాయి యధికారము క్రిందను పూర్వాంధ్రదేశము ధరణికోట రాజధానిగా శాతకర్ణి పరిపాలనము క్రిందను నుండెను. శాసనములవలన గౌతమీపుత్రశాతకర్ణి ఆస్మిక, ఆసిక, మూలక, సురాష్ట్ర, కుకుర, అపరాంతక, అనూప, విదర్భ, అకరావంతి లోనగు దేశముల కధిపతియనియు వింధ్యావతము, పారియాత్రము, సహ్యము, కృష్ణగిరి, మలయము, మహేంద్రము, శ్రేష్ఠగిరి, చకోరము, మొదలగు పర్వతముల కధినాధుడుగా నుండెననియు దెలియుచున్నది. మగధదేశమునకు గూడ ధరణికోట యాకాలమున రాజధానిగానుండెను. ఉత్తరదిశను గంగానదిమొదలుకొని దక్షిణమున గాంచీపురివఱకు గల దేశమంతయు నాంధ్ర రాజుల పరిపాలనమున నున్నటుల నిశ్చయింప నవకాశములు గలవు.

శాతకర్ణి యాంధ్రుడైనను అతని కాలమున వ్యాప్తిలో నున్న ఆంధ్రభాషాస్వరూప మెట్టిదో నిశ్చయింప నాధారములు లభించుటలేదు. రాజకీయవ్యవహారములయందును శాసనములయందును సంస్కృతభాష మిగుల స్వల్పముగను విశేషముగ బ్రాకృతయు నుపయోగింపబడెను. శాతకర్ణి ప్రాకృతవాఙ్మయమును మిగుల నభివృద్ధిలోనికి దెచ్చెను. ప్రాకృతభాషలో బెక్కు లుత్తమగ్రంథము లీనృపాలునికాలమునందే బయలు వెడలెను. విదేశవ్యాపారమునుగూడ నీతడు మిగుల నభివృద్ధిలోనికి దెచ్చి ద్వీపాంతరముల కిచటివస్తువులు పోవునట్లును ఇతరద్వీపవస్తువు లచటికి వచ్చునట్లును జేసెను. స్వయముగా బండితు డగుటచే శాతకర్ణి వర్ణాశ్రమధర్మముల గుర్తించి వర్ణములను సంకరముగాకుండ గట్టుదిట్టములను మిక్కిలి దిట్టముగాజేసెను. దండయాత్రలలో నీ దేశమునకు వచ్చి యిచటనే ప్రాతకాపులుగానున్న విదేశీయుల నాదరించి వారి కెట్టిపన్ను లవసరము లేకుండజేసి శాతకర్ణి వారి కెన్నియో సౌకర్యములు కలుగజేసెను. పూర్వరాజులు తమపేరుముందు మాతృనామ ముంచుకొని వ్యవహరించినటుల గానరాదు. శాతకర్ణి తన మాతృదేవియగు గౌతమీనామమును తన పేరుతో గలిపికొని గౌతమీపుత్ర శాతకర్ణియనియె వ్యవహరించెను. దీనిచే నీతనికి గల యపారమగు మాతృభక్తి వెల్లడి యగుచున్నది.

గౌతమీపుత్రుడు క్రీ.శ. 133 మొదలు 154 వఱకు రాజ్యమును బాలించియుండునని యింతవఱకు లభించిన శాసనా ద్యాధారములవలన దెలియుచున్నది. ఇతని ధర్మపత్ని వాసిష్ఠి.

ఈరాజన్యుని జీవితమునందలి యపూర్వాంశము లెన్నియో కాలగర్భమున మరుగుపడియున్నవి. శాతకర్ణి యపూర్వ చరిత్ర మంతయు గీర్యంకములుగ బరిగణింపబడు శిలాశాసనములం దింకను అజ్ఞాతావస్థయందె యున్నదని యొప్పుకొనక తప్పదు. మహావిస్తృతమైన ఆంధ్రసాంరాజ్యమునకు నెలవైన ధాన్యకటకము నేడు పూర్వవైభవములన్నియు గోలుపోయి చిఱుపల్లెగా మాఱిపోయినది. ఆంధ్ర రాజుల వేడిరక్తముచే బూతమైన పుణ్యప్రదేశములలో రక్కెసకంపలు నిండిపోయినవి. ఆంధ్రరాజుల మహోన్నత దశనుగాంచి యానందించి విజయగీతములు పాడిన కృష్ణాస్రవంతి యిపుడు విపరీతకాల పరిణామమునకు బలవించుచు విషాదగీతికల బాడుచున్నది. ఆంధ్రుల దురదృష్టమువలె బెచ్చు పెరుగు పాటిదిబ్బలలో జారిత్రకరత్నము లెన్ని మరుగు పడియున్నవో సమగ్రమగు పూర్వచరిత్ర మాతృలోకమున కెన్నటికి జ్ఞాపకమునకు వచ్చునో యెవరు చెప్పగలరు?

కులోత్తుంగ చోడదేవుడు.

భారతమును నన్నయభట్టారకునిచే ఆంధ్రీకరింప జేసి యంకితముగా గొన్న రాజరాజనరేంద్రుడు మనకు జిరపరిచితుడు. ఈతడు చాళుక్యవంశజుడు. చాళుక్యవంశజులు చంద్రవంశక్షత్రియులని భారతమునందు జెప్పబడెను. ఈనృపుని రాజరాజ విష్ణువర్ధనుడనియు రాజ రాజనియు గూడ వ్యవహరించుట కలదు. తన మేనమామయగు రాజేంద్రచోడుని కుమార్తెయైన అనుంగదేవి నతడు వివాహమాడెను. ఈ దంపతుల కుమారుడే మన కథానాయకుడగు కులోత్తుంగ చోడదేవ చక్రవర్తి.



కులోత్తుంగ చోడదేవుడు.

కులోత్తుంగ చోడదేవుని మొదటిపేరు రాజేంద్రుడు. ఇతడు యువరాజుగానున్న కాలమున బెక్కు రాజ్యములు దండయాత్ర లొనరించి విజయము గడించెను. దండయాత్రయం దీయువరాజు మధ్యమాగాణముల వాయిరా నగరమును బలపరాక్రమములతో ముట్టడించి యూధములను

లోగొని విజయము గడించెను. పలు మాఱు బస్తరు రాజ్యములోని చక్రకోట్యమును కూడ జయించి సింధువంశజాతుడును విక్రమశాలియునగు వర్షుని సామంతరాజునిగ నొనరించెను. చాళుక్యుల --- -లతో సంబంధము విమలాదిత్యుడు. రాజరాజు, -------చోడుల కాలమువఱకు వరుసగా మూడుతరముల కలసి వచ్చెను. ఈమువ్వురిభార్యలును చోడులయింట ఆడ పడుచులె. మేనమామలను దల్లులనుబట్టియో చోడులను జయించిన కారణము కారణముననో యీ రాజేంద్రుని రాజేంద్రుడనియు గులోత్తుంగ చోడుడనియు వ్యవహరించిరి. గరికాలచోడుడు, రాజనారాయణుడు అను బిరుదములు గలవు. ఎంతరాజకుమారు డైనను మాత జనకస్థానము మహారాజ్య సంబంధము గలవైనను క ---- మాత్రమితడు తొలుతనె పొల్పడెను. రాజరాజనరేంద్రుడు మరణించినంతనే తండ్రిరాజ్యమగు రాజమహేంద్ర --- కీకులోత్తుంగచోడదేవుడు రాజుగావలసియుండ యైన విజయాదిత్యుడు బలవంతుడై రాజకీయోద్యోగులను సైనికులను లోగొని యక్రమముగా భ్రాతృరాజ్యము నాక్రమించెను. కులోత్తుంగచోడుడు రాజ్యభ్రష్టుడై పినతండ్రిని సాధించి నిజ రాజ్యము నెటుల లోగొనవలయునా యని తీవ్ర యత్నములు గావించుచు సైనికబలమును సమకూర్చు చుండెను. విజయాదిత్యుడు ప్రసిద్ధ పరాక్రమశాలి కాకపోవుటయు, గులోత్తుంగుడు సైన్యమును జీలదీయుచుంటయు గమనించి చిరకాలమునుండి వేంగిదేశమును గబళింప వలయునని ప్రయత్నించుచున్న పశ్చిమ చాళుక్యులలోనివాడగు (నాఱవ) విక్రమాదిత్యుడు అమితసైనిక బలముతో గృష్ణా గోదావరీ నదులదాటి రాజమహేంద్రవరముపైకి దండయాత్ర కేతెంచెను. స్వదేశము పర రాజాక్రాంతముగా నున్న చనియు నిపు డూఱకయున్నయెడల వేంగిరాజ్యమునకు మనకు బ్రాప్తము తీరుననియు గులోత్తుంగచోడరాజు నిశ్చయించి పశ్చిమచాళుక్యుల నెదిరించెను. ఉభయపక్షములకు గౌతమీ తీరమున భయంకరసంగ్రామము జరిగెను. కడకు బశ్చిమ చాళుక్యుడగు విక్రమాదిత్యుడు ఓడిపోయెను. తన రాజ్యము సరిహద్దులవఱకు బశ్చిమచాళుక్యరాజును గులోత్తుంగచోడుడు తరిమి వేసి వెనుకకు మరలి తన రాజ్యమునకు జేరి యంతవఱకు దనకు వ్యతిరేకముగ రాజ్యమేలుపినతండ్రియగు విజయాదిత్యునే తనకు ప్రతినిధిగా వేంగిరాజ్యము బాలించు నటుల నేర్పాటు గావించెను. కులోత్తుంగుని సుగుణములలో విరోధియగు పినతండ్రిని క్షమించి యెప్పటివలె రాజప్రతినిధిగా నేర్పఱచుట యొకటి.

చోడరాజ్యమును బాలించు వీరరాజేంద్రుడు తన పినతండ్రి యగు విజయాదిత్యుని పక్షమవలంబించి తన కనేక విధముల నపకారము గావించెను. చోడరాజ్యము నందు వీర రాజేంద్రునకు బేరుప్రతిష్ఠలు గూడ దగ్గుచుండెను. వీర రాజేంద్రుని మట్టుపెట్టుట కొకమూల కులోత్తుంగుడు యత్నించుచుండ కుంతల దేశాధీశుడును బశ్చిమ చాళక్యుడు నైన విక్రమాదిత్యుడు చోళరాజ్యమును హరింపనెంచి దండయాత్రకు బయలువెడలెను. వీరేంద్రచోడుడు తన దుర్బలస్థితిని దా నెఱింగినవా డగుటచేత గొంత రొక్కమును దన కుమార్తెను విక్రమాదిత్యున కొసంగి సంధిచేసికొనెను. కులోత్తుంగడు మాత్రము చోళదేశము హరించుటకు దాను జేయుయత్నముల నొకటియు మానుకొనలేదు. కాలవశమున వీర రాజేంద్రుడు కులోత్తుంగచోడుడు యుద్ధయాత్రకు రాకముందె మరణించెను

మఱల జోడదేశమున నశాంతియు నరాజకము ప్రబలెను. సామంతులు తిరుగబడి స్వతంత్రులై ప్రతిఘటించు యత్నములో నుండిరి. పౌరులు రాజాజ్ఞ తిరస్కరించుచుండిరి. ఈ పరిస్థితు లెఱింగి విక్రమాదిత్యుడు సైన్యసహితముగ చోడదేశమునకు వచ్చి యరాజకమునంతయు నివారించి తన బావమఱంది యగు పర కేసరివర్మను సింహాసనాసీనుని గావించి చీలిపోయిన సామంతులను బౌరులను గూడబఱచి కొంతకాల మటనుండి రాజ్యమునందు శాంతి స్థాపించి తనదేశమునకు బోయెను. విక్రమాదిత్యు డటులబోయి పోకమున్నె మఱల జోళరాజ్యమునం దశాంతి పెచ్చరిల్లెను. ఈవృత్తాంతము విని విక్రమాదిత్యుడు వచ్చి మఱల మఱల శాంతినెలకొల్పి వెళ్లు చుండెను. చోడరాజ్యము నింక జూచుచున్నయెడ బరుల పాలగునని మార్గమధ్యముననే రాజేంద్రచోడుడు విక్రమాదిత్యుని నోడించి వెనుకకు బంపివైచి యమిత బలసహాయముతో జోడదేశమును జయించి పరకేసరివర్మను జంపి “కులోత్తుంగ చోడనామము” సమస్త సామంతులకు భయంకరమగునటుల జోళమండలము బాలించుచుండెను.

ఇటు చోడరాజ్యము, అటు వేంగిరాజ్యము తన హస్తగతములైనను అంతతో దృప్తినొందక తిరుగబడిన రాజుల నందఱ జయించి తనరాజ్యము మిగుల విస్తరముజేయ సంకల్పించి కులోత్తుంగ చోడదేవుడు చెంగల్పట్టు ఉత్తరార్కాడు మండలములోని పులియారునాడు, ఎళుమూరునాడు గూడ జయించెను. కుంతలదేశమును బాలించుపశ్చిమచాళుక్యులలో బ్రసిద్ధుడగు విక్రమాదిత్యునిగూడ నతని సోదరుడగు జయసింహ సహితముగా నోడించి పూర్వవైరమునకు బ్రతి క్రియగావించెను. మైసూరురాజ్యమునందలి కొంతభాగమును పాండ్యదేశమును జయించి పంచపాండ్యుల నంకితుల గావించుకొనెను. ఇంతతో దృప్తినొందక మలబారుదేశములోని పశ్చిమ భాగమగు కుడలైనాడునుగూడ జయించి మేటివీరుల ననేకుల బొరిగొని యాదేశమునంతయు లోగొనెను. చేరరాజునకుగల నావికాబలమును సైన్యమును గూడ మట్టుపెట్టి కులోత్తుంగచోడుడు చేర దేశమునందు గూడ దన స్వతంత్ర పతాకమును నిలువబెట్టెను. ఇంచుమించుగ నితడు గౌతమీపుత్ర శాతకర్ణి రాజ్యమునకు సమానవైశాల్యముగల యాంధ్రభాగమును బాలించెనని చెప్పవచ్చును. వేంగిదేశమును గులోత్తుంగునకు బ్రతినిధిగ బరిపాలించు నతనిపినతండ్రియగు విజయాదిత్యుడు కొంతకాలమునకు (క్రీ.శ.1099) పరలోక గతుండయ్యెను. తరువాత దనకుమారుడగు రాజరాజును వేంగిదేశమునకు బాలకునిగా నియోగించెను. ఎల్లపుడును ఆధ్యాత్మిక చింతామగ్నుడగు రాజరాజు కొంత కాలమునకు రాజ్యభోగములపై విరాగమూని తన పరిపాలనాభారము మఱల దండ్రికప్పగించెను. తరువాత మఱియొక కుమారుడగు వీరచోడుని నియమించెను. ఇతడు దాదాపుగ నాఱు సంవత్సరములు వేంగిరాజ్యము పాలించి కాంచీనగరమునకు బోయెను. తనకుమారుల నందఱను వేంగిదేశము పాలించుట కిటుల నొకనివెంట మరియొకని నియోగించుచు చోళ, వేంగి దేశముల రెంటిని సమానముగ దిలకించుచుండెను. కులోత్తుంగచోడుడు కళింగదేశముపైకి రెండు మాఱులు దండయాత్రకు బయలుదేరి విజయము గడించెను. పరిపాల నారంభమున నొకమాఱు పరిపాలనాంత్యమున నొకమాఱు నని యితని కళింగ దేశ దండయాత్రలకు సంకేతము లిడవచ్చును. కులోత్తుంగుడు తన పుత్రియగు రాజసుందరిని కళింగదేశపాలకున కొసంగెను. మనుమడగు అనంతవర్మ కళింగ దేశమును బాలించుతఱి గొందఱు కాళింగులు తిరుగబడి యరాజక ప్రయత్నములు చేయుచుండిరి. రెండవ దండయాత్రలో నరాజకముల నడంచి అనంతవర్మ రాజ్యమును సంస్కరించి తనపేర కులోత్తుంగ చోడనగరమును గట్టించెను. తరువాతి కాలమున నీనగరము విశాఖపట్టణమను వ్యవహార నామము వహించెను.

కులోత్తుంగ చోడునకు నలువురు ధర్మపత్నులు గలరు. వారిపేరులు మధురాంతక దేవి, దీన చింతామణి, ఎళిశైవల్లభి, త్యాగవల్లి. మధురాంతక దేవియందు ఈరాజన్యునకు ఏడుగురు పుత్రులు ఒకపుత్రియు జనించిరి. పుత్రిక అనంతవర్మ తల్లియగు రాజసుందరి. పుత్రు లేడుగురిలో రాజరాజ చోడగంగు, రాజరాజ ముమ్మడిచోడుడు, వీరచోడు డను ముగ్వురె చరిత్రవిదులకు బరిచితులు. కులోత్తుంగ చోడునకు జోడరాజ్య మాక్రమించికొన్న పిదప గంగయకొండపురము, గంగయకొండ చోడపురము అని వ్యవహరింపబడు గంగాపురము కొంతకాలము, కాంచికానగరము మిగిలిన కాలమంతయు రాజధానిగా నుండెను.

కులోత్తుంగచోడుడు ఉత్తరదిక్కున కళింగము, దక్షిణము కన్యాకుమారి, తూర్పుదిక్కున సముద్రము, పడమటి దిక్కున కుంతలదేశము, సరిహద్దుగాగల విశాలమగు దేశమును ఏకచ్ఛత్రాధిపత్యముగా నించుమించుగ నేబది సంవత్సరములు పరిపాలించెను. ఇతనిరాజ్యకాలము క్రీ.శ. 1070-1120 వరకని చరిత్రకారులు నిశ్చయించినారు. కులోత్తుంగచోళుని పరాక్రమజీవితము సంస్కృత ద్రవిడగ్రంథములలో విశేషించి కీర్తింపబడెను. ఆంధ్రభాష కీనృపాలు డెంత సహాయము గావించినో ఆకాలమున బయలువెడలి యాంధ్రకావ్యము లెవ్వియో యెఱుగ నవకాశము చిక్కలేదు. కులోత్తుంగచోడ మహారాజు శైవమతాభిమాని. విష్ణ్వాలయముల ననేకముల గూలద్రోయించెననియు విశిష్టాద్వైతమత ప్రవర్తకుడగు రామానుజాచార్యుని మతప్రచారమును సాగకుండ జేసెననియు ఆపాపముచే నీతడు గతించెననియు వైష్ణవమత గ్రంథములందును రామానుజ చరిత్రమునందును గలదు. ఈరాజు మరణమునుగూర్చి కొన్నికథ లాగ్రంథమున గలవుగాని వాని సత్యాసత్యచర్చతో మనకు బనిలేదు. కులోత్తుంగుడు మరణించువరకు రామానుజు డతని రాజ్యమున నెట్టి ప్రచారము చేయక మైసూరురాజ్యమున నున్నమాట వాస్తవము. కులోత్తుంగుడు తన రాజ్యము సుభిక్షముగా నుంటకై

యనేక తటాకముల నిర్మించి రైతులకు బెక్కు సౌకర్యములు కలుగజేసెను. ప్రజలు ధాన్యరూపముగ బన్నులు చెల్లించు నట్లును గ్రామమునుండి వసూలుగావలసిన సిస్తులపై యధికారము గ్రామాధికారిపైననె యుండునట్లును కట్టుదిట్టములుచేసి వ్యాపారము నభివృద్ధిలోనికి దెచ్చెను. కులోత్తుంగచోడుని కాలమున మిగులనభివృద్ధిలోనికివచ్చిన యీయాంధ్రరాజ్యము రానురాను అతని యనంతరము క్షీణించి కడకు కాకతీయ సామ్రాజ్యములో మఱికొంతకాలమునకు లీనమైపోయెను.

చేర, చోళ, పాండ్య కళింగాంధ్రాదిదేశముల నేకధాటిగా బరిపాలించిన యీయాంధ్రచక్రవర్తి జీవిత చరిత్రము మనము పూర్తిగా మఱచినారము. పూర్వరాజుల ప్రతిష్ఠాలేశముల నాలపించు శిలాశాసనాదులకడ కేగితిమేని ప్రశాంతసమయమున గులోత్తుంగచోడుని యశోగీతికల నాలింపవచ్చును. స్వామిభక్తి పరాయణులగు నాంధ్రశూరుల రక్తముచే దడిసిన పుణ్యభూములు త్యాగజీవితమును దెలుపు శాసనరాజములు మాసిపోయిన చాళుక్యనృపుల ప్రతిష్ఠను జరిత్రవిదులకు జ్ఞాపకము చేయుచున్నవి. మహత్తరమగు నా రాజ్యముతో బాటు నాంధ్రసోదరుల విక్రాంతియు మఱపునకు వచ్చుట దురదృష్టము.

బాలచంద్రుడు.

వీరకుమారుడు బాలచంద్రుడు భారతవీరులలో సుప్రసిద్ధుడగు అభిమన్యునితో బోల్పదగినవాడు. ఈవీర బాలుని జీవితము జెప్పుటకు ముందు బూర్వకథ కొంచెము చెప్పుటయవసరము. మన కథా కాలమునకు గొంచెముముందు గురిజాల రాజధానిగ జేసికొని అనుగురాజు పల్నాటి రాజ్యమును బరిపాలించుచుండెను. అనుగురాజునకు ముగ్గురుభార్యలు. వీరవిద్యాదేవి, భూరమాదేవి, మైలమాదేవియని వారిపేరులు. భూరమాదేవియందు కామరాజు, నరసింహరాజు, జెట్టిరాజు, పెరుమాళ్ళురాజు అను నలుగురు కుమారులు. వీరవిద్యాదేవి యందు పెదమల్లదేవుడు, పినమల్లదేవుడు, బాలమల్ల దేవుడు అను ముఫ్ఫురు తనయు లుద్భవించిరి. వీరందరి కంటె మైలమాదేవి కుమారుడగు నలగామరాజు పెద్దవాడు. అనుగురాజు తన యంత్యకాలమునందు రాజ్యమును దనకుమారులను రేచర్లగోత్రుడును వెలమవీరుడు నగు శీలము బ్రహ్మనాయని చేతబెట్టి కుమారుల నుద్ధరించి రాజ్య తంత్రములను మంత్రివై నిర్వహింపుమని చెప్పి ప్రాణములు విడిచెను. బ్రహ్మనాయడు మృతభూపులకు క్షత్రియవంశాచారానుగుణముగా నుత్తరక్రియ లాచరించి కుమారులపక్షమున రాజ్యచక్రము తానె జయప్రదముగా ద్రిప్పుచుండెను. నలగామరాజు పెద్దవాడై గురిజాలరాజ్యము తాను స్వయముగా బాలింప దొడగెను. సోదరు లతని పోషణముక్రింద నే యుండిరి. వీరవిద్యాదేవియందు జనించిన పెదమల దేనాదులు మిక్కిలి చిన్నవారు. వీరి కేమేని యాపదకలిగింతురేమో యని బ్రహ్మనాయ డీబాలురను వెంటగొని మాచర్ల రాజధానిగ జేసికొని కొంత దేశమును బాలించుచుండెను. బ్రహ్మ నాయకుడు పేరునకు మంత్రియైనను రాజ్యవ్యవహారములు స్వయముగ నిర్వహించుచు పెదమల్లదేవాదుల వేయి కనులతో గాపాడుచు వారిసుఖము తన సుఖముగ భావించుచుండెను. బ్రహ్మనాయకుని సత్పరిపాలనమునకు బ్రజలుమెచ్చి పలనాటికృష్ణుడని యతనిని బ్రశంసించుచుండిరి. గురిజాల రాజ్యము స్వతంత్రముగ నలగామరాజు తక్కినసోదరుల నందఱ జెంతనుంచుకొని పాలించుచుండెను. నాగాంబయను నొకరెడ్డి కాంత నలగామాదుల దననేర్పుచే లోగొని గురిజాలరాజ్యమునకు మంత్రిణియై రాజ్యతంత్రములు నిర్వహించుచుండెను. ఈ యమనె నాయకురాలందురు. నాయకురాలు మంత్రిణిగ జేరినది మొదలు బ్రహ్మనాయకుని ద్వేషింపసాగెను. రెండు రాజ్యములవారు ఒకరినొకరు ద్వేషించుకొనుచుండిరి. నాయకురాలు దు సంత్రము లొనర్చి మాచర్లరాజ్యము నాశనము చేసి గురిజాల రాజ్యములో గలుప నెన్నియో ప్రయత్నములు గావించుచుండెను. బ్రహ్మనాయకుడు తన మెలకువచే నా చిక్కులు తొలగించుచు కాలము గడపుచుండెను. మనమిక బ్రధానకథలోనికి వచ్చుచున్నారము. బ్రహ్మనాయనికి సంతానము లేదు. ఆయనభార్య ఐతాంబ. చిరకాలము సంతానార్థము ఎన్నియో నోములు నోచెను. ఎన్నియో ధానధర్మము లాచరించెను. అన్నసత్రములు పెట్టించెను. సంతానము కలుగదయ్యె. కడకు గజనిమ్మనోము నోచెను. మాచర్ల చెన్నకేశవుని యనుగ్రహమున గర్భవతియై నవమాసములు నిండినవెనుక నొకశుభముహూర్తమున గుమారుని గనెను. జాతకర్మలాచరించి బ్రహ్మనాయకుడు బాలచంద్రుడని యాబాలునకు నామకరణము గావించెను. బాలచంద్రుని వలె నా బాలుడు దినదినాభివృద్ధి నొందుచు దల్లితండ్రులకు గనులపండువు గూర్చుచుండెను.

నాయకురాలు ఒకదినమున గురిజాలకు బ్రహ్మనాయడువచ్చుట గనిపెట్టి కోడిపందెముల వేయించుచు ఓడినకోడి బ్రహ్మనాయనిదని, గెలిచినకోడి తనదని పరిహాసము లాడుచుండెను.. బ్రహ్మనాయ డదిచూచి పౌరుషము నాపుకొనజాలక తాను స్వయముగా గోడిపందెమున బాల్గొని పుంజును విడచెను. నాయకురాలు వేఱొక పుంజును విడచెను. వట్టిపందెములతో లాభము లేదని యెవరిపక్షము కోడి యోడిన వారు పండ్రెండేడులు పరదేశమున వసింపవలె ననియు ఒకయే డజ్ఞాతవాసము గావింపవలెనని కట్టుదిట్టముల జేసికొనిరి. గ్రహచారవశమున బ్రహ్మనాయనికోడి యోడిపోయెను. అనుకొన్న పంతముచొప్పున బ్రహ్మనాయకుడు సపరివారసహితముగా వలసబోయెను. నానావస్థలకు లోనై రాజకుమారులతో వలసయందు బడవలసిన కష్టములన్నియు బడి బ్రహ్మనాయడు కడకు గడువుతుదను రాజ్యమునకు రానెంచి మాచర్లరాజ్యము తమకొప్పగింపుమని రాజకుమారులపక్షమున గురిజాలకు వర్తమానము పంపెను. నాయకురా లా దూతను జంపించెను. భాగమీయ వీలుగాదనెను. ఉభయపక్షములకు పల్నాటిసీమలోని నాగులేటి

తీరమునందు కారెముపూడిచెంత భయంకర యుద్ధము జరుగవలసివచ్చెను. సమకాలికులగు రాజులందరు రెండుపక్షములలో దమ యన కూలములబట్టిచేరిరి. గురిజాల పక్షమున సర్వభారములు నాయకురాలు వహించి రాజులుగనున్న నలగామరాజును, నరసింహ రాజును, కీలుబొమ్మలుగ జేసి సంగ్రామ ప్రయత్నములు తానె స్వతంత్రించి చేయుచుండెను. నియతకాలమున నుభయ దళములు పరస్పర జిగీషతో యుద్ధము చేయుచుండెను.

బ్రహ్మనాయకుడు రాజకుటుంబమును తన కుటుంబమును వీర మేడపిలోనుంచి బాలచంద్రుని గొంత సైన్యమును సంరక్షణమున కుంచి సంగ్రామరంగ మలంకరించెను. బాలచంద్రుడు పదునాఱుసంవత్సరముల బాలుడు. మిగులగారాబముగా బెరిగినవాడు. ఇత డితరవ్యవహారములలో జోక్యము పెట్టుకొనక తన సవయస్కులగు అనపోతు, కమ్మర కాచెన్న, మంగల మల్లు, చాకల చందు, కుమ్మర పట్టి, వెలమ దోర్నీడు, కంసాల చందు, అను బాలురతో గలిసి క్రీడా విహారములతో గాలము గడపుచుండెను. లేక లేక పుట్టిన తనయుడుగాన దలిదండ్రు లీబాలకుని స్వేచ్ఛకు భంగము చేయరైరి. తండ్రి యుద్ధమున కేగినసంగతి వినిన బాలచంద్రు డేమి సాహసము చేయునో యని తల్లి యతని స్వతంత్రవిహారమున కెట్టియాటంకము కలుగజేయకుండెను. ఒకనాడు బాలుడు తన తల్లియొద్దకువచ్చి బొంగరములాడ దనకు గోరికగలదనియు బంగారు బొంగరములు చేయించి యిమ్మనియు బ్రార్థించెను. ఆయమ్మ తనకుమారుని బుజ్జగించి మన కివి చాలనిదినములు. మీతండ్రి దూరదేశము పోయియున్నాడు. మనము వలసలోనున్నారము. ఆటలో బ్రమాదమున బొంగరము లెవరికి దగిలినను దగవులు వచ్చును. దానివలన ననేకకష్టములు ప్రాప్తించును. బొంగరములయాట మానుకొమ్మని యెన్ని తెఱంగులనో చెప్పెను. బాలచంద్రుడు తల్లిమాట వినక నాకు బంగారు బొంగరములె కావలయును. వానితో నేనాడుకొనితీరవలయునని మూర్ఖపు బట్టు పట్టెను. తల్లివిధిలేక సొన్నారుల బిలిపించి వారికి మేలిమి బంగారము నొసంగి బొంగరముల జేయించి కుమారున కొసంగెను. తన సవయస్కులు మిత్రులునగు బాలురనందరను వెంటగొని పొట్టేళ్ళపై నెక్కి, పందెములకు బికిలిపిట్టలు, కౌజులు, తగళ్ళను బట్టించుకొని బాలచంద్రుడు క్రీడారంగముగ నేర్పరచుకొనిన సోలురావులవద్దకు జేరిరి. అంతకు ముందె యాప్రదేశమునిండ రత్నకంబళములు, చాపలు పఱచిరి. బాలురంద ఱచట గూర్చుండి యాటలాడ నారంభించిరి. మొదట గొందరు బాలురు కసరత్తులు, పికిలిపిట్ట పందెములు కౌజుల పందెములు, పొట్టేళ్ళ పందెములు జరిపిరి. బంగారు బొంగరములతో బాలచంద్రు డాటలాడునని గ్రామములోని వారందరు చూచుటకు స్త్రీబాల సహితముగా వచ్చిరి. బాలచంద్రుడు బొంగరముల యాటలో మిగుల నేర్పరి. బరువైన యాబంగారు బొంగరమును బాలచంద్రుడు తీసికొని త్రాడుచుట్టి వేయబోవుసరికి బంట్రోతులు గుంపును వెనుకకు నెట్టివేసిరి. మధ్యనున్న విశాలస్థలమున బాలచంద్రుదు నిలిచి బొంగరమును లాగి విసరెను. బొంగరము రుంయి రుంయిమని మ్రోగుచు గిరగిర తిరుగుచుండ బాలచంద్రుడు దానిని తిన్నగ జేతిమీది కెక్కించి కొంతసేపాడించి తరువాత బాణము చివర నిల్పి కొంతసేపాడించెను. తిరిగి నే మీద నాడింప వలయునని బాలుడు బొంగరమును విసరి క్రిందికి వైచెను. అటనున్న యొక యెదురురాతికి గొట్టుకొని, బొంగరము బెడసి ఆవేడుక చూడవచ్చిన యొక కోమటిచిన్నదాని కాలికి దగిలెను. మొనగ్రుచ్చుకొనుటచే గాలినుండి రక్తము చిమ్మినక్రోవితో జిమ్మి నటుల గారెను. ఆమె పేరు అన్నమ్మ. అన్నమ్మ మూర్ఛపోయెను. చూడవచ్చిన స్త్రీలంద రాయమకు శీతలోపచారములు గావించిరి. బాలచంద్రుడు తన ప్రమాదమునకు జిం తించి చేతులు కట్టుకొని యాకాంతకు జెంత నిలిచి విచారపడుచు అన్యాయముగ బరకాంతకు శ్రమగూర్చితినే యని లోలోన గృశించుచుండెను. కొంతసేపటికి అన్నమ్మకు దెలివి వచ్చెను. బాలచంద్రునకు బ్రాణములు లేచివచ్చెను.

అన్నమ్మ కనులు తెఱచువరకు బాలచంద్రు డెదుట గానవచ్చెను. బాధచే మైమఱచి అన్నమ్మ నీకండకావరము కాలిపోను, బొంగరముతో గొట్టుదువా? రాజుసొమ్ము తేరగా దిని యొడలు బలిసియున్నావు. నీచూచుకన్నులలో సూదులుగ్రుచ్చ, నీకాలిలో గత్తులుదిగ, నీతండ్రి, రాజు యుద్ధములో నుండ బోతుసింగమువలె బోతరించి యింట నుండునది ఆడువారిమీద నాగడము చేయుటకా, యని పెళపెళ దిట్టిపోసెను. బాలచంద్రుడు తిట్లన్నిటికి సహించి దోసలిమోడ్చి, తల్లీ! క్షమింపుము. ప్రమాదమునకు మన్నించుట విధి యని బ్రతిమాలి ఐదువందల మాడల నామెకిచ్చి తప్పు క్షమింప బ్రార్థించి తన తలపాగ చించి, యామె కాలికిం గట్టుకట్టించి మాతండ్రు లెచటనున్నారో చెప్పుమనెను. అన్నమ్మ బాలునిపై కోపమునాపుకొని "కోపముచే నేమంటినో

నేనెఱుగను. మీతండ్రిగారి సంగతి నేనెఱుగననెను." బాలచంద్రుడు వెంటనే యింటికిబోయి తల్లియగు నైతమ్మను సమీపించి నాతండ్రి యెచట కేగెనో తెలుపుమనెను. ఏదో ప్రమాదముజరిగినది. బాలుడు సంగరమునకురుకు నటులున్నాడు. ఇంకనేమి చేయవలయునోయని యైతమ్మవిచారపడి, బాలుడా! మీతండ్రి యెటకేగినది నాకు దెలియదనెను. బాలుడు కోపించి, నేనెఱుంగ ననుకొంటివా? నాతండ్రియు బెదమల్ల దేవాదులు కారెమపూడివద్ద యుద్ధముచేయుటకు బోయిరి. తండ్రికి రాజునకు దేశమునకు గానికొడుకు కొడుకా? నే నిక నిట నుండజనదు. యుద్ధమున కేగెదనని పయనమునకు సిద్ధపడెను. ఐతమ్మ యెన్నివిధములనో నయమున భయమునం జెప్పెను. లాభము లేకపోయెను. నాయనమ్మ మాట వినునేమో యని తల్లి తన యత్తగారగు శీలమ్మను బిలిచెను. ఆమె మాటలు బాలచంద్రుడు నిరాకరించెను. జ్యోతిశ్శాస్త్రపండితుల బిలువనంపి బాలుని జాతకము జూప ఇక పదునైదు దినములలో నితనికి గొప్ప గండగలదని సంకోచించుచు జెప్పిరి. యుద్ధరంగము భయంకరముగా నుండునని చెప్పి శీలమ్మయు ఐతమ్మయు బాలుని భయపెట్టిరి. చావునకు దెగించిన బాలవీరునకు సంగ్రామరంగముకంటె సౌఖ్యకరమైన ప్రదేశములేదని బదులుచెప్పెను. ఐతమ్మ కన్నీరు నించుచు నాకు గడుపుశోకము పెట్టుదువా? యని వాయెత్తియేడ్చెను. బాలచంద్రుని హృదయము మఱింత మొద్దుబాఱెను. తాను వీర మరణమునకు సిద్ధముగా నున్నాడననిచెప్పెను. ఐతమ్మయు శీలమ్మయు యోజించి బాలుని ప్రయత్నము ఆపుట యసాధ్యము. ఐనను చేయగల యత్నములు చేయవలయునని రూపవతియగు భార్యను జూచియేని కామపరవశమున గదనము మానునేమో యనుకొని నీభార్యయగు మంచాలవద్ద సెల వొంది సంగరరంగ మలంకరింపుమని బాలచంద్రునకు జెప్పిరి. బాలచంద్రుడు సంతసించి కామవశమున గదనప్రయత్నమే మానుదునేమోయని వెంట బ్రాహ్మణ బాలుడగు ననపోతు నుంచుకొని యత్తవారింటికి బయలుదేరెను. వీరమేడపిలోనె మఱియొక వీధి బాలునియత్తవారిల్లు. పెండ్లి జరిగి యెన్నియో దినములు కాలేదు. నాడు పెండ్లిపీటలమీద సిగ్గుతో నేమి చూచెనోగాని బాలచంద్రు నాతనిభార్యయగు మంచాల తేరి పాఱజూచి యెఱుంగదు.

మంచాల అర్ఘ్యపాద్యాదులొసంగి యుచితవిధిని దన భర్తను, అనపోతుని బూజించెను. దంపతు లొకరినొకరు ప్రేమ పూర్వకములగు చూపులతో జూచుకొనిరి. అనపోతు తానీ సమయమున నచటనుంటకియ్యకొనక, 'మిత్రమా! బాలచంద్రా! ఏడుగడియలలో రావలయును., నేను ద్వారముకడ వేచియుందు'నని వెడలిపోయెను. బాలచంద్రుడు తాను నగరమున కేగుచుంటినని మంచాలకు జెప్పెను. ఆమె భర్త నాదరించి 'నాకు వీరపత్నియను పతివ్రతానామము సమకూర్చితివి. ఇంత కంటె నాకు గావలసినది ఏమియున్నది. ఇదుగో ఖడ్గము దీనితోవిరోధుల సంహరించి జయము సాధింపుము. బ్రాహ్మణులు ధర్మపరిపాలకులు. వారిని గాపాడుట రాజధర్మముగాన 'అనపోతును సంగరమునకు గొనిపోకుము. ఒక వేళ నాతడు సంగరమున మరణించిన బ్రహ్మహత్యాపాపము వచ్చునని వా కొనెను. బాలచంద్రుడు తన భార్యవద్దను అత్తయగు రేఖాంబవద్దను సెలవుగెకొని యింటికివచ్చెను! తలి కుమా రుని గౌగిలించుకొని 'తండ్రీ యుద్ధప్రయత్నము మానవా?' యని బ్రతిమాలెను. బాలచంద్రు డెంతకు వినడయ్యెను. కడకు ఐతాంబ ధైర్యము తెచ్చుకొని 'నేను మాత్రము వీరకాంతను కానా? నాభర్త వీరపత్ని బిరుదము, నా తనయుడు వీరమాతృబిరుదము నాకు బ్రసాదింపుచుండ జేజేత బోగొట్టనగునా' యని బాలచంద్రునకు బెరుగుతో నన్నము కలిపిపెట్టెను. బాలచంద్రుడు భోజనానంతరమున వీరవేషము దాల్చి తల్లికి నాయనమ్మకు నమస్కరించి వారి దీవనలనంది కదనరంగమునకు బయనమయ్యెను. పూర్వోక్తమిత్రులందఱు బాలచంద్రునితో సంగరమునకు బయలుదేరిరి. బాలుడు అనపోతును వెనుకకు బంపదలంచి కత్తియును డాలును ఉంగరమును మంచాలవద్ద మఱచివచ్చితిని. పరిచితుడవు నీవెపోయి దెమ్మనెను. అనపోతు పోకతప్పినదికాదు. అతని బోవనిచ్చి బాలుడు ఒకతాటియాకుమీద నేదియోవ్రాసి రావిచెట్టు కొమ్మకుగట్టి త్రిపురాంతకము, ముటుకూరు, గరికపాడు, మేళ్ళవాగుగ్రామములు దాటి బాలుడు పరిజనముతో వచ్చుచుండ మధ్యగ్రామములవా రీ వీరపుత్రుని గౌరవించిరి. తరువాత కనుమవద్దకు వచ్చువఱకు నాయకురాలు త్రోవగాచియుండెను. బాలుడు వేఱొకత్రోవను బయలు దేటి నల్లగొండ నత్తమువకు మిత్రులతో నెక్కెను. గుట్టమీదనుండి నలగామ రాజుబలమును సేనానాయకులను శిబిరములను జూచెను.

మంత్రిణియగు నాయకురాలిని సర్వసేనాధిపతియగు నరసింగ రాజును బాలుడు గుర్తించెను. కొదమసింగమువలె గుట్టపై నుండి విరోధిసేనమీదికి బాలు డుఱకబోవ మిత్రులు వారించిరి.

బాలచంద్రుడు గుట్టదిగి పెదమలిదేవుని శిబిరమునకు జేరబోవ గండుకన్నమనీడు వారించెను. త్రోసికొని రాజును సమీపించి, రాజా! సంధికి రాయబారముల కిది యదనుగాదు వనవాసములచే మీహృదయములు నీరసమైయున్నవి. దేహము శుష్కించినది. పరాభవ దైన్యముచే దలవ్రాలినది. ఇంక నేమని రాయబారములు చేయుచున్నారు, విరోధులను రణరంగమున బొరిగొనుటో మరణించుటయో మనవిధి. ఇదుగో! నేను రణరంగమున కుఱుకుచున్నాను. రాదలచినవారు రండు. లెండని బాలచంద్రుడు వైరిశిబిరముల కభిముఖముగా బోవ సమకట్టెను. కొమ్మరాజను నొక వీరుడు బాలునాపి వీర కుమారా! తొందరపడకుము. నా తనయుని నరసింహరా జక్రమముగా రాయబారమునకు బోవ జంపినాడు. నీవు వానిని జంపి నాకు శాంతిగూర్చెదవని నమ్మినాడను. కోపముతో గార్యముగాదు. కొలదిసేపులో సంగ్రామము కట్టాయితము కాగలదు. ఉపాయము లేనిది వైరిచిక్కడు. అని చెప్పుచుండు నంతలో రెండుపక్షముల వారికి సంధి కుదిరినది. యుద్ధప్రయత్నములింక నవసరములేదని పెదమల్లదేవుడు తన సేనామధ్యమున నిలిచి చెప్పెను. ఇంతలో నొకయువతి బాలచంద్రునివద్దకు వచ్చి అయ్యా! నేను మాడచి యనుదానను, మేడపిలో అంతిపురి కాపాడుదానను. నీవు రావి చెట్టునకు గట్టిన చీటి చదివి యుద్ధమునకు బాలుడు రావద్దనినాడు. నేను బ్రతికి లాభమేమని అనపోతు మెడగోసికొని మరణించుచు నీకిమ్మని వీరకంకణము జందెము ఇచ్చినాడు. అనపోతుభార్య సహగమనము చేసెనని చెప్పి కంకణము జందెము నొసంగెను. బాలచంద్రున కొడలెఱుగనంతటి యావేశమువచ్చెను. వీరకంకణము చేతికి ధరించుకొని జందెము మెడలోవేసికొనెను. అనపోతూ! మిగిలిపోకుము. నిన్ను స్వర్గమునకు జేరులోగ గలిసికొందునని బాలుడు పలికి సైనికుల నందఱను సంగరమునకు బురిగొల్పెను. నేను బాలుడనని మీరుసంకోచింపకుడు. ఒకప్పుడు నేను కుమారస్వామిని, ఇంకొకప్పుడు నేను అభిమన్యుడను. వేఱొకప్పుడు నేను సిరియాళుడను. దేహములు నశించుచున్నవిగాని ఆత్మ నశించుటలేదు. వీరునకు సంగరమరణమును బోలిన దింకొకటి లేదు. యుద్ధరంగమునకురండు. ఆలసింపకుడని బాలుడు పలికి యుద్ధమునకు త్రోవదీసెను. భోజనము చేయుచున్న వీరులందఱు విస్తళ్లు నాగులేటిలోవైచి ముందునకు దుమికిరి. ఈసంబరముజూచి యెదుట పక్షమువారు సిద్ధపడిరి. భగవంతునకుగూడ సంగరమిష్టము వలె నున్నది. చెన్న కేశవుని యనుగ్రహమెటులున్న నటులె జరుగునని బ్రహ్మానాయకుడు బాలచంద్రునకు ముందు, దక్కిన వారికి దరువాత శంఖముతో దీర్థమునొసంగి వీరగంథము మేనబూసి వీరతాంబూలము లొసంగి యుద్ధరంగమునకు సాగనంపెను.

రెండుపక్షములవారు భయంకరసంగరమునకు దారసిల్లిరి. రక్తము ప్రవహించెను. అనేకులు వీరులు వీరమరణ మొందిరి. ఒకప్రక్క నాయకురాలు, వేరొకప్రక్క నరసింగ రాజు బాలచంద్రుని బలమును జుట్టుముట్టిరి. కమ్మర కాచెన్న, మంగల మల్లు, చాకల చందు, కుమ్మర పట్టి, వెలమ దొర్నీడు, కంసాల చందులను బిలిచి వారివారి స్వాధీనమున గొంతసైన్యముంచి విరోధిసైన్యమును ఆవరించి రూపు మాపుట కన్నిదిక్కులకు బంపించెను. బాలచంద్రుడు స్వయముగా గొంత బలముతో నరసింగరాజు నెదిరించెను. నలగామరాజు మంచెపై నెక్కి తన బలము చెందు వినాశనమునకు బరితపించుచు, బ్రోత్సాహవాక్యములు పలుకుచుండెను. మలిదేవాదులు, బ్రహ్మానాయకాదులు బాలచంద్రుని యుద్ధ కౌశలమును వేయినోళ్ళ బ్రశంస చేయుచుండిరి. నరసింగరాజు బాలచంద్రుని ధాటికాగలేక వేఱొకత్రోవకేగి హతశేషమగు సైన్యమును సంగరమునకు బురికొల్పుచుండెను. తన ముందటనున్న మత్తగజముపై నెక్కినవీరుని నరసింహరాజని తలంచి బాలచంద్రుడు కుప్పించి ముందునకు దుమికి యేనుగుమీదివానిని గ్రిందికిలాగి వానితల జెండాడి తన బల్లెమునకు గ్రుచ్చుకొని తీసికొనిపోయి బ్రహ్మ నాయడు మలిదేవాదులముందు బెట్టి నాధర్మము నిర్వహించితినని చెప్పెను. కొమ్మరా జాతలను బరిశీలించి ‘యిది నరసింహరాజు తలకాదు. నరసింహరాజును జంపవలసిన భారము బాలునిపైననే గల’ దనిచెప్పెను. వెంటనే మిత్రులను పరిజనులను వెంటగొని లేడిపైకిదుముకు సింగపు గొదమవలె విరోధులమధ్య దుమికెను. సేదదీర్చుకొని నరసింహరాజు బాలచంద్రు నెదిరించెను. కర్ణార్జునులవలె నీ వీరులిద్దరు చాలసేపు పోరి, నరసింహరా జలసిపోయెను. బాలుడు నరసింహరాజెక్కిన యేనుగుతుండమునొక చంద్రవంక బాణముతో నఱకెను. ఏనుగు ముందునకు మొగ్గెను. బాలుడు ఏనుగు కుంభస్థలము

మిదినుండి పైకెక్కి నరసింహరాజును క్రింది కిడ్చుకొనివచ్చి కత్తితో గుత్తుక గోసి బల్లెముచివరి బెట్టుకొని వెంట తమ్ములు జయవాక్యములు పలుకుచుండ బెదమలిదేవుని కొలువుకూటమున కా తల జేర్చెను. వీరు లందఱు బాలచంద్రుని పరాక్రమమునకు హర్షించిరి. తన యన్న చావునకు బెదమలిదేవాదులు వగచిరి. నేను చేతి మీదుగ బెంచిన నరసింహరాజున కెంతటి దుర్గతి. కుమారునివలన గలిగెనని బ్రహ్మనాయడు పలవించెను. తరువాత విచారము కోపముగా మాఱి తనయునిజూచి, బాలుడా! నిన్నీ సంగరమునకు బిలిచిన దెవరు? పిన్నవాడవని యుపేక్షింప బిడుగుతునుక వైతివే! యని బ్రహ్మనాయడు నొవ్వ నాడెను. బాలు డామాటకు గోపించి, 'తండ్రీ! నాడు పుత్రదు:ఖముతో నున్న కొమ్మరాజు నోదార్చి నన్నాయన చేతిలో బెట్టి యలరాజును జంపిన నరసింగరాజును బాలుడు చంపగలడంటివి. నాధర్మము నేను నెఱవేర్చితిననెను. బ్రహ్మనాయడు బాలచంద్రునిజూచి ఒక్కవీరుని జంపినంతనే శూరుడవైతివా? అరులకు వెన్నుజూపి పాఱివచ్చితివి గదాయని యెత్తిపొడిచెను. బాలచంద్రునియెుడలు మండిపోయెను. విరోధిసైన్యమును జక్కాడి రాజుతల తెచ్చినందులకు వెన్నుజూపి వచ్చితినని కన్నతండ్రియే నొవ్వనాడినాడు. ఇక గదనమునుండి వెనుకకు బ్రాణములతోరాను. ఇదియె నాప్రతిజ్ఞయని బాలుడు నవయస్కులగు మిత్రులతో గదనరంగ మలంకరించెను.

'చిన్నవాడు గాడురాచిచ్చులపిడు'గని బాలునివిరోధులందఱు చుట్టుముట్టి వివిధాస్త్రములచే నొప్పించిరి. మొక్కబోని పరాక్రమమున బాలచంద్రుడు ముందునకు నడచుచుండెను. అభిమన్యుడు పద్మవ్యూహము భేధించినటుల బాలుడు విరీధిబలముల జించి చెండాడెను. కొంతసేపటికి విరోధులు చెలరేగి కమ్మర కాచెన్నను గడతేర్చిరి. మంగల మల్లును మది యించిరి. చాకలచందును జంపిరి. కుమ్మరపట్టిని గూల్చిరి. వెలమదోర్నిని చత్రవధ చేసిరి. బాలచంద్రుడు తన సైన్యమునంతయు నొకమాఱు పాఱజూచెను. మిత్రులందఱు మరణించిరి. అనపోతు అందఱికంటె ముందె మరణించెను. బ్రతికి లాభము లేదని బాలుడు తెగబడి చిక్కినవైరిని జిక్కినటుల నఱకు చుండెను. విరోధులందఱు బాలుని మేనినిండ బాణములను నించిరి. బాలునకు బ్రతుకుమీద నాశతీరెను. బాలచంద్రుడు తన మిత్రులందఱకు గన్నీటితో దర్పణాదులొసంగి అలుగుల నేలబ్రాతి తనమిత్రుల నెత్తుటిలో దడిపిన యక్షతలతో నాయలుగులకు బూజజేసి కనులు మూసికొని వానిపై నొరిగి మరణించెను. బాలునిమరణమున కుభయసైన్యములందు హాహాకారములు పెచ్చరిల్లెను.



బాలచంద్రుడు యుద్ధభూమిని జనిపోవుట.

బాలుని మరణవార్త విని మంచాల చిచ్చురికెను. బాలుని భౌతిక దేహము నీవిధముగా మహారణమధ్యమున బడి నశించెను. అతనియస్తికల గంగధారలోగలిపిరి. ఈకథ జరిగి యిప్పటికి దాదాపు ఎనిమిదివందల సవత్సరములు జరిగినను, మనము బాలచంద్రుని మఱచిపోవలేదు.

కవులా-వీరుని జీవితమును వీరగేయములుగా వ్రాసిరి. శిల్పులా-వీరమూర్తి యాకృతి శిలలపై జెక్కిరి. వీరులా-బాలుని యాదర్శముగా గైకొనిరి. నేటికి బాలదాసరుల పూజయని బాలచంద్రుని యొక్కయు, నతని సోదరులు మిత్రులగు నితర బాలురయొక్కయు పూజ మనము చేయుచున్నారము. ఆంధ్ర బాలకవర్గమునకు త్యాగధనుడగు బాలచంద్రుని జీవితము ఆదర్శప్రాయమగుటకు భగవంతు డనుగ్రహించుగాత.

ఖడ్గ తిక్కన.

ఆంధ్రులలో ఖడ్గతిక్కన మిగుల బ్రసిద్ధుడు. ఈతని పరాక్రమజీవితము పల్లెపదములందును జాటు పద్యములందును నిమిడియుండుటచే జిరకాలమునుండి యాంధ్రసోదరు లీశూరమూర్తిని స్మరించుచున్నారు. ఇతడు నియోగి బ్రాహ్మణుడు. సిద్ధనామాత్యునకు బోలమాంబకు జనించిన యేడుగురు కుమారులలో బెద్దవాడు. గౌతమస గోత్రుడు. భారతమును రచించిన తిక్కనసోమయాజితండ్రియగు కొమ్మనామాత్యుడును, ఈవీరుని తండ్రియగు సిద్ధనామాత్యుడును నొక తల్లిబిడ్డలు. గాన నీవీరులిద్దరు నన్నదమ్ములు కొమారులు. ఖడ్గతిక్కన బాల్యమున సంస్కృతాంధ్రభాషలభ్యసించి రాజనీతిశాస్త్రమునందును. ధనుర్విద్యయందును బ్రసిద్ధిగడించి యాకాలమున బ్రసిద్ధుడై నెల్లూరురాజ్యమును బాలించుచున్న మనుమసిద్ధి నృపాలుని యొద్ద సేనానాయకుడుగ నుండి యాతడు గడించిన విజయము లన్నింటికి దానే యాధారమయ్యెను. ఈవీరవతంసుడు విద్యా వితరణ విక్రాంతులలో నిరుపమానుడై విక్రమసింహపుర రాజ్యమును, దానొక్కండె భుజపీఠిపై ధరించెనని చెప్పుదుమేని యిందతిశయోక్తి కలదని చరిత్రవిదులు వాకొనలేరు.



ఖడ్గ తిక్కన.

ఖడ్గతిక్కన మనుమసిద్ధి కేయేసంగ్రామములలో నెంతెంత సహాయపడినో నిర్ణయించు నాధారములు లభించుట లేదు. ఇతడు సర్వసేనానాయకుడుగా నుండి విరోధుల వంచించి జయముల బడసెననుటకు వలయు గ్రంథాధారములు కలవు. వీరశిరోమణి యగు ఖడ్గతిక్కన యింత ప్రసిద్ధు డగుటకు నాతని తల్లియు వీరమాతయు నగు పోలమాంబ స్తన్యప్రభావమని

వేఱుగా జెప్పబనిలేదు. ఖడ్గతిక్కన కేవలదండ నాయకుడుగ నుండి కులాచారములు విడనాడినవాడు కాడు. ఇతడు వేదగానలోలుడు. బ్రాహ్మణకుటుంబ పోషకుడు. దానకర్ణుడు. విరోధిఖండన చణుడు. ఈమహామహుని యాశ్రయమున "రాయవేశ్యా భుజంగరాజమూర్తి గంధవారణా"ది బిరుదము లన్వర్థములై ప్రశస్తిమంతము లయ్యెను. ఒకకవితా విషయమున జెప్పుట కాధారములు లేవుగాని పరాక్రమౌదార్య పాండిత్య రాజకీయ పరిజ్ఞానాది మహాపురుష ధర్మములలో దిక్కన సోమయాజికి ఖడ్గతిక్కన యించుకేనియు దీసిపోవ జాలడనియు బై పెచ్చు పయిజేయిగా నున్నాడనియు జెప్పనగును. కేతనకవి యీమహావీరుని గుణవర్ణనము మిగుల మనోహరముగా గావించి ప్రశంసించియున్నాడు. ఆయన వర్ణన భాగముల దిలకింతుమేని ఖడ్గతిక్కన నాంధ్రపరశురాముడని ప్రశంసింప వచ్చును.

ఖడ్గతిక్కన విజయము తెలుపు కథాగ్రంథములలో కాటమరాజుకథయొకటి. కొట్టరువువంశతిలకుడగు ఖడ్గతిక్కన పరాక్రమ జీవితము, స్వామిభక్తి యీగ్రంథమువలన నెఱుంగవచ్చును. విద్యాప్రియులగు నాగరకులకు జిరకాలమునుండి కాటమరాజుకథ వినిపించి ఖడ్గతిక్కన జీవితచరిత్రమును విస్మృతి తరంగము చాటున నదృశ్యముకాకుండ గాపాడిన వీరకథా గాయకులకు బ్రకృతకథాపఠనావసరమున గృతజ్ఞత దెలుపుట మన విధులలో నొకటియై యున్నది.

కాటమరా జను యాదవవంశజుడు నెల్లూరుమండలమందుగల కనిగిరిసీమలోని యెఱ్ఱిగడ్డపాడుప్రాంత భూతములను బాలించుచుండెను. ఇతడు గొప్ప భూస్వామియు నపరిమిత పశుధనము గలవాడునై సజాతీయుల కందఱ కధిపతియై మిగుల బలుకుబడితో గులపెద్దయను గౌరవముతో గాలయాపనము చేయుచుండెను. ఆ కాలమున గొన్నిసంవత్సరము లనావృష్టి తటస్థించుటచే బ్రజలకు బశులకు గూడ చాల చిక్కులు గలిగెను.

యాదవులు విశేష పశుగణము గలవారగుటచె దమ బీళ్లన్నింటను గడ్డిలేకుంట చూచి తృణజల సమృద్ధిగల తావులకేగి పశువుల మేపుకొని దేశము సుభిక్షమైనపిమ్మట తిరిగి యిండ్లకు జేరనిశ్చయించిరి. కొందఱు యాదవులు దూర దేశములకుబోయి పైరుపచ్చలు చల్లగానుండు ప్రదేశము తాము చూచినంతలో నెల్లూరిచెంతగల పాలేరుతీరమని వచ్చి తమ రాజున కెఱిగించిరి. కాటమరాజు పశుగణమును యాదవులను వెంటగొని నెల్లూరిప్రాంతములకేగి యట తనపశువులను బశుపాలకులను నాపి, ఆప్రాంతముల బాలించు మనుమసిద్ధి భూపాలుని దగ్గరకుబోయి తనకష్టములనెల్ల నెఱింగించి పాలేటి తీరమునగల బీళ్లు కొంతకాలము పశువులు మేపుకొనుటకు బుల్లరికి దీసికొనెను. పాలేటితీరమున గాటమరాజు కొన్నాళ్ళు నివసించి పశుగణమును బోషించుకొని కాలము గడుపుచుండు నంతలో ఎఱ్ఱిగడ్డపాటినుండి కొందఱు గొల్లలువచ్చి వర్షములు కురిసినవనియు దేశము సుభిక్షముగా నున్నదనియు బశువులకు గూడ మేతగలదనియు వర్తమానము చెప్పిరి. కాటమరాజు ఆవార్త విన్నంతనె మిగులసంతసించి గంగమ్మకు జాతరులుచేయించి పరిమితివఱకు బశువుల మేపుకొనలేదు గాన మనుమసిద్ధికి మనము పుల్లరినీయ నవసరములేదని తమలోదాము నిశ్చయించుకొని యాదవులను బశువులను వెంటబెట్టుకొని పోవుచుండ మనుమసిద్ధిభటు లడ్డగించిరి. వారల దిరస్కరించి యాదవులు తమగ్రామము వెడలిపోయిరి. భటులవలన మనుమసిద్ధి యీవర్తమానము విని మండిపడి యాదవుల దురాగతమున కేవగించి అన్నము భట్టు అను నొక బ్రాహ్మణుని కాటమరాజువద్దకు పుల్లగి యొసంగుడని కోరుటకు బంపెను. యాదవులు పుల్లరి నీయవలసిన యవసరములేదనియు, గొలదికాలమె పశువులను మేపితిమిగాన నీయక పోవుటయె ధర్మమనియు, రాయబారములకు లొంగి కనకవర్షము గురిపించుటకు గొల్లలు పిచ్చి వాండ్రుకారనియు నందఱపక్షమున కాటమరాజు వర్తమానము చేసెను. యాదవులను వంచింపకున్న లాభములేదనియు పుల్లరి విడిచిపెట్టితిమేని పౌరులకు గూడ నలుసు కలుగుననియు మనుమసిద్ధి భూపాలుడు సర్వసేనానాయకుడగు ఖడ్గతిక్కన యనుమతి చొప్పున సంగరమునకు తలపడియెను.

ఈవార్త యాదవులు విని కాటమరాజున కెఱింగించిరి. కాటమరాజు తన బంధువులు వీరులు నగువారికందఱకు వర్తమానము లంపి పిలువనంపి సైనికబలము నాయత్తపఱచెను. కొండపల్లి చల్లపిన్నమ్మనాయకుడు, దొనకొండ అయితమరాజు, ఎఱ్ఱయ్య, భట్టామరాజు, కరియాపులరాజు, వల్లభన్న, నేతిముద్దయ్యానాయడు, పురుషోత్తమరాజు లోనగు సుప్రసిద్ధ యాదవప్రముఖులు

సైనికసహాయులై కాటమరాజు పక్షమున జేరిరి. కాటమరాజు తనసేనకు గ్రమశిక్ష నొసంగి చిన్నమనాయని మంత్రిగను బ్రహ్మరుద్రయ్యయను బ్రాహ్మణుని సేనానాయకునిగను నేర్పఱచి సంగరమునకు సైన్యసహితముగ బయలుదేరెను. మనుమసిద్ధిపక్షమున సర్వసేనానాయకుడగు ఖడ్గతిక్కన కొంతసేన్యమును వెంటగొని ఎఱ్ఱగడ్డపాటికి బయలుదేరెను. రెండు సైన్యములును బాలేరుయొడ్డున నున్న పంచలింగములకడ సంగరమునకు దలకొనెను. యాదవులు చెక్కు చెదరులేక మతావేశము స్వతంత్రదీక్ష నూతగాగొని ముక్కాకలదీరిన ఖడ్గతిక్కన సైన్యముతో మిగుల భయంకరముగా బోరాడిరి. ఖడ్గతిక్కన నిర్లక్ష్యభావముతో యాదవులను సరుకుసేయక స్వల్పబలమును మాత్రమె వెంటతెచ్చెను. ఐనను నిరుత్సాహపడక యాదవ సైన్యము నెదిరించి పట్టుదలతో బోరాడుచుండెను. యాదవ సైన్యము ఖడ్గతిక్కన సైన్యమును జాలవఱకు నాశనముగావించి ముందునకు వచ్చుచుండెను. ఈపరాజయ పరిస్థితులగాంచి యేని జంకక ఖడ్గతిక్కన హతశేషమగు సైన్యముతో జిరకాలము పోరాడెను. యాదవసైన్యము చుట్టుముట్టి ఖడ్గతిక్కనను నాతని స్వల్పసైన్యమును బట్టుకొనిరి. ఖడ్గతిక్కనను కాటమరాజు సమీపించి "బ్రాహ్మణోత్తమా! సంగరము మానుకొనుము. బ్రాహ్మణుల జంపిన మాకు బ్రహ్మహత్య వచ్చును. అగ్రవర్ణులగు మీరు మాతోబోరుట న్యాయముగాదు. మమ్ము గోపింపక సంగరయత్నము మానుకొను" మని ప్రార్థించి విడిచిపెట్టెను. ఖడ్గతిక్కన చేయునదిలేక గుఱ్ఱమునెక్కి నెల్లూరి కేగి సైన్యముతో రాదలంచి గృహాభిముఖు డయ్యెను.

పరాభవదు:ఖముతో ఖడ్గతిక్కన గృహము చేరెను. మంచములోనున్న సిద్ధానామాత్యుడు తన కుమారుడు పారి వచ్చినాడని తలంచి "ఛీ పాఱుబోతా! తుచ్ఛమగు ప్రాణము కాశపడి యిల్లు చేరిన నిన్ను జూచిన పాపమువచ్చు"నని ఖడ్గతిక్కనను నొవ్వనాడెను. తండ్రియొనరించిన తిరస్కారముచే ఖడ్గతిక్కనహృదయము కలగిపోయెను. ఇంటిలోనికిబోవ నతని భార్య చావమ్మ భర్తను సాదరంబున జూచి 'వంటయైనది, స్నానముచేయు' డని చెప్పి స్త్రీలు స్నానముచేయుతావున నొక మంచము చాటుజేసి పసుపుకుంకుమ యట పదిలపఱచెను. ఖడ్గ తిక్కన తన భార్యను జూచి యదియేమని యడుగ సంగరము నుండి పాఱివచ్చిన భర్తలను వీరపత్నులు గౌరవింపదగిన విధమిదియెకదా? యనిప్రత్యుత్తర మొసంగెను. తన ప్రమాదమునకు దాను నొచ్చుకొని యెటులోస్నానము గావించి ఖడ్గతిక్కన భోజనగృహములోని కేగెను. తల్లి ప్రోలమాంబ అన్నము వడ్డించెను. కుమారుడు భుజించుచుండెను. మజ్జిగకు మాఱుగా తల్లి పాలు వడ్డించెను. అవి విఱిగిపోయియుంటచే నిటులున్న వేమి యని ఖడ్గతిక్కన తల్లినడిగెను. ఆమె పక్కున నవ్వి "విరోధులను జయింపలేక పందవై నీవు వచ్చుటచే బశువులు విఱిగినవి, పాలును విఱిగె"నని చెప్పెను. ఆమాటవిని యెటులో భోజనవ్యాపారమును ముగించి ఖడ్గతిక్కన పరాభవ దు:ఖము నిష్ఠురోక్తులవలని రోసము మదిలో నుంచుకొని "జయించి విక్రమసింహపురమును జేరవలయును, లేదా సంగరమందె మరణింపవలయును. ఇదియె నా ప్రతిజ్ఞ"యని పలికి రాజమందిరమున కేగి క్రొత్తసైన్యమును దనవెంట గైకొని రివ్వున సంగ్రామరంగము చేరెను.

ఖడ్గతిక్కన సైన్యసహాయుడై సంగరరంగము నలంకరించుచున్నాడని యాదవు లాలించి వారును రణరంగము నలంకరించిరి. ప్రళయకాల నటునివలె విజయముపై లక్ష్యముంచి నిశ్చలముగా బోరాడు ఖడ్గతిక్కనవిక్రమమునకు వెఱచి సైనికులు త్రోవనీయసాగిరి. కాటమరాజు సైన్యము చలించెను. కడకు గర్తవ్యము దోచక కాటమరాజు రణరంగమున బ్రవేశించి తనకడ్డముగానున్న ప్రతిపక్ష సైన్యమును దెగటార్చుచు ఖడ్గతిక్కనను సమీపించి నమస్కరించి "బ్రాహ్మణోత్తమా! పోరుడుగుము, పోరుడుగుము. బ్రహ్మహత్యా పాపము మాకంతముల జుట్టకుము. చేతులార నిన్ను వధింపజాలము. వెనుకకు మరలిపొ"మ్మని దోసిలియొగ్గి సవినయముగా బ్రార్థించెను. ఖడ్గతిక్కన యాతని నగౌరవించి "చేతగాకున్న పుల్లరినొసంగి శరణు గోరుము. శక్తియున్న నెదిరింపుము. పెక్కుమాటలేల? బ్రాహ్మణుని జంపదగదని ధర్మశాస్త్రములు వల్లింప దలంచితిరేని మీకు సంఘవిలయము తప్పదు పొమ్మ"ని తిరస్కరించెను. కాటమరాజు చేయునదిలేక తన సైన్యమును ఖడ్గతిక్కనమీదికి బఱపి కాటమరాజు స్వయముగా సంగ్రామభారము వహించెను. రెండు మూడు మాఱులు మంచి యవకాశము లభించినను బ్రాహ్మణ భక్తుడగు కాటమరాజు ఖడ్గతిక్కనను విడిచిపెట్టెను. ఖడ్గతిక్కన యట్టి యవకాశము తనకు జిక్కినపుడు చేతనైనంతవఱకు బ్రతిపక్షసైన్యమును మారణము చేయుచుండెను. ఈ పరిస్థితులను గమనించి సేనానాయకుడగు బ్రహ్మరుద్రయ్య కాటమరాజువద్దకేగి, "నృపాలకా! నీవాగుము.

బ్రాహ్మణుడని ఖడ్గతిక్కనను నీవు వదలుటచే నాతడు మనసైన్యమును రూపుమాపుచున్నాడు. వర్ణాశ్రమ ధర్మములు విచారింపవలసినది సంగ్రామరంగమందా? పేరునకు నీవు సేనాధీశ్వరుడుగ నుండుము. నేను జయము సాధింతు"నని ఖడ్గతిక్కనను సైన్య సహాయముతో నెదిరించెను. ఉభయులు రణకౌశలులగుటచే జిరకాలము జయాపజయ నిర్ణయముల కనువుగానటుల బోరాడిరి. కాలవశమున వీరవతంసుడగు ఖడ్గతిక్కన మరణించెను. స్వామిభక్తిగల యాతనియశ్వము ఖడ్గతిక్కన శిరమును నోట దగిలించుకొని నెల్లూరిలోని తన యజమాని యింటివద్దకు జేరి సకిలించెను. ఇంటిలోని వారందఱువచ్చి చూడఖడ్గతిక్కనశిరము గోచరించెను. ఖడ్గతిక్కన రణరంగమున మరణించినవా ర్త వినినంతనె నగరమంతయు క్షోభించెను. వీరవతంసు లందఱు కన్నీరు గార్చిరి.

మంచములోనున్న సిద్ధానామాత్యుడు కుమారుని వీరమరణవార్త వినినంతన యానందబాష్పములు విడుచుచు బరలోక మలంకరించెను. ఆయన తల్లియగు ప్రోలమాంబ కుమారుని శిరము ముద్దాడి యిప్పటికి వీరమాత ననిపించుకొంటినని ప్రాణములు విడిచెను. చానమ్మ భర్తతల నొక కాష్ఠమునందుంచి తానును నందుజొచ్చి సర్వజన ప్రశంసాపాత్రురాలై కీర్తివహించెను. ఖడ్గతిక్కన భౌతికస్వరూప మేనాడో నశించినది. చరిత్రాభిరతులు నుత్సాహశాలురునగు నాంధ్రయువక హృదయములం దామహావీరునితేజము నేటికి బ్రకాశించుచున్నది. ఈవీరునిజన్మకాలము తెలియదుగాని క్రీ.శ. 1200-1260 వఱకున్న తిక్కనసోమయాజికి సమకాలికుడును, సోదరుడును గాన నించుమించుగా నాకాలముననే యున్నటుల విశ్వసింపవచ్చును. స్వామిభక్తిపరాయణతయందును. శూరత్వమునందును నీవీరవతంసుడు ఆంధ్ర వీరసందోహమునందవతంసప్రాయుడై యున్నాడు. ఆంధ్రుల పునరభ్యుదయమున కీవీరుని సంకల్పము దోహద మొసంగుగాక.

ప్రతాపరుద్ర చక్రవర్తి.

మన కథానాయకుడగు ప్రతాపరుద్రచక్రవర్తి క్షత్రియ వంశజుడు. వీరాధివీరుడగు నీరాజసింహుని చరిత్రము తెలిసికొనుటకు ముం దీయన పూర్వులను గుఱించి తెలిసికొనుట యావశ్యకము. తొలుత కళ్యాణపురరాజులగు పశ్చిమచాళుక్యులకడ దండనాయకుడుగ నున్న ప్రోలరాజను వీరుడు తద్రాజ్యపతనానంతరము హనుమకొండ రాజధానిగా జేసికొని స్వతంత్రపతాకము స్థాపించి యాంధ్రదేశములో జాలభాగము తన పరిపాలనమున జేర్చుకొనెను. ఈనరపాలుని పుత్రుడగు రుద్రదేవుడు పితృసంపాదితమగు రాజ్యమును మిగుల నభివృద్ధిలోనికి దెచ్చెను. ఈ నరపాలుడు శిల్పములకు లలితకళయగు కవితకు గూడ నభివృద్ధి మార్గముల నన్వేషించెను. ఈయన యనంతరము ఇతని తమ్ము డగు మహ దేవరాయల పుత్రుడు గణపతి దేవుడు రాజ్యమునకు వచ్చెను. ఈనృపుని కాలమునాటికి ఓరుగల్లుకోట పూర్తి యయ్యెను. తన సామ్రాజ్యము నీత డోరుగల్లులో స్థాపించి చాళుక్యులను చోళులను జయించి యభివృద్ధిలోనికి దెచ్చెను. పుత్రసంతానము లేకపోవుటచే నీయనపుత్రి రుద్రమదేవి రాజ్యమునకు వచ్చి చిరకాలము మహత్తరముగ నాంధ్ర సామ్రాజ్యమును బాలించెను. పితృ దత్తమగు రాజ్యము నీయమ విస్తరింపజేసి తిరుగబడిన రాజుల బిలుకుమార్చి యాంధ్రజాతియం దంతర్హితమైన పరాక్రమము నీయమ యొక్కమాఱు బ్రజ్వలింపజేసెను. ఈయమకు బురుషసంతతి లేదు. ముమ్మడమ్మ, రుయ్యమ్మయను నిరువురు కుమార్తెలు గలరు. ముమ్మడమ్మను చాళుక్యాన్వయుడగు వీరభద్రరాజు, రుయ్యమ్మను ఇందులూరి అన్నభూపతియు బెండ్లాడిరి. అల్లుండ్లిరువురు ప్రత్యేక మండలాధిపతులైనను రుద్రమదేవికి గుడి భుజముల వలె నుండి సంగరములం దాయమకు సాయపడుచు విజయలక్ష్మిని గనుసన్నలలో నుంచిరి. రుద్రమదేవి తనపుత్రికలకు బుత్రసంతానము గలిగెనేని వారికి రాజ్యము స్వాధీనము జేసి కృతార్థురాలు గావలెనని సంకల్పించెను. పెక్కువ్రతములు గావించెను. ఎన్నియో యాలయములు గట్టించెను. కానవచ్చిన దేవరలకెల్ల దాను మ్రొక్కి కుమార్తెలచే మ్రొక్కించెను. అయినవోలు మైలారుదేవరకు, కొలనుపాక సోమనాథునకు, వేములవాడ రాజేశ్వరునకు, మొగిలిచర్ల ఏకవీరాదేవికి మహోత్సవముల జేయించెను. దైవానుగ్రహమున ముమ్మడమ్మ గర్భ వతి యయ్యెను. ప్రజ లీశుభవార్తవిని యుత్సవము లొనర్చిరి. శాలివాహనశకము...... ఆనందనామ సంవత్సర చైత్రశుద్ధ పంచమి గురువారము బ్రాహ్మీముహూర్తమందు సూర్యుడు, అంగారకుండు, బుధుడు, బృహస్పతి, యుచ్చస్థానముసను, శని స్వక్షేత్రమున నున్న శుభసమయమున నొకబాలు డుద యించెను.

ఓరుగల్లునగరమున నానా డొనరింపబడిన వేడుకలకు మితము లేదు. పురమంతయు నలకరింపడెను. ఆలయము లన్నింటియందు మహోత్సవములు జగన్మోహనముగా జరుపబడెను. మంగళవాద్యము లెడతెగక మ్రోయింపబడెను. రుద్రమదేవి నామకరణోత్సవము మహావైభవముగ నెర వేర్ప జేసి ప్రధానమంత్రియగు శివదేవయ్య యనుమతిచే నాబాలునకు శ్రీమన్మహారాజ వీరప్రతాప రుద్రదేవ చక్రవర్తియని నామకరణ మొనరించెను. శుక్లపక్షచంద్రునివలె నాబాలు డభివృద్ధి నొంది బాల్యమునందె ధనుర్విద్యయు, వ్యాయామ విద్యయు, సంస్కృతాంధ్రములు, రాజనీతియు గురువులకడ నభ్యసించి ముత్తవయగు రుద్రమదేవితో రాజసభామందిరమున ఆసీనుడై పరిపాలనా విధానమును గూడ బసితనముననె నేర్చు కొనెను.



ప్రతాపరుద్ర చక్రవర్తి.

రుద్రమదేవి తనవార్ధకమున మనుమడగు ప్రతాపరుద్ర దేవునకు బట్టాభిషేకము జేయసంకల్పించెను. ఈశుభసంకల్పము వినినంతన ప్రతాపరుద్రుడు పట్టాభిషేకానంతరము విశ్రాంతి చాలదని తనమంత్రిని సైన్యమును వెంటగొని యొకమాఱు విజయయాత్రకు వెడలి పలువురు స్వతంత్రరాజులను సామంతులుగా గొని కొన్నిచోటుల జయస్తంభముల స్థాపించి నియమిత కాలమునకు రాజధాని చేరెను. ఓరుగల్లు నగరము మిక్కిలి రమణీయముగా నలంకరింప బడెను. స్వయంభూదేవాలయము నందును, జెన్న కేశవాలయము నందును మహోత్సవములు జరుప బడెను. జరుపబడిన వేడుకలకు మితములేదు. మంగళవాద్యములచే భూనభోంతరములు మాఱుమ్రోగెను. వివిధ ప్రాంతములతో బుణ్యానదులనుండి తెచ్చిన శుద్ధోదకముచే బ్రతాపరుద్రచక్రవర్తిని బట్టాభిషిక్తుని గావించిరి. ప్రజల యుత్సాహము మేరమీఱెను. రుద్రమదేవి యాశుభావసరము బురస్కరించుకొని యుద్యోగులందఱకు సత్కృతు లొనరించెను.

ప్రతాపరుద్రుడు రాజ్యమునకు వచ్చిన క్రొత్తలో గొంద ఱాతని నిరాకరించి కప్పములొసంగుట మానిరి. కొందఱు స్వాతంత్ర్య సంపాదమునకు గుట్రలు చేయసాగిరి. మనుమగండగోపాలుడు, అంబయదేవమహారాజు, త్రిపురారి దేవుడులోనగు నెల్లూరు మండలపాలకులు తిరుగబడిరి. ప్రతాపరుద్రుడు తనసైన్యమునంపి మనుమగండ గోపాలుని దెగటార్చించి రాజ్యమున శాంతి స్థాపింప జేసెను. అంబయ దేవ త్రిపురారి దేవాదులు తమంతతాము లోబడిరి. ప్రతాపరుద్రుడు స్వాతంత్ర్యము ప్రకటించుటకు యత్నించుచున్న పాండ్య చోళ కేరళ దేశాధిపతుల జయింపనెంచి కోటలు కొత్తళములు బాగుచేయించి సైన్యమును మిగుల వృద్ధికిదెచ్చెను. ఆ తరుణమున దేవగిరిదుర్గమున యాదవవంశజుడగు రామదేవుడు పాలించుచుండెను. ఇతడు భోగలాలసుడై కాలము గడుపుచు రాజ్యవ్యవహారములలో నంతగ జోక్యము పుచ్చుకొనకుండెను. ప్రతాపరుద్రుని త్రిలింగసామ్రాజ్యము మహోన్నత దశలోనుండుటచే నుత్తరహిందూస్థానమును బాలించు మహమ్మదీయ నృపాలురకు దేవగిరిని లోగొని యాంధ్రసామ్రాజ్యమును హరింపవలెనను కోర్కి జనించెను.

డిల్లీ సామ్రాజ్యమును జలాయుద్దీను ఫిరోజు పాలించు కాలమున అల్లాఉద్దీను అపరిమితసైన్య సహాయముతో నొకమాఱు దండయాత్ర కరుదెంచి దేవగిరిని ముట్టడించి జయించి రామదేవునివలన గొంతధనము, అమూల్యరత్నములు, బంగారము గైకొని సామంతునిజేసికొని వెనుకకు మఱలెను. ఆంధ్ర సామ్రాజ్యముగొప్పతన మపు డతడు వినెనుగాని సైన్యమలసి యుండుటచే ముందునకేగ మానెను.

అల్లాఉద్దీను తన మేనమామయగు జలాలుద్దీను ఫిరోజును జంపి తాను క్రీ.శ. 1296 లో బ్రభువయ్యెను. ఇతడు ఓరుగల్లు రాజ్యమును జయింపనెంచి సైనికబలమును ఆయుధసామగ్రిని మిగుల నభివృద్ధిపరచి క్రీ. 1303 లో మల్లిక్ నాయబ్ కాపూరనువాని సేనాధిపతిగ నొనర్చిపంపెను. మల్లిక్ నాయబ్ కాపూరు పదివేల గుఱ్ఱపుదళము నలుబదివేల సైనికులతో బయలుదేరి దేవగిరిచేరి యంతకుమున్ను యంకితుడైన రామదేవునియొద్ద నాతిథ్యముల గైకొని ఆంధ్రనగరము మీదికి బయలువెడలెను. ఈవార్త ప్రతాపరుద్రదేవుడు వినినంతనె యవనసైన్యమునకు బరాభవము సులభముగ జేయవచ్చునని పాండ్య చోళ కేరళదేశములపైకి బోవ సర్వసిద్ధముగా నున్న యాత్మీయసైన్యమునకు దన తమ్ముడగు అన్నమదేవుని యధ్యక్షుని గావించి యెదిరింపబంపెను. పురవరి మహాదేవనాయకుడు, సాహిణిమారుడు, మేచయనాయకుడు బెండపూడి అన్నయమంత్రి, ముప్పడినాయకుడు లోనగు మహావీరులకు గొంతబలము నొసంగి తాను గోదావరీతీరమువఱకు యవనసైన్యము నెదిరింపనేగెను. ఆంధ్రసైనికులు మహమ్మదీయ సైన్యమును గోదావరి దాటకుండ బెక్కువిధముల నరికట్టిరి. పడవలలో వచ్చుసైనికులను సుడిగుండములలో గూలద్రోసిరి. పడవలు బగులగొట్టిరి. ప్రాణములకు దెగించి హతశేషులగు యవన సైనికులు గోదావరి దాటి యీవలకు వచ్చినంతనె ఆంధ్రమహమ్మదీయ సైన్యములకు మహాసమరము జరిగెను. ఆంధ్రవీరులు మొక్కవోని పరాక్రమమున ముందున కుఱికి యవన సైన్యము నంతయు జిందరవందర గావించి రణరంగము నంతయు బ్రతిపక్ష రక్తప్రవాహములతో నించిరి. ప్రాణముల మీది యాసతో జెట్టునకొకరు గుట్టకొక---
-------విడిచి మైమఱచి తురు: సైన్యమునుజెండాడి విజయలక్ష్మీద్వితీయులై యాంధ్రసైనికు

లేకశిలానగరము జేరిరి. పరాభవదు:ఖముతో హతశేషమగు సైన్యమును సమకూర్చుకొని మల్లిక కాపూరు డిల్లీకి జేరెను.

రణమున జయించి సైన్యమును జెండాడి నగరమున కేతెంచిన యాంధ్ర వీరులనందఱను బ్రతాపరుద్ర చక్రవర్తి గౌరవించి యుచిత సత్కారములగావించి గౌరవించెను. ప్రజలు తమ సామ్రాజ్యజయమున కానందించి వీరులకు హారతులొసంగి మహోత్సవము లొనరించి మృతవీరుల పొలికలనిలో స్మరణ చిహ్నముల నెలకొల్పిరి. ఏకశిలానగర రాజ్యమును గబళింప నెంచిన త్రిపురాంతకుడు అంబయదేవుడు ప్రతాపరుద్రుని వంచింప నిదియ తరుణమని యోరుగంటికోటపైకి వచ్చిరి. సోమయగన్నవీరు డపరిమిత సైన్యబలముతో వారి నెదిరించి సైన్యసహితముగ దునుమాడి వారిరాజ్యము నాంధ్రసామ్రాజ్యములో గలిపివేసెను. యవనసైన్యము డిల్లీకేగినది మొదలు అల్లాఉద్దీను ఆంధ్ర సామ్రాజ్యమును హరింపనైతినే యనిమిగుల నాందోళనపడి యచిరకాలమున మఱల దండయాత్ర కేగనిశ్చయించి సైనిక బలమునభివృద్ధి జేయుచుండెను. అపుడు దేవగిరిని డిల్లీకంకితుడై పాలించు మహారాష్ట్రుడగు రామదేవుడను నామాంతరముగల రామచంద్రదేవుడు డిల్లీసామ్రాజ్యమునకు బన్నునొసంగమానెను. అల్లాఉద్దీను రెండవదండయాత్ర కాంధ్రకోశముమీదికి మల్లికాపూరునుబంపెను. అతడు తొలుత దేవ గిరిని ముట్టడించి రామచంద్రదేవుని బంధించి డిల్లీకిబంపి యచటిబలము నంతయును హరించి ఏకశిలానగరముమీదికి దాడి వెడలెను. కాని తీరని పరాజయము నొంది యవనసైనికులు చిందరవందరయై బ్రదుకుము జీవుడాయని ఇంటిత్రోవబట్టిరి. పరుష స్వభావముతో నీయవనసైనికులు ఆంధ్రదేశమున బ్రవేశించినపుడును బారిపోవునపుడును. గూడ ఆలయముల రూపుమాపి నగరములను గాల్చి దీనుల హింసించి ప్రజాపీడ సమకూర్చిరి. ఆంధ్రసామ్రాజ్యమంతయు యవన దురంతములచే గల్లోలమై క్షోభనొందెను. నష్టపడిన ప్రజలందఱకు బ్రతాపరుద్రుడు బొక్కసమునుండి ధనము తెప్పించి యొసంగి వారి యాపత్తుల జాలవఱకు నివారించెను.

క్రీ.శ.1319 సంవత్సరమున అల్లాఉద్దీను మూడవ పర్యాయము ఆంధ్రసామ్రాజ్యమును జయించుటకు మల్లికాపూరు, ఖ్వాజాహాజీయను వారల యధ్యక్షతక్రింద నపరిమిత సైన్యమును నొసంగి పంపెను. దేవగిరిచెంత నెట్టిప్రతిఘటనను లేకుంటచే యవనసైన్య మాకస్మికమున ఇందూరు మీదుగా వచ్చుచుండ స్వామిభక్తపరాయణులగు సైనికు లెదిరించి వీరమరణమొందిరి. మహమ్మదీయులు సిరిపురదుర్గమును ముట్టడించిరి. దుర్గపాలకుడగు వాణీకవిదేవుడు భయంకరసంగ్రామ మొనరించి యవనసైనికుల యాగ్నేయాస్త్రములకు గుఱియై అవరోధకాంతలతో గూడ దగ్ధమయ్యెను. అతని సోదరుడు సర్వవైభవ సంపన్నమగు దుర్గము మహమ్మదీయులకు స్వాధీనమయ్యెను. అనంతరము సముద్రమువలె బొంగి పొరలివచ్చు యవనసైన్యమును సూనార్పూరు దుర్గమువద్ద నాంధ్రు లెదిరించిరి. ఉభయపక్షములవారికి భయంకరసంగరము జరిగెను. దురదృష్టవశమున నాంధ్రు లోడిరి. మహమ్మదీయ సైన్యము ఆంధ్రనగరము ముట్టడింపవచ్చు వార్తవిని ప్రతాపరుద్రదేవుడు శూరులనందఱ బిలువనంపి చాపకూడుగుడిచి, యుచిత రీతి సత్కరించి ప్రతిపక్షుల నెదిరింప బంపెను.

ఆంధ్రసైనికు లప్రతిమాన పరాక్రమముతో యవన సైన్యము నెదిరించిరి. మహమ్మదీయులు పట్టుదలతో నిలిచి యాంధ్రనగర దుర్గముల కన్నింటికి శతఘ్నులు బారుచేసి కాల్పసాగిరి. ఓరుగల్లుకోట కన్నివైపుల యవన సైనికులు మూగిలోనికెటుల బ్రవేశింపవలయునో తోచక కలవరపడు చుండిరి. చుట్టును పుట్టకోటయు దానిచుట్టు మిగుల విశాలమగు అగాధజల పూరిత పరిఘయు నుంటచే మహమ్మదీయులు ముందులకుబోవ జంకిరి. కోటగోడపై నున్న వీరులు పరిఘలో గాలుంచిన వీరుని నుంచినటుల ఖండింప దొడంగిరి. ఇట్లు నెలల కొలది గడచెను. ఆంధ్రనగరము యవనులకు సాధ్యము కాదయ్యెను. ప్రతాపరుద్రదేవుడు శైవమత పక్షపాతియని భావించి యానృపాలుని ద్వేషించు జైనాచార్యులు కొందఱు రహస్యముగ మహమ్మదీయుల గలసికొని కోటయాకృతి యంతయు దెలిపిరి. ఆకస్మికముగ నున్నటులుండి యవనులు ఏనుగుల సహాయముతో నగడ్తదాటి యర్ధ రాత్రమున మంటికోటనెక్కి లోనున్నపౌరులను సైనికులను హింసింప దొడంగిరి. తెల్లవారు వఱకు ఱాతికోటవఱకు మహమ్మదీయ సైన్యములు వచ్చెను. అగడ్త వారి నాటంకపఱచెను. అగడ్త పూడ్వసాగిరి. పైనుండి యాంధ్రసైనికులు ఆగ్నేయాస్త్రములు,

ఆయుధవర్షము గురిపించి యవనదళము జెండాడుచుండిరి. తగనిపట్టుదలతో యవనవీరులు ఱాతికోటకు బగ్గమువేసి ప్రాకుచుండిరి. ప్రతాపరుద్రదేవు డీవార్త నాలించి యిక విజయము దుర్లభ మని తలంచి యాంధ్రుల దురదృష్టమునకు గాలమే కారణమని సంధికియ్యకొనెను. మధ్యవర్తులు సంధికి రాయబారముల నడిపిరి. ప్రతాపరుద్రుడు 312 ఏనుగులు, 20,000 గుఱ్ఱములు 96,000 మణుగుల బంగారము, పెట్టెడు రత్నములు నొసంగి డిల్లీసామ్రాజ్యమునకు బన్నుకట్టుట కొప్పుకొనెను. మల్లికాపూరు జయమును గడించి 1310 సంవత్సరము మార్చి 19 వ తేదిన డిల్లీ సామ్రాజ్యాభిముఖుడై హతశేషసైన్యముతో వెడలి పోయెను.

ఓరుగల్లురాజ్యమును మహమ్మదీయులు ముట్టడించిరనియు బ్రతాపరుద్రుడు సంధి కియ్యకొనెననియు విన్నంతనె సామంతులలో బెక్కండ్రు తిరుగబడి కప్పములీయ వద్దని నిశ్చయించిరి. కాంచీపుర పాలకుడు స్వతంత్రత బ్రకటింప బ్రతాపరుద్రు ని సేనానాయకుడును రేచర్ల గోత్రుడుననగు ఎఱ్ఱదాచానాయకుడు కాంచీపురరాజ్యము కాకతీయులవశము గావించెను. కులశేఖరవర్మ తరువాత కాంచీరాజ్యమును హరింప ముప్పడి నాయకు డేగి యాతనిజయించి తెలుగు చోడులలో నొకడగు మానవీరుని సింహాసనమున జేర్చెను. చిన్నచిన్న రాజ్యములు గూడ దిరుగబడుట చూచి స్వయముగా దండయాత్ర చేయకున్న వీలుగాదని దుర్గరక్షణమునకు వలయు బలమును ఆంధ్రనగరమునందుంచి యపరిమిత బలముతో బ్రతాపరుద్ర చక్రవర్తి దండయాత్రకు బయలుదేరి పాండ్య, కొంకణ, తెంకణ, మలయాలాది పశ్చిమదేశాధీశ్వరుల నంకితులుగ జేసికొని పుణ్యక్షేత్రముల దర్శించి మణి మాన్యాదికము లొసంగి ఓరుగల్లు చేరెను. పూర్వముకంటె దృఢతరముగ దుర్గమును బాగుచేయించి కందకమును విశాలముచేయించి యాంధ్రనగరమును శత్రుజనాభేద్య మొనర్చెను. శైవమతాభిమానియై బ్రాహ్మణోత్తములకు బెక్కు వృత్తులనొసంగి కవుల బహూకరించి యుత్తమకావ్యముల రచింప బ్రోత్సహించి తటాకముల నభివృద్ధిపఱచి రాజ్యము రామరాజ్యమ గావించెను. నాడు నిర్మింపబడిన కాకతమ్మబావి, శోభనాల బావి, సవతుల బావి, గడియారముల బావి, కుషిమహలు, ఏకశిలామహలు లోనగు కట్టడము లాంధ్రవీరుల శిల్పిప్రశస్తికి దార్కాణముగ నేటి కలరారుచు నేత్రపర్వముగ నున్నవి. కేశవాలయము, స్వయంభూదేవాలయము మిగుల వైభవో పేతములుగ నుత్సవములచే నలరారుచుండెను. కొలది కాలములో ఆంధ్రసామ్రాజ్యము మహోన్నతదశకుకు వచ్చెను.

ఇంతలో డిల్లీరాజ్యమున బెక్కువిప్లవములు జరిగెను. అల్లాఉద్దీను గతించెను. డిల్లీసామ్రాజ్యసామంతులు తిరుగబడిరి. దేవగిరియాదవులు స్వతంత్రులైరి. ప్రతాపరుద్ర చక్రవర్తి గూడ పన్నుకట్టుట మానికొనెను. మల్లికాపూరు సింహాసన మెక్క విశ్వప్రయత్నముగావించెను. ఆతని వధించిరి. తరువాత ముబారకు అనుపేరుగల అల్లాఉద్దీను రాజ్యమునకు వచ్చి దేవగిరి మీదికి దండయాత్రకేగి దుర్గాధిపతియగు హరిపాల దేవుని నోడించి రాజ్యమధ్యమున బ్రతికియుండగ మిగులక్రూరముగ నతని మేనితో లొలిపించెను. ముబారకు రాజ్యమునకు జేరగనే ఖుస్రూఅను సేనాధిపతి వానిని జంపించి తాను రాజయ్యెను. తరువాత నైదు మాసములకు ఘాజీబేగుతుగ్లక్ ఖుస్రూను సంగరరంగమున జంపి ఘియాజుద్దీను తుగ్లక్ అనుపేరుతో క్రీ.శ. 1321 ఆగష్టు 22 తేదిని డిల్లీసామ్రాజ్యమునకు రాజయ్యెను. ఇతడు రాజనీతివిదుడగుటచే నలువైపుల నుండి శత్రుసైన్యములు రాకుండ కట్టుదిట్టములు చేయించెను. ప్రతాపరుద్రుడు పూర్వవైరము పురస్కరించుకొని డిల్లీ సామ్రాజ్యమును మ్రింగివేయునేమో యను భయమాతని హృదయమును దహించివేయుచుండెను. తుగ్లక్ తన కుమారుడగు అలూపుఖానునకు అపరిమితమగు సైన్యమును సహాయముగ నొసంగి యాంధ్రసామ్రాజ్యమును ముట్టడింపబంపెను. ఇది నాలుగవ ముట్టడి. ప్రతాపరుద్రుడీ వార్త విన్నంతనె సమీపదుర్గములందున్న సైన్యమును సేనాధిపతులను రప్పించి రాతికోటలోని ప్రతిదుర్గమునకు ఒక్క వెలమవీరుని గొంతసైన్యమును గాపుంచి ద్వారములన్నింటినిండ వీరాధివీరులగు సైనికులనుంచి తేరాల బచ్చిరెడ్డి, కొలిపాక సిద్ధయ్య, శ్రీరంగమదేవుడు, మహాదేవనాయకుడు, గన్నయ్యా సేనాని, కుమారరుద్రదేవుడు లోనగుమహావీరులు సవలక్ష సైనికులతో నాంధ్రసామ్రాజ్యము సంరక్షించుటయో సంఘమరణ మొందుటయో కర్తవ్యమని రణమునకు దలపడిరి. రాచర్లవద్ద విడిసిన యవనసైన్యము ముందునకు వచ్చెను. మహాత్ముడగు శివదేవయ్య వీర చందనము విభూతిగైకొని వీరులందఱును నాశీర్వదించి తిలకము మొగమునిండ, గందము మేన బూసి రణమున కంపెను. అద్వితీయపరాక్రమముతో నాంధ్రులుపోరాడిరి. రాజ్యమునందున్న ప్రతిపౌరుడు రణమున

బాల్గొనెను. చుట్టుపట్టునగరముల వారందఱు పగతుర సైన్యము ననేకవిధముల జెండాడిరి. కడకు మహమ్మదీయసైన్యము సంపూర్ణముగ నాశనమయ్యెను. సరదారులు పలువురు మరణించిరి. యుద్ధోపకరణములన్నియు నూడలాగికొని ఆంధ్రవీరులు మహమ్మదీయుల గోదావరితీరము దనుక బాఱదోలిరి. అలూపుఖాను మూడువేల గుఱ్ఱపుదళముతో డిల్లీచేరి తన పరాజయ కథయంతయు దండ్రికి నివేదించెను. సుల్తాను, చుట్టుపట్టులనున్న చందేరీ, బూదావూన్, మాళవదేశములనుండి తక్షణమె యసంఖ్యాక సైన్యమును రప్పించి యలూపుఖానున కొసంగి త్రిలింగసామ్రాజ్యమును హరించి రాజును బంధించిగాని నాయొద్దకు రావద్దని పంపెను. యవన సైన్యము రాత్రుల నడవిత్రోవల బయనము చేసి ఆకస్మికముగా నోరుగల్లుకోటమీదపడి నిర్భయముగా నసహాయముగానున్న ద్వార రక్షకసైన్యమును దెగటార్చి లోనికిజొచ్చెను. యుద్ధముముగిసి రెండునెలలైన గాలేదు. ఇంతలో యవనులవలన నెట్టి యుపద్రవముండదని వీరులకు విశ్రాంతి యొసంగి ప్రతాపరుద్రుడు పరిమితబలముతో నగరమధ్యమునందలి మహాసౌధమున నుండెను. యవనసైన్యము ఱాతికోటకు ఫిరంగులు బారు పెట్టికాల్చుట లాంధ్రసైనికులు విని నివ్వెఱపోయిలేచి దుర్గరక్షణమునకు బూనుకొనిరి. యవన సైనికులుకోట బైటిద్వారములన్నిటిని మూయించి క్రొత్తసైన్యము నగరము జేరకుండ కట్టుదిట్టముచేసి రాతికోట బగులగొట్టనారంభించిరి. ప్రతాపరుద్రచక్రవర్తి యేనుగునెక్కి సైనికుల బురికొల్పుచు బ్రతిపక్ష సైన్యమును బంచబంగాళము చేయించుచుండెను. ఆంధ్రసైనికులు పరాజయమందుచుండిరి. ప్రతాపరుద్రు డీవిపరీత పరిస్థితులగాంచి స్వయంభూ దేవాలయమున కేగి జ్యోతిర్లింగమును సందర్శించిన నది ప్రకాశవంతముగ గోచరింపదయ్యె. పద్మాక్షియాలయమునకేగి యాయుధములటనిడి నమస్కరింప బోవ నాయుధములు సర్పాకారముదాల్చి గుహలోనికి బోయెను. ఈపరిస్థితులు అపశకునములుగ నెంచి ప్రతాపరుద్రదేవుడు జయముపై నాసవీడి ఖడ్గముపుచ్చుకొని మహమ్మదీయ సైన్యముపై దుమికెను. అలూపుఖాను ప్రతాపరుద్రుని బంధించి రహస్యముగా దనశిబిరమున జేర్పించెను. రాజింక యుద్ధము చేయుచున్నాడని సైనికులు ఘోరముగ బోరాడుచుండిరి. అలూపుఖాను ఆరాత్రినుండియే సైన్యముతో ప్రతాపరుద్రుని డిల్లీకిబంపెను. ఎటులో నీవర్త ఓరుగల్లు నగరమునందంతటను బ్రాకెను. ఆంధ్రభటులు రాజునువిడిపింప శిబిరముల కడకుఱికి భయంకరసమరము చేయుచుండ మహమ్మదీయ సైనికులు కోటలు బగులగొట్టి ఆలయముల గూలద్రోచి రాజమందిరము అంగడి వీధులుదోచి డిల్లీత్రోవబట్టిరి. మహమ్మదీయ శిబిరములందు దమరాజు లేకుండుటకు వగచి డిల్లీకి గొనిపోవుచుండిరేమో త్రోవలో నడ్డగించి రాజును విడిపింతమని యవనసైనికులు పోయిన త్రోవనుబట్టి యాంధ్రులు రామగిరియొద్ద ప్రతిపక్షసైన్యమును గలసికొని ఘోరసంగరమునకు దలపడిరి. ఆంధ్రసైనికులు రాజును విడిపించుటకు భోవుచున్నారని విని ఓరుగల్లు ముట్టడించు మహమ్మదీయ సైనికులు రామగిరివద్ద తమసైన్యములను గలిసికొని ఆంధ్రసైనికులతో బోరుచుండ యుక్తిశాలియగు నొక మహమ్మదీయసేనాని కొంత పరిజనముతో రాజు నీసంరంభములో గోదావరి దాటించెను. ఆంధ్రసైనికులు యవన సైన్యమును జెండాడి పరిశీలింప రాజు కనబడ డయ్యెను. దురదృష్టవశమున నాంధ్రులు పరాధీనులై యవనపాలనమున నున్న నిజనగరము చేరిరి. ఆంధ్రదేశ మద్వితీయవిక్రమముతో బాలించి ఆంధ్రజాతికి శరణ్యుడైన ప్రతాపరుద్రుడు 1323 లో బంధీకృతుడయ్యెను. ప్రతాపరుద్రుడు జీవగ్రాహిగ బట్టువడినందులకు డిల్లీనవాబు ఆఱుమాసము లుత్సవము జరిపెనట. డిల్లీ నవాబు దయదలచి విడిచిపెట్ట ప్రతాపరుద్రుడు కాళేశ్వరమునకు వచ్చి యట గొంతకాల ముండి మరణించినటుల స్థానికచరిత్రము చెప్పుచున్నది ఆంధ్రసామ్రాజ్యమునకు ముఖ్యస్థానమగు ఓరుగల్లు పూర్వవిభవమంతయు ప్రతాపరుద్రుడు బంధీకృతు డగుటతో దీరిపోయెను. నాటి సామ్రాజ్య చిహ్నము లనదగు శిలాద్వారములు, కూపములు, ఆలయములు, దుర్గద్వారములు, క్రీడాసరోవరములు స్మరణ చిహ్నములవలె నేటికి జరిత్రాభిరతుల సంతాపాశ్రుసేచన ముతో దృప్తినొందుచు ఓరుగల్లుకోటలో గనుపించుచున్నవి. ఆంధ్రసోదరులారా! హతశేషములగు చిహ్నముల గాంచియేని యానందింపరా ?

కృష్ణదేవరాయలు.

మహా శూరశిఖామణియు ఆంధ్రభాషాప్రియుడు నగు శ్రీకృష్ణదేవరాయల దివ్యనామము నెఱుంగని యాంధ్రుడుండడు. ఈ రాజతిలకుని జీవితచరిత్రము చెప్పుటకు ముందు విద్యానగర సామ్రాజ్య చరిత్ర మించుక చెప్పవలసియున్నది.

ప్రతాపరుద్రదేవుడు బంధీకృతుడైనంతన సేనానాయకు లెవరిత్రోవను వారేగి చిన్నచిన్న రాజ్యములను స్థాపించిరి. ఆంధ్రనగరమున సుగంధ భాండాగారాధ్యక్షులుగా నున్న హరిహరరాయలు, బుక్కరాయలు, మాధవ మంత్రితో గలిసి యానెగొంది ప్రాంతములకు జనుదెంచిరి. శైలములమధ్య సురక్షితముగానున్న యొక ప్రదేశమునందు శా.శ. 1648 ధాతసంవత్సర వైశాఖశుద్ధ పంచమి (క్రీ.శ.1136) నాడు మాధవమంత్రి విద్యానగరమను పట్టణరాజమును నిర్మించి హరిహరరాయల బ్రభువుగను బుక్కరాయల యువరాజుగ నొనరించెను. నగరముచుట్టును ఏడు ప్రాకారములు నెలకొల్పబడెను. మాధవమంత్రి సన్యసించి మాధవ విద్యారణ్యు లను నామముతో శృంగేరి పీఠమున కధ్యక్షుడయ్యెను. క్రమక్రమముగా విద్యానగరరాజ్యము మిగులవృద్ధిలోనికి వచ్చి సుప్రసిద్ధమై యరిజనాభేద్యమై యొప్పెను.



కృష్ణదేవరాయలు.

హరిహరరాయల, బుక్కరాయల యనంతరమున విద్యానగరరాజ్యమును రెండవహరిహరరాయలు, దేవరాయలు(రెండవ) దేవరాయలు, మల్లికార్జునరాయలు, విరూపాక్ష రాయలు, (రెండవ) విరూపాక్షరాయలు పరిపాలించుచు వచ్చిరి. రెండవ విరూపాక్షరాయలు పరిపాలనమునం దసమర్థుడును భోగలాలసుడు నగుటచే బ్రజ లీతని ద్వేషించిరి. ఏతద్రాజ్య దండనాథు:డగు సాళ్వనరసింహరాయ లీపరిస్థితులు గమనించి రాజును వెడలనడచి తానె విద్యానగరసంస్థాన ప్రభువై చిరకాలము పాలించెను. అతని యనంతరమున నిరువురు కుమారు లొకరివెంట నొకరు రాజ్యమునకువచ్చి యకాల మరణమొందిరి. తరువాత విద్యానగర సామ్రాజ్యమునకు తుళువనరసరాజు పరిపాలకుడయ్యెను.

నరసరాజు తరువాత నతనికుమారుడు వీరనరసింహరాయలు కొంతకాలము విద్యానగరసంస్థానము పాలించి మరణించెను. అనంతరము శ్రీకృష్ణదేవరాయలవారు (క్రీ.శ. 1509 ఫిబ్రవరి 4 వ తేది) విద్యానగర సామ్రాజ్యమునకు పట్టాభిషిక్తుడయ్యెను. రాయలవద్ద తండ్రియగు నరసరాజుకాలమునుండి సుప్రసిద్ధుడై యున్న సాళువతిమ్మరసు మంత్రిగ నుండెను. తిమ్మరసు వయసున బెద్దవాడును దనకు విద్యాగురువును రాజకీయ రహస్యవేత్తయు నగుటచే కృష్ణదేవరాయ లాయనయెడల మిగుల గౌరవబుద్ధిగలవాడై అప్పాజి యని పిలుచువాడు. రాయలు రాజ్యమునకు వచ్చినపిదప విద్యానగర సామ్రాజ్యమును కృష్ణదేవరాయలు తన యసాధారణ ప్రజ్ఞాతిశయముచే మిగుల విస్తర మొనరించెను. వీర నరసింహరాయలు విద్యానగరసామ్రాజ్యమును బాలించుకాలముననె కృష్ణదేవరాయలు పన్నులొసంగక తిరుగబడిన సామంతుల లో గొనుటకు దండయాత్రకు బయలు దేరి కర్ణాటకదేశమందలి ఉమ్మత్తూరు దుర్గమును మూడు మాసములు ముట్టడించి జయించెను. తరువాత కావేరీతీరమున నున్న సుప్రసిద్ధమగు శివసముద్ర దుర్గమును ముట్టడించి జయించెను. శ్రీరంగపట్టణమును జయించి తన ప్రతినిధి నచట నిలిపి కృష్ణదేవరాయ లనతికాలములో విద్యానగరమునకు జేరెను. రాయల పరాక్రమజీవితము సుప్రసిద్ధ మగుటచే బూర్వసామంతులలో జాలమంది యెప్పటివలె గప్పము లొసంగుచుండిరి. కొందఱు బాలుడగు కృష్ణదేవరాయలను బాటింపక సుంకమునీయ మానికొనిరి. అందులకై యపరిమిత సైన్యముతో విజయయాత్రలకేగి దేశమునంతయు స్వాధీనపఱచికొన వలయునని సంకల్పించెను. ఈ సంకల్పమునకు దిమ్మరుసు మంత్రి పెక్కుభంగుల బ్రోత్సాహము గావించి నిజబలమును గోశాగారమును నభివృద్ధిపరచెను.

రాయలభార్యలలో జిన్నాదేవియు దిరుమలదేవియు సుప్రసిద్ధురాండ్రు. చిన్నమదేవి యేరాజపుత్రియో స్పష్టము గా దెలియదు. రాయల కీమెయెడల ననురాగము మెండు. ఈమెపేరనాగాలాపురమను నొక పేట గట్టించి మనోహరమగునొక రాజవీధినందు నెలకొల్పెను. వివిధములగు సందు లా వీధిలో బెట్టించెను. ఆవీథులందలి యంగడుల సుంకము సంవత్సరమునకు నలువదిరెండువేల వరహాలను మించియున్నదని చరిత్రకారులు చెప్పుచున్నారు. శ్రీరంగపట్టణాధీశుడగు వీరశ్యామరాయల పుత్రికారత్నమగు తిరుమలదేవి రాయల రెండవ భార్య. ఈయమ రాయల కనుకూలవతియు బ్రేమాస్పదయు నై యుండెను.

కృష్ణదేవరాయలు సామ్రాజ్యమునకు వచ్చినది మొదలు అభివృద్ధిమార్గముల నన్వేషించుచు జుట్టుప్రక్కల బలవంతులై యున్న యవనులను బరాభూతుల జేయ యత్నించుచుండెను. సామంతప్రభువులు ప్రతిసంవత్సరము సుంకమునొసంగుటె గాక యవసరమైనపుడు కొంతసైన్యము నొసంగునటుల గట్టడిగావించెను. తనస్వాధీనములోనికి గ్రొత్తగావచ్చిన దుర్గములకు నధికారుల నియోగించి వారిచే సైనికబలమును అభివృద్ధి చేయించుటయేగాక తానుగూడ ధనము విరివిగా వెచ్చబెట్టి ఆశ్వికబలమును గజబలమును పదాతిసైన్యమును మిక్కిలి యభివృద్ధిలోనికి దెచ్చి బొక్కసము ధనముతో నింపివేసెను. ఆకాలమున రాయల సైన్యము అసంఖ్యాకము అపరిమితముగ నుంటచే సాటి రాజులందఱును అరజేతిలో బ్రాణములుంచుకొని సింహము వలె విజయనగరప్రభువు తమపై నెపుడుపడునో యనిభయపడుచుండిరి. అన్నిచోటుల గలిసి విద్యానగరసామ్రాజ్య సైన్యము పదిలక్షలకు మించియుండెను. ఈసైన్యములో గొంతయు, ముప్పది యాఱువేలమంది యాశ్వికులు, ఏడెనిమిది వందల మంది గఱుసైన్యపాలరులు విద్యానగరమును నిరంతరము గాచుచుండిరి. ప్రతిరాజ్యమునందలి రహస్యముల గుర్తుంచి వచ్చుటకు నేర్పరులగు చారులు నియోగింపబడిరి.

కృష్ణదేవరాయలు రాజ్యమునకు వచ్చిన క్రొత్తలో గొంతకాలము విద్యావినోదములతో గడుపుచుండెను. ఆయన స్వయముగ గర్ణాటాంధ్ర సంస్కృతాది భాషలలో బండితుడును గవియు నగుటచే నాయాభాషలలో సుప్రసిద్ధులగు పండితుల గౌరవించి వారిచే గ్రంథముల రచింపజేసి సారస్వత మాధుర్యము చవి జూచుచుండెను. రాయల కభిమానభాష ఆంధ్రము. ఆంధ్రభాషలో గవితచెప్పు సుప్రసిద్ధకవుల నందఱను బిలువనంపి సత్కరించుటయే గాక తన యాస్థానము నందు అల్లసానిపెద్దన్న, ముక్కుతిమ్మన్న, మాదయగారి మల్లన, తెనాలి రామలింగకవి, ధూర్జటి, అయ్యలరాజు రామభద్రుడు, భట్టుమూర్తి, పింగళిసూరన యను కవులను అష్టదిగ్గజము లను పేరుతో నుంచుకొని వారిచే జిత్రవిచిత్ర కావ్యములు రచింప జేసి సంతోషముగ గాలము


గడపుచుండెను. ఇంతలో--------మత్యుడుగాక సామ్రాజ్య క్షేమము నకు బాటుపడుచు దిమ్మరుసుమంత్రి యనుజ్ఞచొప్పున సైనికబలమును వృద్ధిచేసి తిరుగబడిన రాజుల వృత్తాంతములు చారులముఖమున గుర్తెఱింగి దండయాత్రలకు బలము సిద్ధ పఱచుచుండెను. ద్రవిడదేశము నంతటికి ముప్వురు ప్రతినిధులు నియమింపబడిరి. వారు సామంతులనుండి మూడుకోట్ల ద్రవ్యము సంవత్సరమునకు బ్రోగుచేసి పంపుచుండిరి.

ఇట్లు కృష్ణదేవరాయలు రెండు సంవత్సరములు రాజధానియం దుండి సైనికబలమును మిగుల నభివృద్ధిపఱచి దేశ పరిస్థితులు విశాలదృష్టితో నొక్కమాఱు పరికించెను. మహమ్మదీయ రాజ్యములు చీలికలుగ జీలి వానిలో వానికైకమత్యము లేకుండెను. వీనివలన మనకింతలో నపాయము కలుగదని నిశ్చయించెను. గజపతులు ఓడ్రదేశమునుండి బయలువెడలి కృష్ణా గోదావరుల దాటి బలవంతములగు దుర్గముల నాక్రమించికొనిరి. కొండవీటిదుర్గము, ఉదయగిరిదుర్గము, కనకగిరిదుర్గము గజపతుల స్వాధీనమునం దుండెను. అటు ద్రవిడ దేశమును ఉదయగిరియందుండియు, నిటుకర్ణాట దేశమును గొండవీటి నుండియు రెంటిక్షి నుమోడియు పకయున్న పశ్చిమాంధ్రదేశమును (నిజామురాష్ట్రమును) గొండవీటి దుర్గమునందుండియు జయించుటకు గజపతులు యత్నించుచుండిరి. కటకముమొదలు గోదావరి వఱకు గల దేశమంతయు గజపతులు ముందె యాక్రమించుకొనిరి. గజపతుల నిర్మింపకున్న నెప్పటికేని విద్యానగరసామ్రా జ్యమున కపాయము వాటిల్లునని రాయ లూహించి తొలుత కొండవీటిని ముట్టడింప సంకల్పించెను. తిమ్మరుసుమంత్రి దూరము యోజించి గజపతులబలమంతయు ఉదయగిరియందున్నదిగాన నాదుర్గమునె తొలుత లోగొనవలయునని చెప్పెను. కృష్ణరాయ లియ్యకొని సంగర సన్నధము చేయ నజ్ఞాపించెను. గోవిందామాత్యునికి లక్షసైన్యమును స్వాధీనముచేసి విద్యానగరమును జాకరూకతో గాచియుండ గట్టడి జేసి, యొక శుభముహూర్తమున నాస్థానవిద్వాంసులతో నంత:పురజనముతో ససంఖ్యాకసైనిక సమూహముతో పూర్వదిగ్జైత యాత్రకు కృష్ణదేవరాయలు బయలుదేరెను.

క్షత్రియవంశభూషణులగు శ్రీరంగరాజు, నారపరాజ ఇమ్మరాజును, బ్రాహ్మణవీరుడగు రాయసము కొండమరుసున, కమ్మనాయకుడగు పెమ్మసాని లింగన్నను, వెలమవీరుడగు వెలుగోటి కుమారతిమ్మనాయకుని, పంట రెడ్డియగు గంగాధర రెడ్డిని సేనానాయకుల గావించి ఒక్కొక్కరి యధీనమున ముప్పదివేల కాల్బలము, నాలుగు గుఱ్ఱపుదళములు, ఇన్నూరు మదపుటేనుగులు నుంచి, తిమ్మరుసుమంత్రి యుచితవిధు లందఱకు నివేదించెను. సైనికబలము నలుగెలంకుల నడచుచుండ రాయలు మహోన్నత గజరాజమునెక్కి బ్రాహ్మణులస్వస్తి వాచకముల, కవుల రణగీతముల నాలించుచు బ్రాగ్దిశాభిముఖుడై బయలుదేరి యచిరకాలమున కుదయగిరి జేరెను. కృష్ణదేవరాయలు తనదుర్గముమీదికి వచ్చెనని యుదయగిరి పాలకుడగు తిరుమలకాంతరాయడు విని వెఱగంది చేయునదిలేక యావర్తమానము ప్రతాపరుద్రగజపతికి దెలియ జేయ జారులనంపి పదివేల సైనికులను నాలుగువందలమంది యాశ్వికులను దుర్గమున జేర్చుకొని జాగరూకతతో సంరక్షించుచుండెను. తిమ్మరుసు రాయలును సైన్యమును బురికొల్పి యుదయగిరి దుర్గమును ముట్టడించిరి. కోటలోనున్నవీరులు గుహలోనున్న సింగములవలె బట్టుదల వదలక రాయల సైన్యముతో నిలుకడగ బోరాడుచుండిరి. దుర్గములోని కాహార పదార్థములు పోకుండ నరిగట్టినచో విరోధులు సులభముగా లోబడుదురని రాయలసైనికులు దుర్గద్వారములన్నియు దెఱువవీలుగానివిధమున గండశిలలతోమూసిరి. ఉదయగిరి దుర్గదుస్థితి విన్నంతనే ప్రతాపరుద్రగజపతి లక్షసైనికులను కటకమునుండి తిరుమలకాంత రాయలకు దోడ్పడి ఉదయగిరి కాపాడుటకు బంపెను. ఈవార్త చారులవలన తిమ్మరుసుమంత్రి విని నాయసము కొండమరుసయ్యను కొంతసైన్యమును ఉదయగిరి జయించుటకు గృష్ణదేవరాయల యధీనమునందుంచి తాను వచ్చుచున్న సైన్యమునకు నెదురుగా సైన్యసహితుడై యేగెను. ఉభయదళములకు భయంకర సంగరము మార్గమధ్యమునందె జరిగెను. తిమ్మరుసు మంత్రి యాసంగరమున మగ్నుడై యుంట గమనించి కృష్ణదేవరాయలు విద్యానగరమునుండి కొంతసైన్యము వచ్చుట కాజ్ఞా పించి పదునెనిమిదిమాసము లేకధాటిగ నుదయగిరిని ముట్టడించెను. ఆహారాదులు తగ్గుటచేతను బలము నశించుటచేతను ఉదయగిరి దుర్గము రాయలకు సాధ్యమయ్యెను. వెంటనే సేనాధీశ్వరులు దుర్గమును బగులగొట్టిరి. కృష్ణదేవరాయలు పరిజనముతో దుర్గమున కేగి సేనాదికమును వశపఱచుకొని దుర్గపాలకుడగు

తిరుమలకాంతరాయల జెఱగొని రాయసము కొండమరుసయ్యను ఉదయగిరి రాజ్యమునకు బ్రతినిధిగా నియోగించి హతశేషమగు బలముతో తిమ్మరుసుమంత్రికి సహాయము బోయెను. ఇంతలో విద్యానగరమునుండి క్రొత్తసైన్యమువచ్చి రాయల సైన్యముతో గలిసెను. కృష్ణదేవరాయలు తిమ్మరుసు మంత్రియు రెండుసంవత్సరములు గజపతి సైన్యముతో బోరాడి విజయము గడించి యంతతో దృప్తినొందక గజపతుల బలమున కాయువుపట్టుగానున్న కొండవీటిదుర్గమును బట్టుకొనుటకు బయలుదేరిరి.

ప్రతాపరుద్రగజపతి కుమారుడగు వీరభద్రగజపతి కొండవీటి దుర్గమును బాలించుచుండెను. అద్దంకి, వినుకొండ, బెల్లముకొండ, నాగార్జునకొండ, తంగెడ, కేతవరము దుర్గము లీకొండవీటి దుర్గముక్రిందవె. ఉదయగిరిదుర్గము కృష్ణదేవరాయలు జయించిన వార్తవిని వీరభద్రగజపతి తన బలము నంతయు సమకూర్చి రాయలసైన్యము నెదిరింప దలపడెను. రెండు పక్షముల వారికి భయంకర సమరము జరిగెను. గజ పతుల సైన్యము చాలవఱకు నష్టపడెను. బయటనున్న బ్రాణములు దక్కవని వీరభద్ర గజపతి, వీరభద్రపాత్రుడు, రాచూరి మల్లాఖానుడు, ఉద్దండఖానుడు, రాచిరాజు శ్రీనాథరాజు, లక్ష్మీపతిరాజు, జన్యామలక సవాపాత్రుడు, బాలచంద్రమహాపాత్రుడు మున్నగు వీరులందఱు కొండవీటి దుర్గమునజేరి తలదాచుకొనిరి. బహిరంగస్థలమున నున్న గజపతిసైన్యమును దరుముకొనుచు శ్రీకృష్ణదేవరాయలు అద్దంకి, వినుకొండ, బెల్లముకొండ, నాగార్జునకొండ, తంగెడ, కేతవరము లోనగు దుర్గములన్నిటిని స్వాధీనపఱచికొనెను.



క్రీ.శ. 1515 సంవత్సరము మార్చినెలలో తిమ్మరుసు మంత్రి కొండవీటిదుర్గమును ముట్టడించెను. ఈవార్త ప్రతాపరుద్రగజపతి విని కొండవీటిదుర్గమును రక్షింపనెంచి మూడు వందల యేనుగులతోడను ఇరువదివేల యాశ్వికబలముతోను ఐదులక్షల కాల్బలము తోడను బయలుదేరెను. ఈ వార్త కృష్ణదేవరాయలు విని తిమ్మరుసుమంత్రిని గొండవీటిని ముట్టడించుటకు గొంతబలముతో విడిచిపెట్టి తాను సైన్యసహితుడై గజపతి సైన్యము నెదిరించుటకు గృష్ణదాటి మేడూరు వద్ద కేగెను. ప్రతాపరుద్ర గజపతి సైన్యమునకు శ్రీకృష్ణదేవరాయల సైన్యమునకు భయంకరసమరము కొంతకాల మెడతెగక జరిగెను. దురదృష్టశాలియగు గజపతియొక్క సైన్యము నశించెను. విఫలమనోరథుడై కొండవీటిపై నాశవిడిచి ప్రాణము గాని తనవిజయము సర్వంకషము

గాదని తలంచి కృష్ణాతరంగిణి గోదావరిదాటి పరిజనముతో దండయాత్రకు బయలువెడలెను. కృష్ణదాటినదిమొదలు గజపతిసైన్యము ప్రతిగ్రామమునందును దనబలము నెదిరించుచునే వచ్చెను. ఇంతలో విద్యానగరమునుండి వచ్చిన నూతనబలము గలిసికొనెను. తనబల మంతయు నష్టమగుటచే గజపతి ప్రతిఘటించి లాభములేదని కుటుంబముతో గొండగుహలలో దలదాచుకొన బాఱిపోయెను. గౌతమిదాటి రాజమహేంద్రవర దుర్గమును జయించి యచట తనప్రతినిధి నుంచి మన్నెపు సంస్థానములను రాజమహేంద్రవరము నాక్రమించుకొని రహితాపురము లోనగు మన్నెసంస్థానములను రాయలు జయించెను. తరువాత బాహుబలేంద్రుని వంశజులకు ---- ధానియగు పొట్నూరు జయించి యచట మిగుల నున్నతమగు జయస్తంభము నాటించెను. మాడుగుల వడ్డాదిని గూడ జయించి రాయలు పరిజనముతో గొంతకాలము సింహాచలమున విశ్రమించి నృసింహస్వామికిబెక్కుదానములు గావించి శాసనముల స్థాపించెను. అనేకామూల్యాభరణములు సమర్పించి నిత్యనైవేద్య భోగాదికములకు గొన్ని వృత్తులొసంగి దృష్టి ముందునకు బఱపెను. కటకము ప్రాంతములందు సాత్రవంశజులు బలవంతులై యుండిరని రాయలు గ్రహించి సైన్యమలసియున్నను, రణయత్నము ఇప్పటికి మానుదమని తిమ్మరుసు మంత్రి వారించుచున్నను, లెక్కసేయక లతో బయటబడిన నంతియచాలునని గజపతి హతశేషమగు సైన్యముతో వెనుక కేగెను. కృష్ణదేవరాయలు వెనుకకు మఱలి కొండవీటికి జేరెను. అంతకుమున్నె తిమ్మరుసుమంత్రి రెండుమాసములపైగా గొంటవీటి దుర్గమును ముట్టడించి క్రీ.శ.1515 సంవత్సరము జూను 23 వ తేదీని కొండవీటి దుర్గమును స్వాధీనముగావించుకొని యసమాన విజయమునొంది వీరభద్రగజపతిని జీవగ్రాహిగ జేకొనెను. పలువురు వీరులుకూడ బట్టువడిరి. కృష్ణరాయలు తిమ్మరుసు కొండవీటిని జయించినటు లొకశాసనమును స్థాపించి కొండపల్లిని జయించుటకు బయనమయ్యెను. ఆకాలమున బ్రహరేశ్వర పాత్రాదులు కొండపల్లిదుర్గమును బాలించుచుండిరి. కొండపల్లిని రాయలు మూడుమాసములు భయంకర సన్నాహముతో ముట్టడించి ప్రతాపరుద్రగజపతి భార్యలలో నొక్కతెను బెక్కుమంది సేనానాయకులను జీవగ్రాహులుగ జేకొని కొండపల్లి దుర్గమును స్వాధీనపఱచికొనెను. తరువాత అనంతగిరి, కంబముమెట్టు, ఊరుగొండ మున్నగు దుర్గములను జయించి తనప్రతినిధుల నందందుంచి కొండవీటికి జేరెను. కొండవీటిలో గొంతకాలము విశ్రమించి తిమ్మరుసుమంత్రి --------- నాదెండ్ల అప్పామాత్యుని ప్రతినిధిగనుంచి తాను బందిగొన్న వీరుల నందఱను విద్యానగరమునకు బంపెను.

విద్యానగరము నుండి కొంతసైన్యము వచ్చునటులనేర్పాటుచేసి కృష్ణదేవరాయలు గజపతుల రాజ్యమును హరించిన గాని తనవిజయము సర్వంకషము గాదని తలంచి కృష్ణాతరంగిణి గోదావరిదాటి పరిజనముతో దండయాత్రకు బయలువెడలెను. కృష్ణదాటినదిమొదలు గజపతిసైన్యము ప్రతిగ్రామమునందును దనబలము నెదిరించుచునే వచ్చెను. ఇంతలో విద్యానగరమునుండి వచ్చిన నూతనబలము గలిసికొనెను. తనబల మంతయు నష్టమగుటచే గజపతి ప్రతిఘటించి లాభములేదని కుటుంబముతో గొండగుహలలో దలదాచుకొన బాఱిపోయెను. గౌతమిదాటి రాజమహేంద్రవర దుర్గమును జయించి యచట తనప్రతినిధి నుంచి మన్నెపు సంస్థానములను రాజమహేంద్రవరము నాక్రమించుకొని రహితాపురము లోనగు మన్నెసంస్థానములను రాయలు జయించెను. తరువాత బాహుబలేంద్రుని వంశజులకు ---- ధానియగు పొట్నూరు జయించి యచట మిగుల నున్నతమగు జయస్తంభము నాటించెను. మాడుగుల వడ్డాదిని గూడ జయించి రాయలు పరిజనముతో గొంతకాలము సింహాచలమున విశ్రమించి నృసింహస్వామికిబెక్కుదానములు గావించి శాసనముల స్థాపించెను. అనేకామూల్యాభరణములు సమర్పించి నిత్యనైవేద్య భోగాదికములకు గొన్ని వృత్తులొసంగి దృష్టి ముందునకు బఱపెను. కటకము ప్రాంతములందు సాత్రవంశజులు బలవంతులై యుండిరని రాయలు గ్రహించి సైన్యమలసియున్నను, రణయత్నము ఇప్పటికి మానుదమని తిమ్మరుసుమంత్రి వారించుచున్నను, లెక్కసేయక అఃహోరాత్రము లరణ్యములలో గొండలలో సైన్యమును నడిపించి కటకమునకు బ్రయాణమయ్యెను. త్రోవలో గలిగిన కష్టనష్టములను బాటిసేయక నిరుత్సాహపడక కృష్ణదేవరాయలు కొన్నిదినములకు కటక సమీపమునకు జేరి తనరాక తెలియునటుల విజయభేరిని మ్రోగింపజేసెను. కృష్ణదేవరాయలు కటకమునకు జేరకమున్నె ప్రతాపరుద్రగజపతి కటకము జేరెను.

కటకపరిసర భాగములను ప్రతాపరుద్రగజపతియాజ్ఞావర్తులు పాత్రసామంతరాజులు అపరిమిత బలవంతులై పదియాఱుమంది పరిపాలించుచుండిరి. రాయలు తమదుర్గము పైకి దండయాత్రకు వచ్చినవార్త విని పాత్రసామంతు లెదిరింప నుత్సాహపడి ప్రతాపరుద్రగజపతి సంగరానుజ్ఞ వేడిరి. దూరదృష్టిలేని గజపతి చేయునది లేక వేల తన సైన్యమునకు సంగరానుజ్ఞ నొసంగెను. పాత్రసామంతులందఱు తమతమ స్వాధీనమునందున్న బలము నంతయు సమకూర్చుకొని రాయల సైన్యము మీదికి సంగరమునకు దలపడిరి. మన్నెములలో నెడతెగక ప్రయాణములు గావించుట చేతను ననారోగ్య ప్రదేశ నివాసవశమునను రాయల సైన్యము చాల నీరసస్థితిలో నుండెను. పలువురు సైనికులు పాత్రసామంతుల సైనికులచేత వధింపబడిరి. కృష్ణదేవరాయల సైన్యమే దండయాత్రయందును యింతవఱకు జెందని వినాసము నాడు చెందెను. రాయ లీ పరిస్థితులు గమనించి, కర్తవ్యము తోచక విజయము నొందుటకు జతురుపాయములలో నేదేని యవలంబించుట యుక్తమని కర్తవ్య నిర్ణయమునకుం దనకాప్తుడగు తిమ్మరుసు మంత్రిని గోరెను. పరిస్థితులన్నియు నెఱిగిన మహాయోధుడగు తిమ్మరుసుమంత్రికి గటకసామంతులను జయించుటకు సరియగు నుపాయ మేదియు గోచరింప దయ్యెను. భేదోపాయము దప్ప విరోధులను సాధించుటకు వేఱొక యుపాయము లేదని తిమ్మరుసుమంత్రి నిశ్చయించి వెరవూహించెను.

కటకరాజగు ప్రతాపరుద్రగజపతిరాజ్యమునకు బ్రతి నిధులుగనుండి బలభద్రపాత్రుడు, దుర్గాపాత్రుడు, భీమపాత్రుడు, ముకుందపాత్రుడు, భీకరపాత్రుడు, బేరుపాత్రుడు, రణరంగపాత్రుడు, ఖడ్గపాత్రుడు, అఖండలపాత్రుడు, మురారిపాత్రుడు, వజ్రముష్టిపాత్రుడు, తురంగ రేవంత పాత్రుదు, గజాంకుశపాత్రుడు, అసహాయపాత్రుడు, మృగేంద్రనోద్యుడు, విజయపాత్రుడు అనువారు ఓడ్రదేశమును పరిపాలించుచుండిరి. వీరందఱు ప్రతాప రుద్రగజపతి -------- సంగరమునకు దలపడిరి. కృష్ణరాయల సైన్యముకంటె బాత్రుల యధీనమందున్న సైన్యమె యెక్కుడుగ నుండెను. పైగ దన సైన్యము నిరాధారమగు బహిరంగ ప్రదేశమున నిలిచి పోరాడుటయు నపాయకరము. వెనుకకు మరలిన బరాక్రమమునకు లోపము. ఈ స్థితిగతులలో దిమ్మరుసుమంత్రి రాయలయనుజ్ఞ గొని పదియాఱు బంగారుపెట్టెల జేయించి యందు దివ్యాభరణములు ఒక్కొక్కలేఖయుంచి తనభటుల కొసంగి యొక్కొక్కటి పాత్ర సామంతులకు వేఱువేఱ బంపించెను. కృష్ణరాయలకు బాత్ర సామంతులకు వేగు నడువకుండగాచియుండు గూడాచారు లాభటులను బంధించి ప్రతాపరుద్రగజపతి కప్పగించిరి. రాజాభటుల యొద్దనున్న పెట్టెల బరిశీలింప నం దన్నిటిలో నమూల్యాభరణములు ఒక్కొక్కరహస్యలేఖయు గనవచ్చెను. ప్రతి లేఖయందును.

“మిత్రమా! మీరు గావించిన నిబంధనలు మా కంగీకారములు. గజపతిని బట్టియిచ్చిన మీకందఱకు మనకట్టడిప్రకారము నగరములు ధనము నొసంగుటకు నొడంబడితిని. నాయంగీకారము తెలుపుచు బంపిన యాసత్కారమును బరిగ్రహింపుడు” అనివ్రాయబడి క్రింద కృష్ణదేవరాయలసంతకముండేను. గజపతిలేఖలజూచి పాత్ర సామంతులందఱు కృష్ణరాయలకులోబడిరనియు దాను ప్రతిఘటించి లాభములేదనియు దలంచి రహస్య ప్రదేశమునడాగి భవిష్యత్కర్తవ్యమునుగూర్చి యోచించుచుండెను. పాత్రసామంతులందఱు “పరిమితసైన్యముతో రణరంగమునకు జేరినను గజపతి మూలబలముతో సహాయము రాడయ్యెను. రాయల సైన్యము సంగరమునకు సర్వసిద్ధముగానుండెను. “గజపతి సంధి కంగీకరించెనో, వెఱచి సంగరమె మానెనో “యని తమలో దామనుకొని యుద్ధయత్నములుమాని యెవరిత్రోవను వారేగిరి. గజపతి యీమోసమును గ్రహింపజాలక యెటులేని సంధి గావించుకొనినచో కృష్ణరాయలముందు నిలుచుట కష్టమని తిమ్మరుసు చెంతకు రాయలయొద్దకు రాయబారినంపి సంధికియ్యకొన బ్రార్థించెను. రాయలు మిక్కిలి సంతోషించి యియ్యకొనెను. తిమ్మరుసుమంత్రి గజపతియొద్దకు బరిజనముతో డేగి గజపతి విద్యానగరసామ్రాజ్యమునకు సామంతుడై యుండునట్లును, ఆతనిపుత్రియగు తుక్కాంబను (ఈమెను అన్నపూర్ణాదేవి యందురు) రాయలకొసంగునట్లును, గట్టుదిట్టములు గావించెను. కృష్ణరాయలు తుక్కాంబను పెండ్లాడి ఓడ్రరాజ్యమును యథావిధముగ బ్రతాపరుద్రగజపతి కధీనము గావించి క్రీ.శ.1516 లో బూర్వదిగ్విజయ యాత్రను ముగించి గృహాభిముఖుడయ్యెను. కృష్ణరాయ లొనరించినది న్యాయబుద్ధితో జూచిన మోసమైనను రాజనీతిప్రకారము యోచించిన దోషముగాదు. చతురుపాయములతో నిది భేదోపాయము. ఏపాప మెఱుగని పాత్రసామంతులను మన్నించి

బలవంతుడగు గజపతి కెప్పటియట్లు పూర్వరాజ్యమునొసంగి బంధితుల విడిపించి రాయలు జయము తన దనిపించుకొనెను. చిరకాలము పరస్పర ద్వేషములు లేకుండ నుభయరాజ్యము లభివృద్ధి నొందుటకుగాను దుక్కాంబికను బరిగ్రహించెను. కాన రాయలు గావించిన భేదోపాయము రాజ్యధర్మము. సామ్రాజ్య శుభదాయకము. ఉభయపక్షములకు క్షేమకరమనక తప్పదు. విజయలక్ష్మి ద్వితీయుడై కృష్ణదేవరాయలు సింహాచలము, రాజమహేంద్రవరము, శ్రీకాకుళము, విజయవాడ, మంగళగిరి, మున్నగు క్షేత్రముల సందర్శించుచు బౌరులవలన సత్కృతులను బడయుచు, సుఖముగా గొంతకాలమునకు విద్యానగరసామ్రాజ్యమునకు జేరెను.

కృష్ణదేవరాయలు దాదాపుగనైదు సంవత్సరములు కవితారచనము విద్యాగోష్టులతో గాలముగడపెను. వినాశనమైన సైన్యము నభివృద్ధిపరచెను. దుర్గమును బాగుచేయించెను. పోర్చుగీసువారిసహాయముచే మరఫిరంగులు చేయించి దుర్గములందు నెలకొలిపించెను. కృష్ణదేవరాయలు గావించిన భాషాసేవయందు జాలభాగ మీకాలమున జరిగినటుల విశ్వసింపవచ్చును. క్ర్ష్ణదేవరాయలు బాలుడైయుండ రాయచూరు దుర్గమును మహమ్మదీయులు గైకొనిరి. రాయచూరు కృష్ణా తుంగభద్రానదుల మధ్యనున్న దృఢతరమగు దుర్గరాజము. దాని నాదిల్‌షాహ పరిపాలించుచుండెను.

ఎటులేని రాయచూరుదుర్గము లోగొనినగాని తన పూర్వుల యాత్మకుశాంతి చేకూరదనియు విద్యానగర సామ్రాజ్యము సురక్షితముగాదని కృష్ణరాయలు తలంచి యాదిల్‌షాహ తనకు స్నేహితుడుగాన యుద్ధకారణముకొఱకు నిరీక్షించుచుండెను. సయ్యద్‌మర్కారు అనునొక తురుష్కుడు గుఱ్ఱములను గొనితెచ్చెదనని రాయలయొద్ద గొంతధనము గొనిపోయి హరించి యాదిల్‌షాహ రాజ్యములో డాగి యాతని శరణుగోరెను. రాయలువానిని బట్టియిమ్మని వర్తమాన మంపగ ఆదిల్‌షాహ కులాభిమానము పురస్కరించుకొని వానిని దాచి తన రాజ్యమునకె రాలేదని వర్తమాన మంపెను. రాయ లీసందు జూచుకొని సంగరమునకు బయలువెడలెను.

బలవంతుడగు నాదిల్‌షాహను జయించుట సామాన్యకార్యము కాదని కృష్ణదేవరాయలు ఏడులక్షల మూడువేలమంది కాల్బంటులను, ముప్పదిరెండువేల ఆఱువందల మంది గుఱ్ఱపురౌతులను, ఐదువందల యేబదియొక్క యేనుగులను నింక గొందఱు పరిజనులను వెంట గొని జైత్రయాత్రకు బయలు దేరెను. వీరాధివీరులగు కామానాయకుడు, త్ర----రావు, తిమ్మప్పనాయకుడు, ఆదెప్పనాయకుడు, కొండమరెడ్డి, సాళువ గోవిందరాజు, మధురనాయకుడు, కుమారవీర శ్యామలరాయలు తమతమవెంట గొంతబలము నుంచుకొని కృష్ణరాయలను సైన్యసహితముగ మధ్యనుంచుకొని రాయిచూరు సమీపించిరి. యవన సంస్థానాధీశు లితరు లీ సమయమున ముట్టడింపకుండుటకై తిమ్మరుసుమంత్రి పరిమితబలముతో విద్యానగర దుర్గమును జాగరూకతో గాచియుండెను. విద్యానగరము నెవ్వరును దేరి చూడజాలరైరి. ఆదిల్‌షాహ గొప్పసైన్యముతో గృష్ణదాటి యీవలకు వచ్చి యంతకుమున్నె యటనున్న కృష్ణరాయల సైన్యము నెదిరించెను. ఉభయసైన్యములకు భయంకరసంగ్రామము జరిగెను. ఈసంగరము కౌరవపాండవ సంగరమును బోలియుండెను. తురుష్కుల ధాటికాగలేక రాయలసైన్యము పాఱిపోవుటజూచి రాయలు సేనానాయకులచే బాఱిపోవువారల నఱికించెను. చచ్చిన సంగరముననే చావవలయునని రాయల సైన్యము మొక్కవోని బీరముతో దురుష్క సైన్యము నెదిరించి చిత్రవధ గావించెను. రాయల సైనికులు తురుష్క సైన్యమును రూపుమాపి పాఱిపోవువారల దరిమితరిమి చెండాడిరి. ఆదిల్‌షాహ యేనుగునెక్కి కృష్ణదాటి పాఱిపోయెను. సర్వసేనానయకుడు బంధింపబడెను. పలువురు తురుష్కులు కృష్ణలోబడి మరణించిరి. దీనులగు కాందిశీకుల జంపవలదని రాయలు తనసైన్యమున కుదారభావముతో నాజ్ఞాపించెను. ఈవిజయము క్రీ.శ. 1520 మేనెల 16 శనివారమునాడు చేకూరెనని చరిత్రకారులు చెప్పుచున్నారు.

రాయలింతతో సంతృప్తినొందక సైన్యముతో రాయచూరు దుర్గమును ముట్టడించెను. కోటలోనున్న సైన్యము ఇరువదిదినము లేకధాటిగ గృష్ణరాయల సైన్యముతో బోరాడి యపజయము నిశ్చయమని తెలిసికొని దుర్గద్వారములు తెఱచి శరణుగోరెను. రాయలు పురమునందు బ్రవేశించి తన సైనికులవలన దుర్గవాస్తవ్యుల కెట్టి యిక్కట్టులు రాకుండ గాపాడి దుర్గమును స్వాధీన పఱచికొని యచట గొంత సైన్యమును దన ప్రతినిధినుంచి విద్యానగరముచేరి యీసంగరమున బాటుపడిన వీరులకందఱ కుచితభంగి సత్కారములు చేసా గౌరవించెను.

రాయచూరు గోలుపోయిన పిమ్మట ఆదిల్‌షాహ చేయునదిలేక తన దూతను గృష్ణరాయలు యొద్దకు బంపి తన దుస్థితియు బరాజయము నంతయు నివేదించుమనెను. గతమునకు క్షమించి రాయచూరు దుర్గము మాకొసంగుమని గూడ వర్తమానమంపెను. ఉదారశీలుడగు శ్రీకృష్ణదేవరాయలు ఆదిల్‌షాహ వచ్చి తప్పునొప్పుకొని నాకాళ్లు పట్టుకొనెనేని తప్పక రాయచూరుదుర్గము నిచ్చెదనని వర్తమానమంపెను. రాజ్యాశచే ఆదిల్‌షాహ యందులకు నంగీకరించెను. ఇరువురు ముదిగల్లునొద్ద గలిసికొనునటుల గట్టడిచేసికొనిరి. రాయలు నియమిత కాలమునకు ముదిగల్లుచేరెను. ఆదిల్‌షాహ రాయలునొద్దకేగిన బంధించునేమొ యను భయముచేతనో దురభిమానముననో నియతస్థలమునకు రాడాయెను. రాయలు కోపించి వెంటనున్నసైన్యముతో విజాపురము ముట్టడించి దుర్గమును రూపుమాపి విజయమునొంది యారాజ్యములోని కలుబరిగి దుర్గమును లోబఱచికొని ఆదిల్‌షాహచే బంధీకృతులై చెఱసాలలోనున్న బహమనిరాజుల ముప్వుర విడిపించి యందుబెద వానికి గలుబరగ రాజ్యమునొసంగి కడమ యిరువురను దనరాజధానికి గొనిపోయి వారికున్నతోద్యోగము లొసంగెను. అంతరించిన కలుబరిగిలోని బహమనిరాజ్యమును బునరుద్ధరించుటచే శ్రీకృష్ణరాయలకు "యవన రాజ్యస్థాపనాచార్య" బిరుదమును బ్రజలొసంగిరి. ఈబిరుదము కృష్ణరాయల శాసనములలో బెక్కింటియందుగలదు. సర్వమత సమదర్శియగు శ్రీకృష్ణదేవరాయలను మత ద్వేషముగలవాడనుట సత్యమునకు జరిత్రమునకు ద్రోహముచేయుటె.

కృష్ణదేవరాయలు తన జీతమునం దెన్నడును పరాజయము నెఱుంగడు. గౌతమిపుత్రశాతకర్ణి, కులోత్తుంగచోడుడు, ప్రతాపరుద్ర చక్రవర్తివలె నీతడును ఆంధ్రవీరులలో సుప్రసిద్ధుడు. ఈరాజచంద్రుడు స్వయముగా నాముక్తమాల్యదయను గ్రంథరాజమును రచించెను. మఱికొన్ని గ్రంథరాజములు రచించెగాని యవి యలభ్యములై యున్నవి. ఇతడంకితమొందిన గ్రంథములలో మనుచరిత్రము, పారిజాతాపహరణము సుప్రసిద్ధములు. ఈకాలమున నాంధ్ర వాఙ్మయమునకు సర్వతోముఖమగు సేవ లభించెను. రాయల యవలంబనమున ఆంధ్రభాషలో సర్వాంగసుందరములగు కావ్యరత్నములు పెక్కులు రచింపబడెను. రాజకీయ రంగమునందెగాక వాఙ్మయమునందుగూడ గృష్ణదేవరాయల దివ్యనామము చిరస్మరణీయముగ నున్నది. కృష్ణదేవరాయలు పెక్కుతటాకముల నెలకొల్పి జీవనదులకు గాలువల దీయించి భూదేవిని సస్యసంభరితగ నొనరించెను. విదేశవర్తకమును దేశీయవర్తకమును మిగుల నభివృద్ధిలోనికి దెచ్చెను. మనోహర శిల్పవిన్యాసముతో నలరారు జక్కని దేవాలయములు సభామందిరములు పెక్కుగట్టించెను. స్వయముగ నీనృపాలుడు వైష్ణవుడైనను శివకేశవులయెడ భేదబుద్ధి లేక సమముగ బెక్కు శివాలయములను వృత్తి స్వాస్థ్యము లొసంగెను.

రాయల కిరువురు కుమార్తెలు ఒకకుమారుడు గలరు. పెద్దకుమార్తెయగు తిరుమలాంబికను రామరాజు పెండ్లాడెను.రెండవకుమార్తెయగు వెంగళాంబను తిరుమల దేవరాయలు వివాహమాడెను. కుమారు డాఱుసంవత్సరములు మాత్రమె జీవించెను. ఈబాలునకు రాయ లాఱవయేటనే పట్టాభిషేకము గావించెననియు నితడు కాలవశమున గతింప తిమ్మరుసు విసముబెట్టి చంపించెనని తలచి రాయలు తిమ్మరుసు గ్రుడ్డు తీయించి కారాగృహముననుంచెననియు విదేశీయుల చరిత్రయందుగలదు. దేశీయ చరిత్రములందుగాని ప్రవాదములందుగాని తిమ్మరుసింతటి ద్రోహియను కథాంశము తెలియబడదుగాన నిది విశ్వసనీయముగాదు. రాయలపుత్రుడు గతించుటకు గారకుడు తిమ్మరుసని కృష్ణరాయలు భావించెననుట విశ్వసనీయముగాదు. ఇంతలో ఆదిల్‌షాహ రాయచూరుదుర్గమును హరింప నొక మాఱు వచ్చెను. రాయలు పరిజనముతో నెదిరింప వచ్చుచుండుట విని ఆదిల్‌షాహ పాఱిపోయెను. ఎటులేని బెల్గాము దుర్గమును స్వాధీనపఱచికొని ఆదిల్‌షాహను బంధింపకున్న యెడల రాయచూరుదుర్గమును హరింపకమానడని కృష్ణదేవరాయలు సంగ్రామ ప్రయత్నములు చేయుచుండెను. ఆ సంకల్పము నెరవేరకమున్నె క్రీ.శ.1530 లో శ్రీకృష్ణదేవరాయల మార్తాండుడు అస్తంగతుడయ్యెను.

అద్వితీయ పరాక్రమశాలి యగు కృష్ణరాయనితోబాటు ఆంధ్రవీరుల స్వాతంత్ర్యదీక్షయు నంతరించినది. ఆంధ్ర సామ్రాజ్య నిర్మాతలలో బ్రథమగణ్యుడగు శ్రీకృష్ణదేవరాయలు అద్వితీయ పరాక్రమముతో జిర కాలము రాజ్యమేలి యంత్యదశలో దన యేకపుత్రుని కనులముందు

దాటిపోవని కాలపురుషుని దురంతకర్మఫలము. ఈమహావీరుని పవిత్రజీవితము వాఙ్మయమందును, సామ్రాజ్యచిహ్నములు హంపి ప్రాంతమునను దర్శనీయములై యలరారుచున్నవి. ఆంధ్రజాతికి కృష్ణదేవరాయలు మఱచిపోరాని వేలుపు. ఇతనితో ఆంధ్ర స్వాతంత్ర్యరంగము ముగిసినది.

రామరాజు.

కృష్ణదేవరాయల మరణానంతర మాతనిసవతితల్లి కుమారుడగు నచ్యుతదేవరాయలు విద్యానగర సామ్రాజ్యధిపతియై క్రీ.శ. 1530-1542 వఱకు రాజ్యము పాలించెను. భోగలాలసుడగు నీనృపాలుని కాలమున విజాపురమునవాబు దండయాత్రయొనరించి ముదిగల్లు, రాయచూరు దుర్గముల దీసికొనెను. రాజ్యములోని భాగములుగూడ దోచెను. తనసుఖమున కేమిభంగము వాటిల్లునోయని అచ్యుతరాయలు నవాబుతో సంధి గావించుకొనెనేగాని సంగరమున కెన్నడును యత్నముగావించి యెఱుంగడు. అచ్యుతరాయల రాజ్యమున కాతనిబావమఱది సలకము తిమ్మయ ముఖ్యమంత్రిగ నుండెను. అచ్యుతరాయలమరణానంతర మతనికుమారుడగు వెంకటపతిరాయలు రాజై కొంతకాలము రాజ్యమును బాలించెను. సలకము తిమ్మయ్య మాయోపాయములచే వేంకటపతిరాయలను జంపించి తానె విద్యానగర సామ్రాజ్యమునకు బ్రభువయ్యెను. సేనాధిపతులు పౌరులు సలకము తిమ్మయ్యకు దిరుగబడి కృష్ణదేవరాయల యల్లుడగు రామరాజునకు వర్తమానమంపి సామ్రాజ్యోద్ధరణము గావింపుమని కోరిరి. పెనుగొండ నుండి రామరాజు సైన్యముతో విద్యానగరమునకువచ్చి యధికారుల గూడగట్టుకొని సలకము తిమ్మయ్యను బంధించి యచ్యుతరాయల యనుజుడగు సదాశివరాయలను రాజును జేయ గృషి యొనరించెను.

ఈపరిస్థితులను సలకము తిమ్మయ గమనించి యుపేక్షించిన దనకే యపాయము ప్రాప్తించునని యాదిల్‌షాహను రహస్యముగరప్పించి విద్యానగరరాజ్యము నాతని యధీనముగావించెను. రామరాజాదులు చేయునదిలేక సలకము తిమ్మయ్య యొద్దకుబోయి మేము నీకు లోబడి యిచ్చువచ్చినచొప్పున జరించెదము. నవాబు నెటులేని పంపుమని కోరిరి. వారిమాటలు నమ్మి సలకము తిమ్మయ్య నవాబున కమితధనము కొన్నిమణులపరాధముక్రింద నొసంగి పంపివేసెను. రామరాజాదులు నవాబుపోయిన వెంటనే తిరుగబడి తిమ్మయ్యను జంపయత్నించుచుండిరి. ఇకబ్రదుకుట యసాధ్యమని తిమ్మయ్యభాండాగారము కొల్లగొట్టి గుఱ్ఱముల తోకలు చెవులు గోయించి రత్నములన్నియు దిరుగళ్ళలో విసరించి చేతనైనంతవఱకు సామ్రాజ్యసంపదల బాడుజేసి తానాత్మహత్య గావించుకొనెను.



రామరాజు.

రామరాజు సదాశివరాయలను విద్యానగర సంస్థానమునకు నామమాత్రమున నధీశ్వరుని గావించి తానె సామ్రాజ్యమును బాలించుచుండెను. రామరాజు నరపతి వంశజుడు. బసవేశ్వరునిచే

జంపబడిన బిజ్జలు డివంశమునకు గూటస్థుడు. తరువాత నివంశజులు చిరకాల మార్వీటిలోనుంటచే నార్వీటి వారసబడిరి. రామరాజు పూర్వము కృష్ణరాయల హస్తగతమై

యున్న రాజ్యమునంతయు మరల వశపఱచికొని విద్యానగర సామ్రాజ్యమును మహోన్నతదశకు దెచ్చెను. అంతియగాక కృష్ణదేవరాయల జీవితములో నెరవేర్పబడని మహమ్మదీయ సంస్థానాధీశులను లోగొనుట రామరాజు నెరవేర్ప యత్నించెను. ఈసందర్భమున దురుష్క సంస్థానములగూర్చి కొంచెము చెప్పవలసియున్నది.

విజాపురరాజ్యము ఆదిల్‌షాహ స్వాధీనమునందుండెను. అహమ్మద్ నగరరాజ్యము బుర్‌హడ్‌నిజాంశాహ స్వాధీనమునను, గోలుకొండరాజ్యము జమ్‌షిద్ కుతుబ్‌శాహ స్వాధీనమునను, బీడరరాజ్యము ఆలీబేరీదు స్వాధీనమునందును నుండెను. ఈనాలుగురాజ్యములు విద్యానగరమునకు నుత్తర దిశయం దుండెను. తక్కినముప్వురు నవాబులు రామరాజునకు నిష్టులుగా నుండిరి. ఆదిల్‌షాహ చిరకాలమునుండి విద్యానగరసంస్థానమునకు ద్వేషిగాన రామరాజునకు నటులె శత్రుగణములలోని వాడయ్యెను. రామరాజు సహాయము జాతగాగొని తక్కినమూడురాజ్యముల నేలు నవాబులు ముగ్గురు ఆదిల్‌షాహమీదికి యుద్ధమున కేగిరి. రామరాజు తనసోదరుడగు వేంకటాద్రిని కృష్ణా, తుంగభద్రా నదుల మధ్యనున్న అంతర్వేదిని, అచ్యుతరాయలు కోల్పోయిన రాయచూరును సాధింపుమని పంచెను. ఇందఱిధాటి కాగజాలక ఆదిల్‌షాహ తనదుర్బలస్థితిని కాలపరిస్థితులను గమనించి రామరాయలతో సంధిగావించికొని విద్యానగర సంస్థానవినాశనమునకు మార్గము లన్వేషించుచు గాలము గడుపుచుండెను.

ఆకాలమున పోర్చుగీసువారు విస్తార సైనికబలముతో రేవుపట్టణముల నాశ్రయించికొని వ్యాపారము చేయుచుండిరి. రామరాజు వారును సంధిగావించుకొని తురుష్కసంస్థానముల కెట్టి సహాయము చేయకుండునటుల గట్టుదిట్టములు గావించుకొనిరి. రామరాజు సహజముగ దురుష్కద్వేషి కాడుకావున దురుష్క రాజ్యమున నుండజాలక వచ్చు తురకవారలకందఱకు నొకవీధి గట్టించి యిచ్చెను. వారికొక మసీదుగూడ గట్టించి తనరాజ్యమున వారలకుద్యోగము లొసంగెను. ఇబ్రహిం తన యన్నయగు జమ్‌షీదు కుతుబుషాహ తనను జంపునేమోయని రామరాజును శరణు గోరెను. ఒకగ్రామము నొసంగి యతని మిగుల బ్రేమతో రామరాజును చూచి క్రీ.శ. 1550 లో ఇబ్రహిం కుతుబ్‌శాహ నామముతో నాతనిని గోలకొండ రాజ్యాధిపతిగ నొనరించెను. నిజాముషా రామరాజునకు గానుకలుబంపెను. అదివిని ఆదిల్‌షాహకోపించి దురుసుమాటలాడి విద్యానగర సంబంధులగు రాయబారులను ఆదిల్‌షాహ పరాభవించి వెడలనడచెను. ఈసంగతి రామరాజు విని కోపించి నిజాముషాహను ఆదిల్‌శాహమీదికి బ్రోత్సహించి దండయాత్రకు బంపెను. ఆదిల్‌శాహ, నిజాముశాహదుర్గమునాక్రమించుకొనెను. క్రీ.శ. 1551 లో రామరాజు తన నాల్గవ కుమారుడగు చిన తమ్మరాజును వెంటగొని రాయచూరు ముదిగల్లు క్షేత్రములను సాదించెను. రామరాజుతో బగగొనిన బ్రదుకుట దుస్తరమని గ్రహించి ఆదిల్‌షాహ విధేయుడుగ నుందునని వాగ్దానము గావించెను. సైపు అయిస్ ఉల్‌ముల్కు అను సరదారు తిరుగబడి విజాపురమునవాబునోడించి రాజ్యమును హరించెను. రామరాజు కనికరించి తనతమ్ముడగు వేంకటాద్రిచేనాతనినిజంపించి పూర్వరాజ్యముయథావిధి ఆదిల్‌షాహకు దిరుగనిప్పించెను. ఇంకననేక పర్యాయములు రామరాజుసహాయముతో ఆదిల్‌షాహ తాను గోల్పోయిన తన రాజ్యమును మరల సంపాదించుకొన గలిగెను.

విజాపురము నవాబగు ఇబ్రహీం ఆదిల్‌షాహ క్రీ.శ. 1557 లో మరణించెను. అతని జ్యేష్ఠసుతుడు ఆలీఆదిల్‌షాహ విజాపుర రాజ్యమునకు నవాబయ్యెను. ఇటులుండ రామరాజు కుమారుడు మరణించెను. ఈ యవకాశము జూచికొని రామరాజు స్నేహమును సంపాదింపవచ్చునని ఆలీఆదిల్‌షాహ స్వల్పబలముతో విద్యానగరముజేరి రామరాజును బరామర్శించి చనిపోయిన కుమారునకు మాఱు నన్ను జూచుకొండని ప్రార్థించెను. రామరాజు ఆతనిభార్యయు నాబాలునిపుత్రవాత్సల్యముతో దిలకించుచుండిరి. రామరాజును నతనిభార్యను నతడు దండ్రివరుసతో దల్లివరుసతో బిలుచుచుండ వారిరువు రీతని కుమారుని బిలుచునటుల హృదయపూర్వకముగు ప్రేమతో బిలుచు చుండిరి. విద్యానగర సామ్రాజ్యమును రూపుమాపుటకు రామరాయలను దల్లికోట యుద్ధములో ఘోరమృత్యువు పాల్పఱచుటకు నీ ప్రేమాస్పదుడగు

కుమారుడె కారణమయ్యెను. ఎన్నివిధముల హృదయమిచ్చి రామరాజు వానిభార్యప్రేమించినను సహజక్రూరభావము నాదంపతులయెడ ఆలీఆదిల్ షాహ విడనాడజాలక సమయము వచ్చినపు డీప్రేమను సాధనముగాగొని జయింప యోజించి తనరాజ్యమునకు వెడలిపోయెను.

తనపూర్వులవలన గైకొన్న కల్యాణి, షోలాపురము నగరములు తన కిచ్చివేయ వలసినదిగా ఆలిఆదిల్ షాహ నిజాంషాహకు వర్తమాన మంపెను. నిజాముశాహ దూతను బరాభవించి పంపెను. ఆలిఆదిల్ శాహ రామరాజును గలసి అహమ్మదునగరు మీదికి దండెత్తిపోయి యారాజ్యము నందలి పెక్కు గ్రామములు రూపుమాపిరి. ఆసమయమున హిందూ సైనికులు మసీదులు కూలద్రోసి ఖురాను గ్రంథములను జింపిపాఱవేసి తురుష్కస్త్రీలను బరాభవించిరి. రామరాజు సైన్యమొనరించిన దురంతములకు లోన గోపించియు ఆలీఆదిల్ షాహ బయటికి దగిన ప్రతిక్రియ గావించితిమని యానందించెను. నిజాముశాహ రామరాజుతో సంధిగావించుకొని కల్యాణనగరము కోల్పోయినందుల కెంతయు బరితపించుచు ఇబ్రహింకుతుబ్ షాహతో సంధి గావించుకొని కళ్యాణనగరము ముట్టడింప బిలుచు కొనివచ్చెను. విజాపురపు నవాబు, రామరాజు, వారల నెదిరింప నమితబల

సహాయముతో నేగిరి. ప్రతిఘటించిన దనకపాయ...
ఇబ్రహీం కుతుబ్ షాహ్ రామ రాజుతో గలిసె .....
నీముమ్వురు సేనతో బైబడ జేయునది లేక నిజాము....
రాజధానికి బోయి తల దాచికొనెను. ముమ్వురు రా.....
షాహను వెంటనంటి అహమ్మదు నగరమును ముట్టడించ,
గోలు కొండనవాబు లోలోన నిజాం శాహకు సహాయ
పడెను. ఈ సహాయము వల్ల అహమ్మదు నగరము వర్ష...
వారికి వశముకాక పోవుటచే మరియొక మారు మ....
యెవరి త్రోవని వారు తమతమ రాజ్యముల కేగిరి......
ముగూడ రామరాజు సైనికులు రాజ్యము లోని.....
హింసించుచు దురుష్కాంగనల నవమానించుచు......
ల ద్రోయుచు నెన్నియో దురంతములు గావించి విజ
యోత్సాహమును బ్రకటింప సాగిరి. పరస్పర భి.....
లగు నవాబులందఱు హిందువులు గావించు విప్లవ....
విజయనగర సామ్రాజ్యము పై లోలోన బగను.....
వేశ పరవశులగు తురుష్కులు రామ రాజు పై ......
లదీర్చు కొందుమాయని లోలోన యోజించుచు ......
రాజీయంశమును నిర్లక్ష్యభావముతో గమనింప.....
చిక్కినపుడెల్ల తురుష్క రాజ్యములోని భాగము ....
తనరాజ్యమును నభివృద్ధి చేయు చుండెను. బల .....
వృద్ధి యగు కొలది రామ రాజు తురుష్కుల యెడ

తో వారిదూతల బరాభవించుచు దనయాజ్ఞలేనిది తనతో వచ్చు తురుష్కుడు ఆశ్వము నెక్కరాదని నిబంధన చేసెను. ఇది నవాబు లాలకించి "తమలో దాము భిన్నాభిప్రాయముగనుండుటచేతనే రామరాజిటుల మహమ్మదీయులను బరాభవించు చున్నాడు. రామరాజు రాజ్యమును హరింపకున్న తురుష్కరాజ్యము నశించుట నిశ్చయమని తమలో దాము కూడ బలికికొని యైకమత్యముతో వర్తించుచుండిరి. రామరాజు నెదిరించుటలో మహమ్మదీయులందఱు నేకాభిప్రాయులైరి. సంబంధములు గలసినగాని పూర్వవైరము లడుగంటి స్వాభిమాన మతిశయింపదని ఆదిల్ షాహకు నిజాముషాహ తన కూతురగు చాందుబీబీ నొసంగి వివాహము గావించెను. ఆదిల్ షాహ చెల్లెలిని నిజాముషా కుమారుడగు మూర్తిజా పెండ్లాడెను. గోలకొండనవాబు, బెదర్‌నవాబు, బరీదుషాహ వీరలతో గలిసిరి.

ఆదిల్ షాహ బయటికి మంచివానివలె నటించుచు దురుష్కులుచేయు దుండగములలో దా నేకీభవించుట లేదనియు నెటులో మిత్రభేధ మొనరించి వారలను మీకుబట్టి యొసంగుటకే వారితో గలిసియుంటినిగాని వేఱుకారణము కాదనియు రామరాజుకు వర్తమానమంపెను.

పుత్రవాత్సల్యవిధియగు రామరాజావంచకుని వాక్యములను విశ్వసించెను. తరువాత నవాబులు నలువురేకమై ఆకస్మికముగా నొకదినమున విజాపురము చెంతగల మైదానమున సైన్యమునుంచిరి. యుద్ధకారణము గావలయునుగాన ఆలి ఆదిల్ షాహ రామరాజునకు దన పూర్వులనుండి గైకొన్న రాయచూరు, ముదిగల్లు దుర్గము లీయవలయునని వర్తమాన మంపెను. రామ రాజా వర్తమానము విని ఆదిల్ షాహ దుర్మార్గమునకు గృతఘ్నతకు మిగుల గినిసి యా రాయబారి నిట్టి సందేశములు తేకుండ బ్రదుకుమని శిక్షించి పంపెను. ఇదియ యాధారముగ గొని నవాబులందఱు విద్యానగర సామ్రాజ్యము ముట్టడించుటకు దృణకాష్ఠ జల సమృద్ధిగల ద్రోణనదీ తీరమున నివసించిరి. రామరాజు తురుష్కులంద ఱేకమై దనపైకి వచ్చుచున్నారని విని తోక త్రొక్కిన పాముపలె నదరిపడి మహమ్మదీయ రాజ్యముల నిర్మూలనము గావింపక మాన నని ప్రతిజ్ఞావాక్యములు పలికి విరోధులు కృష్ణదాటి రాకుండ కొంతసైన్యమును నాటంకపరచుటకు బంపెను. రామరాజు తన రాజ్యమునందలి యన్నిభాగములనుండి సైన్యమును రప్పించెను.ఆఱులక్షల కాల్బలము లక్ష ఆశ్వికబలము సమకూర్చెను. తిరుమలరాయనికి లక్ష కాల్బలము, ఇరువదియైదువేల యాశ్వికదళము, ఐదువందల యేనుంగులు నొసంగి తురుష్కుల నెదిరింపబంపెను. అపరిమితసైన్యముతో నాతని వెనువెంట మరియొకసోదరు డగు వేంకటాద్రిని బంపెను. రామరాజు మిగిలిన సేనతో సమయమునాటికి రామరాజు తొంబదియాఱు సంవత్సరముల వృద్ధుడని చరిత్రకారులు కొందఱు వ్రాసియున్నారు. తురుష్కులు కృష్ణానదిదాటిపైకి రానిశ్చయించుచుండ బ్రవాహమును దాటి రాకుండ రామరాజుబల మాటంకము గలుగ జేసెను. వా రేరేవునకువచ్చిన నారేవున కాటంకము గలుగు చుండెను. ఇట్లున్నలాభములేదని తురుష్కులు తమసైన్యమును రెండుచీలికలు చేసి కృష్ణదాటునటుల నటించి యొకతీరమున జేరిరి. రామరాజు బలమంతయు నా తీరమున కెదురు నిల్చి యాటంకపఱచుచుండెను. ఇంతలో మిగిలిన తురుష్కసైన్యము క్షణములో కృష్ణానదిదాటి యీవల కేతెంచి వ్యూహముల బన్నిరి. రామరాజుసైనికులు తురుష్కులు కృష్ణదాటి యెటుల రాగలిగిరో యని యాశ్చర్యపడుచు వారి నెదిరింపబోవుసరికి మిగిలినసైన్యము కృష్ణదాటి రాగల్గెను.

తురుష్కులు తమసైన్యమునకు మధ్యభాగమునందు మూడువరుసలుగా నాఱువందల ఫిరంగులను బెట్టిరి. ముందు వరుసలో మిక్కిలి పెద్దఫిరంగుల జేర్చిరి. వానివెనుక తుపాకుల జేర్చిరి. ప్రతిపక్షుల కీ నిర్మాణము కానరాకుండునటుల రెండువేల కాల్బలమును ముందుంచిరి. కొంతసేపటికి హిందూమహమ్మదీయ సైన్యములు సంగరమునకు దలపడెను. తురుష్కసైనికులు ధారాళముగా శరవర్షమును రామరాజు సైన్యముపై గురిపించిరి. రామరాజు సైనికులకు బ్రోత్సాహవాక్యముల బలికి తురుష్క దళమును బంధింప నాజ్ఞాపించెను. హైందవసైన్యము శరవేగమున దురుష్కదళముపై బడెను. తురుష్కసైనికు లీసమయము గుర్తించి యీవలావలకునొత్తిగిలిరి. చాటుననున్న సరదారులు ఫిరంగులు తుపాకులు నొక్కమాఱుపేల్చిరి. ఆకస్మికముగా హిందూసైన్యము సంగరరంగమున మాడిపోయెను. ఈఘోరకృత్యము కనులార గాంచియు రామరాజు నిరుత్సాహపడక రెండువైపుల నిరపాయముగ నున్నసైన్యమును సంగరమునకు బురికొల్పెను. హైందవసైనికు లుత్సాహముతో ముందునకు నడువసాగిరి. హిందువులధాటి కాగజాలక తురుష్కులు వెనుకడగు వేయుచుండిరి. రామరాజు తనసైన్య విజృంభణమునకు మిగుల నానందించి వ్యూహమును బన్ని తురుష్క సైన్యమును జుట్టుముట్టిన విజయము క్షణములో సాధ్యమగునని నిశ్చయించి తానొక యున్నతమైన పీఠము వేయించుకొని వజ్రములు రత్నములు వరహాలు రాశిపోయించి జయప్రదముగా బోరాడిన సైనికులను సత్కరించుచు బ్రోత్సాహించుచుండెను. హిందువులు తురుష్కులఫిరంగుల బట్టుకొనుటకు మిక్కిలిసాహసముతో ముందునకేగిరి. అంతకుమున్నె యవి మందుచే నింపబడి యుండుటచే తురుష్కులాకస్మికముగా బేల్చిరి. అయిదువేలమంది మేటిశూరులు మరణించిరి. హైందవ సైన్యము నడిభాగమిటుల బలుమాఱు నశించుటజూచి రామరాజు తాను స్వయముగా సైన్యము నడిపిన ఫిరంగులు సులభముగా జేతికి జిక్కవచ్చునని సైన్యమధ్యభాగమునకు మేనాయెక్కి బయలు దేరెను. దురదృష్టవశమున రామరాజింతకు మున్నెక్కివచ్చిన యేనుగు బెదరి మేనామీద బడెను. వాహకులు భయవశమున నొడలెఱుగక మేనా విడిచి పారిపోయిరి. రామరాజు క్రిందబడియు దెప్పరిల్లి చెంతనేయున్న యున్నతాశ్వమునెక్కబోవ నిజాముషా సైనికులు రామరాజును బంధించి జయజయ ధ్వనులు గావించుచు నిజాముషాహయొద్దకు గొనిపోయిరి, వెంటనే నిజాముషాహ తన ఖడ్గమును బెరికి రామరాజు తల ఖండించి బల్లెము కొనకుగ్రుచ్చి హైందవసైన్యమునకు

జూపించెను. తమరాజు మరణించుటకు హైందవసేన మిగుల జింతించి రణరంగమున దమకు విజయము దుస్తరమని పారిపోవుచుండ దురుష్కులు లక్షమంది ఆంధ్రసైనికులను అరటిచెట్టుల నఱికినటుల నఱికిరి. హిందూసైన్యము సర్వవిధముల నాశనమయ్యెను. చిరకాలమునుండి యభివృద్ధినొంది మహోన్నతదశకు వచ్చిన విద్యానగర సామ్రాజ్యము దైవవశమున నిటుల నాశ మొందెను. ఆంధ్రవీరులలో సుప్రసిద్ధుడును శూరవతంసుడునగు రామరాజు మరణముతో నాంధ్రుల సమగ్రసౌభాగ్యాతిశయము అదృశ్యమయ్యెను. రామరాజుతో నాంధ్రులస్వాతంత్ర్యేచ్ఛ యంతరించెను.

హైందూసైనికు లీవిధముగ బరాజయమునొంది తురుష్కులబారినుండి బ్రదుక దలచి విద్యానగరమునకు జేరి ధన ధాన్యాదులు ఆలు బిడ్డలను గొని తమ తమ యిరవులకు.... వెడలిపోయిరి. రామరాజు సోదరుడగు వెంకటాద్రి సంగ్రామమున మరణించెను. తిరుమల దేవ రాయలు ప్రాణభయ చేత విద్యానగరము చేరి సదాశివ రాయలను ధనకనక వస్తు వాహన ములను వెంటగొని పెనుగొండకు బారి పోయెను. సర్వతీ ద్విభాసురమై సురక్షితముగా నున్న విద్యానగరమునందకు పౌరులందఱు దిక్కుమాలిన వారై యెటుబోవ దరిగానక గడగడ లాడుచుండిరి. చుట్టుపట్టుల నన్ని వైపుల మహమ్మదీయ సైన్యము నిండిపోయెను. ఈ యదను గ్రహించి చుట్టుప్రక్కల నున్న యాటవికులు పలుమాఱు విద్యానగరమున బ్రవేశించి ప్రజలను హింసించి వారి ధనములను యధేచ్ఛముగా దోచుకొనిరి. పురములో నున్న పౌరులీపాట్లు పడజాలక రాజ్యము విడచి యెందో పోయిరి. కొంతకాలమునకు దురుష్క సైన్యము మరల విద్యానగరమున బ్రవేశించి యొనరించిన దురంతములకు అంతములేదు. నిరపరాధులగు పౌరుల నెందరనో చంపిరి. అవ మానముల పాలుచేసిరి. రాజ మందిరములు, దేవాలయ అంగడి వీధులు, పగులగొట్టి కాల్చి, మాడ్చి, నేలమట్టము గావించిరి. కొంతకాలమునకు విధ్యానగరమను జరిత్రలో దేనినేని గాంచి గుర్తింప రాని విధమున వినాశమొనర్చిరి. ....ద్ర సైనికుడు విద్యానగర ధనమును ఒంటెలతో నెక్కించి మోయించుకొని తమ రాజ్యనకు గొంపోయి యందు భాగ్యవంతుడయ్యెను. ఆంధ్రరాజులచే బరిపాలింపబడి యాంధ్రకవితకు నాటపట్టై శాశ్వతస్థాయిగా నాంధ్రచరిత్రములకు నాదర్శప్రాయముగా నుండదగు విద్యానగర సామ్రాజ్యముతో బాటుగా నాంధ్రుల యదృష్టముగూడ నంతరించెను.

రామరాజు భట్టుమూర్తిని గౌరవించి పెక్కు కావ్యములంకితము నొందెను. రాయలవారు సాధింపజాలని తురుష్క రాజ్యములను సాధించెను. ఆంధ్రుల పరాక్రమమునకు బ్రాణభిక్షపెట్టి యాంధ్రులు పరాధీనత గాంచకమున్నె యంతరించెను. తురుష్కుల దండయాత్రలచె నాంధ్రసామ్రాజ్యములు రెండును నశించెను. మొదటిది కాకతీయ సామ్రాజ్యము, రెండవది విద్యానగర సామ్రాజ్యము. ఈ యుభయ రాజన్యులు ఆంధ్రజాతీయతా సంరక్షణార్థము జనించిరి. జాతీయత నుద్ధరించి కృతార్థులైరి. దేశీయుల దురదృష్టవశమున వారు గడించిన యౌన్నత్యము భాగ్యభోగ్యములు, ఐశ్వర్యజీవనము వారితోడనే కాలగర్భమ నం దదృశ్యమయ్యెను. వీరారాధనమను నాచారముగల యాంధ్రకుమారులు రామరాజు దివ్యనామము మఱునకుందురేని కృతార్థులు కాకపోరు.

రామరాజు మరణించిన దినము క్రీ.శ. 1565 సం. జనవరి 23 వ తేది మంగళవారమని చరిత్రగారులు నిర్ణయించినారు. ఆదినమె యాంధ్రవికాసమున కంత్యదినము. నాడె ప్రళయ కాలాంబుదము లావరించి విజయనగర సామ్రాజ్యమును రూపుమాపెను.

యాచశూరుడు.

ఆంధ్రవీరులలో వెలమవారగు రేచర్లగోత్రీయులు సుప్రసిద్ధులు. భేతాళనాయకుడు, అనపోతనాయకుడు, సర్వజ్ఞసింగభూపాలుడు మున్నగు వెలమవీరులందఱు నీ రేచర్లగోత్ర సంజాతులె. రేచర్లగోత్రీయులు తొలుత కాకతీయసామ్రాజ్యమున సేనానాయకులుగ నుండి యప్రతిమాన పరాక్రమముతొ సంగరములలో జయముగడించి తమప్రభువులచే సత్కారముల నొందిరి. కాకతీయసామ్రాజ్యము పడిపోయిన పిదప నీ వెలమవీరులు స్వతంత్ర రాజ్యములను స్థాపించి చిరకాలము పాలించిరి. అనంతర మీరాజ్యము యవనుల యొత్తిడిచే రానురాను జీలి భిన్నభిన్నమైపోయెను. ఈరేచర్ల గోత్రము నందు జనించిన యాచశూరుడు చంద్రగిరి వీరవేంకటపతిరాయలు పాలించుతఱి కొంతకాలము మధురాంతకమునందును మఱికొంత కాలము ఉత్తరమల్లూరునందును సామంతరాజుగా నుండి స్వామిభక్తివిశేషమున బేరెన్నిక గాంచెను.

విద్యానగర సామ్రాజ్యము పతనము కాగానే తిరుమలరాయలు పెనుగొండ జేరినటుల మన మెఱింగియున్నారము. అక్కడగూడ విరోధులవలని యొత్తిడి తగ్గకపోవుటచే జంద్రగిరి చేరెను. ప్రకృత కథాకాలమున దిరుమలరాయని తనయుడగు వీర వేంకటపతిరాయలు చంద్రగిరి రాజ్యమును



యాచశూరుడు.

ములుగా నున్నవనియు వీర వేంకటపతిరాయలచే బట్టాభిషిక్తుడైన రంగరాజే తమకు నిజమగు ప్రభువనియు యాచశూరుడు జగ్గరాజునకు వర్తమానమంపెను. జగ్గరాజు యాచశూరునిమాట పాటింపక చిక్కరాజుపేర దానె రాజ్యవ్యవహారములను నిర్వహించు చుండెను.

యాచశూరుడు చెఱసాలయందున్న రంగరాజు నెటులేని విడిపింపవలయునని విశ్వప్రయత్నములు చేసెనుగాని లాభములేకపోయెను. కారాగృహవాసుల వస్త్రము లుదుకు చాకలి వాండ్రను లోగొని వాండ్రకు లంచము లొసంగి శ్రీరంగరాయల ముగ్గురు కుమారులలో మధ్యవాడగు పండ్రెండు సంవత్సరముల బాలుని బట్టలమూటలలో బెట్టి బయటికి దెప్పించి యాచశూరు డాబాలుని తనయొద్ద నుంచుకొని పెంచుచుండెను. యాచశూరుని భేదనీతియు జగ్గరాజు దుర్మార్గము ఫలింప నెనిమిదివేల సైన్యముతో నలుగురు సేనానాయకులు యాచశూరుని గలిసిరి. యాచశూరుడు విశ్వాసపరులగు నిరువదిమంది సైనికులను బిలిపించి చంద్రగిరికేగి చెఱసాల పాలకునియొద్ద నుద్యోగమున గుదిరి యెటులేని రంగరాజును విడిపించుడని పంపెను. వారు చెఱసాల యధికారి యొద్ద స్నేహము సంపాదించుకొని కారాగృహమునుండి బయటికొక సురంగము త్రవ్వి వారి నా సురంగపు ద్వారమున బయటికి గొనివచ్చుచుండిరి. అంతకుమున్ను వేటకేగి తిరిగి వచ్చుచున్న జగ్గరాజుగుఱ్ఱపుకాలు సురంగపు మొదట దిగబడెను. ఏదియో వింతవలె నున్నదని యాభాగము ద్రవ్వింప నందుండి బయటికివచ్చుచున్న సైనికులు, రంగరాజు, నాతని కుటుంబము బయటపడెను. జగ్గరాజీ ద్రోహమున బాలుగొన్న సైనికుల నందఱను జిత్రవధము గావించి యింకొక దృడతరమగు గృహమునందు రంగరాజు నాతని కుటుంబమును జేర్చి విస్వాసపాత్రులగు మఱికొందరు భటులను గావలిపెట్టి జాగ్రత్తగా మెలగ నజ్ఞాపించెను.

తనయత్నము నిష్ఫలము కాగానే యాచశూరుడు కొందఱువేగుల వాండ్రను జంద్రగిరిసేనానాయకుని యొద్దకు బంపి కొంతధనము లంచముగ నొసగజేసి జగ్గరాజు లేనపుడు కారాగృహపాలకుల జంపి కారాగృహద్వారముల దెఱచి తనకు వర్తమానము చేయునటుల గట్టడిజేసెను. జగ్గరాజు రాజ్యమునలేని తరుణము గనిపెట్టి సైన్యాధికారి కారాగృహ పాలకులను జంపించి కారాగృహద్వారములు తెఱపించి తనకు నమ్మకమైన దూత కీవార్తనువ్రాసిన జాబొసంగి యాచశూరునియొద్దకు బంపెను. దురదృష్టవశమున నాదూత జగ్గరాజుచేత జిక్కెను. జగ్గరాజు దొడ్డిగుమ్మము నుండి కోటలో బ్రవేశించి కారాగృహమును మరల బంధించి సైన్యాధికారిని నాతనితో గలిసిన యితరోద్యోగులను గూడ జంపించెను. ఈవర్తమానము యాచశూరుడు విని తనప్రయ త్నములన్నియు విఫలమైనందులకు మిగులవగచి సైన్యసహితముగ బోరాడి చంద్రగిరి దుర్గమును సాధించినగాని రంగరాజును విడిచిపెట్ట వీలుకాదని సైనికబలము నభివృద్ధిచేయు చుండెను. ఇంక నుపేక్షించినయెడల బ్రతిపక్షులు బలవంతులై రంగరాజును బంధోన్ముక్తినిగావించి తిరుగబడక మానరని దయావిహీనుడగు జగ్గరాజు రంగరాజు కుటుంబమును నాశనముజేయ సిద్ధపడెను. జగ్గరా జొకదినమున తనసోదరుడగు ఓబలరాజును బిలిపించి యాతనికి ఖడ్గము నొసంగి కారాగృహమునకేగి లోనున్న రంగరాజును గుటుంబసహితముగా దెగటార్చిరమ్మని పంపెను. క్రూరుడగు ఓబలరాజు దయారహితుడై కారాగృహమున బ్రవేశించి తన యన్నయాజ్ఞ వారికి వినిపించి వారి జెండబోయెను. రంగరాజు తిరుగబడి యోబలరాజును నాతనికి సహాయముగావచ్చిన సైన్యమును బొరొగొనవలయునని యత్నించెను. గాని దానివలన నిరపరాధులగు సైనికులు మరణించుటయెగాని తన కపాయము తొలంగజాలదని తలంచి రంగరాజు కుటుంబమరణమునకె యనుమతించెను. “ఓబలనాయకునిచేత జావనేల? నాచేతిమీదుగ దొలుత గుటుంబమును దెగటార్చి యాత్మహత్య గావించు కొందుగాక” యని శూరశిరోమణియగు రంగరాజు కత్తిగైకొని యేపాపము నెఱుంగని తనపసిబిడ్డల నిరువురను ధర్మపత్నిని ఖండించి తనతల దాను నఱికికొని పడిపోయెను. ఈఘోరహత్యల విన్నంతనె జగ్గరాజుపై నసహ్యము రంగరాజుకుటుంబముపై గనికరము ప్రతిపౌరునకు జనించెను. జగ్గరాజుపరిపాలనముపై నసూయవహింపని మనుష్యుడె లేడు. రాజ్యచక్రము కేలనుంచుకొని కపటనాటకము నాడించు నా జగ్గరాజు దుర్మార్గ వృత్తికి జంకి పౌరుడెవ్వడును మాఱాడ డయ్యెను. కాని లోలోన నందఱకు గోపము వృద్ధినొందెను.

ఈ దుష్కృత్యము లన్నింటిని గాంచి యాచశూరుడు మిగుల నాందోళనపడి తాను బ్రతికియుండియు, నధర్మమును వారింపజాలనందులకు విచారపడెను. యాచశూరు డొకదినమున జగ్గరాజునొద్దకు నొకదూతని బంపి "రంగరాజు రెండవకుమారుడు ఇంకను జీవించియున్నాడు. ఆతనిని నన్ను జంపి మామేనల్లుచే జంద్రగిరిరాజ్యము నాచంద్రార్కస్థాయిగా బాలింపజేయు"మని వర్తమాన మంపెను. జగ్గరాజావృత్తాంతమువిని తాను వేయికనులతో జూచుచున్నను శత్రుశేషము మిగిలినందులకు జాల విచారపడి యాచశూరు డాబాలు నెటులేని జంద్రగిరిరాజ్య ప్రభువును జేయకమానడని తలంచి యుద్ధప్రయత్నములు మానుమానియు సంధి గావించుకొందమనియు రాయబారములు పంపెను. యాచశూరుడు సంధికియ్యకొనననియు జంద్రగిరి సామ్రాజ్యము నిలువబెట్టుటయో చేతగాకున్న నశించుటయో కర్తవ్యమనియు రాజద్రోహులకు రాజభక్తులకు సంధికనుకూలమార్గములు లేవని వర్తమానము చేసెను. జగ్గరాజుపక్షమువారు చాలమందిధర్మపక్షమగు యాచశూరుని వైపు చేరిరి. సైన్యసహాయమున యాచశూరుడు చంద్రగిరి దుర్గము నొక్కుమ్మడి ముట్టడించెను. జగ్గరాయడు కొంతవఱకు బోరాడి పరాజయసూచనలగాంచి పటకుటీరమును వదలి రాజప్రసాదమునకు బారిపోయెను. పట్టువదలక యేబదివేల సైనికులను సమకూర్చుకొని యాచశూరవతంసుడు జంద్రగిరిని రెండు సంవత్సరము లెడతెగక ముట్టడించెను. జగ్గరాజు పదునేనువేల సైనికులతో గొంతకాలము ముట్టడికి నాగి రాయబారమునకు మరల బ్రయత్నించెను. యాచశూరుడు రాయబారుల దిరస్కరించి చంద్రగిరి దుర్గమును లోగొనెను. జగ్గరాజీ సంరంభమును జూచి పారిపోయెను. యాచశూరుడు రాజమందిరమున బ్రవేశించి కోటను స్వాధీనపఱచికొని విశ్వసనీయులగు సైనికులకు నుద్యోగములు నొసంగి పూర్వవస్తువు లన్నింటిని బయటికి దీయించి సామంత పౌరసమక్షమున శ్రీరంగరాయల పుత్రుడగు రామరాయ భూవిభునకు జంద్రగిరి రాజ్యము పట్టాభిషేకము గావించెను. పౌరులందఱును యాచశూరుని ధర్మపరతంత్రబుద్ధికిని స్వామిభక్తిని సంతసించి చంద్రగిరి రాజ్యమునకు మంత్రిగ నుండుమని ప్రార్థించిరి. కాని తన కర్తవ్యము నిర్వహింపబడినదని యాచశూరుదు తెలిపి తన రాజ్యమునకు నేగెను. పూర్వప్రభు వంశజుడగు రామరాజు తమకు బరిపాలకుండైనందులకు జగ్గరాజు దుష్టపరిపాలన మంతరించినందులకు బ్రజలు సంతసించి రాజ్యమున జిరకాలము మహోత్సవము లొనరించి తమయానందము బ్రకటించిరి.

ఈ యాచశూరుని విజయము క్రీ.స. 1601 లోనిదని చరిత్రకారుల విశ్వాసము. ఈ కథాంశమును న్యాయలు దొరవారు విజయనగర చరిత్రమునందు వ్రాసియున్నారు. దేశీయచరిత్రముల శోధించి వ్రాయబడిన దగుటచే నీకథ విశ్వసనీయమనక తప్పదు. తనప్రభునివంశమును నిలువబెట్టుటలో నెన్నియో కష్టములకోర్చి స్వామిభక్తి ప్రకటించిన వీరశిరోమణియగు యాచనాయకునకు ఆంధ్రవీరులు "రామరాజ రాజ్యస్థాపనాచార్య" బిరుదము నొసంగి తమశాశ్వత కృతజ్ఞతను బ్రకటించిరి. యాచశూరుని శూరత్వమును దామెర వేంగడపతి యిట్లు వర్ణించినాడు.

సీ. ఉత్తరమల్లూరియొద్ద దావల పావ
        విభుసి గొట్టిన నాటి విజయకలన
తిరుమల జేరి ధాత్రిని మన్నెరాజుల
        బాఱదోలిన నాటి బాహుబలము
చెంగలుపట్టు వీక్షించి లగ్గలుపట్టి
        యాక్రమించిన నాటివిక్రమంబు
పాలెముకోట వెల్వల నాజి యతిరాజు
        జరుగ జేసిననాటి శౌర్యపటిమ
తే.గీ.మున్నెతోవూరు జగ్గరాణ్ముఖుల గెల్చి
మధురదొర చెంజిమన్నీని మదమడంచి
తిరుచినాపల్లి దొర దోలు తేజముగల
మేటి వెలుగోటి యాచనిసాటి గలడె!

(బహులాశ్వచరిత్రము)

అక్కన్న మాదన్న మంత్రులు.

చిరకాలమునుండి మన మక్కన మాదన్న యనుజంట నామము లాలకించుచున్నారము. ఈ మంత్రివర్యుల జీవితములు సమగ్రముగా దెలిసికొనుట కాధారములు చాలినన్ని లేవు. సుప్రసిద్ధులగు నాంధ్రుల నాంధ్రేతరుల తమవారని చెప్పుకొనుట సహజముగాని వీరిని మహారాష్ట్రులని కొందఱనుచున్నారు. ఇది విశ్వసనీయముకాదు. వీరలాంధ్రులనుటకె యవకాశము లెక్కుడు కలవు.

అక్కన్న మాదన్నలలో మాదన్నగారె సర్వతంత్ర స్వతంత్రుడు, సమర్థుడును, నున్నతస్థితియం దున్నవాడునని తెలియుచున్నది. అక్కన్నమాదన్నగారలకుగల బాంధవ్యాదికములు నిర్ణయింప వీలు కలుగదు. వీరినిగూర్చి యొక చిత్ర కథ వాడుకలో నున్నది. అందు సత్యమెంతయున్నను వినుటకు మాత్రము యుక్తియుక్తముగ నున్నది.

మాదన్నమంత్రి దానకర్ణుడై యహోరాత్రములు లేదనకుండ దనగృహమున బ్రాహ్మణజనమునకు సత్రము బెట్టుచుండువాడట. ఆసత్రములో జిరకాలమునుండి యక్కన్న భుజించుచు గాలక్షేపము చేయుచుండెను. అక్కన్నగారు సత్రమువారందఱితో గూడ దాను మాదన్నగారికి సోదరుడనని చెప్పువాడు. రానురాను సత్రమువారెకాక మాదన్నగారి భార్యసైతము గౌరవముగా నక్కన్నగారిని దిలకించుచు భోజనాదికములలో శ్రద్ధవహించుచుండెను. ఒకనాడు మాదన్నగారి భార్య భర్తతో మంతనము నాడుచు "మీసహోదరుడు చాలకాలమునుండి సత్రములో భుజించుచు దిక్కుమాలిన వానివలెనుండ జూచుచుండెదరేమి? సంస్థానములో నుద్యోగము నిప్పింపరాదా!" యని ప్రశ్నించెను. మాదన్న నివ్వెఱపోయి "సోదరు డెవరు నేనెఱుగనే!" యనెను. అంత నాతని ధర్మపత్ని "మనసత్రములో భుజించుచున్న యక్కన్నగారు మీసహోదరుడని నేనాతనిముఖమునకా వినియున్నాను. మీరెఱుగనటుల భాషింతురేల?" యనెను. మాదన్న ఆశ్చర్యపడి వెంటనే పరిచారకునిచే నక్కన్నగారిని పిలిపించి యుచితాసనము జూపించి కూర్చుండ జేసి "మిత్రమా? నీవెవ్వడవు నీనివాసమెద్ది? నీకు నాకుగల బాంధవ్యమే దియొ తెలుపు"మని యడిగెను. అక్కన్న మిగుల వినయముతో మాదన్ననుజూచి 'నన్ను నీవెఱుగక పోవచ్చును. నేను పెద్దమ్మకుకుమారుడను, నీవు చిన్నమ్మకుమారుడవు. కావున మనమిరువురము సహోదరులము. ఇది నీకును నాకును మాత్రమె తెలియదగిన యంశము. నాయందింకముందు గూడ నిటులె భ్రాతృగౌరవ ముంచవలయు' ననెను. నాట గోలె మాదన్నయు నాతని ధర్మపత్నియు నక్కన్నగారిని మిగుల దయతో దిలకించుచు నింటనేయుంచి యాదరింపసాగిరట. ఈకథలోని సత్యాసత్యములను విచారింప బూనుట ప్రకృతముకాదు.

అబూహసన్ కుతుబ్‌షా యనునామాంతరముగల తానీషానామము మనము రామదాసుచరిత్రము పఠించిననాటనుండి వినుచునె యున్నారము. తానీషా మిగుల పరాక్రమశాలియై హిందూ మహమ్మదీయుల నైకమత్యముగ బాలించుచు గోలకొండ ముఖ్యస్థానముగ జేసికొని చిరకాలము రాజ్యమును బరిపాలించెను. ఇతనియొద్దనె మాదన్నముఖ్యమంత్రియై రాజ్యాంగములను నిర్వహించుచుండెను. అక్కన్న మాదన్నగారి లిరువురు సహోదరులనియు బింగళియను నింటిపేరు గలవారనియు, భారద్వాజస గోత్రులనియు దద్వంశీయులు చెప్పుచున్నారు. అక్కన్న మాదన్నగారల మేనల్లుడని మనము వినుచున్న కంచెర్ల గోపమంత్రియను రామదాసు సైతము నియోగియు, నాంధ్రుడు కావున నక్కన్న మాదన్నగారలు నాంధ్రులా, కారా యనుచు విచారింపనవసరములేదు. అక్కన్న మాదన్నయను నామము లాంధ్రులలో గానవచ్చుటవలనను జిరకాల మాంధ్రదేశమునందె వీరుంటవలనను నాంధ్రులతో బాంధవ్యము గానవచ్చుటవలనను వీరల నాంధ్రులనియె విశ్వసించి తీఱవలయును.

తానీషాయొద్ద మాదన్నగా రింతయనరాని గౌరవముతో మంత్రిపదవి నిర్వహించుచుండిరి. అక్కన్నగారు తానీషాయొద్ద సర్వసైన్యాధ్యక్షుడై రాజ్యక్షేమమునకై యావచ్ఛక్తి వినియోగించుచుండెను. మాదన్నగారు హిందూమహమ్మదీయుల కైకమత్యము ఘటించుచు

భిన్నాభిప్రాయముల బాఱదోలుచు మిగుల జాగరూకతతో రాజ్యస్థితిగతుల నరయుచు రాజ్యపరిపాలనము గావించుచుండెను. అన్యశ్రేయసునకు సహింపని కొందఱు దుర్మార్గమున కొడిగట్టి యక్కన్న మాదన్నగారికి మహమ్మదీయ జాతికి భిన్నాభిప్రాయమును గల్గింప నారంభించిరి. అట్టివారిలో మహమ్మద్ ఇబ్రహీం అనువా డొకడు. ఇబ్రహీం తానిషాయొద్ద సర్వసైన్యానాయకుడుగ నుండి దుర్మార్గము లనేకములు గావించుచుండె. నాతని దొలంగించి మాదన్నగా రాస్థలమున నక్కన్నగారిని జేర్చిరి. అది మొద లక్కన్నగారి యొక్కయు మాదన్నగారి యొక్కయు మారణమున కిబ్రహీము తన యావచ్ఛక్తి వినియోగించుచుండెను. తానీషాయొద్ద నిచితమగు గౌరవ భావము ప్రజలయొద్ద భక్తి విశ్వాసములు గల యీమంత్రివర్యుల నేవిధముగనేని వంచింపనెంచి తరుణముకొఱకు వేచియుండెను. అక్కనమాదన లాతని లక్ష్యపెట్టరైరి.

మొగలురాజు లెటులైన గోలకొండరాజ్యము హరింప దీప్రయత్నములు కావింపసాగిరి. ఔరంగజేబు మిగులనాసక్తితో గోలకొండ రాజ్యముకొఱకు గుటుకలు మ్రింగుచుండెను. అక్కన్న మాదన్నగార లీయంశము గ్రహించి రాజ్యములోని హిందూమహమ్మదీయుల కైకమత్యా మభివృద్ధిగావించి యాకాలమున బలవంతుడైయున్న శివాజీచక్రవర్తితో దానీషాకు స్నేహము కుదిర్చిరి. శివాజి గోలకొండ కొకమారువచ్చి తానీషా యొసంగిన యాతిథ్యము స్వీకరించి గోలకొండ రాజ్యము సురక్షితముగ జేయుదునని వాగ్దానము గావించెను. శివాజీ కాలధర్మము నొందిన పిమ్మట శంభాజి రాజ్యమునకు వచ్చెను. అక్కన్నమాదన్నగారలు పూర్వము వలెనే శంభాజికి దానీషాకు నైకమత్యము గుదిర్చిరి.

రాజ్యతృష్ణగల డిల్లీశ్వరుడగు నౌరంగజేబు గోలకొండ రాజ్యము హరింపవలయునని పలుమాఱు సైన్యమును బంపెను. అక్కన్న మాదన్న గారలు యవనాంధ్ర సైన్యముల నెదురు నడిపి యౌరంగజేబు సైన్యముల వినాశము గావించిరి. అవమాన పీడితుడగు నౌరంగజీ బంతతో నాయత్నము మానుకొనక గోలకొండ రాజ్యముకొఱకు దురాలోచనములు పెక్కు చేయుచుండెను. ఆకాలమున ఈష్టుఇండియా కంపెనీవారు హిందూదేశమున బ్రవేశించి మదరాసు, మచిలీపట్టణము లోనగుచోటుల చిన్నచిన్న కొట్లువెట్టి వ్యాపారము జేయుచుండిరి. ఔరంగజేబునకు గంపెనీవారికి నభిప్రాయము భేధించుటచే వారికి నిలువనీడ దొరకదయ్యెను. అపుడు కంపెనీవారు గోలకొండరాజ్యము సర్వాధికారములతో బరిపాలించుచున్న యక్కన్నమాదన్నల నాశ్రయించి సముద్రతీర ప్రాంతములను గౌలునకు బుచ్చుకొని వ్యాపారము జేయ నిశ్చయించి యుపాయాంతరము నన్వేషింప సాగిరి. గోలకొండ రాజ్యమున కంతటికి సుబేదారుగా నున్న పగడాల లింగప్ప యను నొకసరదారు రేవులలో గంపెనీవారి సామానులు దిగకుండ నాటంక పఱచి కంపెనీవారి విజృంభణము నంతయ దుదముట్టింప సిద్ధపడెను. కంపెనీవా రక్కన్న మాదన్న గారలతో స్నేహము సంపాదించుకొని పగడాల లింగప్పవలన దమకు గలుగుచున్న చిక్కులన్నియు నివేదించిరి. అపు డక్కన్న మాదన్నగారలు పగడాల లింగప్పకు నొకజాబు వ్రాసిరి. లింగప్ప యాజాబు నందలి "కంపెనీవారి వ్యాపారమునకు నాటంకము గలుగనీయకుము" అను వాక్యముజూచి యపటికి జేయునదిలేక యూరకుండెను. కంపెనీవారు వ్యాపారప సైనికబలము వృద్ధిచేయుట జూచి లింగప్ప అక్కన్నమాదన్న గారలకు దెలిపి కంపెనీవారు కొలదికాలములో స్వతంత్ర రాజ్యము స్థాపించి మనకపాయము గలిగింతురని తెల్పెను. అక్కన్న మాదన్న లామాటలువిని యందలి సత్యము విచారించి తెలిసికొని గాని తొందరపడరాదని వారి యత్నము లరయుచుండిరి.

పగడాల లింగప్పయే అక్కన్న మాదన్న గారలకు దమకు భిన్నాభిప్రాయము కలుగ జేసెనని తలంచి కంపెనీ వారు గోలకొండకేగి అక్కన్న మాదన్నను సందర్శించి తాము సేనలను వృద్ధిచేయుచున్నది ఆత్మసంరక్షణముకె గాని దేశము నార్జించుటకు గాదనియు తమ పని వర్తకముమాత్రమె యని నివేదించిరి. ఇంతలో మాదన్నగారి తనయుడగు మల్లప్పయను వాని యుపనయనము సమీపించెను. అది గ్రహించి కంపెనీవారు మాదన్నగారి కొక వీసెబరువుగల బంగారు గొలుసు, నాలుగువందల వరహాలు అనేకామూల్యములగు పట్టు వస్త్రములు బహుమానముగా నొసంగిరి. అంతతో బోక మాదన్నగారి పేష్కారునకు గొంతధనము మాదన్నగారి పినతండ్రిగారికి గొంతరొక్కము నొసంగి యందఱ సంతృప్తి పఱచిరి. మాదన్నగారు కంపెనీవారు ధర్మ వర్తనులనియు విధేయులనియు గేవల వ్యాపారులనియు దలంచి యెవరివలన నెట్టి

యాటంకములు లేకుండ రేవులలో వ్యాపారవస్తువులు దిగుమతిచేయించుకొని విక్రయించి కొనుటకు ఖండాంతరములనుండి వ్యాపారమునకు వచ్చు నితర వర్త కులను వెడలగొట్టుటకు నంగీకరించెను. దీనితో ఈష్టిండియా కంపెనీవారు వ్యాపారము వృద్ధిచేసికొని స్వతంత్రులగుట కవకాశము చిక్కెను.

తానీషయు నక్కన్న మాదన్న గారలు చేయు ధర్మపరిపాలనము విప్లవకారులగు కొందఱకు మిగుల కష్టతరముగ నుండెను. అట్టివారిలో బూర్వము సైన్యాధ్యక్షుడుగ నుండి స్థానభ్రష్టుడైన మహమ్మద్ ఇబ్రహీం ఒకడు. ఇతడుకొంత పలుకుబడి కలవాడగుటచే దీవ్రముగ బ్రయత్నము జేసి యక్కన్న మాదన్నగారలయందు మహమ్మదీయజాతికంతకు నేవము పుట్టించెను. విడిగనున్న నీతనివలన విప్లవమువచ్చునని తానీషా మహమ్మదు ఇబ్రహీమునకు సేనానాయక పదవి మాత్ర మొసంగి వానిని జాగరూకతతో దిలకించుచుండెను.

మాదన్నగారు మిగులనాచారపరాయణుడు. ప్రతిదినముదయమున బ్రాత:కాలకృత్యముల దీర్చుకొని చాలసేపు శివపూజ గావించి యనేక బ్రాహ్మణుల నాహ్వానించి వారి పంక్తిని భుజించి రాజకీయ కార్యములు నిర్వహించువాడు. మాదన్న త్యాగశీలుడు. పండితపక్షపాతి. సర్వకాల సర్వావస్థలయందు విద్వత్సహవాసము గావించుటచే నీతనికి గొప్ప పాండిత్యము కూడ నలవడెను. మాదన్నగారు తమ యుపవనములోని సరోవరమున స్నానము గావించుచుండ నిబ్రహీంచే బ్రేరేపితుడై వచ్చి యొకతురుష్కు డా కొలనిలో మునిగెను. మాదన్నగా రాతురుష్కుని సాహసమునకు మిగుల గోపించి వెంటనే యాతని శిక్షించిరి. దుర్మార్గుడగు నాయవనుడు దేహమునిండ గాయములుగావించుకొని పురములోని మహమ్మదీయు లందఱకు జూపి మాదన్నగారి దుర్మార్గమును వేయివిధముల నుగ్గడించెను. మాదన్నగారి విషయమై తానీషాకు దెల్పినను లాభములేదని మహమ్మదీయు లందఱు నిశ్చయించి బ్రాహ్మణ మంత్రులచే దానీషా చేయించు దుండగములలో నిదియొకటిగ డిల్లీశ్వరునకు నివేదింపుమని వానినిబ్రోత్సహించి పంపిరి. వెంటనేవాడు బయలువెడలి కొన్నిదినములకు డిల్లీకి జేరి యౌరంగజీబును సందర్శించి తానొందిన దురవస్థయు దానిషాయొక్క యధర్మ పరిపాలనము, అక్కన్న మాదన్నల యవినీతి యను నంశములగూర్చి లేనిపోనివి చాలసేపు ఘోషించెను. చాలకాలము నుండి గోలకొండ రాజ్యముకొఱకు ప్రయత్నము జేయుచు విఫలమనోరథుడగుచున్న యౌరంగజీబు గోలకొండ రాజ్యములోని సైనికుల యంతరంగము, రాజద్వేషము నా యవనులవలన సాకల్యముగ విని యిదియె తరుణమని తన కుమారుడగు మువాజ్జం అనువాని కమితమగు సైన్యము నొసంగిపంపెను.

తానిషా, మువాజ్జం గోలకొండ రాజ్యమును ముట్టడింప వచ్చుచున్నాడని విని మార్గమధ్యమున బ్రతిఘటించుటకై తనబలములో సగము నొసంగి మహమ్మద్ ఇబ్రహీం మును బంపి మిగిలిన సగముసైన్యము నక్కన్నగారి యాధీనము గావించి గోలకొండ దుర్గమును రక్షింప నియోగించెను. అక్కన్న మాదన్నగారల నంతము నొందింప వలయుననియు తానీషాను రాజ్యమునుండి తొలగింప వలయుననియు, దలంచిన వాడగుటచే నౌరంగజీబుచే బంపబడిన మువాజ్జంరాన్‌జహాన్ అనువారితో మహమ్మదు ఇబ్రహీం కలిసి వారిని గోలకొండ దుర్గమునొద్దకు గొనివచ్చెను. ప్రత్యర్థుల సైన్యమంతయు నమితోత్సాహముతో హైదరాబాదునకు సమీపములోనికి వచ్చెను. తానీషా, మహమ్మద్ ఇబ్రహీ మొనర్చిన దుర్మార్గము నంతయు నాలకించి యపజయము నిశ్చయమని భావించి సైనికుల శక్తియున్నవఱకు బోరుమని నియోగించి తాను ప్రాణభీతిచే దుర్గములోనికేగి దుర్గద్వారము లన్నియు మూయించి యఱచేతిలో బ్రాణములు పెట్టుకొని యుండెను.

మువాజ్జం సైన్యము స్వేచ్ఛగా గోలకొండ దుర్గములోనికి గనుగందకుండ బ్రవేశించి ధనవంతుల గృహములదోచి స్త్రీల జెఱబట్టి యనేక దురంతములు గావించిరి. ఈదుర్మార్గములన్నియు స్వామిద్రోహియగు మహమ్మదు ఇబ్రహీము దగ్గరనుండి చేయించెను. రాజ మందిరములో బ్రవేశించి తానీషాను అంత:పురకాంతలను జెఱబట్టదలంచిరి గాని యప్పటికి సాయంకాలమగుటచే గోటభేదించుటకు బొద్దుచాలదని యాప్రయ త్నము మఱునాటి యుదయమున జరుపవలయునని నిశ్చయించుకొని శిబిరములకు జేరిరి.

ఈ సంగ్రామమునకు ముఖ్యముగ బ్రాహ్మణు లగు నక్కన మాదనగారలు మంత్రులుగ నుండుటయే కారణమని పరిజనుల వలన విని యంత:పుర కాంతలు వీరభటులను దానిషాకు దెలియకుండ హంతకుల బిల్పించి వారి కనేక భూషణముల నొసంగి యక్కన్నమాదన్నగారల వధించి వారితలల గొనిరమ్మని యాజ్ఞాపించిరి. హంతకులు త్రోవలు గాచి దాక్షిణ్యశూన్యులై నిర్దోషులగు నక్కన్న మాదన్నగారల రాజద్వారము ముందు దునిమి యుత్తమాంగ లంత:పురమునకు జేర్చిరి. వెంటనే యంత:పుర కాంతలు ఖండితశీర్షముల నొక వెండిపళ్లెరములోనుంచి మువాజ్జమునొద్దకు బంపిరి. అక్కన్న మాదన్నలు వధింపబడగనే వీరావేశముతో మహమ్మదీయు లందఱు విజృంభించి గోలకొండలోనున్న బ్రాహ్మణుల నందఱను జెండాడి రక్తప్రవాహములచే దుర్గమంతయు గలుషితము గావించిరి. తానీషా మంత్రివర్యుల యొక్కయు బ్రాహ్మణుల యొక్కయు దుర్మరణమునకు విచారము నొంది చేయునదిలేక రెండుకోటుల రూపాయ లపరాధము నొసంగి మువాజ్జంతో సంధి గావించుకొనెను. మువాజ్జం సైనికు లాసంగ్రామములో గోలకొండనగరములో నాలుగైదు కోటులకు బైగా ధనము దోచికొనిరి. 1686 సంవత్సరములో నౌరంగజేబు సేనలతో గుల్బర్గాకు బోవుచున్నటుల బ్రయాణమై యాకస్మికముగ గోలకొండను ముట్టడించెను. తానీషా తనబలము నతంయు వినియోగించి యేడుమాసములు పోరాడి యోడిపోయెను. ఔరంగజేబు తానిషాను బంధించి 1687 లో దేవగిరి దుర్గముమీద జెఱబెట్టెను. అతడా కారాగృహమునందె మరణించెను.

అక్కన్న మాదన్నగారలు తానీషా సామ్రాజ్యమున క్రీ.శ. 1659 మొదలుకొని 1686 వఱకుండియుందురు. స్వామిభక్తి పరాయణులు సత్యప్రియులు నగు నీయాంధ్ర మంత్రివర్యు లకారణముగ జాతి ద్వేషపరాయణులచే వధింపబడిరి. అక్కన్నమాదన్నలతో గోలకొండ రాజ్య మంతరించెను. గోలకొండరాజ్య మష్టైశ్వర్యములతో నుంటకు నక్కనమాదన గారలు వినాశమగుటకు మహమ్మదు ఇబ్రహీము కారకుడు. అక్కన్న మాదన్నలు మరణించినను వారి చరిత్రము భారత జాతి యున్నంతవరకు సజీవముగ నుండ గలదు. అక్కన్న మాదన్న రచ్చనావడులు బెజవాడ కనకదుర్గాలయ సమీపమునను వారల సత్రము లను ప్రదేశము నందిగామ సమీపమున ముని యేటియొడ్డునను నేటికి దర్శనీయములుగ నున్నవి. అక్కన్న మాదన్నలు ధర్మసంస్థాపకులు. హిందూ మహమ్మదీయ సమ్మేళనమునకు వారు పాటుపడి దేశమాతకు బలి యొసంగ బడిరి. వారానాడు నాటిన బీజమె యిప్పటికి మహావృక్షమై దుర్భేదమై ఫలవంతమైనది. మహాత్ముల జీవితముల లోని ధర్మ రహస్యముల గ్రహించుటకు దివ్యదృష్టి కావలెననుట కీ యక్కన్న మాదన్నల చరిత్రమె ప్రమాణము. భద్రాచల రామదాసను పరమభక్తుని పవిత్ర చరిత్రము ఎఱుంగని యాంధ్రుడు లేడు. రామదాసు మొదటిపేరు గోపన్న. ఈయన అక్కన్న మాదన్నలకు మేనల్లుడనియు దానీషాకు జెందవలసిన ధనమును జేర్పక హరించుటచే జెఱసాలలో నుంచిరనియు నీయన భద్రాచలమున దాశీలుదారుగా నున్నప్పుడు రామాలయము గట్టించెననియు మనము వినియున్నారము. రామదాసు వంటి భక్తునకు మేన మామయగుట గూడ అక్కన్న మాదన్నల ప్రశస్తి కొక సాదనము.

సంపూర్ణము.

ఆంధ్ర వీరులు.

(రెండవ భాగము)

గ్రంథకర్తలు:

శేషాద్రి రమణ కవులు

శతావధానులు.

పబ్లిషర్సు:

వేంకటరాం అండ్ కో.,

హెడ్ ఆఫీసు, ఏలూరు. బ్రాంచి, బెజవాడ.

బెజవాడ వాణీ ముద్రాక్షరశాలయందు

ముద్రింపబడినది.

 1928 [వెల రు. 0-12-0

విషయ సూచిక.

పీఠిక.

శ్రీ శేషాద్రి రమణ కవులు రచియించిన ఆంధ్ర వీరుల చరిత్రమును జూచితిమి. అటువంటి సుప్రసిద్ధ కవీశ్వరులు వ్రాసిన గ్రంథములకు బీఠిక వ్రాయు నధికారము మాకేమాత్రమును లేదు. నిరర్గళధారగవారు బాఱించు చరితావాహిని తరతరముల బాలురకు బాలికలకు జ్ఞానప్రదాయిని యగుగాకయని పరమేశ్వరుని బ్రార్థింతుము. ఆంధ్రదేశ చరిత్రమును గథలమూలముగ బాఠకులకు సుబోధమగునట్లు గావించనెంచిన యుద్యమ మెంతయు శ్లాఘనీయము. అట్టి యుద్యమమును సాధించుటకు దోడ్పడినందులకు వేంకరామ్ కంపెనీవారికి, యాంధ్రదేశ మెన్నటికిని మఱువలేదు. మనవారికి ఆత్మ చరిత్రజ్ఞాన మత్యల్పముగ నున్నది. ఇప్పటి S. S. L. C. చదువులో హిందూదేశ చరిత్ర పఠనమునకు ఆంధ్రచరిత్ర పఠనమునకు వలయునంత యవకాశము లేదు. మన చరిత్రజ్ఞానము లేకుండ B. A. పరీక్షలో నుత్తీర్ణు లగుటకు వీలులేర్పడి యున్నవి. ఇట్టి సందర్భమున మన చరిత్రకు సంబంధించిన కథల చదివియైన దాని జ్ఞానమున సంపాదించ గలుగుటకు ఈలాటి పుస్తకము లాధారములు కాగలవు. ఇవి IV, I & VI ఫారములలో Non-detailed పఠనీయ గ్రంథములుగ నేర్పరచుట కెంతయు ననుకూలములుగ నున్నవి. వీనిని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, S. S. L. C. Board వారు నామోదించి కవుల యుద్యమమును గంపెనీవారి యుత్సాహమును సాగింతురుగాత మని యెంచుచున్నాము.

హిందూ హైస్కూలు
బందరు,
1927.

వారణాసి శ్రీనివాసరావు,
ఎం. ఏ. (ఆనర్సు) ఎల్. టి.

పీఠిక.

సహృదయులారా !

ఆంధ్రవీరు లను పేరుతో జరిత్రవిషయికమగు వీరకథలతో బ్రథమభాగము కొన్నిమాసముల క్రిందట బ్రచురించి యుంటిమి. విద్యభిమాను లాగ్రంథమును మిగుల నాదరించి సదభిప్రాయముల నొసంగిరి. భాషావిదులగు నుపాధ్యాయులు మాయుద్యమమునెడ నభిమానించి యున్నత తరగతులకు బఠనీయ గ్రంథముగా నేర్పఱచి మాకెంతయు దోడ్పడిరి. ప్రజాభిమానమును గుర్తించి యీరెండవ భాగమును గూడ నుత్సాహముతో బ్రచురింప గలిగితిమి.

సాధారణముగా జరిత్రగ్రంథములందు జిరకాలము విశాలరాజ్యమేలిన రాజుల చరిత్రములె విపులముగా గానవచ్చుచుండును. రాజుల చరిత్రముతో బాటు రాజ్యస్థాపకుల చరిత్రముగూడ మనకు బఠనీయముగాన నీరెండవభాగమున రాజ్యస్థాపకుల చరిత్రమునకె యుచితస్థాన మొసంగితిమి. ఆంధ్రరాజుల చరిత్రము చాలవఱ కగమ్యముగా నున్నది. పురాణగ్రంథములందలి యాంధ్రరాజ వంశములకు జరిత్రము లందలి యాంధ్రరాజులకు సంబంధములు కలుపబడుటకు దీవ్రయత్నములు జరుగుచున్నవి. ఆంధ్రవాఙ్మయమునందును శాసనలిపియందును, పూర్వచరిత్రములందును అపూర్వాంశ ములు పరిశోధకులు కనిపెట్టుచున్నారు. ప్రత్యేక వ్యక్తిత్వము నిలువబెట్టు కొనుటకు సహస్రభంగుల సర్వతోముఖముల ఆంధ్రులు యత్నించుచున్నారు. ఈ శుభావసరమున గళాశాల లందును ఉన్నత తరగతులందును జదువుకొను బాలుర కాంధ్రదేశాభిమానము ఆంధ్రభాషాభిమానము గావించుట కుపరించుననియే యీ చరిత్రగ్రంథములు వ్రాయ నారంభించితిమి. ప్రమాణ గ్రంథముల నుండియు శాసనముల నుండియు నిం దుదాహరింప బడిన వీరచరిత్రములకు విషయ సంగ్రహణము గావించితిమి. మొదటి నుండి మే మభిమానముతో జేయు పరిశోధనము గూడ నీగ్రంథ రచనమున కెంతయు సహాయకారి యయ్యెను. కాకతీయ రుద్రదేవుడు, అనపోతనాయకుడు, సోదనాద్రి రెడ్డి మున్నగు వీరుల చరిత్రములకు వలయు జరిత్రాంశములు కొన్ని మేము చేయుచున్న నిజామురాష్ట్ర పరిశోధనమున లభించినవి. రెడ్డిరాణి పత్రికలో శ్రీ సురపురపు ప్రతాపరెడ్డి బి. ఏ., బి. ఎల్. గారు వ్రాసిన సోమనాద్రి యను విలువగల వ్యాసమునందలి భాగములు కొన్ని యిందలి సోమనాద్రి చరిత్రము నందు జేర్చితిమిగాన వారికి బ్రత్యేకించి కృతజ్ఞత దెలుపుకొనుట యవసరము. దేశ మిపుడు పంచమ సంఘము నాదరించు చున్నది. అస్పృశ్యతా నివారణమునకు, పంచమోద్ధరణమునకు మిగుల బాటుపడు చున్నది. పూర్వము పంచమ సోదరు లొందిన యభ్యున్నతికి దార్కాణముగా నిందు బలనాటి వీరులలో బేరొందిన కన్నమనాయని చరిత్రమును సేకరించి యీ గ్రంథమునందు జేర్చితిమి.

ఆంధ్రుల పూర్వచరిత్ర మగాధముగా నున్నది. ఉన్నంతలో నసమగ్రభాగములు మెండు. కథారూపముగా నభిరుచితో బఠింప వీలగు నాదర్శ పురుషుల జీవితసారముల నీ గ్రంథమున జతపరచితిమి. ప్రథమభాగమువలె నీ ద్వితీయ భాగముగూడ బ్రజాదరణపాత్ర మయ్యెనేని మేము ధన్యులము. ద్వితీయ ముద్రణము నాటి కిందలి దొసంగులున్న సవరించుకొని నిర్దుష్టము గావించు కొందుము. ప్రకృతము దేశసేవగావించు విజయనగరము, గద్వాల, వెంకటగిరి, బొబ్బిలి, పిఠాపురము, మున్నగు సంస్థానములకు స్థాపకులగు రాజుల చరిత్రముగూడ నిందు సేకరించితిమి. విజయరామరాజు స్వతంత్రాభిరతులగు విజయనగర రాజులలో గడమవాడు. ఈయన కార్యదీక్ష, స్వాతంత్ర్యతృష్ణ నిరుపమానములు, అనపోతనాయకుడు వేంకటగిరి, పిఠాపురము, జటప్రోలు, మైలవరము, బొబ్బిలి సంస్థానముల మూలపురుషుడు. ఈమహావీరుని జీవిత ముద్రేకకరముగ నుత్సాహకరముగా నుండును. గద్వాల సామ్రాజ్య నిర్మాతయగు సోమనాద్రి యవనరాజులకు బ్రబలప్రత్యర్థి; స్వాతంత్ర్యము కాపాడుకొని దేశీయకళల బోషించిన వీరచూడామణి. ఈ గ్రంథ మునం దుదాహరింప బడిన పదిమందివీరులలో నీముమ్వురి రాజ్యములుమాత్రము నేటి కాంధ్రజాతీయతకు దృష్టాంతముగ నిలిచియున్నవి. మిగిలిన యేడ్వురచరిత్రము కేవలచరిత్ర శరణ్యముగా నున్నది.

కొలదికాలములో మూడవ భాగముగూడ బ్రచురింపనున్నారము. అందు బెద్దాపురము, వనపర్తి, ఆత్మకూరు, బొబ్బిలి మున్నగు రాజ్యములను బాలించిన పూర్వరాజుల చరిత్రములు వ్రాయదలంచితిమి. ఆంధ్రవీరులకు సవిమర్శమగు తొలిపలుకు వ్రాసి గ్రంథప్రశస్తికి గారకులైన బందరు హిందూహైస్కూలు ప్రథానోపాధ్యాయులగు బ్రహ్మశ్రీ వారణాసి శ్రీనివాసరావు పంతులు ఎం.ఏ.,ఎల్.టి. గారియెడ గృతజ్ఞులము.

ఈగ్రంథములు వ్రాయుటలో మమ్ము మిగులబ్రోత్సహించుటయెగాక ముద్రించి యచిరకాలమున వ్యాప్తికి దెచ్చిన వేంకటరాం అండ్ కో, బెజవాడవారు కృతజ్ఞతా పాత్రులు.

ఇట్లు భాషాసేవకులు,
శేషాద్రి రమణకవులు,
శతావధానులు.

నందిగామ,
1-8-1927.

మాధవవర్మ.

...మిగుల బేరు ప్రతిష్ఠల గాంచెను. సోమరా జీతనికుమారుదు. ఇతడు పరాక్రమమున నాంధ్ర రాజ్యాధినేతలకు సర్వ విధంబుల సాటివాడై ప్రత్యర్థుల ననేకుల జయించి రాజ్యము మిగుల నభివృద్ధిలోనికి దెచ్చి కందారములో శత్రుజనాభేద్యముగ నొక గొప్ప కోటను గట్టించి తండ్రికాలము కంటె దన కాలమున నైశ్వర్యము నభివృధిలోనికి గొనివచ్చి పరాక్రమైక జీవనుడై ధర్మపరిపాలనము గావించు చుండెను. ఆంధ్రదేశమునకు జెందిన కొంతభూభాగము నీతడు నిరంకుశముగ పరిపాలించుచుండ దోడివారలకు గన్నెఱ్ఱ జనింపసాగెను. వీరవర్యుడగు సోమరాజు దైవమును దక్క తదన్నుని లెక్కసేయక పగవాడను వాడు లేకుండ బరిపాలించుచుండెను.

సోమరాజునకు సామంతులుగ నున్న రాజులు కొందరు అసూయపరులై స్వతంత్రముగ వర్తింప నిచ్చగించి యాకాలమున బలవంతుడుగ నున్న కటకపరిపాలకు నాశ్రయించి సోమరాజుపై గత్తిగట్టిరి. దురాశాపీడితుడగు కటక పరిపాలకుడు క్రమక్రమముగా మాటలతీయదనంబుచే సోమభూపాలుని సామంతుల నందఱ లోగొని యంతఃకలహముల నభివృధి జేయచుండెను. సోమరాజు కొంతకాలమునకు గటకేశ్వరుని దురంతమును గ్రహించి సామంతుల నందర సామదానోపాయములచే లోగొని కటకేశ్వరుని వంచనోపాయములతో వంచించి యాతని విషయమున గనుగలిగి మెలగు చుండెను. తనప్రయత్నము వ్యర్థమగుటచే నెటులేని సోమరాజునువంచించి వానిరాజ్యము లోగొనవలయునని నిశ్చయించుకొని కందారరాజ్యము నెటుల ముట్టడింప వీలగునాయని చిరకాలమునుండి కటకేశ్వరుడు తీవ్రప్రయత్నములు చేయు చుండెను. సోమరాజు చారులవలనను ఇంగితవేదులగు పరిజనులవలనను గటకరాజు తలంపు సమగ్రముగ నెఱింగి బలంబుల నభివృద్ధిగావించికొని శత్రుజనభీకరముగ వర్తించుచుండెను. ఉభయులహృదయములలో నంత:కలహము పెచ్చరిల్లి దినదినాభివృద్ధి గాంచుచుండెను. సోమరాజు కటకేశ్వరుని దురంతములు వినివిని చేయునదిలేక సమానుడగునాతని నెటులేని వంచింపవలయునని తీవ్రముగ బ్రయత్నము చేయుచుండెను. సామంతుల యభిప్రాయములు సరళముగ నుండకుంటచే నెటుపోయిన నెటువచ్చునో యని సోమరాజు తనకై తాను సంగ్రామమున కేగు ప్రయత్నమును మానుకొని ప్రత్యర్థియే యెత్తివచ్చిన యాత్మసంరక్షణము గావించుకొనదగినంత బలమును వహించి వర్తింపసాగెను.

సోమరాజు గోవులయందు మిగుల భక్తివిశ్వాసము గలవాడగుటచే సామంతుల వలనగూడ గప్పము క్రింద గోవుల జేకొని విశాలమగు తన కాననంబుననుంచి మిగుల గూరిమితో దిలకించుచు సంరక్షణమునకై పెక్కండ్రు పరిపాలకుల నియోగించి ప్రేమింపసాగెను. ఆకాలమున రా లలో బశుధనమున సోమరాజును బోలిన భూపాలకుండు లేడయ్యెను. గోదావరీతీరమందలి సారవంతములగు నరణ్యములలో గడుపాఱ మేసి సాయంసమయమున లేగలకై యంబాయనియఱచుచు నేతెంచు గోకదంబంబును సోమరాజును నాతని ధర్మపత్నియు మిగుల బ్రేమతో దిలకించుచుందురు. సోమరాజుసతి సిరియాలదేవి. ఈదంపతులు సంతానహీనులగుటచే దమ లేగదూడలనే బిడ్డలుగ భావించి ప్రేమతో నిరంతరము దిలకించువారు. కాలవశమున ననావృష్టి దోషముచే గోదావరి ప్రాంతములయందలి యరణ్యములలో గోకదంబమునకు జాలినంత పచ్చిక లభింపదయ్యెను. పశువుల దు:స్థితికి సోమరాజు మిగుల విచారించి పుత్ర పుత్రికా జననమునకు మాఱుగజూచు తన ప్రేమపాత్రమగు నాలమందలను విధిలేక కందార రాజ్యమునకు సరిహద్దులోనున్న తమ యడవులలో జలము, తృణము సమృద్ధిగా నున్నటుల విని యటకు సాయుధులగు భటులతో గూడ బంపించెను. సోమదేవరాజు నాజ్ఞ శిరసావహించి పశుపరిపాలకు లా గోకదంబమును నహర్నిశలు జాగరూకతో దిలకించుచు దుష్టమృగములవలన నెట్టి యపాయము రాకుండునటుల జూచుచుండిరి. అసూయాసర్పదష్టుడగు కటకేశ్వరుడు సరిహద్దులలో సోమదేవ భూపాలుని గోకదంబ మున్నటుల చారులవలన నెఱింగి సోమరాజును సాధింప నవకాశము లభించినదని మిగుల నానం దించి యొకానొక దినమున సైనికబలముతో బయలుదేరివచ్చి పశుపాలకుల నందఱ శిక్షించి వారల వృక్షమూలములకు బంధించి గోకదంబము నంతయు దన దొడ్డికి దోలించెను. కొన్నిగోవు లా సందడికి బెదరి కందారరాజ్యము త్రోవబట్టెను.

పశుధనము నంతయు సైనికులు కటకము జేర్చికొని సరిహద్దులను దాటి మేపినందులకు బ్రతిక్రియ గావించితిమనియు, శక్తిసామర్థ్యములున్నచో నీ యాలమందలగొనిపోవచ్చుననియు సోమభూపాలునకు గటకేశ్వరుం డొక సందేశమును రాయబారులచే బంపించెను.

అంతకంటె ముందు గోరాజములు, తరువాత పశుపాలకులు, కందారమునకు జేరినపిమ్మట సోమరాజు పసుపాలకుల గాంచి పశువు లిటుల భిన్నభిన్నముగ రా గతమేమని ప్రశ్నింప గలరూపు నెఱింగించిరి. కటకేశ్వరుని దురంతము లిప్పటికి ఫలరూపమునకు వచ్చినవని సోమరాజు కోపదృష్టితో బ్రతిక్రియ యోజింపుచుండు సమయమునకు నతనిచే బంపబడిన రాయబారులు వచ్చి సందేశపత్రిక నొసంగిరి. సామోపాయముతో నిక ఫలములేదనియు సంగ్రామమునగాని కార్యఫలము తేలదనియు సోమరాజు నిశ్చయము గావించుకొని యా భటులకు గొలదికాలములో సంగ్రామమునకు వచ్చి గోకదంబముతోబాటు గటకేశ్వరునిగూడ బంధించి తేనున్నాడనని ప్రత్యుత్తరము వ్రాసి యొసంగి సైనికుల నందఱ సమావేశపఱచి జరిగిన విషయము నంతయు నివేదించి స్వామిభక్తి పరాయణులు, శూరవర్యులు నగుసైనికుల నందఱ యుద్ధమునకు సిద్ధముకండని యాజ్ఞాపించెను.

సోమరాజు నాజ్ఞ సుగ్రీవుని యాజ్ఞ వంటి దగుటచే విశ్వాస పాత్రులగు నా సైనికులందఱు సంగ్రామమున కాయితులైరి. శుభ ముహూర్తమున తన రాజ్యమును గీర్తివర్మయను తన మంత్రియధీనము గావించి యుచితబలములతో సోమరాజు కటకమునకు బయలు వెడల సంగ్రామ భేరి మ్రోగించెను.

కటకేశ్వరుడు రాయబారుల వలన సోమరాజు కదనమునకు రానున్న యంశము గ్రహించి సాటి రజన్యులను సాయము రండని లేఖలు వ్రాసి పంపెను. పలువురు రాజులు బలములతో వచ్చి కటకేశ్వరునకు సాయపడిరి. రాను రాను గటకేశ్వరుని బల మమితమయ్యెను. సోమవర్మ సామంతులలో బలువురు స్వామిద్రోహ బుద్ధితో బ్రత్యర్థులై కటకేశ్వరునకు బలములతో దోడ్పడిరి. బల సంపన్నుడైన కటక పరిపాలకుడు తనస్థితికి సోమరాజుస్థితికి గల వ్యత్యాసము గ్రహించి తానును వెంటనే విజయ భేరి మ్రోగింప భటుల కాజ్ఞాపించెను. నియతకాలమున నిరువురు రాజన్యులు సంగ్రామము నిశ్చయించి కొనిరి. కటకేశ్వరుని బలమంతయు దుర్గమున సురక్షితముగ నుండి సంగరము ఘోరముగ గావించుచుండ (2)సోమరాజు సైన్యము విలయమునకు జంకక పగతుర యంపతాకుల లెక్కచేయక ముందునకు రాదొడ0గెను కొ0త సేపటికి సోమరాజు సైనికలడుగడుగునకు రక్తప్రవాహములన్ కల్పించుచు గోటదరిసి ద్వారముల భేదింప సాగిరి. ధ్రుడతరములగు ద్వారములు పగులవయ్యెను. కోటలో నుండి బురుజుల మిద నుండి ప్రత్యర్ది సైనికులు ద్విగునితొత్సాహముతో నాయుధములతొ సొమరాజు సైనికుల నురుమాడుచుండిరి దుర్గముననుటచే గటకేశ్వరుని సైన్యము సంరక్షితముగ నుండెను. నిలువనీడ లేక బహిరంగముగ నున్న సోమరాజు సైన్యము పలుచ బదెను. అపజయచిహ్నములు సోమరాజునకు సారెకుగానరాదొడంగెను. హితబ్రుందమంతమున్ పత్యర్ధ్యులుగా మారి కతకేశ్వరునకు సాయపడెదరని యతడుకలనైన తలంపడయ్యేను కటకదుర్గము చెక్కు చెదరదయ్యెను కోటలోని సైనికులు నలయంతములు బల్లెములు చేతగొని చుట్టునుమూగియున్న కందారపు సైనికుల నందర జాలవరకు నురుమాడిరి. కటకేశ్వరుడొక యున్నతమగు బురుజనెక్కి సంగ్రామము నంతయుబరిక్షించి సోమరాజుదుర్బలస్థియు సైనికుల వినాశనము నెరింగి వెంటనే తన సైనికులనందర ద్వారములన్ దెరచి బయటకు వచ్చి హతశేషమైయున్న ప్రత్యర్థి సైనికుల ముట్టడింపుడని యాజ్నాపించెను . కాలయమునకు దీసిపోని యా కటకేశ్వరుని భటులు కోటనుండి బయటకు వచ్చి యొక్క మాటు కందార సైనికుల నురుముచేయ సంకల్పించిరి. పరిస్థితులన్నియు విషయముగా నుండుటయు విజయము వ్యతర్దుల యెడ గానవచ్చుటయు దలంచి చేయునది లేక సోమరాజు వెంటనే తన సైన్యమును వ్రుత్యర్దులు ముట్టడింపక ముందే కందారమునకు బోవ నాగ్న్యాపించి విధిలేక తానును మరలి పోయెను. సోమరాజు సైన్యము మిగుల నిరుత్సాహముతో మరలి కందారము త్రోవబట్టెను. జయాపజయములు దైవాధీనములనుట యధార్ధము. కటకేశ్వరుని సైన్యము మిగుల నుత్సాహముతో బయలు వెడలి వచ్చెను. దుర్గము చుట్టును రాసులు రాసులుగ బీనుంగులు నిండిఫోయెను. సోమరాజు, నాతని సైన్యము కందార త్రోవ బట్టినటుల గ్రహించి కటకేశ్వరు డానందించి విజయకేతనము నెత్తించెను. కటకేశ్వరుడు విజయోత్సముల మిగుల

వైభవముతో గావించి తోడిరాజన్యుల గౌరవించి పంపుచు గొలది కాలములో గందార రాజ్యముపైకి దండివెడలవలయుననియు బలములతో సర్వసిద్ధముగ నుండవలయుననియు బేరు పేరు వరుసల సేనాలకు దెల్పి వీడ్కొలిపి తాను సంగ్రామ ప్రయత్నములుగావించు చుండెను. సోమరాజు హతశేషమగు స్వల్ప బలముతో మిగుల విచారముతో నగరము జేరెను. మంత్రులు, పౌరులు, సోమభూపాలున కెదురేగి నమస్కరి0చి గతమునకు విచారి0ప బనిలేదనియు గట కేశ్వరుని వద్ది0ప నుపాయముల నరయుదమనియు ననేక విధముల దెల్పిరి. వీరపత్నియగు సిరియాల దేవి నాయకున కెదురేగి వికసితకునుమదామము క0ఠమున నల0కరి0చి పాదముల గడిగి శిరమున జల్లుకొని రాజన్యా గెలుపోదులు మానుషములు కావు. ప్రయత్నమునకు మాత్రము పురుషకారము కావలయును. క0ట్టమున బ్రాణ మున్న0తవరకు ద్వేషమును మరుమేని విజయము సాది0చుట దుష్కరకార్యము కాజాలదు. అని పౌరుషవాక్యములతో నాయకుని నుద్బోది0చెను. సోమరాజు పరాభవ మెరుగని వీరచూడామణీ. ఆ0ధ్రదేశమును శ0తిమ0తముగ బ్రజానుకూలముగ ధర్మబద్ధముగ బరిపాలి0చిన ధర్మరాజు. కటకముదరి గడి0చిన యవజయ మాతని హ్రుదయమర్మముల భేది0చెను. రాజుమ0దిరమున చేరినదాది యాతని హ్రుదయమును నిట్టిదని నిర్వచి0పరాని విచారము ముట్టడి0చెను. బుద్ధి నిలుకడ దొల0గెను. ఈయా0దోళనములో మని0గి సోమరాజు రాజ్యస్థితిగతుల బరిశీలి0ప మానెను. ధర్మమూర్తులగు మ0తులే విశ్వాసముతో రాజ్యపరిపాలనము నెట్టి లోపము లేకు0డ జాగరూకతతో గావి0పసాగిరి. సోమరాజు చి0తాజ్వర పీడితుడై ఆలోచనా సముద్రమున ముని0గి దారితెలియక తన్నుకొనుచు0డెను. క0దార

. రాజ్యమును మునుముందు బరిపాలింపదగిన వంశాంకురమా లేదు. ప్రత్యర్థియా! బలవంతుడై హృదయ శల్యమువలె బ్రవర్తించుచున్నాడు. ఆందోళనమున స్తబ్ధముగ నున్న యాతనిహృదయము కర్తవ్యము నిర్ణయింప నేరదయ్యెను. కటకేశ్వరు డేనాడెత్తివచ్చునో యను యోచన యతని హృదయమును గలచివేసెను. సిరియాలదేవి తన వీరోచితోపదేశములచే నాతని చిత్తవృత్తి చాలవఱకు సవరించి మఱల సంగరాభిముఖుని గావింప సహస్రభంగుల బ్రయత్నము చేసెను. సోమరా జా వీరపత్ని యుద్బోధనము శిరసావహించి కొంతకాలమున కమితమగు బలమును సమకూర్చుకొని కటకేశ్వరునిపైకి బయలువెడలెను. అంతకుమున్నె కందారమునకు బ్రయాణమగుచున్న కటకేశ్వరుడు మార్గమధ్యముననె సోమభూపాలకుని బలముతో బ్రతిఘటించి పోరాడెను. రెండుమాసము లుభయసైన్యములకు సమమగు సంగ్రామము జరిగెను. ఇరువాగులయందు బేరునకెక్కిన వీరులనేకులు నశించిరి. కటకరాజన్యునకు నాహారవస్తువులు, ఆయుధములు, సైనికులు, కావలసినంత ధనము కటకమునుండి వచ్చుచుండెను. సోమరాజున కట్టి సహాయము తటస్థింపదయ్యెను. కందారము మిగుల దూరముగనుంటచే నటనుండి మంత్రులెట్టి సహాయము నాయవస్థలో రాజన్యునకు చేయజాలరైరి. గ్రహచారవశమున సోమరాజు సైన్యమున కాహారవస్తువులైపోయెను. సైన్యము పలుచబారెను. దేవుడుసైతము ప్రతికూలుడై యపజయఫలము చవిచూప నిశ్చయించెను. మఱల సోమరాజు పరాజయము నొందెను.

జలాశయమున మకరీంద్రుని బల మతిశయించి నటుల స్థానమహత్త్వముచే కటకేశ్వరుని బలము దినదినాభివృద్ధి యగుచుండెను. సోమరాజు పరాజయముతో గృహముజేరి, సంగ్రామముపై జీవితము నాధారపఱచుకొనుట లాభదాయకము గాదని యనుభవముచే గ్రహించి తన రాజ్యమునందలి ధర్మపురి, మంత్రకూటము, కాళేశ్వరము, లోనగు గ్రామములలోనున్న సర్వశాస్త్రజ్ఞులగు బ్రాహ్మణోత్తముల రావించి వారల నందఱ నుచితవిధి గౌరవించి కటకేశ్వరుడు గావించిన గోధనాపరణమును సవినయముగ విన్నవించి గోధనమును మఱల గొనివచ్చి విరోధిని బంధింపగల సత్పుత్రు డేపుణ్యా కర్మములు గావించిన జనించునో యానతిండని వేడుకొనెను. బ్రాహ్మణులు పెద్దయుంబ్రొద్దుయోజించి శాస్త్రముల బరిశీలించి తొల్లి దశరథమహారాజు గావించిన పుత్రకామేష్టివంటి వ్రతరాజము వేఱులేదని విన్నవించిరి. రాజు మిగుల నానందించి వలయు వస్తుసంభారమునంతయు సంగ్రహించి రాజబంధువులను సామంతులను సర్వజ్ఞులగు బ్రాహ్మణోత్తములను రావించి వ్రతదీక్ష వహించి తన ధర్మపత్నితో యాగవేదిక నలంకరించెను. అగ్నిహోత్రుడు సుముఖుడై ప్రజ్వలించెను. ఆ శూలగంధమై మారుతము వీచెను. భూతవ్రాతము సోమభూపాలుని దీక్షకు దానధర్మములకు మిగుల నానందించి స్వస్తి వాచకములు గావించుచుండెను. ఇంత యనరానివైభవమున వ్రతము ముగిసెను. అనంతరము సమాగతులగు

సందఱ నర్హత ననుసరించి సత్కరించి వారి వారిదేశములకు బంపెను. దైవానుగ్రహమున సిరియాల దేవికి నెలమసలెను. పౌరు లాశుభవర్తమానము గ్రహించి రాజ్యమున నెడతెగకుండ నుత్సవములు గావించిరి. సోమరాజు మితిలేని సంతసమున ననేక ధర్మకార్యముల గావించెను. రాజ్యమునందంతటను శభచిహ్నములు నిబిడీకృతములై విరజిల్లెను. శుభప్రదర్శనములచే రాజన్యుడు, పౌరులు పరాజయచింత దిగనాడి భావ్యభ్యుదయ సూచకమగు రాజకుమార జననమునకై యెదురుచూచుచుండిరి. శుభోదయమునకై యెదురుచూచుచుండుటచే రాజన్యుడు, పౌరులు నమత్యాదులు కటకేశ్వరుని వలన రానున్న విపత్తులను లక్ష్యము జేయజాలరైరి. సమయము నెఱింగి వేగువాలండ్రు కందారమునకు భిక్షుకవేషముతో బ్రవేశించి రాజ్యరహస్యములు గ్రహించి కటకమున కేగి సైనికుల విశ్రాంతియు రాజ్యమునగల శుభోదంతము కందారనాయకుని నిర్భీతవర్తనము తమ యేలికకు నివేదించి మఃట్టడికిది మంచిసమయమని ప్రోత్సహించిరి. సంగ్రామ మూహూర్తమునకై యెదురుచూచుచున్న కటకేశ్వరుడు మిగుల నానందించి సైన్యములనన్నింటి ననతికాలమున నాయితము గావించి బలములను సమకూర్చి, కందారరాజ్యము పైకి జతురంగ బలములతో దాడివెడలెను. దురదృష్టవశమున నీ వర్థమానము సోమరాజు గ్రహింపజాలడయ్యెను.అతని బలములన్నియు ననాయత్తములై యుండెను. సంగ్రామమునకు గటకరా జింతస్వల్పకాలములో నెత్తి వచ్చుని యతడెఱుంగడు.

ఆకస్మికముగ నేలయీనినట్లున్న కటకేశ్వరుని సైన్యము కందారమును ముట్టడించి విజయదుందుభి మ్రోగించెను.రాజును మంత్రులు తహతహపడి చేయునదిలేక పౌరులలో గొందఱను నగరసంరక్షణమునకు నియోగించి సిద్ధముగ దైవవశమున హస్తగతముగ నున్న కొలది సైన్యమునుగొని సంగరమునకు బయనమైరి

కటకేశ్వరుని బల మమితముగా నుంటవలనను సోమరాజు సంగ్గ్రామము జరుగునని తలంచి యుండక పోవుటవలనను జయాపజయములు క్షణములో బహిర్గత మయ్యెను. కటకేశ్వరుని సైనికులు విచ్చలవిడిగా విజృంభించి బురుజుల కెగ బ్రాకి ద్వారముల భేదించి పగతుర వధించి యనేక సాహస కార్యాములు గావింప సాగిరి. సోమభూపాలునకు జయముపై నాస తొలంగెను. చేయునది లేక యంతఃపురమున కేగి తన దర్మపత్నియగు సిరియాల దేవిని సందర్శించి జరుగుచున్న సంగ్రామమును గూర్చిన చరిత్రము నంతయు నివేదించి 'వీరపత్ని! నా కడసారి యానపరిపాలింపు'మని వేడుకొనెను. సిరియాల దేవి భర్తృదైన్యవదనము ఖేద మోదములు తాండవింప సందర్శించి 'విధేయురాలనగు నన్ను గూర్చి వేఱ యడుగవలయునా! మీ యాజ్ఞ పరిపాలించుటకు జీవితమునంతయు వ్యయము చేయుదును. ఆనతిం'డని సవినయముగ వేడుకొనెను. కొంతసే పా పుణ్యదంపతులు నిశ్శబ్దముగ నూఱకుండిరి. వారి హృదయములు నిస్తరంగ నీరాకరమువలె శాంతి తరంగములతో నావరింపబడి భావనా ప్రపంచమున లీనమయ్యెను. ప్రత్యర్థు లొనరించు విజయభేరి భాంకారములు స్వీయు లొనరించు హాహాకారములు వారి కాసమయమున వినబడవయ్యెను. ఇంతలో ద్వారమునుండి యొక వీరు డుచ్చైస్స్వరమున "రాజన్యా! ప్రత్యర్థులు పురమున బ్రవేశించినారు. మన సైనికు లడ్డుపడుచున్నారు గాని కృతార్థులు కాజాలరు. అంత:పుర సంరక్షణ మావశ్యకమని మనవిచేయుటకై యరుదెంచితి" నని పల్కెను. అశనిపాతమునకు దీసిపోని యావాక్య మిరువురి సంకల్ప సౌధముల నధోగతము గావించెను. సోమరాజు సిరియాలదేవిని సాదరముగా సందర్శించి వీరపత్నీ! నీవు వీరమాతవు కావలయును. దైవానుగ్రహమున నీ గర్భమునందొక పవిత్ర తేజము ప్రవేశించియున్నది. భారతీయాభ్యుదయమున కది మిగుల దోడుపడగలదని ప్రజలేకాక యస్మదాదులు గూడ విశ్వసించి యున్నారు. ప్రతిపక్షులు కోటలో బ్రవేశించుటకు ముందు నీవాత్మ సంరక్షనము గావించి కొనుట విధి. అపజయము కొలదికాలములో మనల నావరింప నున్నది. మన నోముల పంటయగు నీభ్రూణము కాపాడుకొనుట నీవిధి. ముందు నీ వీయంత:పురమును దాటి విశ్వాసపాత్రులగు భృత్యులగొని దేశాంతరములు చేరుము. ఏచెట్టుక్రిందననేని తలదాచుకొమ్ము. నీగర్భమున జన్మించు శిశువు మన కుభయులకే గాక వంశమున కంతటికి బ్రతిష్టదెచ్చి పరమందు బరాజయ చింతతో నధోలోకమునకు జేరనున్న మన యాత్మలకు శాంతి గూర్చుటకై కతకేశ్వరుని వధింప గలడు. ఇది వేద వేద్దంగవిదులగు బ్రహ్మజ్ఞులలు వాక్య 'మని సోమరాజు తెలిపి యావల మాటలాడలేక పోయెను. సిరియాలదేవి హృదయము తారుమారయ్యెను. శుభచిహ్నముగ భావించి గర్భరణమునుగూర్చి యామె యెంత యానందించెసియిపు డంత విచారపడవలసి వచ్చెను. భర్తతో

సమానముగ బరముజేర ననుకూలమగు సహగమనము గావించుటకు నాయమకు స్వతంత్రము లేదయ్యెను. నిరాశావృత మగు నాయమహృదయదృష్టికి బాహ్యప్రపంచమంతయు నంధకారబంధురముగా గానరా దొడంగెను. మాఱుపలుకక సిరియాలదేవి కనుల నీరుగార్చుచు డల నేలకు వ్రాలినిలిచెను. ప్రేమచ్ఛేదనము మిగుల కృపణ కార్యము. దంపతు లాప్రేమబంధము త్రెంచుకొన లేక చాలసేపు పరాధీనహృదయముతో వర్తించిరి. ఇంతలో ద్వారమున బ్రతికూలసైనికుల యట్టహాసములు వినవచ్చుచుండెను.

సోమరాజు సానకంపముగ బ్రియురాలిని సందర్శించి "యువతీమణీ! సంగరరంగమునకు బోవలసిన తరుణ మాసన్నమైనది విజయముపై నాసలేదు. పగతురచే జనిపోవుట నిశ్చయము. నీ సంతానము కొఱకు బరమందున సైతము నాయాత్మ ప్రతీక్షించుచుండును. సహగమన మాచరింపకుము సుమా!" యని సంగరరంగమున కుఱుకబోయెను. సిరియాలదేవి హృదయము నీరయ్యెను. ఆయమ్మ కనుగొలకులనుండి వేడి వేడి యశ్రువులు రాలుచుండెను. పెదవి కంపింపసాగెను. శోకావేశభరమున బ్రియుని గాఢముగ గౌగిలించుకొని మైమఱచెను. వీరకర్మమున కుఱుకనున్న సోమరాజు కూడ జాలసేపు స్తబ్ధుడై యూఱకుండెను. తరువాత నంతరాత్మచే బ్రబోధితుడై పరవశురాలైన ధర్మపత్నిని మెల్లంగ వదలి రణరంగము ప్రవేశించెను. సోమరాజు సంగరరంగమున బ్రవేశించుటగాంచి ద్విగుణీకృతమగు సాహసముతో భటులు, మంత్రులు, పౌరులు వీరావేశమున ముందునకు దుమికిరి. తిమింగిల సంచలనముచే సముద్ర మాక్షోభించునటుల గటకేశ్వరుని సైన్యము సోమభూపాలుని సైన్యపు దాకిడికి గలగిపోయెను. అసంఖ్యాక పదాతి పరివేష్టితమగు కటకే కటకేశ్వరునకు బ్రబలప్రత్యర్థినియగు నీసిరియాలదేవి నెవరు చేరదీసి యవస్థలపాలగుట కియ్యకొందురు? అభిమానమువదలి కటకేశ్వరుని శరణుగోరుట కాయమపవిత్రహృదయ మంగీకరించునా ? సత్సంతానార్థియగు సోమరాజుమాత్రము తన ధర్మపత్ని కట్టియాజ్ఞ యొసంగలేదు. సిరియాలదేవికి దలదాచుకొన నెలవు కానరాదయ్యెను. ఎఱుకురాజను పరాక్రమశాలి పరిపాలించు హనుమకొండ కేగిన బ్రతుకవచ్చుగదా యని పరిచరులను వెంటగొని మాఱు త్రోవలబట్టి కొలది కాలమువకు హనుమకొండ జేరెను.

పరిచారకు లిరువురు సిరియాలదేవి నొకపాడుపడిన దేవళముచెంత నుంచి తా మెఱుకుదేవరాజు చెంతకేగి కటకేశ్వరుని దురంతమునంతయు నివేదించి గర్భభారాలస యగు సిరియాలదేవి కాశ్రయము నొసంగవలయునని సహస్రభంగుల బ్రార్థించిరి. సహజభీరువగు నెఱుకురాజు కటకేశ్వరుని ధాటికి వెఱచి తన రాజ్యమున నాయమనుంచుకొన వీలుకాదని ఖండితముగ బోధించెను. పరిచారకులు మిగుల దైన్యముగనున్న యామ జీవితచరిత్రము నంతయు నివేదించి ప్రసూతి పర్యంతమైన నిలువనీడ నీరాజ్యమున నొసంగుమని వేడికొన విధిలేక సోమరాజువలన దానొందిన లాభముల స్మరించికొని యంత:పురములో నుండ వీలుగాదనియు గ్రామములో నెచటనేని జీవితము గడుపుకొనుచో నభ్యంతరము లేదనియు నెట్టకేల కంగీకరించెను. పరిచారకులు సిరియాలదేవికి జరిగిన వృత్తాంతము నంతయు నివేదించి యామెను బ్రాహ్మణవీధికి జేర్చిరి. గర్భభారముననను గమనాయాసముననను గృశించి నడువలేక నడువలేక నడచుచున్న యాసీమంతిని విప్రవాటికలో బ్రవేశించి బ్రాహ్మణోత్తముల నందఱ వేఱు వేఱు సందర్శించి తన దీనచరిత్రమునంతయు నివేదించి పరిచారకురాలిగనేని యుంచికొని పట్టెడన్నము బెట్టుడని సవిచారముగ బ్రార్థించెను. రాజువలన నెట్టి మాటవచ్చునో యని యెవరు నాయమ కాశ్రయము నొసంగరైరి. కడకు మాధవశర్మయను నొక బ్రాహ్మణుడు దయదలంచి యాయమను దన గృహమునజేర్చి గృహిణిచే నాయమ కాహారాదికముల గాలానుకూలముగ నొసంగ జేయుచు మిగుల ననురాగముతో భక్తివిశ్వాసములతో దానును విచారించుచుండెను.

సిరియాల దేవికష్టము లొంతతో నంతరింపలేదు. 'తగిలిన కాలే తగులును, నొగిలినకొంపయే నొగులు' నన్నటుల నాయమనాపదలు మఱల మఱల జుట్టుముట్టెను. కటకేశ్వరుడగు బల్లహుడు కందారరాజ్యము నాక్రమించి సోమరాజును తదకు అనుచరులను బంధించి యంత:పురము ప్రవేశించి రాజ్ఞికొఱకు వెదకెను. ఆయమ గర్భమందు దైవాంశసంభూతు డభివృద్ధి నొందుచున్నట్లును నాతడు తన కేనాటికైన మారకుండనియు వినియుంటచే గరవాలముతో నాగర్భము ఛేదింపనులకించి యంత:పురము నంతయు గాలించెను. ఆతనికి నిజవర్తమానము తెలియదయ్యెను. రాణివాసమునందున్న పరిచారికలు ఘోరమగు మరణమునకు నియ్యకొనిరిగాని

రాజ్ఞి యుదంతము బహిర్గతము గావింపజాలరైరి. కడకు బ్రాణభయము వలననో దురాశవలననో సిరియాలదేవి హనుమకొండ కేగినదని కొందఱు పౌరులు నివేదించిరి. విజయకేతనము స్థాపించి కొందఱు సైనికుల గందార రాజ్యముననుంచి రాజ్యము జాగరూకతతో సంరక్షింప నియోగించి, తాను సపరివారముగ సిరియాలదేవి కొఱకై యన్వేషించుచు హనుమకొండకు జేరి పురసమీపమున విడిసి యెఱుకురాజునకు 'మీపురంబున సిరియాలదేవి యున్నటుల రూఢిగా దెలిసినది ఒసంగుదువా! లేక సంగ్రామమునకు వత్తువా!' యని తన భటులచే బల్లహుడు వార్త పంపించెను. భయకంపితుడై యెఱుకరాజు మిగుల జంచిలించి సిరియాలదేవిని నేనెఱుంగననియు రాజధాని నగరమున నెటనైన నున్న మీపరిచారకులచే వెదకించి బంధించుచో నా యభ్యంతర మేమాత్రము లేదనియు నేనట్టి ద్రోహకార్యముగావించి యేలిక యాగ్రహమునకు బాత్రుడగాననియు బల్లహునకు వెంటనే వార్తపంపెను.

ఎఱుకరాజు నిర్దోషియనియు సిరియాలదేవికి దనకై తా నాశ్రయము నొసంగి యుండడనియు బల్లహుడు నిశ్చయించెను. అంత:పురములో నుండి సంగ్రహించి తెచ్చిన సిరియాల దేవి ప్రతిచ్ఛందము బల్లహుడు తనభటుల కొసంగి 'యిట్టి యాకారవిశేషములు గల యువతీమణి యాపురమున నున్నది. రాజమందిరములు, రచ్చకూటములు, బ్రాహ్మణ గృహములు, పఠనమందిరములు పరిశీలించి యెటనేని యున్నచో బట్టితెచ్చిన యెడల గొప్ప పారితోషికము నొసంగుదు'నని బల్లహు డాజ్ఞాపించెను.

ఎఱుకరా జాత్మ సంరక్షణము నాశించి యంతకు మున్నె చనువు నొసంగిన వాడగుటచే బ్రతిబింబపటము గొని బల్లహుని భటులు స్వేచ్ఛగ సిరియాలదేవి కొఱకు వీధులన్నింటిని గాలించిరి. ఎట గూడ వారు తలంచిన కాంతామణి కానరాదయ్యెను. తుదకు భటులు మాధవశర్మ గృహమున బ్రవేశించి యనుమానాస్పదముగ నున్నదని సిరియాలదేవిని బంధించి బల్లహుని యొద్దకు గొనిపోయిరి. భయకంపితురాలై సిరియాలదేవి గడగడ వడకుచు విలపించు చుండెను. బ్రాహ్మణవాటిక లోని పిన్న పెద్దలందఱు నటజేరి యాతరుణ విలాసమును జూచి నిలువున నీరైరి. రాజభటులు నిర్దయులై యామెను రచ్చకీడ్చి లాగికొని పోవుచుండిరి. ఇంతలో ననుష్ఠానవేదిక నుండి లేచి విష్ణుశర్మ ముందునకు వచ్చి రాజభటుల జూచి "అక్కటక్కటా! యెందేని యీయన్యాయము కలదా! ఈయమ నాపుత్రి. గర్భవతియగుటచే మొన్ననే కొనివచ్చితిమి. బలవంతముగ లాగుకొని పోవుచుంటిరా? మీకు న్యాయము వలదా?" యని కఠినముగ మందలించెను. నివ్వెఱపోయి చూచు చున్న బ్రాహ్మణాంగన అందఱు బ్రాహ్మణ హింసవలన మీరాజకుటుంబము రూపుమాయ గలదని శపింప సాగిరి. భటులు చెంతగల ప్రతిచ్ఛందముతో సిరియాలదేవి యాకృతిని నొకమాఱు పోల్చిచూచి మాఱు మాటాడక యాయమను లాగికొని పోవుచుండిరి. ఆగర్భశ్రీమంతురాలు, ఆసన్నప్రసవ-సుకుమారీ మణి, యగు సిరియాలదేవి దుస్థితికి బిల్లలు గలవాడును దయాశాలియు నగు మాధవశర్మ మిగుల విచారము నొంది బల్లహుని కంత్య కాలమునకె యిట్టిబుద్ధులు పుట్టుచున్న వనుచు జూచు చున్న బ్రాహ్మణ బ్రాహ్మణీ జనమును వెంటగొని యూరిబయట విడిసియున్న బల్లహునిపాలికి బోయెను.

దూరమునుండి బ్రాహ్మణ బృందము సంభ్రమముతో వచ్చువిధము గాంచి బల్లహుడు లేచి పూర్వాచారానుగుణముగ వారి కెదురేగి నమస్కరించెను. మాధవశర్మ యావందనము పరిగ్రహింపక కోపరక్తాక్షుడై 'బల్లహ రాజన్యా నీ యధర్మములు కడుపు లోని చల్ల కదలకుండ ఎఱుకరాజు ధర్మ పరిపాలనములోనున్న హనుమకొండ పౌరుల పని గూడ బ్రవర్తింప జేయ వలయునా! ఇంద్రుడు లీలావతిని లాగికొని వచ్చునటుల నేపాపము నెఱుంగని నా యేకపుత్రికను దుర్మార్గులగు నీభటులు లాగికొని వచ్చు చున్నారు. గర్భభారాలస యగు నాయమ మిగుల విచారము నొందుచున్నది. బ్రాహ్మణబృంద మంతయు నీఘోరకార్యమునకు చింతించుచు నెట్లు గుంపులుగ వచ్చు చుండెనో చూడుము. హృదయము లందఱకు రగులుకొనుచున్నవి. సాధుఘోష తగులక మానదు. దూరము యోచించి కీర్తి ప్రతిష్ఠల నిలువ బెట్టుకొని పాపాత్ము లగు భటుల దండించి నాపుత్రిక నొసంగుము లేదా మేమందఱము ప్రాయోపవేశము గావించి యిటనే సంఘమరణము నొందుదుము. భారతఖండమున నీ యపకీర్తి చిరస్థాయి కాగల దని మేఘ గంభీర స్వరముతో బలికెను. ఇంతలో భటులు సిరియాలదేవిని బల్లహుని చెంత నిల్పి ప్రతిచ్ఛందము నొసంగిరి. బల్లహుని కేమియు దోపదయ్యెను. బ్రాహ్మణుల కోపోక్తులు శ్రవణదారణములై చెలంగెను. సిరియాలదేవి

శిరమువంచుకొని మొగమున గుడ్డ వైచుకొని విలపించెను. ఆసాధ్వీమణి పాపకర్ముఁడగు బల్లహుని కడకన్నులతోనైన జూడమానెను. బల్లహుడు ప్రతిచ్ఛందము లోని యాకృతితో సిరియాలదేవిని బోల్ప వీలుగాదయ్యెను. బ్రాహ్మణుల ఘోష మిన్ను ముట్టెను. యత్తరుడై కటకేశ్వరుడు నిలువబడెను.

సిరియాలదేవి మిక్కుటముగా విలపించు చుండెను. ఆయమ దీనవదనము బ్రాహ్మణోత్తముల పట్టుదలను మిగుల నభివృద్ధి పఱచెను. బల్లహుడు కొంచెము సే పాలోచించి బ్రాహ్మణుల వాక్యముల భటుల వాక్యముల నాలించి నిశ్చయము తేల్చుకొనజాలక భూసురులం గాంచి 'యీయమను బ్రాహ్మణి యనుచుంటిరిగదా! సమీపముననున్న సిద్ధేశ్వరుని సమ్ముఖమున నీయమ పెట్టునాహారమును భుజించెద రేని మీమాట విశ్వసింతు' ననెను. యుక్తిశాలియగు మాధవశర్మ బల్లహునితో 'రాజన్యా! అది యొక గొప్ప పరీక్ష కాదు. సర్వసిద్ధముగ నున్నారము. కాని యీయమ గర్భవతి. గర్భవతి యొసంగు పక్వపదార్థముల బుచ్చుకొనుట బ్రాహ్మణ ధర్మములకు విరుద్ధము. మతమునకు వ్యతిరేకముగ నడువ వలయునని కూడ మీయభిమతము గాదు గాన యుపాయాంతరము నెఱిగింతు రేని యటులె యొనరింతు' మని విన్నవించెను. శాస్త్ర బద్ధముగనున్న మాధవశర్మమాటలకు బ్రత్యుత్తరము జెప్పజాలక బల్లహుడు కొంచెముసేపు యోచించి యీమె యొసంగు నుచ్ఛిష్టమగు క్షీరమును సిద్ధేశ్వరాలయమున బుచ్చుకొందురేని బ్రాహ్మణిగా భావించి వదలుట కెట్టి యభ్యంతరము లే' దని తెల్పెను. బ్రాహ్మణులు మిగుల సంతోషించి యనాచార జన్మమగు కిల్బిషమును దమ తపోమహిమచే బోగొట్టు కొనవచ్చునని నిశ్చయించి యందుల కియ్య కొనిరి. బల్లహుడు చూడకుండ సిరియాలదేవి శిరోవకుంతనముచే ముఖము నాచ్ఛాదించికొని పదార్థమును బ్రాహ్మణ జనమునకు వడ్డించెను. వారలందఱు నిరాటంకముగ నమృత మస్తని యా పదార్థమును స్వీకరించి సిరియాల దేవితో నిజ గృహములకు వెడలిపోయిరి.

బల్లహునిహృదయశల్య మటులనె యుండెను. సిరియాలదేవి గర్భస్థశిశువు తనమారకు డని యాత డాగతానాగతవేదుల వలన వినియుండెను. అందుచే బల్లహునకు సిరియాలదేవిని గుర్తించి బంధింపలేక పోతినేయను విచారము మెండయ్యెను. రాజభటులు సిరియాలదేవి యీమెయే యని చెప్పుచున్నను బ్రాహ్మణ శాపమునకు భయపడి బల్లహుడు చేత జిక్కిన యువతిని బుద్ధిపూర్వకముగ వదలిపెట్టెను. ఆయమ సిరియాలదేవి యని నిర్ణయించుటకు జాలి నన్ని యాధారము లాతనికి లభింప వయ్యెను. మాధవశర్మ తన కూతురనియు బ్రసూతికి వచ్చెననియు ఱాయిగ్రుద్ది వాదించు చుండ నాయమయే సిరియాలదేవి యని బల్లహుడెటుల సాహసించి వాకొనగలడు! సిరియాల దేవి బహుశ: సహగమనము గావించియుండు నేమో యనుకొని వెదకి వెదకి వేసారి కొలది కాలమునకు బల్లహుడు కటకము చేరెను.

పులినోటనుండి లేడికూన బయట బడినటుల దైవవశమున బల్లహునిబారినుండి సిరియాలదేవి బయటబడిన వెంటనే మాధవశర్మ యామెను మిగుల సంతోషముతో దవ యింటికి గొనిపోయి యధావిధి సుత నిర్విశేషముగ దిలకించుచుండెను. సాటి బ్రాహ్మణులందఱు హర్షించి సహస్ర హస్తములతో సిరియాలదేవి కుపచారములు గావించుచుండిరి. గ్రహములన్నియు శుభస్థానములయందున్న యొకానొక పవిత్రసమయమున సిరియాలదేవి కొక మగచిన్నవాడు జనించెను. మాధవశర్మ మిగుల బ్రేమతో జాతకకృత్యములన్నియు నిర్వర్తింపజేసి యొక సుముహూర్తమున నామకరణ మహోత్సవము గావింప సంకల్పించెను. సిరియాలదేవి మాధవశర్మను సందర్శించి వందనమాచరించి, "ఆర్యా! మీరు నాకు బితృసములు. నేను సుతవతినై భర్తృసందేశమును బరిపాలింప గలుగుట మీ యాశ్వీరచన ప్రభావముననే, దైవమైనను దేశికుడైనను మీరేకావున నాతనయునకు మీ పవిత్ర నామము గలసివచ్చినటుల మాధవవర్మ యని నామకరణము గావింతురేని నామస్మరణముచేతనైన గృతజ్ఞత వెల్లడించు కొందునని సవినయముగ విన్నవించెను. మాధవశర్మ యెట్టకేల కంగీకరించి యుత్తమోత్తములగు బ్రాహ్మణుల రావించి యాకుమారునకు జాతకర్మలన్నియు విధిచోదితముగ నిర్వర్తించి మాధవవర్మయని నామకరణము గావించి యందఱచే నమోఘాశీర్వాదములం జేయించెను. శుక్లపక్ష క్షపాకరుని మాడ్కి యాకుమారుడు దినదినప్రవర్ధనమానుడై యుంట గాంచి పుత్ర పుత్రికాశూన్యుడగు నా బ్రాహ్మణోత్తముడు మిగుల గౌరవముతో జూచుచుండెను. దైవానుగ్రహమువలన మాధవశర్మ

యమోఘాశీర్వాద ప్రభావమున గుమారుడు వర్ధిల్లసాగెను. మాధవశర్మ కుమారునకు స్వయముగా నైదవయేట నక్షరాభ్యాసము గావించెను. మేధాశాలియగు నాకుమారుడు మిగుల బుద్ధికుశలతతో స్వల్పకాలములోనె సర్వశాస్త్రములు పఠించెను. అమోఘ విద్యాధురీణుడగు మాదవశర్మ బోధన మహిమచే మాధవవర్మ కొన్నికొన్ని శాస్త్రములలో దేశికునకుసైతము సందేహములు తీర్ప సమర్థుడయ్యెను. సమయానుసారముగ గరిడిసాలలకేగి లక్ష్య విద్య నేర్చెను. వ్యూహనిర్మాణము, దుర్గభేదనము, కవచధారణము లోనగు సంగ్రామరహస్యములు స్వయముగానే యాతడు నేర్చికొనెను. హనుమకొండ పురముననున్న దేవళములలో బద్మాక్షి దేవ్యాలయము ప్రశంసా పాత్రమైనది. పద్మాక్షిదేవి ప్రత్యక్షదేవత, ఆయమ యనుగ్రహముచే నభీష్టసిద్ధి నొందని పౌరులులేరు. దూరదేశవాసులు సైత మాయమ యనుగ్రహము నపేక్షించి యాలయప్రాంతమున దవముగావించు నాచార మాకాలమున గలదు. మాధవవర్మ మాధవశర్మవలన నుపదేశమైన మహా మంత్రరాజములు పురశ్చరణము గావించుటకై శైలమేఖలయందున్న పద్మాక్షీ నికేతనమున కేగి నిత్యము గొంతకాలము కాలక్షేపము జేయుచుండెను. స్థిరసంకల్పము గల మాధవవర్మ యొకనాటి సాయంత్రము యధావిధి పద్మాక్షీసముఖమున కొకడ యేగి ధ్యానమున మైమఱచెను. ఆకసమునిండ మేఘములాక్రమించి భూనభోంతరములు జల ప్రవాహములతో నిండిపోవునటుల పెద్దవర్షము వచ్చెను. దిక్కటాహము లంధకార బంధురమయ్యెను. మాధవవర్మ యాప్రదర్శనములకు భయపడక నాటిరాత్రి యంతయు పద్మాక్షీ సమ్ముఖముననే గడుప నిశ్చయించి బీజాక్షరసంయుక్తములగు మహామంత్రముల మేఘరవము శ్రుతిజేసికొని పఠింపదొడంగెను. ధ్యాన నిశ్చలుడగు మాధవవర్మ హృదయస్థిమితమును బ్రళయకాల ఘనాఘన గర్జనములు గాని యేకాంతవాసము గాని భీమాంధకారస్తోమము గాని చలింప జేయ లేకపోయెను.

సమీపమున గుహలన్నియు జనస్తోమముచే నిబిడీకృతములై యుండెగాని స్థిరబుద్ధితోనున్న మాధవవర్మ కాయరిము తెలియదు. తెలిసికొనవలసిన యావశ్యకము సైతము లేదు. ఆవీరుని స్థిరబుద్ధికిమెచ్చి పద్మాక్షీదేవి ప్రత్యక్షమై "కుమారా! నీతపమున కానందించితిని. నీస్థిరదీక్షకు మెచ్చికొంటిని. నీవు బాల్యమునుండియు బ్రాహ్మణధర్మముల యందాఱితేఱిన మాధవశర్మ గృహమున బెఱిగియుంటచే సహమగు క్షత్రియధర్మములయందు బరిశ్రమ గావింపకున్నాడవు. నీజనకుడు బల్లహునితో బోరాడి రణరంగమున నిహతుడయ్యెను. జననియగు సిరియాలదేవి నా నావస్థకులోనై తన వేకటిని గాపాడుకొని పసివాడగు నీక్షేమము నపేక్షించుచు బరులపంచలలో బడియున్నది. స్వరాజ్యమగు కందార మున కీవేగనర్హుండవు. ఇదిగో ఖడ్గఖేటంబులను స్వీకరింపుము. దివ్యాయుధములగు వీని సహాయముచే నీవు విశాలమగు రాజ్యమును బాలించి పితృరాజ్యమును హరించిన కటకేశ్వరుని వధింపగలవని యానతిచ్చి యంతర్ధానమయ్యెను.

మాధవవర్మ యపరమితానందభరితుడై యాఖడ్గఖేటకముల బరిగ్రహించి దేవీమూర్తికి బున:పున:ప్రణామముల నాచరించి యాలయమును వదలి బయటికి వచ్చెను. విశాలాకాశమున నావరించిన జలదములు విచ్చిపోయెను. సోముడాకాశమధ్యభాగమున బ్రకాశించుచుండెను. అవ్యక్తస్వరములతో గీటకములు రొదచేయుచుండెను. కల్మషజలముచే నావరింపబడిన పల్వలములలో జంద్రునికిరణములు ప్రతిఫలించి యమోఘకాంతి నిస్తంద్రములై యలరారుచుండెను. మనోహరమగు నాప్రకృతిప్రపంచమును సవిమర్శముగ దిలకించుచు బద్మాక్షియనుగ్రహమునకు మిగుల నానందించుచు నట విశ్రమించెను. సమీప గుహాముఖమునుండి మనుష్యసంభాషణము వినవచ్చెను. మాధవవర్మ యదియు బద్మాక్షీమాహాత్మ్యముగా నూహించి యభయకరములగు నాయుధఖేటకములను గొని యా గుహాముఖమున బ్రవేశించి నలుగెలంకుల దిలకించెను. ముందు కొందఱు గుంపుగా గూడియుండిరి. మాధవవర్మ వారినిజూచి "మీరెవరు? ఇటకు రాగతమేమి?" యని ప్రశ్నింప వారలందఱు తాము కందార వాస్తవ్యులమనియు సోమదేవుడు గతిం చుటవలనను రాజ్యము కటకేశ్వరుని యధీనమగుట వలనను మి గుల శ్రమలొంది దిక్కుచెడి వలసపోవుచుంటిమనియు, వర్షము వచ్చుటచే నిట విశ్రమించితిమనియు నివేదించిరి. మాధవవర్మ వారు తెలుపు నంశములకు మిగుల నానందించి తన వృత్తాంతము వారల కెఱింగించి వలసపోవ నవసరము లేదనియు స్వల్పకాలమున నేను రానుంటిననియు నంతదనుక మాతృభూమినెటులో కాపురము చేయుడని ప్రబోధించెను. నశించినదనుకొనిన రాజవంశము నిలిచినందులకు, రాజకుమారుని పరిపాలనమున దాము సుఖముల నొందగలిగినందుల కాపౌరు లానందించి బల్లహుని ధుష్టపరిపాలనమునుండి

విముక్తియగు సుదినముకొఱకు సహస్రభంగుల దపము గావించుచు నావార్త సహచరులకు విన్నవింప నిజపురమున కేగిరి.

ప్రతాపచరిత్రమున నీయంశ మించుక మార్పుగ నీక్రింది విధముగా గలదు. పద్మాక్షీదేవి ఖడ్గఖేటకంబుల నొసంగి మాధవవర్మను సప్రేమంబుగ దిలకించి "కుమారా ఈయాయుధంబులు నీయొద్దనున్నచో బ్రత్యర్థులు నిన్నెదిరింపజాలరు. ప్రతిసంగ్రామంబున నీదివ్యాయుధముల సహాయమువలన విజయము చేకూర గలదు. చెంత నీశైలమున నొక గుహ కలదు. అందు నీవు ధైర్యముగ బశ్చిమ దిక్కునకు బొమ్ము. మధ్య కలుగు విఘ్నముల నించు కేని పాటిచేయ కుము. అట నీకు జతురంగ సేనలు లభించును. వాని సహాయముతో ననాయాసముగ బ్రతిపక్షుల జయించి రాజ్యాభివృద్ధిగావించు కొనుము. సంపదలు హెచ్చినకొలది నడకుప వృద్ధిజేసికొనుము. ఔదార్యమును ప్రతముగ గ్రహింపుము. లక్ష్మీనారాయణ పూజయు నుమామహేశ్వర పూజయు గోబ్రాహ్మణభక్తియు నాచరణీయ ధర్మములు. పరదారాపేక్షయు, నసత్యసంభాషణము వర్జించి యెంతకాలము వర్తింతువో యంతవఱ కీదివ్యాయుధములు వాంఛితము లొసంగుచుండు"నని పద్మాక్షీదేవి యానతీయ వెంటనే మాధవవర్మ గుహలో బ్రవేశించెను. ప్రతిభావతి యగు పద్మాక్షీదేవి ప్రభావము వలన మాధవవర్మ కామార్గమంతయు గంటకమయముగ గంపించెను. దానిని బాటిచేయక సాహసముతో ముందడుగు వేసెను. భూతప్రేత పిశాచ శాకినీ డాకి న్యాదిగ్రహసము దాయము భయంకరముగ ముందు గనుపించెను. వ్యాఘ్ర సింహ మాతంగ సర్పాదులు మార్గమున నావరించి యున్నటుల బొడకట్టెను. గుహాంతరము మాఱు మ్రోగునటుల భయంకర ధ్వానములు సారెసారెకు వినబడెను. ప్రతిపదమున కేదియో భయంకరమగు విఘ్నము తోచెను. వీరచూడామణియు ధైర్యశాలియు నిశ్చలచిత్తుడు నగు మాధవవర్మ యంత రాయముల నించుకేని పాటి సేయక యొక జామునే పాగుహాంతరాళమున బ్రయాణము చేసెను. మం దొక కలకలము వినవచ్చెను. మఱికొంతదూర మటులె సాహసముతో జనుదేర వీరుల సింహ నాదములు, గజబృందముల ఘీంకారములు, తురంగముల హేషలు, కాహళ మృదంగభేరీ గోముఖాది వీరాంగనినాదములు ప్రళయకాల కాలాంభోధర గర్జాసన్నిభంబులై వినబడెను. అంతలో దెల్లవారెను. దట్టముగ గందరమందిరమున బెనగొన్న చీకటులు పలుచబడెను. బాలభానుని రక్తకిరణములు కంద రాంతరమున వసంతము జల్లుచుండెను. మాధవవర్మ యా యమకాల విభవమును జూచి యానందించుచు మిగుల నుత్సాహముతో నింక గొంత దూరము నిర్గమించెను.

ఒక విశాలమగు స్థలమున నఱువదివేల మదగజములు, పండ్రెండులక్షల తురంగములు, పదునేడు లక్షల పదాతీ వర్గము మూకగ నుండెను. సేనానాయకుడు దివ్యాంబరంబులతో సువర్ణరాసులతో నిండిన యొక గుహద్వారమున శిలపై నాసీనుడై యుండెను. మాధవవర్మ యటకు బ్రవేశించెను. వెంటనే కరములు ముకుళించి పదాతులందఱు మాధవవర్మ కంకితులైరి. సేనానాయకుడు నమస్కరించి మాధవవర్మను సమీపించి "రాజకుమారా! పద్మాక్షీదేవీ యనుగ్రహమునకై కలకాలమునుండి యిట వేచియున్నారము. మానోములు ఫలించినవి. ఆయమ యాజ్ఞ యిచ్చిన మాధవవర్మ నీవే కానోపు. ఈ బలమునంతయు నీ యధీనము గావించుచున్నాడను. ధనకనక వస్తువాహన విశేషంబుల యధావిధి వినియోగించి అనుమకొండలో సామ్రాజ్య మొండు స్థాపింప వలయు" నని యాతండు తెలిపి యంతర్హితుండయ్యెను.

మాధవవర్మ దైవదత్తమగు నీ బలముతో బయలువెడలినటుల బ్రతాపచరిత్రమున గలదు. ఇది యమానుషమని కొందఱు విశ్వసింపరేమో! ఎటులైననేమి పద్మాక్షీదేవి యనుగ్రహాతిశయమువలన మాధవవర్మకు జతురంగబలము లభించెను. వెంటనే మాధవవర్మ బయలుదేరి బలము లన్నింటిని హనుమకొండ గవనియొద్ద నుంచి వారి కాహారాదికములకు వలయు నేర్పాటులు గావించి తా నొక్కరుండ గృహమున కరిగెను.

కొమారుండు రాత్రినుండి కాన రాకుంటచే సిరియాల దేవి యేమియు దోచక విచారసాగరమున మునింగియుండెను. మాధవశర్మయు నాతనిధర్మపత్నియు నాయమకు హితము నెఱింగించుచు గుమారుం డచిరకాలంబున రా గలండని యోదార్చుచుండిరి. పెంచిన కారణంబున సిరియాల దేవికంటె వీరిరువురు లోలోన బరితాపమునొందుచు గుమారుడు రామికి హేతువు లనేకవిధముల నూహింపసాగిరి. ప్రత్యర్థు లెవరేని బాలుని గడతేర్చిరేమో యను భయ మా మువ్వురిహృదయముల గలచి వేయుచుండెను. ప్రపంచ మంతయు వారికంధకారబంధురముగ

శోకభూతమునకు నృత్యాగారముగ గానుపించెను. ఇంతలో మాధవవర్మ యటకు జనుదెంచి దేవీప్రదత్తములగు ఖడ్గఖేటకముల నొక వేదికపై నుంచి తల్లికి, మాధవశర్మకు, నాతని ధర్మపత్నికి నమస్కరించి రాత్రి తాను రాని కారణము తెలిపి పద్మాక్షీదేవి యనుగ్రహించిన యాయుధరాజముల వారికింజూపి గతరాత్రి కథాంశము లన్నియు బూసగ్రుచ్చినటుల వారికి విన్నవించెను. విద్యుద్వేగమున నీయంశమంతయు నగరము నలుగెలంకుల నెగబ్రాకెను. జనులంద ఱీ యంశము నాలకించి కుమారుని శక్తి సామర్థ్యములకు నచ్చెరువొందిరి. క్రమముగ నీవార్త హనుమకొండ రాజ్యము పరిపాలించు నెఱుకుదేవరాజుచెవి సోకెను. చిరకాలముక్రింద నాయన అనుమకొండకు సిరియాలదేవి యేతెంచి యాశ్రయము కోరుటయు బిమ్మట బల్లహుండు దండయాత్ర కరుదెంచి సిరియాలదేవిని వెదకించుటయు మాత్ర మెఱుగునుగాని పుత్రోత్పత్తియు నాపుత్రుని శక్తి సామర్థ్యము వినలేదు. కుమారుని యమోఘశక్తి సామర్థ్యములు వినగనే యెఱుకుదేవరాజు హృదయము సంచలించెను. అనుమకొండ రాజ్యమును బడయుటకై దేవిసన్నిదిని వరములు పొందివచ్చిన మాధవవర్మను శరణు గోరుటకంటె దనకు గత్యంతరము లేదని యాతడు నిశ్చయించికొని కర్తవ్యము నాలోచించు సమయమున నచ్చటికి జారు లేతెంచి 'నగర ద్వారమున మాధవవర్మయను రాజకుమారుడు బలములతో విడిసి యున్నాడు. నేల యీనినటుల జతురంగ బలములు కాన వచ్చుచున్నవి. ఏలిక కెఱిగింపవచ్చితి' మని విన్నవించిరి. ఎఱుకరా జున్నతమగు హర్మ్యము నెక్కి గవని యొద్దనున్న బలము నంతయు సందర్శించి దేవతావరప్రసాద విజయలక్ష్మీ పరిష్వంగు డగు మాధవవర్మకు విధేయుడై రాజ్యము నొప్పగింప కున్నచో నెంతటి రాజన్యు డేని మానుషము నిలుపుకొన జాలడని నిశ్చయించెను. గూఢాచారులు సత్వరముగ నేతెంచి 'చతురంగ బలములతో ద్వారముచెంత విడిసిన మాధవవర్మ యను రాజపుత్రుండు భట్టాచార్యుం డగు మాధవశర్మగృహమున కేగెను. ఏలిక కెఱింగింప వచ్చితి' మని విన్నవించిరి. వెంటనే యెఱుకు దేవరాజు సర్వబలముల నాయిత పఱచి మంత్రి సామంతరాజ బంధు పరివృతుండై యుచిత వాహనంబు నెక్కి మాధవశర్మగృహమునకుం బయనం బయ్యెను. పౌరు లందఱు రాజన్యుని ప్రయాణమును గూర్చి పలువిధముల దమలో దాము తలపోయు చుండిరి.

భటులుచూపిన మార్గము ననుసరించి యెఱుకుదేవరాజు మాధవశర్మ గృహద్వారమున మదమాతంగమును డిగ్గి మంత్రి సామంతాదులతో గృహాంతరమున కేగి మాధవశర్మను, నాతని ధర్మపత్నిని, సిరియాలదేవిని, గోటిసూర్యప్ర కాశుడగు మాధవవర్మను సందర్శించి యట నాసీనుడయ్యెను. వైదికాచార పరాయణుడగు మాధవశర్మ యెఱుకుదేవరాజు తన గృహమున కరుదెంచుట తలంచి కుమారునకైనను దనకైనను నింతయనరాని సేగిమూడి తీఱునని నిశ్చయించుకొని దైవసంకల్ప మమోఘము గనుక చేయునది లేదని యనుకొనెను. సిరియాలదేవియు బ్రాహ్మణియు గుమారునకు దైవమెట్టి యాపత్తుల గూర్ప సంకల్పించెనో పరిపరి విధముల విచారము నొందుచుండిరి.

ఎఱుకదేవరాజు దేవీదత్తఖడ్గఖేటకములతో బ్రకాశించు మాధవవర్మను సమీపించి పాదములపై సాష్టాంగ ప్రణామము నాచరించి చేతనున్న వజ్రహారము నాతని కంఠముననిడి "రాజపుత్రా! పెద్దవాడనైతిని. చిరకాలము రాజ్యము పరిపాలించి తనిసితిని. పుత్రపుత్రికా సంతానము లేమింజేసి యీరాజ్యము నెవరికి సమర్పింప వలయునాయని కలకాలము నుండి యోచించుచుంటిని. నాకాంక్ష ఫలించెను. అనుమకొండరాజ్యలక్ష్మి యిప్పటికి గృతకృత్యురా లయ్యెను. రాజ్యలక్ష్మి వెదకుకొనుచు నీసన్నిధికి జనుదెంచినది. అనుమకొండ రాజ్యమును వందనపూర్వకముగ నీకు సమర్పించుచున్నాడను. దయచేసి పరిగ్రహింపు'మని సహస్రభంగుల వేడుకొనెను. మాధవశర్మ యనుమతి ననుసరించి మాధవవర్మ యందుల కంగీకరించి యెఱుకురాజుతో శుభముహూ ర్తమున మీ యిచ్చచొప్పున రాజ్య పరిగ్రహణము గావింతునని ప్రత్యుత్తరము నొసంగెను.

వందిమాగధులు స్తవముగావించుచుండ మంగళవాద్యముల ధ్వనులు భూనభోంతరములు నిండి మారుమ్రోయుచుండ భూసురాశీర్వాద పురస్సరముగ మాధవశర్మ నిర్ణయించిన శుభలగ్నమున మాధవవర్మ అనుమకొండ సామ్రాజ్యమునకు బట్టాభిషిక్తు డయ్యెను. ఎఱుకుదేవరాజు మాధవర్మకు సమస్తైశ్వర్యములు వశముగావించి దక్షిణకాశియనందగు నమరావతీ పుణ్యక్షేత్రమునకు దపము గావించుటకై వెడిలిపోయెను. పద్మాక్షీదేవి యొసంగిన సమస్త

బలంబులు నెఱుకుదేవరాజొసంగిన బలంబులు కలిపి, రాజ్యము మిగుల నభివృద్ధిలోనికిం దెచ్చి మాధవవర్మ మిగుల జాగరూకతతో బరిపాలించుచు గృతజ్ఞతాసూచకముగ మాధవశర్మకు నాతనిదర్మపత్నికి ధన కనకవస్తువాహనంబులు చీనిచీనాంబరముల నొసంగి యిచ్చవచ్చిన గ్రామముల నగ్రహారముల నొసంగి యుత్తమోత్తములగు మంత్రుల యనుమతి ననుసరించి వర్తించు చుండెను.

రాజ్యవిభవముతో దృప్తినొంది సమస్తైశ్వర్యముల ననుభవించుచు అనుమకొండసామ్రాజ్యమును శత్రుజన భీకరముగ బరిపాలించుచున్న తన పుత్రరత్నమగు మాధవవర్మను వీక్షించి సిరియాలదేవి సానురాగముగ మాటల డుచు "గుమారా! నన్ను వీరమాతయని యనిపించుట ధర్మము. మీజనకుని చెట్టబట్టి సమస్తభోగముల ననుభవించి వీరపత్నీ ననిపించుకొంటిని. నీవలన వీరమాత నైతిని గృతార్థుల నయ్యేద" నని పల్కెను. మాధవవర్మకు దల్లియగు సిరియాలదేవి తెలుపు మాటలలోని భావము భోధకాదయ్యెను. తన ధర్మమును గూర్చి లోలోన బలుమాఱు యోజించి నిశ్చితాంశము నెఱుంగనేరక మాధవవర్మ స్పష్టముగ నీ యభిప్రాయము నెఱింగింతువేని యవశ్య మొనరింతునని ప్రతిజ్ఞ చేసెను.

సిరియాలదేవి కుమారుని ప్రతిజ్ఞ యాలించి యానంద పరవశమై యిటుల జెప్పెను. "పుత్ర రత్నమా! సర్వభోగ్య సంభరితమగు మనకందారరాజ్యము పరాధీన మగుటచే నిన్ని యిక్కట్టుల పాలైతిమి. ఇపుడు నీకతన పూర్వరాజ్యమును బడయగలుగుదునేని నేను వీరమాతలలో నగ్రగణ్యా నగుదును. మనకందార రాజ్యమునకు బల్లహుడు పాలకుడై వర్తించుచున్నాడు. వానిచే నేను మిగుల బరాభవింప బడితిని. అక్రమముగ నాతడు కచ్చకు గాలుద్రవ్వి యన్యాయముగ బశుసమూహమును దొంగిలించుకొని పోవుటయేగాక విభవాస్పదంబైన కందార రాజ్యంబునంతయి విధ్వంసంబు గావించినాడు. ముం దుద్భవింపనున్న నాతనయునివలన నెట్టి యిడుమపాటు నొందవలసి వచ్చునోయని యా దురాత్ముడు అనుమకొండ కేతెంచి నాకొఱకై వెదకించి బంధింప బ్రయత్నించెను. పుణ్యశీలురగు నీవీటి బ్రాహ్మణులును దయామయుండగు మాధవశర్మ నన్ను బ్రతికించి నిన్నీ యాంధ్రదేశమున కొసంగి పరమోపకారంబు గావించిరి. కాన నీయందు రెండుధర్మము లిమిడియున్నవి. ధర్మ నిర్వహణానంతరము గాని నీవు ఋణ విముక్తుడవు కాజాలవు. పరమోపకారము గావించి చంద్రవంశమును శాశ్వతముగ నిల్పునటుల ననుగ్రహించిన యీ బ్రాహ్మణోత్తము లందఱుకు వృత్తిస్వాస్థ్యముల నొసంగి కృతజ్ఞత వెల్లడించుట ప్రధాన కర్తవ్యము. బల్లహుని ఖండించి తద్రక్తముతో బితృతర్పణము గావించి పూర్వాపహృతములగు పశువుల నన్నింటిని గొని తెచ్చి నాకు వీరమాతృనామము నొసంగుట నీ రెండవ ధర్మము. నీపవిత్రమగు జన్మము వలన నాజీవితము తరించినది. మీ జనకుడు బల్లహునిచే వధింపబడినటుల జనశ్రుతి కలదు. అదియ నిశ్చయమేని పరముననున్న యాతనియాత్మ కృతార్థత నొందగలదు, లేదా సజీవిగ నుండెనేని పుత్రసందర్శనముచే గృతార్థుడు కాగలడు" ఇట్లు కుమారునకు దెల్పి యంత:పురమునకు వెడలిపోయెను.

మాతృసందేశము, తన పూర్వచరిత్రము వినినదాది యుత్సాహ మతిశయించి ప్రత్యర్థిమారణమునకు మాధవవర్మ ప్రయాణము కా నిశ్చయించెను. భటులందఱు సంగ్రా మమునకు సర్వసిద్ధముగ నుండిరి. బలములన్నియు నాయితము గావింపబడియెను. విజయదుందుభులు దింగతరముల మాఱుమ్రోగు చుండ నొకానొక శుభముహూర్తమున వీరచూడామణి యగు మాధవవర్మ పితృతుల్యుడగు మాధవశర్మ పెట్టిన శుభముహూర్తమున విజయయాత్రకు బయన మయ్యెను. అనుకూల మృదులముగ వీచు పవమాన మా రాజన్యునకు సుస్వాగతము నొసంగెను. ప్రకృతియంతయు విజయచిహ్నముల సూచించుచుండెను. మాతృదేవీదత్తమగు శుభాశీర్వాదాదికము పరిగ్రహించి పద్మాక్షిదేవి ప్రదత్తములగు దివ్యాయుధములు ధరించి పుణ్యాకాంతులు హర్మ్యాగ్రముల నుండి పుష్పాక్షతలు చల్లుచుండ గటకముపైకి సమస్త బలముతో మాధవవర్మ జైత్రయాత్రకు బయలువెడలెను. సామంతాదు లందఱు విధేయులై రాజన్యున కెదురేగి యుచితసత్కారములుగావించి చతురంగసేనల శక్తికొలది సహాయము గావించిరి. అపరిమిత బలముతో బయలువెడలి మాధవవర్మ కొన్నిమాసములకు బ్రత్యర్థిరాజ్యమగు కటకము చేరెను. సైనికులందఱు శిబిరముల నెలకొల్పికొనిరి. సేనానాయకులు సంగరమునకు సర్వసిద్ధముగ నుండిరి. కోపతీవ్రముచే బ్రత్యర్థి సంహరణ దివ్యాకాలము కొఱకు

నిరీక్షించుచున్న మాధవవర్మ గూఢచారుల వలన గటకరాజ్యపరిస్థితులు, బలాదికములు రహస్యముగ నెఱింగి వ్యూహాదికముల నిర్ణయించి తెల్లవాఱున: గోటముట్టడింప వలయునని ప్రధాన సేనానాయకున కాజ్ఞాపించెను. ఆకస్మికముగ మ్రోగుచున్న జయభేరి నాలకించి బల్లహు డాశ్చర్యమునొంది యెవడు తన్న కోపాగ్ని కాహుతి గానెంచెనో తెలిసికొందునుగాక యని బల్లహుడు బలములనన్నింటిని దత్ క్షణమునసే యాయత్త పఱచి ప్రతిపక్ష బలముతో బోరుచేయ నారంభించెను. ఇరువాగులు పోరునకు దలపడెను. మాధవవర్మ సైనికులనందఱ కుచితమగు స్థానములనొసంగి యుద్ధనిపుణులగు వారికి సేనానాయకత్వమునిచ్చి కోట నలువైపుల నొక్కమాఱె ముట్టడించెను. బల్లహుడు ప్రతిశిబిరమున కేగుచు భటుల బరామర్శించుచు నుచితవిధానముల నెఱింగించుచు దనబలమును మిగుల బ్రోత్సహించు చుండెను. కాని బల్లహునకు విజయముపై నాస యెన్నడో యంతరించెను. సంగ్రామప్రయత్నములో నాత డుండకపోవుటచే స్థలాంతరములలో నున్న బలమునంతయు రప్పింప వీలు కాదయ్యెను. ఆహారపదార్థములు సైతము చాలినంతగ లేకుండెను. ప్రతిపక్షుల సైన్యము లెక్కయిడరానంత విశేషముగ నుండెను. ఆసైన్యమునకు రాజెవ్వడో, యాత డేరాజ్యమునకు బరిపాలకుడొ, నాటి విజృంభణమున కేహేతువొ బల్లహు డెఱుంగడు. తీవ్రముగ బల్లహుని సైన్యము మాధవవర్మ సైన్యముతో గొన్నిమాసములు పోరాడెను. జవసత్వములు క్షీణించుటవలనను ఆహారపదార్థములు కొఱతపడుటవలనను చేయునది లేక పౌరుషము దిగద్రావి బల్లహుడు మాధవవర్మను శరుణు గోరెను. తీవ్రక్రోధపీడితుడగు మాధవవర్మ యాతని బంధించి తాను సోమభూపాలుని తనయుడననియు సోమరాజును వంచించినందులకు బశుధనమును దొంగలించినందులకు, సిరియాలదేవిని బరాభవింప యత్నించినందులకు గందారరాజ్యమును హరించినందులకు నీవెట్టిశిక్షకేని యర్హుడవు. క్షమింప వీలులేదుఅనుచు కఠినముగ నివేదించి వీరులగు సేనానులను బిలిపించి బశుధనమునంతయు గోష్ఠములనుండి తొలగించి కందారమునకు జేర్పుడని యాజ్ఞాపించెను. బల్లహుని సైన్యమంతయు మాధవవర్మ హస్తగతమయ్యెను. దయాభూషణుడగు మాధవవర్మ బల్లహునిచే జెఱబెట్టబడిన రాజులనందఱ విడిపించి వారల నుచితగౌరవంబులతో గందార రాజ్యమునకు గొనిరండని కొందఱు ప్రధానులతో దెల్పి వలయు సైన్యమును సహాయముగ బంపెను. మాధవవర్మ విజయస్తంభమును గటకములో నెలకొల్పి నిజపురాభిముఖుడై బంధితుండగు బల్లహునితో దదితర రాజన్యులతో బయలుదేరి కొన్నాళ్లు శ్రమనివారణార్థము మధ్యమధ్య నివసించుచు మార్గ మధ్యముననున్న రాజులవలన భూస్వాములవలన గప్పముల బుచ్చుకొని వారల సామంతులుగ జేసికొనుచు బితృస్థలమగు కందారమునకు జేరెను. ప్రధానమాత్యు డంతకు మున్ను బంపినచారులవలన మాధవవర్మ కటకేశ్వరుని సంగ్రామ రంగమున నిర్జించి జీవగ్రాహిగజేకొని పశుధనముతో జయలక్ష్మితో బితృరాజ్యమున కేగుదెంచు వార్తనాలకించి మాధవశర్మయు సిరియాలదేవియు సంతోషితాంతరంగులై కుమారుని ప్రజ్ఞాదికముల కొనందించుచు, నిజనివాసమునుండి బయలువెడలి, కందారమునకు మునుముందె చేరి మాధవవర్మకు సుస్వాగతము నొసంగిరి. వినయముతో మాధవవర్మ సిరియాలదేవికి, మాధవశర్మకు నమస్కరించి విజయాదికము నంతయు నివేదించెను. వారిరువురు తనయు నాశీర్వదించి శుభముహూర్తమున బితృరాజ్యము మాధవవర్మకు బట్టాభిషేకము నిర్ణయించిరి. పురవాస్తవ్యులు పట్టరాని సంతసముతో సోమరాజుతనయుడు మఱల రాజ్యమునకు వచ్చుట శుభసూచకమని సహస్రభంగుల నానందించిరి. సర్వసంపత్సమృద్ధమగు నాకందారపురమును బౌరులు చక్కగ నలంకరించి పట్టాభిషేక సుదినమునకై ప్రతీక్షించుచుండిరి. సకాలమునకు బంధోన్ముక్తులగు రాజన్యులగు బశుధనమును జేకొని ప్రధానులు, సైనికులు, కందారరాజ్యమునకు జేరిరి. రాజ్యమునకు సంబంధించిన సర్వగ్రామములనుండి వేదవేదాంగ వేత్తలగు బ్రాహ్మణోత్తములు, సంగీత సాహిత్యవేత్తలు, వినోదజ్ఞులు, రాజకార్యధురంధరులు రావింప బడిరి.

సర్వ శాస్త్ర వేత్త యగు మాధవశర్మ యాగమానుసారముగ మంత్రముల బఠించి శాస్త్రోక్తముగ మాధవ వర్మకు గందారరాజ్యమును బట్టాభిషేకము గావించెను. మాధవవర్మ బంధవిముక్తులగు రాజన్యుల నందఱను గౌరవించి యుచితసత్కారములు గావించి కప్పముల నిర్ణయించి యెవరి రాజ్యమునకు వారల నంపెను. అందొక రాజన్యుడు తన పూర్వనివాసము తెలుపుమన శిరము వంచికొని మాఱుపలక డయ్యెను. అతనిదీనవదన మందఱకు విచారకరముగ నుండెను. మలినాంబరముతో మాసిన తలతోనున్న యాతని యాకారమును జూచి మున్నతని నెటనో కాంచి

యుంటిమని ప్రజలు తలంచిరి. మాధవవర్మ యెన్నివిధముల సగౌరవముగా బ్రశ్నించు చున్నను నాబంధోన్ముక్తుండు ప్రత్యుత్తరము నొసంగ డయ్యెను. ఈయంశము నాలకించి సిరియాలదేవి సభారంగమున కేతెంచి యావ్యక్తిని గాంచి నిలువున నీరై నిలువబడి పోయెను. ఆవ్యక్తియు దన్మయుడయ్యెను. కొంతసేపటికి సిరియాలదేవి తెలివి దెచ్చుకొని రాజ్యలక్ష్మీ కలితుడగు కుమారుని హస్తము గొని యాబంధోన్ముక్తుని పాదములపై వ్రాలి, 'రాజన్యా! అజ్ఞాతను, అనన్య గతికను, దీనురాలను కరుణింపు'మని యతని పాదములపై వ్రాలి యశ్రుజలముచే బ్రక్షాళనము గావించుచు, మాధవవర్మా! ఈమహనీయుడె నీజనకుడు. కారాగార పరాభవాదికముచే మిగుల గృశించి యున్నాడు. దైవవశమున దానొందిన దుస్థ్సితిని దలంచుకొని నామ గోపనము గావిం చుచున్నాడని ముక్తకంఠముతో బలికెను. సభ్యులందఱు నిర్విణ్ణులై యా సోమభూపాలకుని కరణాస్వరూపమును జూచి మిగుల విచారపడిరి. మాధవసర్మ సోమరాజును బరామర్శించి దైవవశమున నెంతవారల కేని యవస్థలు రాక మానవనియు గష్టసుఖములు వెనువెంట ననుభవింప దప్పదనియు దెలుపుచు, సిరియాలదేవి కందారరాజ్యమును వదలినది మొదలు నాటివఱకు జరిగిన కథయంతయు నివేదించెను. విచార విస్మయములతో సోమరా జాయంశము నంతయు నాలకించెను. సర్వ మాతని కింద్రజాలమువలె నుండెను. తన ధర్మపత్నిని మరల సందర్శింప గలనని గాని కారాగారమునుండి విముక్తుడను గాగలనని కాని సోమరాజు తలంచి యుండక పోవుటచే నాత డెంతయో యానందించి తన సుకృతమును దానె ప్రశంసించికొనుచు మాధవశర్మకు నమస్కరించి యర్ధాంగి నాదరించి తనయుని గౌగిలించుకొని తన్మయమున జాలసేపు మాటలాడక పోయెను. ఈదృశ్యమునంతయు గాంచుచున్న పౌరులు చిత్తరువు వలె నిలువబడిపోయిరి. పాదపీఠముచెంత బంధితుడై పడియున్న బల్లహుడు దీనస్వరముతో 'సోమరాజా! నీకు మిగుల ద్రోహము గావించితిని. సిరియాలదేవి! నీయెడ మిగుల నపచారము గావించితిని. మాధవవర్మా! నీ ప్రభావము నెఱుంగక ప్రతిఘటించితిని, నన్ను క్షమించుట కర్తవ్యము. పూర్వ దురంతముల స్మరించి విచారపడు నీదీనునికనికరించుట కర్తవ్యమని యొక్కపెట్టున వాపోయెను. సోమరాజు బల్లహుని గరుణించి, తనయునిగాంచి 'పుత్రకా! యాతనివలన నపరాధంబు గొని యంకితుని గావించుకొని క్షమింపు' మని తెలిపెను. మాధవవర్మ బల్లహునివలన బదుమూడుకోట్లు సువర్ణనాణకముల నపరాధముక్రింద గొని యాదాయములో నాఱవభాగము సుంకముగ బ్రతిసంవత్సరము నిచ్చునటుల నాజ్ఞాపించి విడచి పెట్టెను.

మాధవశర్మ రాజకుమారుని జూచి "కుమారా! కలియుగంబున క్షత్రియప్రసాదంబు స్వీకరించుట బ్రాహ్మణులకుం దగదు. బల్లహుని దురితశమనార్థమై మేము సిద్ధేశ్వరాలయమున సిరియాలదేవి యొసంగిన ప్రసాదము స్వీకరించితిమి. ఈ యనాచారదోషము శాంతినొందుటకై మేమందఱము దీర్ఘకాలము జపతపోనియమాదులచే గాలక్షేపము గావింపవలయును. గాన నాజ్ఞయి"మ్మని యడిగెను. బ్రాహ్మణోత్తముల పాదములను బంగరుపళ్లెరములో గడిగి మాధవవర్మ యందఱకు వారి యర్హతానుసారముగ గోదావరితీరముననున్న రెండువేల గ్రామముల నగ్రహారములుగ నొసంగి యమోఘములగు నాశీర్వాదముల నొందెను. చోళేశ్వరుడు మాధవవర్మ పరాక్రమాదికముల నాలకించి తన పుత్రికనొసంగి కొంతరాజ్యమును సమర్పించెను. పితృసందేశమును మాతృసందేశమును లక్ష్యమునందుంచుకొని మాధవవర్మ యాంధ్రదేశమును జిరకాలము పరిపాలించెను. వీరచూడామణియగు నీమాధవవర్మ చరిత్రము చరిత్రాదులయందు శాసనాద్యాధారములచే నిరూపింప బడనంత మాత్రమున విశ్వసింపమనుట సాహసము. ఈతనిచరిత్రముకొఱకు నిజామురాష్ట్రమున మిగుల బరిశోధించుట యావశ్యకము. ఈరాజన్యుడు ధర్మబద్ధుడై చిరకాలము రాజ్యము పాలించి యనేక మహాకార్యముల గావించెను. క్రీస్తుశకము 200 ప్రాంతములో నీరాజ శిరోమణి యున్నటుల నూహింపవచ్చును.

మహామండలేశ్వరుడగు మాధవవర్మ చిరకాలము రాజ్యమేలి యాత్మానురూపులగు తనయులబడసెను. అందొక తనయుడు చింతగింజలమ్ముకొని జీవించు నొక పేదరాలి తనయుని ప్రమాదవశమున జంపెను. మాధవవర్మ యాయంశము మిగుల జాగరూకతగ విచారించి తనయుడు దోషియని తెలిసికొని పుత్రవాత్సల్యము దిగద్రావి యాతని కురిశిక్ష విధించెను. మల్లేశ్వరస్వామి మాధవవర్మ న్యాయబుద్ధి కానందించి మృతుడగు బీదబాలుని రాజపుత్రుని బ్రతికించుటయే గాక సువర్ణవర్షము సైతము కురిపించెను. ఈయంశము పండ్రెండవ శతాబ్దమున పల్లకేత భూపాలుండు బెజవాడ మల్లేశ్వరాలయములోని యొక శాసనములో వ్రాయించెను. దీని

వలన మాధవవర్మ యెంత న్యాయశీలుడో ధర్మస్వరూపుడో తెలిసికొనవచ్చును. మాధవవర్మ గతించి చిరకాలమైనను నాతని కీర్తినేటికి శాశ్వతముగ నున్నది. ఆంధ్రరత్నమగు నీరాజన్యుని చరిత్రము ప్రశంసాపాత్రము.

(కొందఱు మాధవవర్మ బల్లహుని వధించి యాతని తనయునకు రాజ్యమునొసంగెననియు సోమరాజు బల్లహునిచే వధింపబడెననియు జెప్పుచున్నారు. అంతకంటె యుక్తియుక్తముగ నుంటచే నీకథ నిట నుదహరించితిమి. వీరశిరోమణియగు మాధవవర్మ జీవితము మనకందఱకు బఠనీయమని యాంధ్ర సోదరులకు విన్నవించు చున్నారము.)

విష్ణువర్ధనుడు.

ఆంధ్రవీరులలో జాళుక్యులు మిగుల బ్రసిద్ధులు. వీరల నామము దేశచరిత్రములయందు జిరకాలమునుండి వినబడుచున్నది. మనచరిత్రకారులు విషయసుబోధనమునకు గాను రాజమహేంద్రవరప్రాంతము పాలించినవారిని దూర్పుచాళుక్యులనియు నిజాంరాష్ట్రమునందలి కుంతలదేశమును పాలించినవారిని బశ్చిమచాళుక్యులనియు బేరిడిరి. మనమిపుడు చదువబోవు ప్రసిద్ధపురుషుడును వీరోత్తంసుడునగు విష్ణువర్ధనమహారాజీ యుభయవంశజులకు మూలపురుషుడు. చాళుక్యరాజుల చరిత్రములలో నీయనఘుని జీవితచరిత్రము మేలుబంతిగా నున్నది.

చాళుక్యుల జన్మాదికములను గూర్చి యనేకకథలు గలవు. గ్రంథములందు శాసనములందును జాళుక్యులు చంద్రవంశ క్షత్రియులుగా జెప్పబడిరి. బ్రహ్మదేవు డొకనాడు పేరోలగమున నుండగా నచటకు సురపరివృతుడగు దేవేంద్రు డరుదెంచి యుచితసత్కారములొంది యాసనాసీనుడై 'వాణీ వల్లభా! కలియుగమాహాత్మ్యమునగ బోలు ధర్మము సన్నగిల్లినది. మనుజులు యజ్ఞయాగాదిక్రతువులు చేయుట లేదు. ప్రజలను ధర్మమార్గమున ద్రిప్పగల రాజును సృజింపు'మని వేడుకొనెను. బ్రహ్మ యందుల కంగీకరించి ఇంద్రుని బంపి వేసెను. ఉత్తముడగు రాజును సృజింపవలయునను నాందోళనములోనుండి బ్రహ్మ అర్ఘ్యమిడుటకై జలము పైకెత్తగా నతని చులుకము (పుడిసిలి) నుండి తేజస్సంపన్నుడు వీరవతంసుడునగు నొకమహాపురుషు డుద్భవమయ్యెను. ఆవీరుడు బ్రహ్మనుజూచి 'నన్నేల సృజించినాడవు? నాకర్తవ్యమేది?యని యడుగగా 'నీవు చులుకమునందు జనించితివిగావున చాళుక్యుడవు. ధర్మము దప్పనీయక ప్రజల బాలించి యుత్తమక్షత్రియవంశమునకు గర్తవుగ'మ్మని యాశీర్వదించి వానిని భూలోకమునకు బంపెను. తరువాత చాళుక్యుడు తపస్సంపదచే గొప్పశక్తిగడించి రాజ్యము స్థాపించెను. ఈయన రాజధాని యయోధ్య. ఈయనవంశము మిగుల బ్రసిద్ధులగు హరితుడు, మానవ్యుడు అను నిద్దరు వీరులు జనించిరి. తరువాత నీవంశీయులలో గొందరు దక్షిణాపథమునకు వచ్చి స్వతంత్ర రాజ్యములు స్థాపించి యార్షమతము నుద్ధరించిరి. ఈ చాళుక్యులను మానవ్యసగోత్రులని వ్యవహరించుచున్నారు.

దక్షిణాపథమున బ్రసిద్ధుడై యున్న విజయాదిత్యుడను చాళుక్యరాజు అపరిమిత సైనికబలముతో దండయాత్రకు బయలువెడలి త్రిలోచనపల్లవుడను సుప్రసిద్ధనృపాలుని రాజ్యమును హరింపనెంచి చిరకాలము యుద్ధముగావించెను. పరాక్రమశాలియగు త్రిలోచనపల్లవుడు ఆకాలమున బ్రసిద్ధులగు పల్లవరాజులను సహాయముగా దీసికొని విజయాదిత్యు నితో నెలలతరబడి పోరాడి యాతని మడియించెను. సైనికులందఱు రాజుపడుటజూచి చెల్లాచెదరైపోయిరి. విజయాదిత్యుని పట్టపుభార్య యా సమయమున గర్భవతిగానుండెను. స్వార్థపరాయణులగు సైనికులు భటులు తమత్రోవను దామేగుటచే రాణి దిక్కుమాలినదై విరోధిరాజులచే బట్టుపడిన నాపద కలుగునేమోయని చాల విచారపడెను. గర్భవతిగానుంటచే జాళుక్యవంశాంకురమును దగ్ధముచేసి సహగమనము గావించుట కంగీకరింపకపోయెను. త్రిలోచనపల్లవుని ధాటికి వెఱచి రాజ మహిషి కెవరును తావొసంగరైరి. విశ్వాసపాత్రురాండ్రగు పరిచారికలు, పురోహితుడు జాగరూకతగా రాజపత్నిని గాపాడి శిబిరమునుండి యర్ధరాత్రమున నామెను వెంటనిడికొని మహారణ్యమునకు జేరి కొన్నిదినములకు ముదివేము అను నగ్రహారమునకు జేర్చిరి. అగ్రహారాధిపతి పేరు విష్ణువర్ధనభట్టారకుడు. సమస్తశాస్త్ర పారంగతుడు. అతిథిపూజా పరాయణుడగు నీ బ్రాహ్మణుడు తన యగ్రహారమునకు వచ్చిన నూతనుల నందఱను గృహమునకు రావించి యాతిథ్యమొసంగి సత్కరించెను. చాళుక్యపురోహితుడగు బ్రాహ్మణుడు విష్ణువర్ధన భట్టారకునితో నేకాంతమున జాళుక్యవంశమునకు గలిగిన విప్లవము, విజయాదిత్యుని యకాలమరణము నివేదించి రాజపత్ని నాయనపాదములపై బడవేసి చాళుక్య వంశాంకురమును గర్భమున ధరించిన యీసాధ్విని గాపాడమని వేడుకొనెను. విజయాదిత్యుని, నాతని ధర్మపత్నిని స్వయముగా నెరింగినవాడుకాన విష్ణువర్ధనుడు గతమునకు జింతించి రాజపత్నిని నోదార్చి

పుత్రికాభావముతో బ్రేమింతుననని వాగ్దానము గావించి రాజపత్నిని దనయింట నుంచికొని వేయికనులతో గాపాడుచుండెను.

విష్ణువర్ధన భట్టారకుడు సమయోచితములగు పురాణ కథాదికముచే భర్తృచింతయంతయు రాజపత్నికి మఱపునకు వచ్చునటులజేసి వీరమాతవు గమ్మని యాశీర్వదించెను. నవమాసములు నిండినపిమ్మట నొక శుభ ముహూర్తమున రాజపత్ని తేజోవంతుడును, రూపవంతుడుననగు నొక కుమారుని గనెను. విష్ణువర్ధన భట్టారకు డాబాలుని జననకాలమును బట్టి జాతకమువ్రాసి యీబాలుడు పూర్ణాయుర్దాయ సముపేతుడై యాంధ్రదేశము నంతయు బరిపాలించురాజు కాగలడని తెలిసికొని మిగుల వైభవముగా జాతకర్మాదికిములు ముగించెను. రాజపత్ని, విష్ణువర్ధనభట్టారకుడు తన కొనరించిన మేలునకు, దనవంశమునిలిపి కావించిన మహోపకారమునకు బ్రతిఫలముగ దనకుమారునకు విష్ణువర్ధనుడని నామకరణము గావించెను. కొడుకులు లేరను విచారముమాని విష్ణువర్ధన భట్టారకు డాబాలుని దన కుమారునివలెనే గారాబముతో బెంచి పెద్దవానినిజేసి బాల్యముననె పురాణవీరుల విక్రమములు బోధించి వేదము, శాస్త్రము, ధనుర్విద్య నేర్పిం చెను. సమస్తవిద్యలయందును నాబాలుడు ప్రవేశముగలవాడై సర్వశాస్త్రప్రారంగతుడై యొకానొక దినమున దనతల్లియొద్ద కేగి "మనలను క్షత్రియులని లోకులు చెప్పుకొనుచున్నారు. మనము బ్రాహ్మణ గృహములో జిరకాలమునుండి యుండుటకు గారణమేమి? నాతండ్రి యెవరు? నేనేశాఖకు జెందినవాడనో యాజ్ఞయి"మ్మని యడిగెను. కుమారుని మాటలు విన్నంతన పట్టరాని దు:ఖమున రాజపత్ని పరితపించి కుమారున కేమియు బదులు చెప్పజాలకపోయెను.

విష్ణువర్ధన భట్టారకుడు విచారపరవశురాలై యున్న రాజపత్నిని జూచి "చింతల గారణమేమి? నావలన నేమేని ప్రమాదము జరుగలేదుగదా? గడుసరియై నీకుమారు డేమేని నొవ్వనాడెనా? తెలుపు"మని పలువిధముల నడిగెను. విచారాతిశయమున రాజపత్ని బదులాడజాలకపోయెను. విష్ణువర్ధనుడు బ్రాహ్మణోత్తమునకు నమస్కరించి తానే తల్లి విచారపడుటకు గారకుడనియు దనకులశీలాదికముల బ్రశ్నించుటచే నిటుల బలవించుచున్నదనియు నివేదించెను. విష్ణువర్ధన భట్టారకుడు బాలునిజేరజేరి గతవృత్తాంతము, తల్లి యచటికివచ్చిన హేతువు, తానామెను తనను సాదరమున బోషించుచున్నవిషయము నివేదించెను. రాజకుమారుడు కనుల నెఱుపెక్క 'బ్రహ్మజ్ఞ శిరోమణీ! తెలియక ముందు నీసొమ్ముదింటిని. నీకు ఋణపడి యున్నాను. ఈజన్మమున నీఋణము తీర్చుగొన గలుగుదు నేని ధన్యుడను. నాతండ్రినిజంపిన పల్లవుల మారణముగావించుటయు నచిరకాలమున మహాసామ్రాజ్యము స్థాపించి మాకుటుంబమునెడ ననురాగముజూపిన ధన్యుల గౌరవించుటయు నాకర్తవ్యము. నేనిక నాజ్ఞపుచ్చుకొందు సెలవిం'డని పలికెను. బ్రాహ్మణుడు బాలుని పుత్రప్రేమతో బెంచిన వాడగుటచే నెడబాటునకు సహింపజాలక నేనును నీవెంట వచ్చి నీకనుకూలమగు పరిచర్యగావింతుననెను. రాజపత్నియు గుమారుని విడుపజాలక తాను రానుద్దేశించెను. బాలు డెట్టకేలకు దండ్రివలె దన్నుబెంచు బ్రాహ్మణోత్తముని దల్లిని ఒప్పించి వారివలన దివ్యాశీర్వాదములను బడసి తపశ్శక్తిచే గాని విజయము లభింపజాలదని మహారణ్యములకు బోయెను. రాజకుమారునకు బయలుదేరినదిమొద లనేక శుభశకునములయ్యెను. అన్నియు దన భావ్యాభివృద్ధి సూచకములుగా దలంచి దేవతానిలయమనియు జాళుక్యులతపో భూమియనియు బేరొందిన చాళుక్యపర్వతమున కేగి రాజకుమారుడు చిరకాలము తపస్సుచేసెను. సప్తమాతృకలతో గుమారస్వామి యాబాలునకు బ్రత్యక్షమై "నీవెచటికేగినను సింహమువలె విజయము గడింతువు గాన విజయసింహనామము ధరించుమనియు, దిరుగ మీవంశము నిలుచుటకు విష్ణువర్ధన భట్టారకుడె కారకుడుగాన వంశీయులందఱు నామాంతమున విష్ణువర్ధనపదము జేర్చుకొను డని చెప్పి యాశీర్వదించి యంతర్ధాన మాయెను. కొంతసేపటికి శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమై వరాహధ్వజము నొసంగి యీ ధ్వజసహాయమున విరోధిరాజుల జయించి పేరుగాంచగలవని యాశీర్వదించి యదృశ్యమయ్యెను. విజయసింహ బిరుదాంకుడగు విష్ణువర్ధనుడు గృహముచేరి బ్రాహ్మణోత్తమునకును దన తల్లికిని దానొందినవరములను దెలిపెను. విష్ణువర్ధన భట్టారకుడు మిగుల సంతోషించి విజయసింహునకు దిగ్విజయయాత్ర గావింప నొక శుభముహూర్తము నిశ్చయించెను. తల్లి బాలునకు వీరవేషమువేసి యాశీర్వదించి పంపెను.

విజయసింహుడు దైవబలముతో జైత్రయాత్రకు బయలుదేరు చున్నాడని విని రాష్ట్రకూటులయెడలను బల్లవుల యెడలను ద్వేషభావము గల పౌరు లనేకులు జయసింహునకు ధన సహాయము గావించిరి. తన తండ్రినాటి భటులలో బలువురు తమకు దామ వచ్చి జయసింహుని గలిసికొనిరి. అపరిమిత బలముతో బయలు దేరిన విజయసింహుని ధాటికి రాజు లెవ్వరు నాగజాలక పోయిరి. ఆకాలమున బ్రసిద్ధులుగా నున్న కదంబరాజులు, గాంగరాజులు కొంతవఱ కెదిరించి పరాజయశరణ్యులై యంకితులైరి. రాష్ట్రకూటులలో గృష్ణుడను రాజాకాలమున బ్రసిద్ధుడుగా నుండి విస్తార విశాలమైన దేశమును బాలించుచుండెను. అతని కుమారుడు ఇంద్రవర్మ. తండ్రిని మించి తనరాజ్యమున విరోధియను వాడు లేకుండ జేసి శత్రుజనభీకరుండై రాజ్యము నేలు సమయమున విజయసింహు డాతనిపైకి దండయాత్రకు వెడలెను. ఉభయ సైన్యములకు జిరకాలము భయంకర సంగ్రామము జరిగెను. దురదృష్ట వంతుడగు ఇంద్రవర్మబలము సన్నగిల్లెను. చేయునది లేక యపజయము నిశ్చయమని తెలిసికొని విజయసింహుని శరణు వేడగా శరణాగతత్రాణ బిరుదాంకుండగు నారాజన్యుడు అపరాధముగా గొంతధన మాతని నుండి కైకొని సామంతుడుగ నేర్పాటు చేసెను. పల్లవులపై సహజ ద్వేషభావముగల యీ రాజతిలకుడు చిక్కినపల్లవరాజును జిక్కినటుల బంధించి తండ్రినాటి పగను వడ్డితో గూడ దీర్చికొని దక్షిణాపథమున నింతటి రాజు లేడను ప్రతిష్ఠ వహించెను.

విజయసింహుడు విజయయాత్ర ముగించి యగ్రహారమునకు జేరి తన విజయకథలు తండ్రితో సమానుడగు విష్ణువర్ధన భట్టారకునకు దల్లికి నివేదించెను. తరువాత నొకశుభ ముహూర్తమున చాళుక్యసామ్రాజ్యమును వాతాపియను నగరమునందు స్థాపించి ప్రాక్పశ్చిమ చాళుక్య వంశముల రెంటికిని మూలపురుషు డయ్యెను. కాంచీ నగరమునందు బల్లవరాజ్య మొకటి యాకాలమునందు సుప్రసిద్ధము గానున్న వార్తవిని విజయసింహు డపరిమిత బలసమేతుడై దండయాత్రకు బయలువెడలెను. పల్లవరా జీవర్తమానమువిని ప్రతి ఘటించినచో బరువుదక్కుట దుస్తరమని తనకుమార్తె నాతని కొసంగి పరిణయముగావించి రాజ్యములో గొంతభాగము నరణముగా నిచ్చెను. విజయలక్ష్మితో నర్ధాంగలక్ష్మితో విజయసింహుడు తననగరముజేరి విజయాదిత్యుడను కుమారుని గాంచెను. ఈనృపాలుడు క్రీ.శ. 450 ప్రాంతమున నుండి యుండునని చరిత్రమువలన దెలియుచున్నది. ద్రవిడాంధ్ర కర్ణాటమహారాష్ట్ర దేశములు చిరకాలము పరిపాలించి ధర్మసంస్థాపనము గావించిన లోకోత్తరకీర్తిధుర్యులగు చాళుక్యులలో విజయసింహుడు ప్రథమగణ్యుడు. ఈయన సంపూర్ణ జీవితము నెఱుంగదగు నాధారము లింతవఱకు వలసినన్ని లభింపనందున విస్తరించి తెలుప వీలుకాదయ్యెను. అసహాయ స్థితియందుండి స్వశక్తిచే లోకోత్తర ఖ్యాతినొందిన విజయసింహుని కార్యదీక్ష కార్యశూరులగు నాంధ్రసోదరులకు మార్గదర్శక మగుగాక!

రుద్రదేవ చక్రవర్తి.

ఆంధ్రరాజన్యులలో గాకతీయులు మిగుల సుప్రసిద్ధులు. "కాకతి" యను పదము దేవికి బర్యాయనామము. ఈవంశీయులు పూర్వము కాకతి దేవతకు భక్తులైయుంటచే వీరలను నాటనుండి కాకతీయులని వ్యవహరించు చున్నారు. "కాకతి" జైన దేవతనియు నీవంశీయులలో బూర్వులు జైనులుగనుండి యా దేవతను బూజించుచు నుండుటచే గాకతీయులుగ వ్యవహరింపబడిరని తెలియుచున్నది. కాకతీయులలో బూర్వుడు మహామండలేశ్వర బేతరాజు.

త్రిభువన మల్ల విక్రమాదిత్యుడను చాళుక్యరాజన్యు డాంధ్రకర్ణాట దేశంబుల బాలించుచు బలువురను బ్రతినిధులుగ ముఖ్యనగరములయం దుంచి వారలచే రాజ్యము నేలించి సుంకముల బడయుచు యాజమాన్యము దనయం దుంచు కొనెను. ఆకాలమున రాజప్రతినిధులుగ నున్నవారిలో గాకతీయవంశీయులుగూడ జేరియుండిరి. కాకతీయులు మొట్టమొదట జాళుక్యులయొద్ద సామంతరాజులుగ రాజప్రతినిధులుగనుండి పరాక్రమముచే బలుకువాసిచే బలము నభివృద్ధి గావించికొని, లోకువగనున్న సామంతుల గొల్లగొని, రాజ విప్లవములలో విజృంభించి సమీపదేశము నాక్రమించు సైనికులనందఱ సమావేశపరచి రొక్కమునంతయు వ్యయము గావించి ప్రజాద్రోహము గావించుచు జనకంటకులై వర్తించున్న పూర్వసామంత రాజులనందఱ బంధించి సన్మార్గావలంబనులగు నూతనులను సామంతులుగను రాజ ప్రతినిధులుగను నియోగించి అనుమకొండలో నాంధ్రసామ్రాజ్యమును స్థాపించెను. దేశమంతయు నశాంతిమంతమై యున్న సమయములో జాతీయతా వర్ధనమునకై యాంధ్ర సామ్రాజ్యము నెలకొల్పి, యాఱిపోయిన చాళుక్యపరాక్రమవహ్నిని రగులజేసి మాతృ సేవగావించిన ప్రోలరాజన్యుని జీవితము మన కసమగ్రముగ లభించియున్నది. ప్రోలరాజు నెలకొల్పిన సామ్రాజ్యము నేటికి విస్మృతికి వచ్చినను నాటి శుభచిహ్నము లింతవఱకు అనుమకొండ ప్రాంతమున గానవచ్చుచున్నవి. జీర్ణచిహ్నములతో నాటిదుర్గములు, దేవళములు, ధర్మశాసనములు, రాచబాటలు, సరోవరములు, సింహద్వారములు గానవచ్చుచు నేటికి గూడ బ్రాచీనాంధ్ర దేశ చరిత్రకారులకు జరిత్ర భిక్ష పెట్టుచున్నది.

ప్రోలరాజు కాలమున వర్ధమాన పురము, పొలవాస, ధర్మపురి, మంత్రకూటము, దేవగిరి, కళ్యాణ పురములోనగు చోటుల బలవంతులగు చాళుక్య రాజ ప్రతినిధులూ రాజ్యము చేయుచుండిరి. ఎవరికి వారు స్వతంత్రులై సంఘైకమత్యమున గల మేలులు మఱచి వర్తింప దొడంగిరి. ఆంధ్ర దేశము భిన్న భిన్నముగ నుండెను. ఆంధ్రదేశమునకు బ్రత్యేకరాజ్యము లేకున్న లాభము లేదని ప్రోల భూపాలుడు అనుమకొండలో నాంధ్రసామ్రాజ్యమును స్థాపించినది మొదలు తక్కు దుర్గాధీశ్వరులకు బ్రోలరాజునకు వైరము పెచ్చరిల్లసాగెను. ప్రోలరాజు తనయావజ్జీవితము సంగ్రామరంగముననె గడపెను. దేశమంతయు నొక్కటి, యాతడొక్కడు నొకటి యగుటచే నెడతెగక బలమువృద్ధిజేసి ప్రతిఘటించిన రాజన్యుల నందఱను సామంతులుగ జేసికొనువఱకు జాలకాలము పట్టెను. మనము పఠింపబోవునది రుద్రదేవుని చరిత్రమైనను అతని పవిత్రజీవితమున కాధారభూతుడగు ప్రోలరాజు జీవితముగూడ బఠించుట యావశ్యకము కాకపోదు.

ప్రోలరాజు ఆంధ్రదేశ రత్నమనదగు అనుమకొండలో నాంధ్రసామ్రాజ్య రాజధానిని నెలకొల్పి చిరకాలమునకు దేశమున శాంతి స్థాపించెను. మరల జాళుక్యరాజులలో నొకడు కొంతబలమును సంపాదించికొని ప్రోలరాజును లోబరచికొనినగాని తనపూర్వ రాజ్యమంతయు హస్తగతము గాదని తలంచి విశ్వనాథ దేవుడను వీరవర్యుని సేనానాయకుని గావించి యుచిత పరివారముతో గుదురుకొన నున్న యాంధ్రసామ్రాజ్యము కూలద్రోయింప బంపెను. ప్రోలరాజు మొక్కవోని పరాక్రమముతో సేనానాయకుని సైన్యమును జెండాడి మూలచ్ఛేదనము గావింపకున్నచో శత్రువృక్షము మఱల జిగి రించునని కళ్యాణపురమును ముట్టడించి రాజవంశమును జెండివైచి విరోధియనువానిని లేకుండ జేసి, ఖడ్గముదాల్చి తానొనర్చిన తానొనర్చిన కూరకృత్యములు,

హత్యలు స్మరించి పాపపరిహారార్థమై గంగాతీరమున దేవళములు, కొనేరులుగట్టించి జీవితశేషము పారమార్థిక చింతనముతో గడప నిశ్చయించెను.

ప్రోలరాజు అనుమకొండరాజ్యము పాలించుతటి నొక చిత్రకథ జరిగెను. దూరవాసులగు పౌరులు కొందఱు రాజధానికి బండ్లతో వచ్చుచుండ అనుమకొండ రెండుక్రోసుల దూరములో నుండ నొకబండికాలు నేలలో దిగబడెను. మిగిలిన బండివాండ్రదఱు నాశకటచక్రమును బైకిలాగ నెంచి కృతార్థులు కారైరి. ఆ శకటములకు సంబంధించిన జనులందఱు గ్రామములోనికేగి అనుమకొండ వాసుల కీయవస్థతెలిపి జన సమూహమును సహాయముగొని బండ్లాగిన చోటు జేరి నేలలో నిరికికొనిన శకటచక్రము బలమంతయు నుపయోగించి లాగసాగిరి. కొంతసేపటికి భూగర్భమునుండి శకటచక్రము బయట పడెను. దానికమ్మి యంతయు సువర్ణమయ మయ్యెను. కాలు దిగబడినచోట సువర్ణచ్ఛాయ వెల్లివిరియు చుండెను.

పౌరు లావింత వేగమునబోయి ప్రోలరాజున కెఱిగించిరి. అతడు పరివారముతో బయలు వెడలి యాప్రదేశము సందర్శింప నటనొక సువర్ణలింగము జ్యోతిర్మయమైనది కానవచ్చెను. రాజన్యుడు వెంటనే దానిని ద్రవ్వించి యాశకటముపై నెక్కించి రాజధానిలో బ్రతిష్ఠింపనెంచెనుగాని యెంతప్రయత్నించినను ఎద్దు లాశకటమును లాగజాలవయ్యెను. చెంత నున్న బండ్ల విప్పించి కాండ్లుకట్టి తోలినను యెద్దులు మోర బిగించి ముందడుగు వేసి పోవ నెంత ప్రయత్నించినను బండి కదలకపోయెను. అది దైవమహత్త్వముగ భావించి దైవస్వరూపులు, మహానుభావులు, సర్వజ్ఞశిరోమణులు, కాళేశ్వర నివాసులు నగు రామారణ్య శ్రీపాదులను, త్రికూట నివాసులు, హిడింబాశ్రమ నివాసులు నగు త్రిదండమహామునుల రావించి వారి కీవిషయము ప్రోలరాజు విన్నవించెను. వారలు పూర్వోత్తర కథనంతయు నాలకించి యాసువర్ణలింగమునకు నత్యంత భయభక్తులతో నభిషేకము చేయించి విభూతి శ్రీచందన మలంది వేదోక్తముగ సహస్రనామపూఝ గావించి బిల్వపత్రముల బైనిగప్పి మహానైవేద్యమును సమర్పించి 'హరహరా!' యని యెద్దులను దోలుమనిరి. శకటము తేలికగా నడువ సాగెను. ప్రజ లామహాత్ముల శక్తికి విస్మయమునొందిరి.

రాజ్యాంగరహస్యవేత్తయు, పరబ్రహ్మస్వరూపుడు, విజ్ఞానరాశియగు రామారణ్యశ్రీపాదులు ప్రోలరాజుతో 'ఇది సామాన్య సువర్ణలింగము కాదు. స్పర్శవేదలింగము. దీనిని సోకినచో నినుము బంగారమగును. నూతనముగ నాలయముగో పురము గట్టించి యందు దీనిని బ్రతిష్ఠింపవలయునని యాత తీయ సమ్మతించెను. రామారణ్యశ్రీపాదులు శ్రీవిద్యాధర చక్రమునుబట్టి కోటకు రేఖలువ్రాసి యగడ్తలు త్రవ్వించి అనుమకొండవైపొక ద్వారమేర్పరచి చెంత నొకదివ్యాలయమున నాగలింగమును బ్రతిషచేయించెను. నూతనముగ నిర్మించిన పురమునకు నేకశిలానగరమని పేరు బెట్టి శ్రీపాదులు నిజనివాసమున కరిగిరి. స్పర్శవేదలింగమునకు సోకించినమాత్రమున దినమునకొక పుట్టియినుము అంతియ బంగారుమగుచుండెను. రాజన్యుడు దానిని ధర్మార్థము వినియోగము చేయుచుండెను.

చిరకాలమునకు బ్రోలరాజున కొకపుత్రుడుజనించెను. విధివిహితంబుగా నా బాలునకు నామకరణాది శుభకార్యంబులు నెరవేర్చి మహోత్సవాగతులకు విద్వాంసులముందు రాజన్యుడు కుమారుని జన్మకాలనక్షత్రాదికముల విన్నవించి బాలకుని భవిష్యజ్జీవితము నిర్ణయింప బ్రార్థించెను. బ్రాహ్మణోత్తములు తమలో దాము సంశయించుచు రాజుతో మాఱాడ వెఱచిరి. చకితుడై రాజన్యుడు విద్వాంసుల సందర్శించి యంజలి మోడ్చి "కానక గన్న యీకందువునకు బాలారిష్టములు లేవుగదా! ఈశ్వరవరప్రసాదమున సంతానవృక్షమునుండి లభించిన యీ ఫలము మాచేతినుండి తొలంగిపోవ భగవత్సంకల్పముకాదుగదా! ఆజ్ఞయిం"డని సదైన్యముగ బ్రశ్నించెను. విద్వాంసులు దూరమాలోచించి,

కం|| తనయెఱిగిన యర్థంబొరు
డనఘా! యిది యెట్లు సెప్పుమని యడిగిన
ప్పనివాడును సత్యము జె
ప్పనివాడును ఘోరనరక పంకమునబడున్.

అను నీతివచనమును దలంచుకొని సత్యము చెప్పక దాచగూడదని రాజన్యునితో "ఆర్యా! ఈ కొమారునివలన మీకు మరణము గలుగును. కొమారుడు చిరాయుశ్శోభితుడనుట

కెట్టిసందియము లేదు” అని విన్నవించిరి. రాజు బ్రాహ్మణుల సగౌరవముగ బంపివైచి ప్రోలరాజు తనధర్మపత్ని కీరహస్య మేకాంతమున నెఱింగించెను. ఆయమయు నొకవైపు పుత్రప్రేమము మఱియొకవైపు భర్తృభక్తి హృదయము నుర్రూతలూప జాలసేపు నిశ్చేష్టురాలై కర్తవ్యభారము భర్తపైనుంచెను. ప్రోలరాజు కానకగలిగిన నెత్తురు కందును విడువజాలక ఆత్మమరణమున కియ్యకొనజాలక పత్నియనుమతిచొప్పున నాబాలకుని నర్ధరాత్రమున రహస్యముగ గొనిపోయి స్వయంభూస్వామి మండపమున బొత్తులుపఱచి యందు బరుండబెట్టి పుత్రమోహవిషణ్ణయగు పత్నిచే బిడ్డనికి బాలిప్పించి పుత్రబంధము ద్రెంపుకొనజాలక యెటులో బయట బడెను.

మఱుసటిదినమున ఆలయ పరిచారకులు చూచుసరికి గేవు కేవుమని యేడ్చు నీనెత్తురుకందువు కాన్పించెను. వారలు వెంటనే యీరహస్యము నంతయు నర్చకులకు నివేదించిరి. వా రాశిశువును గాంచి దివ్యాకారశోభితుడగు నీబాలకుడు చక్రవర్తులయింట జనింపదగినవాడు. ఇట్టి దుర్గతికి లోనుగావలసినయవస్థ యేమికలిగెనో యని వానిని గొనిపోయి యింట నుంచి యీరహస్యమును బ్రోలరాజులకు నివేదించిరి. రాజా బాలుడు తనకుమారుడె యని యెఱింగియు నెఱుంగని యటుల నటించి ప్రేమము జంపుకొని యర్చకునితో ఎవడైన నేమి! పసిబిడ్డడు. రక్షింపదగినవాడు యుక్తవయస్సు వచ్చు వఱకు గాపాడి విద్యాబుద్ధులునేర్పి వానిని సంస్థానమున కప్పగింతురేని స్వతంత్రముగ జీవింపగలవాడగును. వీనిచే మీకు బుణ్యము పురుషార్థము కలుగును. బాలకుని పోషణమునకగు వ్యయమును సంస్థానమే భరింపగల”దని చెప్పి బాలకుని సంరక్షణమునకై కొందరు విశ్వాసయోగ్యులగు భటుల నియోగించెను. అర్చకులలో బెద్దయగు రుద్రజియ్యయనునాత డా బాలుని పోషణభారము దన తలపై నుంచుకొని యుక్తవయస్సు వచ్చినపిదప విధ్యుక్తముగ నుపనయనము గావించి బ్రాహ్మణ ధర్మానుసారముగ వేదశాస్త్రాదికము, క్షత్రియ ధర్మానుగుణముగ ధనుర్విద్యాదికము నేర్పి జాగరూకత నాబాలుని గాపాడసాగెను. అర్చకు డా బాలునకు రుద్రదేవుడని నామకరణము గావించెను. ఈతడె మన కథానాయకుడు. పవిత్రవంశమున జనించినవాయను ఆంధ్రవాఙ్మయమునకు ఆంధ్రదేశమునకు బ్రత్యేకవ్యక్తిత్వము సమకూర్పదగిన మహానుభావుడగుటచే గాబోలు నీబాలకుడు స్వల్పపరిశ్రమచేతనే సర్వశాస్త్రపరిజ్ఞానము శస్త్రవిద్యానైపుణ్యము గడించి సాటివారిలో సర్వవిధముల నెన్నికకెక్కి యౌవరాజ్యపట్టాభిషేకమునకు దగుప్రాయము గలవాడయ్యెను.

ప్రోలరాజు షట్కాలశివపూజానిరతుడు. స్వయంభూస్వామి యాలయమున కాత డొంటరిగా వచ్చి పూజాదికములు గావించిపోవు నాచారముగలదు. కొంత కాలమునకు స్వయం భూస్వామి యనుగ్రహమున వేఱొకకుమారుడు కలిగెను. వానికి మహాదేవరాయలని నామకరణము గావించి వాత్సల్యముతో బెంచుచుండెను. ఒకనాడు ప్రోలరాజు ప్రయాణము కానిశ్చయించి వేకువజామున లేచి పరివారముతో బయలుదేరి ద్వారమున ననుయాయులనుంచి తా నొక్కరుడ యీశ్వరసాన్నిధ్యమున కేగి పూజాదికములను శ్రద్ధాభక్తులతో నొనరింపదొడగెను. రాచనగరులో నుదయకాలమున మంగళగీతలు వినరాసాగెను. ప్రోలరాజు పూజాదికములు ముగించి శివనిర్మాల్యము గొనివచ్చుచుండ మండపమున నిదురించుచున్న యొక దివ్యమంగళవ్యక్తి గోచరించెను. ప్రోలరా జట గూర్చుండి యావ్యక్తిదివ్యాకారమును రూపరేఖావిలాసములు గాంచి యాశ్చర్యపడుచు దనలో దానుచింతించుచు దలయూపుచు నిశ్చేష్టుడై చాలసేపుగడపెను. తుదకు బ్రయాణ మనివార్యమగుటచే లేచి యావ్యక్తిని నొక్కమాఱు కౌగిలించుకొనిన గాని పోవజాలనని నిశ్చ యించి తరంగముల వంటి బాహువులు సాగించి నిదురలో మైమఱచియున్న యావ్యక్తిని గౌగిలింప బోయెను. వెంటనే గాఢనిద్రలో నున్న యావ్యక్తి యులికిపడి లేచి విద్యుద్వేగమున బ్రోలరాజును కోశనిర్ముక్తమగు పదనుకత్తితో వక్షమునుండి యావలకు దూరునటుల బొడిచెను. వెంటనే వృద్ధుడగు ప్రోలరాజు మొదలు నరికిన కదళీతరువు వలె బడిపోయెను. గంటవలె వెలుగుచున్న దీపపు వెలుగున నావ్యక్తి తనకత్తి కెఱయైన పురుషుని బోల్చికొని ప్రోలరాజని గుర్తించి గుండెల బాదుకొనుచు “అన్యాయముగా రాజన్యుని జంపితిని. రాజద్రోహము గావించిన నాకిక నధోలోకమే శరణ్యము. ఎంత యనాలోచితమునకు బాల్పడితిని! నిద్రావస్థలో జోరుడని చేయిమిగిలితిని. ఈ పాపకార్యము రాజనగరమున నివేదించి దోషమునకు దగినశిక్ష నొందుదుగాక”యని యావ్యక్తి బయలు వెడలెను. ఈసమ్మర్దము నాలకించి ద్వారమున నిలిచియున్న పరివార మంతయు మహామండలేశ్వరుని సమీపించి యీ విపరీతావస్థగాంచి నివ్వెరపోయిరి. ప్రోలరాజు కొంతసేపటికి దెలివినొంది యూర్ధ్వశ్వాసములచే మరణవేదన

మొందుచుండ రాజకియోద్యోగులు రాణివాసపు వారుగూడ నీకథవిని సంభర మముతో వచ్చి పలుదెఱంగుల వాపోవుచు ఖడ్గప్రహారము గావించిన నూతన వ్యక్తి జంప వలయుననియు గత్తికొక ఖండముగ జేయవలయు ననియు బలుక దొడగిరి. నోటమాట వెడలుటయే కష్టముగానున్న యా మరణావస్థలో తెఱప జేసికొని తీవ్రవాదులగు నారాజభక్తుల నందఱవారించి "మిత్రులారా! శాంతివహింపుడు. హంతకుడు స్వామిద్రోహికాడు. నాకుమారుడె. అతడు రుద్రదేవుడు. భవిష్యదాంధ్రసామ్రాజ్యచక్రవర్తి. ఇతని జననకాలముననె జ్యోతిష్కులు జాతకములవ్రాసి పితృమారకుడగునని సెలవిచ్చిరి. విపత్తునుండి బయటపడనెంచి వీని నాలయమున రహస్యముగజేర్చి యర్చకుల యాధీనమునం దుంచితిని. నేటితో నాకాయువు పరిపక్వమైనది. ఇప్పటికి నాకు డెబ్బదిరెండు వత్సరములు వచ్చినవి. భోగములపై విరక్తికలిగినది. మన:పూర్వకముగ నాబాలుండాంధ్ర సామ్రాజ్యమునకు భారవాహకు డగుటకు నేను సమ్మతించు చున్నాడను. మీరందఱు నాపై జూపిన గౌరవ మీ బాలకునిపై జూపుట కర్తవ్య"మని ప్రోలరాజు పల్కి స్తబ్ధుడై చూడసాగెను.

ప్రజలందఱు భయవిస్మయములచే దరంగితులై చిత్ర ప్రతిమలవలె నిలుచుండి యాదృశ్యమును దిలకించుచుండిరి. అనుకొనిన దొకటి అయిన దొకటి. రుద్రదేవుడా ప్రోలరాజు వాకములు వినిన సదాది "రాజద్రోహినేకాక పితృద్రోహినిగూడనైతినా ఈ పాపమున కిక శిక్షలేదు. నాయంతపాపి భూలోకమున లేడని తండ్రిపై వ్రాలి విలపించెను. ప్రోలరాజు తనయుని గాఢముగ కౌగిలించుకొని "కుమారా! విచారింపకుము. దె వనిది నెరవేరినది. ఖడ్గము నూడ బెఱకుము. బాధతో బ్రాణముల భరించుట చాలకష్టముగ నున్నది. సహగమనమునకు మీతల్లి సిద్ధురాలయ్యెనేని వలయు నవకాశముల గల్పింపుము. నీ సోదరుడు మహాదేవ రాయల భారము నీతలపైననే గలదు. ఇవి పద్మాక్షీదేవి ప్రసాదించిన దివ్యాయుధములు. మన పూర్వులు యాయుధముల దాల్చి విక్రమైకజీవనులై యుభయ లోకములలో బేరుగాంచిరి. పరిజనులారా! పౌరులారా! మీయందరి యొద్ద సెలవునొందుచున్నాడనని ప్రోలరాజు పంచాక్షరీ జపము చేయుచు గనులు మూసికొనెను. రుద్రదేవు డపనతముఖుండై పితృదత్తములగు నాయుధము లందుకొని తండ్రియురమున గాటముగ నాటుకొనిన ఖడ్గము నూడబెఱికెను. చిమ్మనగ్రోవితో గొట్టినటుల రక్తధారలు రుద్రదేవుని మెయినిండ బడెను. ముఖ్యులగు నమాత్యు లాయదనున రుద్రదేవుని నటనుండి తొలంగించి ప్రోలరాజు కళేబరమున కర్హమగు సంస్కారముల గావించిరి. రాజపత్నియు గుమారుని కౌగిలించుకొని యానందబాష్పములతో నాతని మేను దడిపి భర్తృచితిపై వ్రాలి వీరస్వర్గ రాజ్యమును జూరగొని జ్వాలా గర్భమున నందర్హిత యయ్యెను.

ఒక శుభముహూర్తమున రుద్రదేవ చక్రవర్తి యాంధ్ర సాంరాజ్యమునకు బట్టాభిషిక్తు డయ్యెను. దేశము మిక్కిలి సంకులస్థితిలో నుండెను. తన సహోదరుడగు మహాదేవరాయ పితృహత్యాకర్తయగు నన్నతో గలిసిమెలసి యుండడయ్యెను. ప్రోలరాజు కాలములో సామంతులుగనుండి పన్నులు చెల్లించిచుచు విధేయులై యున్నవారిలో బలువురు తిరుగబడి స్వతంత్ర పతాకముల నూపి యశాంతి సమీరము నతిశయింప జేయుచుండిరి. హృదయశల్యమువలె బితృహత్యా విచారము మనస్సును దీవ్రవేదనపాలు గావించుచుండెను. ముందు బితృహత్యాఘమునుండి విముక్తుడైన గాని తనజీవితము పవిత్రము గాదనియు, దా నపవిత్రుడై యున్నంతవఱకు బ్రజావిశ్వాస దూరుడు కావలసి వచ్చుననియు, నిశ్చయించి రుద్రదేవుడు రాజధానియగు అనుమకొండలో గొప్ప శివాలయము గట్టించి సహస్ర స్తంభమండపము దీర్పించి గొప్ప దీర్ఘికను ద్రవ్వించెను. ఒరంగల్లులో బెక్కుశివాలయముల బ్రతిష్ఠించెను. పూజారులచే బూజాపురస్కారముల నందికొనుసిద్ధేశ్వరునకు విశాలాక్షీ దేవికి నిత్యనైవేద్య దీపారాధనాదులకు గ్రొత్త వస్త్రములు నొసంగి బొక్కసములోని ధనముతో రాజధాని కాఱుక్రోసుల దూరములోనున్న అయ్యనవోలులోని విశాల ప్రదేశమున మైలారుదేవున కొకగొప్ప యాలయమును గట్టించి, ఒరంగల్లుకోటలో గల ద్వారములవంటి విచిత్రశిల్పాభిరామములగు ద్వారముల నాలుగువైపుల బ్రతిష్ఠించి అనుమ కొండకు బరుగుదూరములో నున్న వడ్డెపల్లిలో గొప్ప తటాకమును ద్రవ్వించి చెంత సిద్ధివిఘ్నేశ్వరుని బ్రతిష్ఠించి యచట విశాల మగు నాలయము మండపము గట్టించెను. ఇంతియగాక మొగిలిచర్లయనుచోట నేకవీరాదేవి యను శక్తిని బ్రతిష్ఠించి గొప్ప దేవళము గట్టించి వస్తువాహనములు సమర్పించి మరల రాజధానిచేరి తనపేర, దనతండ్రిపేర బెక్కుగ్రామములు గట్టించి యాగ్రామములు వేదవేదాంగ ప్రవీణులగు బ్రాహ్మణోత్తములకు ధారవోసి యంతతో

దృప్తినొందక దిగ్విజయపరుడై వివిధరాజుల వశంవదుల గావించుచు శ్రీశైలప్రాంతము తన హస్తగతము గావించుకొని యట బత్నీయుక్తుడై రత్నమాషణములు మడిమామాన్యములు సమర్పించి పాండ్యాధీశ్వరులపై దండయాత్రవెడలి కాంచీనగరము శ్రీరంగములోనగుపుణ్యక్షేత్రములు దర్శించి పాండ్యుల సామంత రాజులను గాలించి సేతుబంధన రామేశ్వరునియొద్ద కేగి తులాభారములు పెక్కు తూగి ధనుష్కోటిలో స్నానాదికముల గావించి జయములనెలకొల్పి రుద్రదేవచక్రవర్తి జయలక్ష్మి ద్వితీయ రాజధానికి జేరెను. మఱియొకమాఱు వారణాసీప్రాంతాలకు దండయాత్రకు వెడలి గంగాస్నానములు గావించి శోడ శోపచారములతో విశ్వేశ్వరునకు బూజాదికములు గావించి యనంతరము గయకేగి పితృదేవతలకు బిండప్రదానము సభక్తికముగ నిర్వహించి యిప్పటికి బాపవిముక్తుడ నైతినని రుద్రదేవచక్రవర్తి రాజధానినగర మగు ననుమకొండకు జేరెను. మహాదేవరాయలు విజయయాత్రలకు బుణ్యక్షేత్రములకు రుద్రదేవు డేగినపుడెల్ల రాజ్యవ్యవహారములు నిర్వహించుచు రాజద్రోహులతో గలిసి రుద్రదేవుని గడముట్టించు నుపాయము లారయుచు సమయమునకై నిరీక్షించియుండెను. ఇది గ్రహించి రుద్రదేవుని విరోధులగు సామంతరాజులు ఆంధ్రసామ్రాజ్యమును హరింపనెంచి మహాదేవరాయలతో రాయభారములు జరిపి విప్లవోద్యమమున బాల్గొన వాగ్దానము గావించిరి. రుద్రదేవు డిదియంతయు గ్రహించి తనతండ్రి యవసానకాలమున గావించిన హితోపదేశము జ్ఞాపకముంచుకొని సోదరుని క్షమించెను. ప్రతిపక్షులుమాత్రము మహాదేవరాయలు తమపక్షమువాడుగ విశ్వసించి యుంటచే నియతకాలమున అనుమకొండ రాజ్యమును ముట్టడింప బయలుదేరివచ్చిరి. ఈవిపరీత పరిస్థితులన్నియు రుద్రదేవుడు సమగ్రముగా గ్రహించి విరోధులతో సోదరుడు కలియకుండునటుల వలయు గట్టుదిట్టములు తొలుతగావించి ప్రత్యర్థుల మట్టుపెట్టుటకు సైనికబలమును మిగుల వృద్ధిజేసి విరోధు లరుదెంచు మార్గముల దెలిసికొని త్రోవలనరికట్టి వధింప గొంతబలమును బంపెను. మహాదేవరాయల యొద్దనుండి తమకు సరియగు నుత్తర ప్రత్యుత్తరములు నడుపకున్నను, దురాగతులగు ప్రత్యర్థిరాజులు అనుమకొండరాజ్యము హరింప సకాలమునకు వచ్చి రుద్రదేవుని ధాటి కాగజాలక ప్రాణమానముల గోల్పోయిరి. ఆకాలమున రుద్రదేవుని నెదిరించిన రాజులలో బలువురు ప్రసిద్ధులు గలరుగాని వారి ప్రత్యేక చరిత్రములు సమగ్రముగా దెలియ వచ్చుటలేదు. దొమ్మరాజు బలవంతులలో నగ్రగణ్యుడు. ఈతడు అనుమకొండరాజ్యమును హరింప వలయునని సమధికబల సమేతుడయివచ్చి కోటముట్టడించెను. ఈముట్టడి కొన్నిమాసములు జరిగెను. కాకతీయ సైన్యములు దొమ్మరాజు సైన్యముల జించిచెండాడెను. విజయముపై నాసమాని బ్రతుకుజీవుడాయని దొమ్మరాజు గుఱ్ఱమునెక్కి పారిపోవుచుండగా రుద్రదేవుడు వెంబడించి బాణముల బ్రయోగించి యాతనికాయము గాయము గావించెను. దొమ్మరాజు తన యశ్వారోహణనైపుణ్యము ప్రాణరక్షణముకొఱ కుపయోగించి యెందో దాగెను. రుద్రదేవుడీ యదనుగ్రహించి పరివారసహితముగా దొమ్మరాజు రాజ్యమునందు బ్రవేశించి కోట బగులగొట్టి రాజధాని గొల్లగొని విజయస్తంభమును బ్రాతించి తనప్రతినిధి నారాజ్యము నందుంచి వెనుకకు మరలెను. రుద్రదేవుడు దొమ్మరాజుతో బోరుచున్న సమయము తమ కనుకూలముగా గ్రహించి మేడరాజు, మేళగిదేవుడు అనుమకొండపైకి దాడివెడలిరి. అనుమకొండయందున్న మూలబల మావీరయుగముతో బోరాడుసరికి రుద్రదేవుడు రాజధానిజేరి వ్యూహముల బన్ని విరోధిబలములను బంచబంగాళము గావించెను. మేడరాజు, కందకములను బూడ్పించి రాజధానినంతయు దగులబెట్టించి యుపవనముల రూపుమాపి నగరమును బాడుచేసెను. తల దాచుకొనుటకు దావులేక భీమరాజు అంత:పుర కాంతలతో దోబుట్టువులతో రక్తసంబంధులతో నెందోపాఱిపోయి రుద్రదేవుని పేరు వినబడినంతవఱకు దలయెత్త డయ్యెను. అంతలో కందూరు వర్థమానపుర రాజ్యములు రుద్రదేవుని హస్తగతములయ్యెను.

చోడోదయుడను నొకరాజు విస్తార సైనికబలముతో స్వతంత్రుడై తిరుగబడగా రుద్రదేవు డాతనినగరమును ముట్టడించెను. అనుమకొండ సైనికులు చోడోదయుని నగరమును ధ్వంసము గావించిరి. రుద్రదేవుడు బాణముల బ్రయోగించి చోడోదయుని దేహమంతయు గాయములతో నిండునట్లు చేసెను. ఆయువుపట్లలో బాణములు గ్రుచ్చుకొనుటచే జోడోదయు డొడలెఱుంగక రాజమందిరము విడిచి కానల వెంటబడి ప్రాణములు విడిచెను. సమర్థులగు రాజులందఱు రుద్రదేవునకు సామంతులైరి. మహాదేవరాయలు రుద్రదేవుని యసాధారణ పరాక్రమమునకు ముగ్ధుడై ద్వేషము మాని కార్యాలోచనములం దన్నతో సర్వవిధముల నేకీభవించు చుండెను.

రుద్రదేవుడు పరాక్రమాతిశయముచే ఆంధ్రదేశమంతయు నాక్రమించుకొనెను. అంతియగాక కర్ణాటదేశము నందలి భాగములను ద్రవిడదేశములో గొంతభాగమును సరిహద్దులందున్న మహారాష్ట్రదేశమును సాధించెను. రుద్రదేవుని రాజ్యమునకు హద్దులు తూర్పుదిక్కున సముద్రమనియు, దక్షిణదిక్కున శ్రీశైలమనియు, బడమటిదిక్కున జాళుక్యరాజధాని యగు కల్యాణపురమనియు, ఉత్తరపుదిక్కున మాల్యవంతమనియు జెప్పబడెను. ఇంత విశాలరాజ్యమును బరాక్రమముచే నార్జించి శాశ్వతస్థాయిగా గాకతీయ సామ్రాజ్యమను పేర నిలిచియుండుటకు బాటుపడిన రుద్రదేవుని పవిత్రసంకల్పము సర్వజనసంభావనీయ మనుటలో సంశయము లేదు. ఈ వీరాధివీరుని పరిపాలనముతో బట్టు దప్పిన చాళుక్య చోడ రాజ్యము దాదాపుగ నంతరించెను.

రుద్రదేవుడు లలితకళలను మిగుల బ్రేమించి పోషించెను. అనుమకొండలో నపూర్వ శిల్పరమణీయమగు నొక దేవాలయము గట్టించి ముందు వేయిస్తంభములతో గొప్ప మండపము గట్టించెను. ఇపు డామండపము చాలవఱకు గూలి పోయినది. ఆలయముమాత్రము నేటికి దర్శనీయమై మనోహరముగ నున్నది. ద్వారములందు గల లతాచిత్రములు స్తంభములపై గల పురాణకథావిగ్రహములు జీవకళ లుట్టి పడుచు గనువిందు గూర్చుచున్నవి. నాడుపెట్టిన మెఱుగు నేటికి గొంచెమేని కనుమాయక యచ్చెరువు కలిగించుచున్నది. గర్భాలయ ద్వారబంధములపైగల శిల్పములు, విగ్ర హములు ప్రత్యేకదర్శనీయములు. ఆలయాభిముఖముగ నున్న నంది చూచి యానందింపదగినది. ఇంక నాకాలమున రుద్రువిభుని త్యాగాధారమున బ్రతిష్ఠింపబడిన యపూర్వ శిల్పదేవాలయములు కలవుగాని వాని వర్ణనమిచట గావించుట ప్రకృతము కాదు. రెండవ ప్రతాపరుద్రుని కాలమున యవనులు గావించిన దండయాత్రలో నీ యాలయము రూపుమాపబడెను. హతశేషమగు నాలయభాగము,రుద్రదేవుని విజయకథల దెలుపుశాసనము, కోనేరు నేటికిని దర్శనయోగ్యములుగ నున్నవి. రుద్రదేవుడు నగరము చుట్టు పెద్దమట్టికోట గట్టించి యన్నివైపుల గట్ట నాధారపఱచి తటాకముల బ్రతిష్ఠించెను. సేనానాయకులుగూడ బెక్కుతటాకముల ద్రవ్వించి రాజ్యమంతయు సుభిక్షము గావించిరి. ఆంధ్రసామ్రాజ్యమున నా కాలమున క్షేత్రములు సస్యసంపూర్ణములై మనోహరముగా నొప్పుచుండెను.

రుద్రదేవుడు శైవమునం దభిమాన బావము గలవాడు. అట్లుండియు నా కాలమున మిగుల వ్యాప్తముగానున్న జైనమతమునెడనెట్టి విద్రోహమును గావించి యెఱుంగడు. తన యాస్థానమునందు వీరశైవ, జైన, అద్వైత, విశిష్టాద్వైత పండితులకు సమగౌరవము లొనరించెను. పలుమారు తులాభారముల దూగి సువర్ణము విద్వాంసులకు బంచియొసంగెను. అనుమకొండ సామ్రాజ్య నగరముగా నుండుటకు దగినదిగా దోచకపోవుటచే దన తండ్రికాలమునుండి కట్టింపబడుచున్న ఏకశిలానగరమునకు లక్షలకొలది ధనము వ్యయముగావించి బురుజులు, కోటలు, కందకములు, కొత్తళములు నిర్మించెను. రుద్రదేవుని యాస్థానమునందున్న కవులలో పాలకురికి సోమనాధుడు, గురు మల్లికార్జున పండితారాధ్యుల వారు, రామేశ్వర భట్టారకుడు లోనగు ప్రముఖులు పలువురుగలరు. రుద్రదేవుడు కవులతో నిష్టగోష్ఠులు గావించి వినోదించుటయేగాక తాను స్వయముగా గవిత్వమును చెప్పనేర్చి కర్ణాటసంస్కృతాంధ్ర బాషలలో నసమాన పాండిత్యము నార్జించి “విద్యాభూషణు” డను బిరుదము బడసెను. ఇంతియగాక రాజకీయధర్మములు, రాజవిధులు చర్చించు నీతిసారమును నొక పద్యకావ్యమును రచించి యాంధ్రభాష నలంకరించెను. ఇపు డాగ్రంథము లభింపకపోవుట సంతాపకరము. ఈయన యాస్థానమునందున్నటుల బై చెప్పిన గురుమల్లికార్జున పండితారాధ్యులవారు దండనాధుడుగ నుండి యాస్థానము నందు విద్యావినోదములలో బాల్గొనుచు శివస్తోత్ర గ్రంథముల బెక్కింటిని రచించెను. రుద్రదేవుని నడిమివయస్సున నీ పండితారాధ్యులు మరణించిరి.

పాలకురికి సోమనాధుడు మల్లికార్జున పండితారాధ్యుల వారి యనంతరము కొంతకాలమునకు రుద్రదేవుని యాస్థానమున బ్రవేశించి మృదుమధురమగు దనయాంధ్రకవిత నాధారముగ జేసికొని వీరశైవమతము మిగుల వ్యాప్తిలోనికి దెచ్చెను. మతావేశపరశుడగు నీసోమనాధుడు జైనుల బౌద్ధుల జంపించె నని స్థానికచరిత్రములందు గలదు. ఇతని గ్రంథములు పరమతదూషణము, స్వమతస్తుతి గలవి గాని నీతనియెడ నారోపించిన దోషము లాకాలపు జరిత్రము సమగ్రముగా నెఱింగిన వారికి సత్యములని తోచుటకు సంశయ ముండదు.

రుద్రదేవునియొద్ద సేనా నాయకులుగ నున్న బేతిరెడ్డి, నామిరెడ్డి, రుద్రదేవ సేనాని లోనగు వీరుల చరిత్రము సమగ్రముగ దెలిసికొనవలసి యున్నది. రుద్రదేవుని సోదరుడు మహాదేవరాయలు మూడుసంవత్సరములు రాజ్యము పాలించినటుల జరిత్రములందు గలదు. రుద్రదేవుడు జీవించియుండగా శౌణదేశాధీశ్వరుడును యాదవ నరపాలకుడునగు జైత్రపాలుడు త్రిలింగదేశము మీదికి దండెత్తి వచ్చినపుడు మహాదేవరాయ లెదిరింపబోయి మడిసినటుల జరిత్రములందు గలదు. శాసనము లందు రుద్రభూపాలుని యనంతరము రాజ్యము పరాదీనము కాగా వీరవతంసుడగు రుద్రసేనాని పునరుద్ధరించినటుల గన్పట్టుచున్నది. మహాదేవరాయలు జీవించి యనంతరము మూడుసంవత్సరములు రాజ్యమును బాలించినదే సత్యమైనచొ రుద్రదేవుని యనంతరము రాజ్యము పరాధీనము గావలసిన యవసరములేదు గావున మహాదేవ రాయలు రుద్రదేవుని కంటె ముందుగానే మరణింప వలయును. ఇదియె యుక్తియుక్తమగు మార్గము.

రేచెర్లగోత్రీయులగు వెలమవీరులలో బలువురు కాకతీయులకడ సేనానాయకులుగ నుండి కాంచీనగరము భేదించి చోడరాజుల జయించితిమనియు గాంచీరాజ్యలక్ష్మిని గాకతీయుల కైవసము గావించితిమనియు వ్రాసికొనియున్నారు. ఆంధ్రదేశమునకు గాంచీరాజ్యము మిగుల దూరముగా నుండుటచే గాకతీయులు మాటిమాటికి గాంచీనగరములో బఱచికొనుటయు మఱల గొల్పోవుటయు బలుమాఱు జరిగియుండును. రుద్రదేవుని కాలమున గాంచీనగరమును రేచెర్ల నామిరెడ్డి జయించి చోడరాజు నవమానపఱచి తద్రాజ్యలక్ష్మిని రుద్రదేవుని యధీనము గావించినటుల శాసనదృష్టాంతములు గలవు. రుద్రదేవుడు తన యవసాన దశలో గణపతిదేవునకు రాజ్యము నొసంగెను. గణపతిదేవుడు మహాదేవరాయలకుమారుడు. రుద్రదేవునికాలము క్రీ.శ. 1140 మొదలుకొని 1196 వఱకై యుండునని చరిత్రగ్రంథమువలన దెలియుచున్నది. ఆంధ్రజాతీయతకు ఆంధ్రవికాసమునకు ఆంధ్రజాత్య భ్యుదయమునకు సహకారిగ నాంధ్రసామ్రాజ్యము స్థాపించిన వీరవతంసుడగు రుద్రదేవుని జీవితచరిత్రము పఠనీయము. ఈ మహనీయుని చరిత్రమెంతయో గ్రంథస్థము గావలసియున్నది చరిత్రకారు లీతని బ్రథమప్రతాపరుద్రుడని వ్యవహరించు చున్నారు. ప్రతాపరుద్రనామమె యీయనకు లేనపుడు రుద్రదేవుడని వ్యవహరింపక ప్రతాపరుద్రుడనుట యుక్తముగ లేదని మేము రుద్రదేవుడనియే వ్యవహరించితిమి.

కన్నమదాసుడు.

పలనాడు రాజ్యము పాలించు నరసింగరాజు, నలగామరాజు అను రాజులయొద్ద నాయకురాలను రెడ్డియువతి మంత్రి పదవియందు బ్రవేశించి యంతకుముందు మంత్రిగానున్న రేచెర్లగోత్రుడును వెలమ వీరుడునగు శీలము బ్రహ్మానాయని వెడలనడిపించెను. బ్రహ్మానాయడు బాలమలిదేవాది రాజకుమారులను వెంటబెట్టుకొని గురుజాలకు గొంచెము దూరమునందున్న యడవిప్రదేశము తెగనఱికి మాచర్లయను నగరము కట్టించి యందుండెను. బ్రహ్మానాయకుడు పేరునకు మంత్రియైనను రాజ్యచక్రము తానే త్రిప్పుచుండెను. పలనాటి సీమలో బ్రహ్మానాయని దేవునిగా భావించుచుండిరి. ఒక పంచమకాంత చిరకాలము సంతానము లేక పరితపించి బ్రహ్మానాయకుని యనుగ్రహమువలన గొడుకు జనించెనేని ఆయన పాదములచెంతనే పడవేయుదునని మ్రొక్కుకొనెను. దైవవశమున బంచమాంగన నవమాసములు నిండినవెనుక నొక బాలుని గనెను. బాలుని జూడగనే ప్రేమకలిగి బ్రహ్మానాయని కొసంగుదునని మ్రొక్కుకొన్నసంగతి మఱచి తానె పెంచుచుండెను. బాలునకు గొన్నాళ్లకు గొప్ప వ్యాధివచ్చెను. స్వప్నమున నొకపురుషుడు కనిపించి నీవాడినమాట తప్పుటచే గుమారునకు రోగమువచ్చినది. నీమాట చెల్లించుకొందువేని కుమారుడు చిరంజీవి కాగలడని చెప్పెను. పంచమాంగనకు వెంటనే బ్రహ్మానాయని పాదములయందు బడ వేయుదునన్న మాట జ్ఞాపకమునకు వచ్చి ఆరోగ్యము కలుగ గానే వాగ్దానము నెఱవేర్చుకొందునని మ్రొక్కుకొనగా బాలునకు దినక్రమమున ఆరోగ్యము కలిగెను. పంచమకాంత ఒక శుభముహూర్తమున బాలుని గొనిపోయి బ్రహ్మానాయని పాదములముందుంచి యిటుల విన్నవించెను. “మహారాజా! నీవరప్రభావమున నాకీకుమారుడు జనించినాడు. బాలుడు జనించినచో నీపాదములమీద వేయుదునని మొక్కుకొని మఱచితిని. అందుచే దీరని వ్యాధులవలన నిన్న మొన్నటివరకు నవిసినాడు. నావాగ్దానము నెరవేర్ప నుంటిననిమ్రొక్కుకొనగా బ్రతికినాడు. నేనుకన్నంతమాత్రమున దల్లినికాను. నీధర్మపత్నియగు ఐతమ్మయే యీబాలునకు దల్లి. మీరే తండ్రి. బాలునిపోషించు భారముమీది” ఇట్లువిన్నవింపగనే నాయ డానందమొంది బాలుని గై కొని శిరముమూర్కొని పెంచుకొనుమని ధర్మపత్ని కొసంగెను. ఆయమయు బంచమ బాలుడని కొంచెమేని సంశయింపక దాదులచే బాలిప్పించుచు బెంచుచుండెను. సంతానములేదను కొఱతను దిగనాడి యాపుణ్యదంపతు లాబాలకునితో గాలయాపనము జేయుచు నొక శుభలగ్నమున నాతనికి కన్నమదాసుడని నామకరణము గావించిరి. కొంతకాలమునకు గన్నమదాసుడు పెద్దవాడై పాతాలలకేగి సమస్తవిద్యల నభ్యసించిన పిదప గరిడీ సాము వ్యాయమములు గూడ నేర్చుకొని జెట్టియయ్యెను. వర్ణాశ్రమ ధర్మములకు మిగుల బట్టుగల యాకాలమున బ్రహ్మానాయకుడు పంచముని జేరదీసెనని నిందింపసాగిరి. కొందఱు కన్నమనాయనియెడ నకారణద్వేషము ప్రకటించుచుండిరి. ఎందఱెన్ని విధముల నాందోళన పడుచున్నను పుణ్యదంపతులగు ఐతమ్మయు, బ్రహ్మానాయకుడు మాత్రము పుణ్యభావముతో నాబాలుని జూచుచుండిరి. కొంతకాలమునకు ఐతమ్మ గర్భవతియయ్యెను. బ్రహ్మానాయని యానందమునకు మేరయేలేదు. సంతోష సూచకముగా మాచెర్ల చెన్నకేశవున కెన్నియో ఉత్సవములు, వేడుకలు చేయించి నాయడు మహావైభవముగా సీమంతోత్సవము జరిపించెను. శుభముహూర్తమున ఐతమ్మకు జక్కనికుమారుడు జన్మించెను. బాలచంద్రునివలె బ్రకాశించు నాకుమారరత్నమునకు బ్రహ్మానాయకుడు బాలచంద్రుడని నామకరణము గావించి శాస్త్రపారంగతులగు బ్రాహ్మణోత్తముల రావించి బాలుని జనన తిథి నక్షత్రత్రాదులను దెలిపి జాతకము వ్రాయుడని కోరెను. నాయకురాలివంపున వచ్చిన వంచకబ్రాహ్మణుడు తన విద్యాప్రకటనము గావించి బ్రహ్మానాయుని లోగొని జాతకమువ్రాయుదునని చెప్పి సెలవొంది కొన్నిదినములకు సభచేయించి అందుజాతకపత్రికను బఠించెను. ‘బాలచంద్రుడు మిగుల దుర్మార్గుడగును. వాని జన్మనక్షత్రము చెడ్డదగుటచే దనవారికి బెరవారికిగూడ నిత డకాలమృత్యువై సర్వకుటుంబములు రూపు మాపగలడు. బాలకునివలని యపాయము తొలగింపవలయుననిన దెగటార్చుట తప్ప వేఱుకర్తవ్యములే’దని కపటజ్యోతిష్కుడు చెప్పెను. సభ్యులు, రాజబంధువు

లొకరి మొగము లొకరు చూచుకొని బ్రహ్మనాయకుని కేమియు జెప్పజాలక మిన్నకుండిరి. ఇదియంతయు బ్రహ్మనాయడు కనిపెట్టి పుత్రప్రేమను దిగనాడి సభ్యులందఱి నడిగి యనుమతి దెలిసికొని బాలునిజంపుటకే నిశ్చయించుకొనెను. అంతలో నొక వృద్ధుడు లేచి 'బ్రహ్మనాయకా! బాలునిజేతిమీద జంపుటయన్న సామాన్యకార్యమా? ఎవరికి జేయాడును? సముద్రమున బాఱవేసిన వాడె చచ్చును. అదియె కర్తవ్య'మని తెలిపెను. బ్రహ్మనాయడు పెచ్చుపెరుగుశోకము నాపుకొని తన యభిమానపుత్రుడగు కన్నమనాయకుని బిలువనంపించి ఐతమ్మకడ జనుబాలుద్రావుచున్న యేపాపము నెఱుంగని బాలచంద్రుని దెప్పించి యీబాలకుని సముద్రములో బడవేసి రమ్మని యిచ్చెను. కన్నమనీడు చాలవిచారపడి బ్రహ్మనాయకుని మాటకు బదులుచెప్పజాలక సభ్యులే నివారింతు రేమోయని వారల విచారకరములు, ప్రార్థనాపూర్వకములగు చూపులతో జూచెను. సభ్యులందఱును బ్రహ్మనాయకునియాజ్ఞను సత్వరముగా నెరవేర్పుమని కన్నమనాయకుని బ్రోత్సహించిరి. బ్రహ్మనాయకుడు తొందరపెట్టెను. కన్నమనాయకుడు 'కనులుదెఱువని పసికందును అన్యాయముగా జంపవలసి వచ్చినదే! ఈపసిపాపని కాపాడ జాలని నాబ్రదుకు గాల్పనా? నే నస్వతంత్రుడను. జనకుడగు బ్రహ్మనాయకుని ఆజ్ఞకు వ్యతిరేకము జరుపదగదు. అనుకొనుచు బ్రహ్మనాయకుని కనుసన్నల ననుసరించి సముద్రతీరమునకుబోవ చందవోలునకు బ్రయాణమయ్యెను. రాజమందిరమునందును పట్టణమునందును బ్రహ్మనాయకుని గృహంబునను నాడు విచారమునకు మేరలేకుండెను. కన్నమనాయకుడు మండువేసంగిలో బాలునొక తొట్టెలోనుంచికొని పైనిగుడ్డలుకప్పి త్రోవకడ్డమగు ప్రతిగ్రామము నందును, బాలిప్పించుచు గొంతసేపటికి జందవోలు చేరెను. ఆకాలమున గల నగరరాజములలో చందవోలు ప్రఖ్యాతమైనది. చుట్టును బ్రాకారములు, కోటలు కలవు. క్రొత్తవాడెవ్వడు నగరమున నడుగుబెట్ట వీలులేక పోవుటచే గన్నమనాయడు బాలకునెటులో నగరముబయటనుండి సముద్రతీరమునకు జేర్చెను. జాముప్రొద్దు పోయెను. అంధకారము నలుదిక్కుల బాగుగా నావరించి యుండెను. బాలుడు ఆకలిగొని యేడ్చుచుండెను. చేతులార పసిపాపని సముద్రములో బాఱవేయ జాలక కన్నమ నాయకుడు మైమఱచి యెలుగెత్తి యేడువసాగెను. దిక్కులేని సముద్రప్రాంతమున వారల నోదార్చువా రెవరు? కన్నమనాయ డిటుల నేడ్చుచుండగా జెంత నెవరో "ఎవరునీవు? ఈయర్ధరాత్రమున నిర్జనప్రదేశమందు విలపించుటకు గారణమే"మని యడిగిరి. వారిరువురు నీక్రిందివిధముగా జీకటిలోనే సంభాషించుకొనిరి.

"ఎవడవు నీవు? ఇచటికేల వచ్చినాడవు?"

"నేనెవడనో నీకు జెప్పవలసిన యవసరములేదు. ఊరక ప్రసంగింపక నీవు వచ్చినత్రోవను బొమ్ము! నీకిచట నేమిపని?"

"నేనెవడనో నీకుదెలుపువఱకు నీవృత్తాంతము తెలుపవుకాబోలును. జాగ్రత్తగా నొడలెఱింగి నీ కులశీలముల దెలుపుము, లేదా నిన్నుఖండింపక మానను."

"సంగరమునకు దొరకొన్నచో నన్ను నీవు ఖండింతువని యెటుల జెప్పగలవు? విజయము బలాబలములపై నాధారపడి యుండును. ఒకవేళ నీవే గతింతువేమో!"

"మితిమీఱి భాషించుచున్నాడవు. నీవు దొంగవాడవు కానోపుదువు. కాదేని నీవృత్తాంతము మరుగుపఱుపవలసినపని యేముండును? నగలకొఱ కీబాలకుని జంపుచుంటివి కాబోలు"

"నిన్నుమాత్రము చంపక విడుతునా" చీకటిలోనున్న నూతనపురుషుడు హుంకరించుచు నొఱలోని కత్తిపెరికి కన్నమనాయుని మీదికి వచ్చెను. కన్నమనాయడు కరవాలము దీసికొని నూతనునిపైకి బోయెను. ఇరువురు చాలసేపు భయంకరముగా యుద్ధముగావించిరి. ఇరువురకు దేహమంతయు రక్తమయమయ్యెను. నూతను డాపరానికోపముతో "ఈవ్రేటునకు నీతల తెగ గొట్టనేని నేను బ్రహ్మనాయని తమ్ముడనుగాను" అనిపలికెను. కన్నమనాయ డులికిపడి కత్తినేలపై బడవేసి నూతన పురుషుని పాదములపై బడి, అయ్యా మీరింతకుముందు బ్రహ్మనాయకుని బేర్కొంటిరి. మీ నామధేయమేమి? నేను బ్రహ్మనాయకుని యభిమాన పుత్రుడను. మీవృత్తాంతము వినుటకు నిరీక్షించుచున్నాను" అని పలికెను. నూతనుడు తాను శీలము బ్రహ్మనాయకుని సోదరుడనియు జందవోలు పాలించు రాజులయొద్ద సేనానాయకుడుగ నుండెననియు దనపేరు పేరినీడనియు దెలిపెను. నూతనుని కన్నమనాయడు కౌగిలించుకొని 'తెలియక సంగరమునకు

కొరకొంటిని క్షమింపు'మని వేడుకొనెను. పేరినీడు కన్నమనాయనివృత్తాంతము, బాలచంద్రుని సముద్రములో వేయవలసిన పరిస్థితులు దెలిసికొని పరితపించెను. పేరినీడు కన్నమదాసునితో 'బాలకు నన్యాయముగా సముద్రములో వేయుటకంటె బాపము వేఱొండులేదు. నాకొసంగినచో బెంచుకొందును' అనెను. బాలచంద్రుని గన్నమనాయడు పేరినీని కిచ్చి సెలవు పుచ్చుకొని బ్రహ్మనాయకునితో విధ్యుక్తధర్మము నెఱవేర్చితినని విజ్ఞాపనము జేసికొనెను. బ్రహ్మనాయడు, ఆతని పత్నియుగొంచెముసేపు దు:ఖించి క్రమముగా విచారము మఱచిరి. కొన్నిసంవత్సరములు జరిగినమీదట పేర్నీడు బాలచంద్రుని తన వెంటగొని బ్రహ్మనాయకుని కప్పగించి సుగుణరత్నాకరుడగు కుమారుని జంపుదురా? కన్నమనాయనిదయచే నీశిశువు బ్రదికినాడు. లేకున్న మనవంశము నశింపవలసినదే గదాయని నిష్ఠురములాడెను. ఐతాంబయు బ్రహ్మనాయడును దనకుమారుడు మఱల వచ్చినందులకు బ్రహ్మానందము నొంది యింతటియదృష్టము కలుగజేసిన కన్నమ నేడు ప్రశంసాపాత్రుడని యాతని వేయినోళ్ళ గొనియాడిరి. నాడు మొదలు కన్నమనీడు బాలచంద్రునిపై దన పంచ ప్రాణములుంచి యతనిశ్రేయస్సే తనదిగా భావించి తానెఱింగిన విద్యలన్నియు నాతనికి నేర్పుచు వెంటనిడుకొని త్రిప్పుకొనుచుండెను. బాలుని విద్యావివేకములకు గన్నమనేని సోదరప్రేమకు బ్రజలందరు. సంతసించిరి.

కొంతకాలము గడచినమీదట నాయకురాలు మాచెర్ల వైభవము చారులవలన నాలించి యెటులేని బ్రహ్మనాయకుని, రాజకుటుంబమును బరాభవింప దలంచి పలువురు దొంగలను బిలువనంపి వారి నందఱను మాచర్లలోని రాజమందిరము, బ్రహ్మనాయకుని గృహము దోచిరండని పంపెను. దొంగలు సకాలమునకు జంద్రవంకనదీతీరమున జేరి భోజనాదు లొనరించి దొంగతనమునకు సమయ మరయుచుండిరి. బురుజు పై నెక్కి బ్రహ్మనాయకుడుగాంచ బలువురు నూతనులుకనిపించుటచే ననుమానించి అభిమాన పుత్త్రరత్నమగు కన్నమనాయని పిలిచి దొంగలేయైనచో దగినబుద్ధిచెప్పి రమ్మని పంపెను. కన్నమనాయడు పరివార సహితుడై చంద్రవంక నదీతీరమున నున్న కంచె చెంతనిలచి యాలింపగా బ్రసంగముల వలన వచ్చినవారు దొంగలనియు నాయకురాలిచే బంపబడి మాచర్లదోచుటకు వచ్చిరనియు దెలియవచ్చెను. వెంటనే కన్నమనాయడు పరివారముతో ముందునకు దుమికి ఏప్రయత్నములు లేక యిష్టగోష్ఠిసలుపుచున్న దొంగలనందఱ బంధించి వారియొద్ద గల యాయుధము లన్నింటిని రాచనగరునకు బంపి గోనెల దెప్పించి వానినిండ నిసుకనించి దొంగల నెత్తిపై బెట్టించి గురుజాలకు నడిపించి అందఱ నొక దొడ్డిలోనికిందోలి తాను ద్వారము గాచియుండెను. కన్నమనాయడు ------ బంపబడిన చోరులను బరాభవించినందులకు నాయకురాలు కోపించి తూలనాడెను. కన్నమనాయడు నాయకు రాలు యొక్క దురంతము గురిజాల వాసులందఱకు దేటతెల్ల మగునట్లు నాయకురాలి నిందావచనము లన్నింటికి బ్రత్యుత్తరము నొసంగి గృహాభిముఖుడయ్యెను. ఎంతకును కన్నమనాయకుడు రాకపోవుటచే బ్రహ్మనాయకుడు తెల్లవారి విచా రింపగా గురిజాల కేగినటుల దెలియవచ్చెను. మధ్యాహ్నమైనను కన్నమనాయడు గురిజాలనుండిగూడ రాకపోవుటకు జాలచింతించి బ్రహ్మనాయడు స్వయముగా గురుజాలకు బయనమయ్యెను. కన్నమనాయడు తప్పక సురక్షితముగా రాగలడు. మీరు గురుజాలకు బోవలదని నాయనితో భటులు, ఆప్తులుచెప్పిరిగాని ఆతడు వినక బయలుదేరెను. కన్నమనాయడు గావించిన పరాభవము తలంచికొని నాయకురాలు ప్రతిక్రియకొఱకు వెదకుసరికి బ్రహ్మనాయకుడు గురిజాల చేరి తనకుమారుడు సురక్షితముగా జోరులను వంచించిన విషయము విని చాలసంతసించెను. నాయకురాలు గురిజాల నడివీధిలో కోడి పందెములు, పొట్టేళ్ళ పందెములు, పికిలిపిట్టల పందెములు. కౌజు పందెములు, పెట్టి యెటులో బ్రహ్మనాయకు నొప్పించి యందు దానెగెలిచెను. ఓడినవారు ఏడుసంవత్సరములు అరణ్యభూములలో నివసించి పిదప రాజ్యము బొందునటుల గట్టడి చేసికొనుటచే బ్రహ్మనాయకుడు పరివారముతో నడవులపాలై నియతకాల మెంతో శ్రమమీద జరిపి తన రాజ్యము తనకు వశముచేయుమని రాజకుమారుల పక్షమున నలగామ రాజాదులకు వర్తమాన మంపెను. కన్నమనాయడు రాయబారములతో గార్యమెన్నటికేని యనుకూలింపదనియు ఏడు సంవత్సరములనుండి రాజ్యమును జూరగొన్న విరోధులు మాటలతో దిరుగ రాజ్యము నొసంగ రనియు సంగరమున కాయితమగుట యుక్తమనియు బ్రహ్మనాయకునితో విన్నవించెను. బాలచంద్రుడు గూడ సంగరము చేయుటయందు దనకుగల యుత్సాహము సూచించెను.

బ్రహ్మనాయకుడు కొమ్మరాజు పుత్రుడును ప్రతిపక్షరాజగు నరసింగరాజున కల్లుడునగు అలరాజును సంధివిషయమై ప్రసంగించుటకు గురిజాలకు వృద్ధబంధుజనానుమతంబున బంపెను. సంధిప్రయత్నము వ్యతిరేకమైనచో సంగరమునకేని సిద్ధముగా నుండవలయునని బ్రహ్మనాయడు బంధువులకు ఆప్తులకు ముందుగ దెలిపి యుద్ధపరికరములను జాగ్రత్త పఱచు చుండెను.

బ్రహ్మనాయని పక్షమువారికిని నాయకురాలిపక్షమువారికిని సంధికుదురకపోయెను. సవతితల్లికుమారులగు బాలమలి దేవాదులకు రాజ్యములో భాగమునీయమని నలగామరాజు ఖండితముగా దెలిపెను. రాయబారమునకు నేగిన అలరాజును నిర్దయగా వధించిరి. ఏడుసంవత్సరములు అజ్ఞాతవాసముజేసి వచ్చిరని గూడ సవతితల్లి కుమారులపై నలగామరాజునకు నరసింగరాజునకు నాయకురాలికి గరుణరాదయ్యెను. సంగరమునకు గారముపూడిచెంత నాగులేటితీరమున గల విశాలప్రదేశమును నెలవుచేసికొని యుభయపక్షములవారు చాల భయంకరముగా బోరాడిరి. కన్నమనాయడు డీసమయమున సంగరవిధమును బ్రహ్మనాయని కెఱుగ జేయుచు నుండెను. శత్రు పక్షము విస్తారముగ నుంటచే బ్రహ్మనాయడు కన్నమనాయకుని బ్రోత్సహించి విజయము గలుగువఱకు సంగరము గావింపుమని వీర తాంబూలము నొసంగెను. కన్నమనాయడు భైరవఖడ్గముబట్టుకొని యుద్ధరంగమున కుఱికి శత్రువుల నందఱను అరటిచెట్లులను నఱకినటుల నఱుకుచుండెను. వీరు లెవరును కన్నమనాయని నెదిరింపజాలరైరి. రణరంగము క్షణముసేపులో రక్తప్రవాహములతో నిండిపోయెను. ఎక్కడజూచిన తానయై కన్నమనాయడు బ్రహ్మనాయకుని యాన శిరసావహించి శత్రుబలమునంతయు నిరపశేషముగావించెను. ఉభయపక్షములందును బేరుగల వీరులందఱు మరణించిరి. ఏకపుత్రుడగు బాలచంద్రుడు గూడ మరణించెనని బ్రహ్మనాయకు డించుక విచారపడి మఱల ధైర్యము కొని కర్తవ్యము యోచించుసరికి కన్నమనాయడువచ్చి నాయకురాలు దక్కమిగిలిన శత్రుబలమంతయు నాశనమయ్యెనని విన్నవించెను. బ్రహ్మనాయుడు కన్నమనాయని గౌగిలించికొని 'కుమారా! నాఋణముతీర్చికొంటివి. నీకదనప్రశస్తి లోకమునంతయునచ్చెరువు పెట్టినది. మనము ప్రపంచములోనికివచ్చి పుణ్యమో పాపమో గడించితిమి. ఆప్తులందఱు మరణించిరి. నాయకురాలొకతె జీవించి యేమి ప్రతిఘటింప గలదు? కావున మనమిక నూర్ధ్వలోకముచేర నదను సమీపించినది. సంగరమునకు ముందు మన కులకాంతల నందఱను మేడపిలో నుంచివచ్చితిమి. వారలనందఱను ఇచ్చ టికి గొనిరమ్ము, విశ్వాసపాత్రుడవు నీవు పోయినగాని వారురారు. తత్క్షణమ కొనిర'మ్మని చెప్పెను. కన్నమనాయడు ఆనవాలుగా బ్రహ్మనాయకుని ఖడ్గము దీసికొని మేడిపికిబోయి యటనున్న కాంతాసమూహమునకు సంగరక్రమము నంతయు నివేదించి బ్రహ్మనాయకుని యాజ్ఞదెలిపెను. రాజపత్నులు, కులకాంతలు, తమ బంధుబృందము మరణించి నందులకు జాలసేపు దు:ఖించి బ్రహ్మనాయని సన్నిధికి బ్రయాణమైరి. బ్రహ్మనాయడు గతించిన వీరుల యస్థికలు దీసికొని సమీపమునందున్న గుత్తికొండ బిలములోని ప్రవాహము నందు గలుపబోవుచు గులకాంతల నందఱను వెంటగొని యందుబ్రవేశించి యొక్కొక్కరి పేరుతో దిలోదకము లొసంగుచుండెను. బ్రహ్మనాయడు సకుటుంబముగా బిలములోనికి బోయి యున్నాడుగావున నీసమయము బిలద్వారము మూసితిమేని యాతడు మడియగలడని తలంచి నాయకురాలు కొందఱు భటులను ద్వారము మూయబంపెను. కన్నమనాయకుడా సంగతిగ్రహించి ద్వారము మూయుచున్న వంచకులనందఱను ఖండించి వారలను బ్రోత్సహించిన నాయకురాలినిబట్టి తెచ్చెను. బ్రహ్మనాయడు వీరులందఱకు ఉత్తరక్రియలాచరించినంతనె వీరకాంతలందఱు సహగమనము సలిపి పుణ్యలోకములు బడసిరి. నాయకురాలు బ్రహ్మనాయని పాదములకు నమస్కరించి యెఱుంగక కావించిన సాహసమునకు మన్నింపు మని ప్రార్థించెను. దయాస్వభావుడగు బ్రహ్మనాయకుడు నాయకురాలికి బూజాకుసుమములు, తీర్థము నొసంగి యాదరించి బిలమునందలి ప్రవాహమునందు జొచ్చి యదృశ్యమయ్యెను. కన్నమనీడు బ్రహ్మనాయనికి భక్తివిశ్వాసములతో దర్పణాదు లొసంగి తానును బ్రవాహమున జొచ్చి యంతర్హితుండయ్యెను.

కన్నమనేడు ఆకాలమున మిగుల హీనముగా భావింపబడు పంచమకులమందు బుట్టినను బుద్ధివిశేషమునను ధర్మాచరణమునందును భూతదయయందును అగ్రవర్ణులకంటె యోగ్యుడని ప్రశంసింప దగినవాడు. ఈతడు పిత్రాజ్ఞానిర్వహణమునందు శ్రీరామచంద్రునకు, సోదరవాత్సల్యమునందు ధర్మరాజునకు, బరాక్రమమునందు గర్ణునకు సమానుడు. దీనత్రాణ

పరాయణుడును సర్వభూత ప్రియుడునగు బ్రహ్మనాయని క్రమశిక్షవలననే కన్నమనాయడు విఖ్యాతినందెను. అగ్రవర్ణులమని చెప్పుకొను వీరపురుషులు సంస్కర్తలై బ్రహ్మనాయనివలె బంచముల బ్రేమించి యుచితవిద్యా వివేకమునుప్రసాదించి ముందునకు గొనితెచ్చినచో నాడుమొదలు నేటివరకు నెందరు కన్నమనాయనివంటి వీరచూడామణులు, దేశభక్తు లుదయించువారోగదా! పలనాటి యుద్ధములో గతించిన వీరులతోబాటు కన్ననాయనికి గూడ వీరపూజ నాటినుండి నేటివరకు జరుగుచున్నది. కన్నమనాయని నేటికిని బంచములకంటె నితరాగ్రవర్ణులే విశేషించి పూజించుచున్నారు. దేశభక్తి, బలపరాక్రమములు, పితృభక్తి, ధర్మనిష్ఠ, సేవాదీక్ష లోనగు మానవ ధర్మములను నిర్వహించుటలో నసమానుడగుకన్నమనేని యాదర్శములు ఆంధ్రలోకమునకు మార్గదర్శక మగుగాక!

[ఆంధ్రమంత్రులు అను గ్రంథమునందలి బ్రహ్మనాయని చరిత్రము, ఆంధ్రవీరులు మొదటిభాగమునందలి బాలచంద్రుడుఅను వీరులచరిత్రము బఠించినచో గన్నమనేని చరిత్రమునందు సూచింపబడిన ప్రధానకథాంశములు ద్యోతకమగును.]

వేమారెడ్డి.

ఆంధ్ర రాజులలో రెడ్డివారు ప్రధమగణ్యులు. స్థానాం — ములం దుంటచే వీరు జాతిసాంకర్యములు కలుగకుండుటకు దమశాఖను బెక్కుఉపశాఖలుగా విభజించి యందుండి గుంపులని చిన్నతెగల విడదీసి సంబంధ బాంధవ్యములు జరుపుకొనుచున్నారు. వీరలు చిరకాలమునుండి ఆంధ్రదేశమునందు నివసించి కాకతీయ సామ్రాజ్యము మహోన్నత దశయందున్నపుడె స్వతంత్రరాజులుగ సేనాధీశ్వరులుగా నుండి క్రమ ముగా బ్రత్యేకరాజ్యములను స్థాపించిరి. వారిలో వేమా రెడ్డి గణనీయుడు.

వేమారెడ్డివంశమునందు దొంతిఅల్లాడరెడ్డి మూలపురుషుడని స్థానికచరిత్రములందు గలదు. ఇప్పటిచరిత్ర కారులదృష్టిలోని కీతడు రాకపోవుటచే నీపేరుగలవాడు లేడను చున్నారు. చరిత్రాంశములతో నేకీభవించు స్థానికచరిత్రములకు బ్రాముఖ్యమీయక తప్పుదుగాన గూటస్థుడుగా దలంపబడు నీవీరుని చరిత్రము నెఱుంగుదము. దొంతి అల్లాడ రెడ్డి పంటరెడ్డి కులములో జనించినవాడు. నిజాము రాష్ట్రమునందలి చెదలువాడలో నీతడు వ్యవసాయము చేసికొని జీవించుచుండెను. ఒకనా డీరైతు భూమిదున్నుచుండగా లంకెలబిందెలు బంగారు నాణెములతో నిండినవి దొరకెను. గ్రామవాసులంద ఱాధనము హరింపవలయునని యత్నించు చుండుటచే రాజధానిగా నుండు అనుమకొండకుజేరి యచటనొక సువర్ణ వీరరాఘవ విగ్రహము చేయించి పూజించు చుండెను. అచ్చటగూడ గొన్నియపాయములు కలుగుచుండుటచే అల్లాడరెడ్డి ధనవస్తువాహనాదులతో కొండపల్లి సీమకువచ్చి కవులూరునందును ధరణికోటయందును బ్రాసాదములు గట్టించి సుఖముగా నుండెను. కొంతకాలమునకు దురదృష్టమున ఓరుగల్లు రాజ్యమును బరిపాలించు ప్రతాపరుద్ర చక్రవర్తిని తురకలు బంధించి డిల్లీనగరమునకు గొంపోయిరి. సామంత రాజులు, సేనానాయకులు స్వతంత్రసంస్థానములు స్థాపించిరి. అపుడు రాజప్రతినిధిగానుండి నూతనరాజ్యములు స్థాపించినవారిలో ప్రోలయరెడ్డి యొకడు. ఈయన తరువాత రాజ్యమునకు వచ్చి ఆంధ్రదేశమున నసమానకీర్తి గడించిన మహావీరుడే మనకధానాయకుడును శూరచూడామణియు నగు వేమారెడ్డి భూపాలుడు.

వేమారెడ్డి పూర్వులు సంపదలతో దులదూగుచు దుర్గములు కట్టుటకు ధనము నార్జించిన విషయము దెలుపు నొక చిత్రకధవాడుకలో నున్నది. కథయొక్క సత్యాసత్యము లెటులున్నను వినుట కుత్సాహకరముగా నుంటచే నిట నుదాహరించుచున్నారము. దొంతి అల్లాడరెడ్డి కవులూరిలోనుండి అతిధిపూజాతత్పరుడై ప్రఖ్యాతుడై యుండునపుడు ఆయన యింటికి అకాలమున నొక వైశ్యుడువచ్చెను. అల్లారెడ్డి అతిధిపూజా తత్పరుడుగాన ఆగతుడగు వైశ్యుని మిగుల నాదరించి ఆహారముచేసికొనుటకు వలయుపాత్రముల వస్తువుల నొసంగగా నావైశ్యుడు తనయొద్దనున్న పసరుబరిణెగల గుడ్డల మూటను చిలుకకొయ్యకు దగిలించి వంటపని మీదబోయెను. కొంతసేపటికి పసరు తొణికిపడుటచే గ్రిందనున్నయినుపములుకు లన్నియు బంగారయ్యెను. అల్లాడరెడ్డి చూచి మిగుల నాశ్చర్యమునొంది మూటలోనేమి గలదో చూడ బసరుండెను. దానిని ఏలోహముమీద బోసినను బంగారముగా మాఱుచుండెను. వర్తకున కీపసరు చిక్కనీయక హరించి దీనిసహాయమున ధనము విశేషముగా నార్జించి రాజ్యము స్థాపింపనెంచి పసరుబరిణెమూటను దనగృహములో దాచి పసరుమూట తొలుత వర్తకుడుంచిన గృహమునకు అల్లాడరెడ్డి నిప్పుపెట్టెను. గృహము కాలిపోవుట చూచి వైశ్యుడు పరుగెత్తుకొనువచ్చి తాను సేకరించిన పసరుమూటగూడ నందేకాలిపోవుచున్నదని తలంచి వింధ్యాద్రికేగి మహాయోగుల నాశ్రయించి తానార్జించిన దివ్యరసము తగులబడిపోవు చున్నందులకు విచారపడి తానును అగ్నిహోత్రమునంబడి మరణించెను. గతమునకు అల్లాడరెడ్డి వగచి నిదురింప రాత్రి వేళవర్తకుడు కలలోనికివచ్చి “రెడ్డిదొరా! నీకు లభించిన పరుసవేదితో ధనమునార్జించి దేవళములు కోటలుగట్టి పరోపకారివై జీవింపుముగాని యందొక కాసునేని స్వయముగా నుపయోగించు కొనకుము. చిరకాలము పెద్దలసేవించి వడసిన స్పర్శ వేది అదృష్టవంతుడవగుటచే సులభముగా నీకు లభించినది. నాపేరు వేమన్న. నేనింత మహోపకారము నీకు గావించితినిగాన నీసంతతి కంతకు నా వేమనామము పెట్టుము.” అనిచెప్పెను. అల్లాడరెడ్డి అందుల కియ్యకొని యాధనమును గోటలు,

పేటలు గట్టించి ప్రజోపయోగముగా వినియోగించెను. ఈ కథ కొండవీడు, కొండపల్లి, ధరణికోట ప్రాంతములలో వాడుకగానున్నది. ఈకథకును వేమారెడ్డినామమునకును గల సంబంధ మెంతవఱకు సత్యమో తెలుప వీలుకాకున్నది.

వేమారెడ్డి క్రీ.శ. 1320 మొదలు 1349 వఱకు రాజ్యము పాలించెను. చరిత్రవిదులు తలంచుచున్నారు. ప్రతాపరుద్ర చక్రవర్తి తురకరాజులతో బోరాడి స్వాతంత్ర్యము నిలుపుకొను సమయమున దేశము చాలవఱకు బరాధీనము కాసాగెను. అపుడు వేమారెడ్డి కొన్నిదుర్గముల లోబఱచికొని పాలింపదొడగెను. ఇంతలో గాకతీయరాజ్య మస్తమించుటతో వేమారెడ్డి మిగుల స్వతంత్రుడయ్యెను. పిదప వేమారెడ్డి ఆంధ్రదేశమును తురకల హస్తగతము గాకుండ గాపాడెను. తురకలు హరించిన దేవబ్రాహ్మణ వృత్తులు తిరుగసాధించి తానుస్వయముగా పూర్వగృహీతలకు ధారపోసి వైదికమతమును నిలువ బెట్టెను. ఓరుగల్లు మొదలుకొని కొండపల్లి వఱకుగల దేశమును వెలమవా రాక్రమించుకొనిరి. రాచవారు తిరుగబడి వెలమవారి స్వతంత్రమును బడగొట్ట యత్నించుచుండిరి. ఈ యంత:కలహములను గుర్తించి తురుష్కులు దండయాత్రలు గావించుచు ఓరుగల్లు ప్రాంతములను గొల్లగొట్టుటచూచి ధరణికోట ప్రాంతములందు దన ప్రతినిధులను నిలిపి విరోధులెవరును గృష్ణదాటి రాకుండను దేశమునందు నెట్టి యశాంతి పొడసూపనట్లు వేమారెడ్డి మిగుల జాగ్రత్తగా గట్టుబాటులు చేసెను. క్రమముగా రాచ వారు రాజ్యసంపదల గోలుపోయి పద్మనాయకులధాటికోర్వజాలక యితర ప్రాంతములకు వలసబోయిరి. పద్మనాయకులన బడు వెలమవీరులు ఓరుగల్లు మొదలుకొని కృష్ణవరకు బాలించుచు దరుణముగనిపెట్టి రెడ్డిరాజ్యమును గూడగబళింపవలెనని పలుమాఱు ప్రయత్నించి సరిహద్దులలో భయంకర సంగ్రామము లొనరించి విఫలప్రయత్నులై వెనుకకు మఱలిరి. నాటనుండి రెడ్డివారికి వెలమవారికి జిరకాలము తగవులు, సంగరములు జరుగుచు వచ్చెను. వేమారెడ్డి తన రాజ్యమునం దంతటను రాజప్రతినిధులుగా దన సోదరులను అగ్రజులను, జ్ఞాతులను, మాతామహ కుటుంబమువారిని నుంచి తాను అద్దంకి రాజధానిగా జేసికొని నెల్లూరుమొదలు గోదావరీ మండలమువఱకు బరిపాలించెను. కర్నూలు మండలము గొంత బాగమును, కృష్ణా గుంటూరు మండలములు పూర్తిగను, నెల్లూరి మండలములో జాలభాగమును, గోదావరీ మండలములోని తూర్పు భాగమును వేమారెడ్డి పాలించెనని విశ్వసింపవచ్చును. ఈయన మన్నెరాజులను గూడ గెలిచితినని చెప్పుకొనుటచే గటకమువఱకు దండయాత్రల కేగె ననియు నాప్రాంతము లచిరకాలమునకె పరహస్త గతమై యుండుననియు దలంచవచ్చును. వేమ భూపాలు డార్యధర్మములను నెలకొల్పుటలోను బునరుద్ధరించుటయందును మిగుల బేరెన్నిక గాంచెను. ప్రతాపరుద్రదేవుని ధర్మములు ఖిలమై యవన పరిపాలనమున విచ్ఛిన్నముకాగా వేమారెడ్డి తాను ప్రభుత్వమునకువచ్చి పునరుద్ధరించినటుల అమరావతిశాసనమునందు జెప్పుకొనినాడు.

వేమారెడ్డి గతించినను అతనివంశము నశించినను నేటివఱకు నాతని ధర్మములు శాశ్వతముగా నున్నవి. వేమవరము అను పేరుతో నెన్నియో గ్రామములుకట్టించి వేదవేదాంగ విదులగు బ్రాహ్మణులకు దానముచేసి వైదికమతమును నిలువబెట్టెను. నూటయెనిమిది దేవాలయములు కట్టించి యందీశ్వర ప్రతిష్ఠగావించి, నటులకు గాయకులకు భజనపరులకు అర్చకులకు బుష్కలముగా వృత్తుల నొసంగెను. దుర్గమముగా నున్న శ్రీశైలమునకును అహోబిలమునకును మెట్లుకట్టించి యాత్రికుల కెంతయో సౌకర్యము కలుగజేసెను. విరోధులను రాజ్యపు సరిహద్దులలో నేని అడుగిడ నీయకుండ జాగ్రత్తచేసి ప్రఖ్యాతి నొందెను.

వేమారెడ్డియొద్ద రాజ్యాంగ విదుడును బరిపాలనా కౌశలుడును ధర్మపరాయణుడును నగు కాశ్యపగోత్ర సంజాతుడైన రామాప్రగడయు నతని యనంతర మాతని మనుమడగు మల్లినాథుడును మంత్రులుగానుండి రాజ్యమును మిగుల నభివృద్ధిలోనికి గొనివచ్చిరి. సేనానాయకులుగా సహోదరులగు అన్నారెడ్డియు, మల్లారెడ్డియు, గుమారుడగు అనపోతా రెడ్డియు, మేనమామ కుమారుడగు నూకారెడ్డియునుండి రాజ్యాభి వృద్ధికి సహకారులైరి. వీరిలో మల్లసేనాని విద్యాప్రియుడు. ఎఱ్ఱాప్రగడ మహాకవి నీ మల్లసేనాని తొలుత దన యాస్థానము నందు గవిగా నుంచికొని గౌరవించి చిరకాలము పోషించి పిదప వేమభూపాలకుని ప్రాపకమునందు జేర్చెను. సముద్రతీరమునందున్న కురుమలూరునం దీమల్లారెడ్డి నివసించి ద్వీపాంతరముల నుండి పడవలపైవచ్చు విదేశవస్తువులకు సుంకములు నిర్ణయించుచు నుండెను. ఈయన

కవితాభిమానము గలవాడు గాన మిగుల బ్రశంసాపాత్రుడు. వేమారెడ్డి రాజ్యము పాలించు సమయమున మోటుపల్లి గొప్ప రేవుపట్టణముగా నుండెను. కాకతీయరాజు లచట శుల్కాధికారి నుంచి దిగుమతి సరకులకు బన్నులువిధించి శాసనశిలలను బ్రాతించిరి. వేమారెడ్డి యాజ్ఞను బురస్కరించుకొని సోదరుడగు మల్లారెడ్డి అపరిమిత పరివారసహితుడై విరోధిహస్తగతమై యున్న మోటుపల్లిని జయించెను. అది మొదలు రెడ్డిసామ్రాజ్యమునకు సుంకముల వలన మితిలేని యాదాయము వచ్చుచుండెను. నూకారెడ్డి ధరణికోట ప్రాంతములనుండి వెలమవీరులగు అనపోతానాయకుడు, మాదానాయకుడు ముందునకు రాకుండ బలుమాఱు నిలువరించెను. కటకాధీశ్వరుడగు గజపతిని కృష్ణ కావలనే యెదిరించి వెనుకకు బాఱదోలెను. వేమారెడ్డి శివభక్తుడైనను వైషమ్యభావమును విడచి శివకేశవ దేవాలయములు ప్రతిష్ఠించుటయే గాక యన్నింటికి సమానముగా వృత్తుల నొసంగెను. అవచిదేవయసెట్టియను కోటీశ్వరుడగు వైశ్యుడు వేమారెడ్డికి సహకారిగను మిత్రుడుగా నుండి వలయు సమయముల నెంతయేని ధనసహాయము గావించుచుండెను. అవచిదేవుడు శివపూజా విధానమునందును అతిధిపూజా తత్పరత యందును దానధర్మ విధానమ లందును నిరుపమానుడై కీర్తిగడించెను.

వేమారెడ్డి విద్యాతపో వృద్ధులగు బ్రాహ్మణులకు బెక్కు లగ్రహారముల నొసంగెను. దేవాలయములు, తటాకములు ప్రతిష్టించి పరోపకారబుద్ధి ప్రకటించెను. చలివెందరలు, సత్రములు, తోటలు నెలకొల్పి సప్తసంతానముల బూర్తిచేసెను. ధర్మశాస్త్రములందు జెప్పబడిన సమస్తధర్మములు యధాశాస్త్రీయముగా గావించెను. తనయెడ భక్తిగలవాడై రాజ్యక్షేమమునకై పాటుబడుచున్న సోదరుడగు మల్లారెడ్డికి బుణ్యము కలుగునటుల అమరేశ్వరస్వామి దేవాలయ శిఖరముపై గనక కలశములను బ్రతిష్ఠించెను. వేమారెడ్డి పరిపాలనమం దెట్టి దండయాత్రలుగాని సంగరములుగాని లేకపోవుటచే ప్రజలు సుఖముగానుండిరి. సుంకములు, పన్నులు మిగుల స్వల్పముగ నుంటచే వ్యాపారము, వ్యవసాయము మిక్కిలి యభివృద్ధిలోనికి వచ్చెను.

వేమారెడ్డి కవితాగౌరవము గలవాడు. పలువురు కవులీనృపాలు నాశ్రయించి పద్యములు రచించి సత్కారముల నొందిరి. ఈయన రాజకీయ వ్యవహారములు ముగించికొన్న పిదప విశ్రాంతి కాలమునంతయు బండితులతో విద్యావినోదము లొనరించుచు గడపుచుండువాడు. రాజ్యమునందలి ప్రసిద్ధవిద్వాంసు లందఱు ఆస్థానమున కేతెంచి సాహిత్యవినోద ప్రసంగములతో గాలముగడుపు చుండువారు. ఆంధ్రకవులలో ప్రసిద్ధుడగు ఎఱ్ఱాప్రగడ మహాకవి వేమభూపాలుని యాస్థానమునందుండి తొలుత రామాయణము పద్యకావ్యముగా వ్రాసి యంకితము గావించెను. ఆ మహాకావ్యమునందలి పద్యములు కొన్ని లక్షణగ్రంథములందు మాత్రము కనుపించుచున్నవి. ఇపుడా గ్రంథరాజమెందును గోచరింపదనుట సంతాపకరము. ఎఱ్ఱాప్రగడగ్రంథములలో సమగ్రమైనది ఆంధ్రమహాభారతముతో అన్నివిధముల సమానముగా దులదూగ దగినది హరివంశము. ఇట్టి యుత్తమకావ్యమును ఎఱ్ఱాప్రగడ రచించి వేమభూపాలుని కంకితముగావించి యసమానకీర్తి కల్పించెను. ఎఱ్ఱాప్రగడవంటి మహాకవిచే నంకితము నొందగల్గిన వేమారెడ్డి సుకృతము ప్రశంసాపాత్రము. తనజీవితము వైదికధర్మ సంరక్షణము కొఱకును ధనమునంతయు రాజ్యస్థాపనము, చిత్రకళాపోషణము లోనగు సత్కార్యములకును, అవకాశము విశ్రాంతి ధర్మశాస్త్రాధ్యయనాదికములకు నుపయోగము, ఆంధ్రదేశ చరిత్రమునందు బ్రథమగణ్యుడైన వేమభూపాలుని చరిత్రము చాలవఱకు మఱపునకు వచ్చుచున్నదని తెలు పుటకు బరితాపము కలుచున్నది. చిరకాలము వేమారెడ్డి బాహుదర్పమున మొక్కవోని పరాక్రమమున రాజ్యమును బరిపాలించి తన జ్యేష్ఠపుత్రుడును ధర్మవిదగ్రగణ్యుడునగు అనపోతారెడ్డికి రాజ్యభారమునర్పించి కీర్తికాంతను భూలోకమున శాశ్వతముగా నెలకొల్పి స్వర్గలోక మలంకరించెను.

హరిహరరాయలు - బుక్కరాయలు.

ఆనెగొంది రాజధానిగా జేసికొని ఆంధ్రకర్ణాట దేశములను బాలించుచున్న జంబుకేశ్వరరాయలు డిల్లీనుండివచ్చిన మహమ్మదీయ సైన్యముతో జిరకాలము పోరాడి వీరమరణమొందెను. రాజ్యాంగవిదుడగు మహమ్మదీయనృపుడు తన కెంతకును రాజ్యము స్వాధీనము గాకపోవుటచే బ్రజావిశ్వాసపాత్రుడగు హరియప్ప వడయరు అనుమంత్రిని రాజుగజేసి సుంకములు సకాలమున జెల్లించు కట్టుబాటులొనర్చి తన రాజ్యమునకు వెడలి పోయెను.

కాకతీయ సామ్రాజ్యము విచ్ఛిన్నమై ప్రతాపరుద్ర చక్రవర్తి బంధీకృతుడుగ డిల్లికి యవనులచే గొనిపోవ బడిన పిమ్మట మరల స్వతంత్రరాజ్యస్థాపనమున కవకాశములు కలుగకపోయెను. యవనులధాటి కాగజాలక ప్రజలు సుభిక్ష ముగానున్న యితర ప్రదేశములకు వెడలిపోయిరి. వెలమవీరుడగు అనపోతానాయకుడు స్వతంత్రరాజ్యము స్థాపించెను గాని సరియగు దుర్గములు, విశ్వాసపాత్రులగు పరిజనులు లేకపోవుటచే యవనులధాటివలన నారాజ్యముగూడ క్షీణించుచుండెను. ఈపరిస్థితులు గమనించి ఆంధ్రసామ్రాజ్యమునందు సుగంధ భాండాగారాధ్యక్షులగు హరిహరరాయలు, బుక్కరాయలు అను వీరసోదరులు అమితధనసంపత్తితో, వస్తువాహనములతో, బరివారముతో విద్యారణ్య స్వాములవారి ప్రోత్సాహమున స్వతంత్రరాజ్యము స్థాపించుటకు అనుకూల ప్రదేశములు వెదకుచు గొన్నిదినములకు బైనిచెప్పిన ఆనెగొందికిజేరి రాజును లోబఱచికొని తామెరాజుగ రాజ్యము పాలించుచుండిరి. విద్యారణ్యులు నూతన సామ్రాజ్య స్థాపనకు వలయుప్రయత్నములు చేయుచుండెను.

హరిహరరాయలను బుక్కరాయలను వెంటనిడుకొని విద్యారణ్యస్వామి యొకదినంబున నూతన సామ్రాజ్యము స్థాపించుటకు అనుకూలప్రదేశ మెచటనున్నదో వెదకుటకు బయలుదేరెను. కొంతదూరము పోవగా జుట్టును గొండలచే నావరింపబడి సురక్షితమగు నొకవిశాలప్రదేశము తుంగభద్రాతీరమున వారికి గోచరించెను. ఆప్రదేశము మనోహరముగా నుంటచే నందు సంచరించుచు విశేషముల నరయుచునుండ గొన్ని వేటకుక్కలు కుందేళ్లచే దరుమబడి పరుగెత్తుట కన బడెను. విద్యారణ్యులవా రదిచూచి మిగుల నాశ్చర్యపడి రాజసోదరుల కావింతజూపించి: 'రాజకుమారులారా! ఈప్రదేశము నూతనరాజధాని కనువగుతావు. ఇచట రాజ్యమును స్థాపించితిమేని చిరకాలము వెలుగొంద గలదు. ఇదియె నాకభిమత ప్రదేశ' మనగా వారును ఆమోదించిరి. విద్యారణ్యులు శ్రీ విద్యాచక్రానుసారముగ సరిహద్దులు నిర్ణయించి నగరవీధులు రాజమందిరములు, ప్రకృతిజనుల నెలవులు, దుర్గమములకు దావులు నిశ్చయించి శుభముహూర్తమున విద్యానగరమను పేరుతో నూతననగరరాజప్రతిష్ఠ గావించెను. ఆ శుభముహూర్తబలముననో, రాజసోదరుల అదృష్టవశముననో అచిరకాలములో విద్యానగరము మహాపట్టణముగా మాఱెను. విద్యారణ్యులు పెట్టిన శుభముహూర్తమున హరిహరరాయలు తన రాజధానిని ఆనెగొందినుండి విద్యానగరమునకు మార్చుకొని హితబంధు సామంతరాజసమక్షమున మహోన్నత వైభవముతో బట్టాభిషిక్తుడాయెను. పరాక్రమశాలియు న్యాయమూర్తియునగు బుక్కరాయలను బ్రజానుమతంబున విద్యారణ్యులవారు విజయనగర సామ్రాజ్యయువరాజు నొనరించెను. రాజసోదరు లిరువురు నాటగోలె నూతనరాజ్యమును విస్తరింపజేయుటకు సర్వశక్తులు ధారవోసి విజయయాత్రలకు బరికరములు సమకూర్పదొడగిరి. విద్యానగరపు సరిహద్దులలో బల్లాలదేవుడను హొయిసలి రాజ్యమును బరిపాలించుచుండెను. అతనిరాజ్యము నెటులేని హరించి తమ రాజ్యములో గలుపుకొన వలయునని హరిహరరాయలు, బుక్కరాయలు తీవ్రకృషిచేయుచుండిరి. ఆకస్మికముగా మహమ్మదుతుగ్లకు హొయిసలరాజ్యమునకు రాజధానియగు ద్వారసముద్రమును ముట్టడించి కోటబగులగొట్టి సంపదల నన్నింటిని జూరగొనెను. ఇక నిటనున్నచో నెప్పటికైన నపాయము తప్పదని బల్లాలదేవుడు దక్షిణార్కాడు మండలములోని తిరువణ్ణామలకుబోయి యది రాజధానిగా జేసికొని పాలించుచుండెను. హరిహరరాయలు తన సహోదరులగు కంపభూపతి, బుక్కరాయలు, మారభూపాలుడు, ముద్దరాజు అను నలువురకు

విశేషసైన్యమును ఇచ్చి సమస్త రాజుల జయించిరమ్మని పంపగా వారు సమీపముననున్న చిన్నచిన్న రాజుల నంకితులను గావించుకొని రాజధాని చేరిరి. అపుడె బల్లాలరాజుయొక్క రాజ్యము పూర్తిగా గర్ణాటరాజ్యములో గలసిపోయెను. ఆంధ్రదేశమున సుప్రసిద్ధ దుర్గములగా గణింపబడు పెనుగొండ, చంద్రగిరి, ఉదయగిరి, కనకగిరి దుర్గములు విద్యానగర రాజ్యములో గలసిపోయెను. దినదినక్రమమున విద్యానగరరాజ్యము అభివృద్ధిలోనికి వచ్చుట జూచి చిన్నచిన్నరాజులు తమంతతామె యంకితులై సుంకములు చెల్లింపనంగీకరించిరి. కల్పవృక్షములవలె దనకన్ని విధముల సహ కారులగు నలువురు సోదరులను నాలుగుచోటుల శాంతిస్థాపనమునకు బంపుచు విద్యారణ్యుల సహాయమున దుర్గములను గోటలను బలపరచుచు జిరకాలము రామరాజ్యమువలె హరిహరరాయలు పాలించుచుండెను. క్రమముగా గర్ణాటదేశము, ద్రవిడదేశములోని కొన్నిభాగములు సముద్రప్రాంతములు వనవాసి, మహిశూరు లోనగు రాజ్యములన్నియు హరిహరరాయల పరిపాలనములోనికి వచ్చెను. విశాలమగు తనరాజ్యమున బ్రజాసుఖమె తన సుఖముగా భావించి అవసరమగు తావులకు దన సోదరుల బంపి ప్రజాసౌఖ్యములు విచారించుచు హరిహరుదు రాజ్యము ధర్మబద్ధముగా బాలించెను.

కర్ణాటరాజ్య మీవిధముగా దినదినాభివృద్ధియగుచుండగనే ధూమకేతువు వలె బహమనీరాజ్యమొకటి స్థాపింప బడెను. డిల్లీచక్రవర్తియొద్ద సేనానాయకుడుగా నున్న హసన్ గంగూ అను మహమ్మదీయుడు అల్లా ఉద్దీను షాహ అను బిరుదనామముతో నీనూతన రాజ్యమును క్రీ.శ. 1347 లో దక్షిణాపథమునందు (డక్కన్ దేశమున) నెలకొల్పి క్రమముగా నభివృద్ధికి దెచ్చుచుండెను. మహమ్మదీయులు ముందునకు వచ్చి విజయనగర రాజ్యమును గూడ గబళింప దీవ్రకృషి చేయుచుండిరి. విజయనగరాధిపతి తన బలములో విశేషభాగమును సరిహద్దులలోనుంచి తురకలను రాజ్యమునం దడుగైన బెట్టకుండ జేసెను. యవనుల దాడికి లోనుగాక సురక్షి తముగా నుంటచే విద్యానగరరాజ్యమె మనకు శరణ్యమని పలువురు ప్రజలు దక్కను భూములను విడిచి కర్ణాట రాజ్యమునకు వచ్చిరి. హరిహరరాయల కాలమున బ్రసిద్ధు డైన నాచన సోమనాధమహాకవి పెక్కుగ్రంథముల నాంధ్రభాషలో రచించెను. ఈకవి హరిహరరాయల రాజ్యకాలమునం దుండి బుక్కరాయలచే బంపాసరోవర సమీపమునందున్న విరూపాక్షస్వామి సన్నిధానమునందు బుక్కరాయ పురమును అగ్రహారముగా బడసెను. ఆంధ్రకవులకు విద్యానగరమునకు జిరకాలమునుండి సంబంధము గలదనియు గర్ణాటరాజ్యాధీశ్వరు లనబడు విద్యానగర ప్రభువులందఱు ఆంధ్రకవుల బోషించి భాషను బెంపొందించిరనియు జెప్పుటలో గొంచెమేనియు నతశయోక్తి యుండదు. ఆనా డింక నెందఱు కవులు మహారాజు ప్రాపు బడసి సుఖముగా జీవించిరో తెలుపు నాధారములు లేవు.

హరిహరరాయల కాలమున విద్యానగరరాజ్యము ఆఱు భాగములుగా విభజింపబడి యుండెను. అందు ఉదయగిరి రాజ్యమొకటి. ఈరాజ్యమును దొలుత కంపభూపతియు నతని యనంతరము పెద్దకుమారుడగు సంగమరాజు, శావన్న యొడయలు బాలించిరి. విద్యారణ్యుల సోదరుడగు సాయనాచార్యులు సంగమరాజునొద్దమంత్రిగానుండి నెల్లూరునందు నివసించుచుండెను. రెండవది పెనుగొండరాజ్యము. ఇందు గుత్తి, చంద్రగిరి రాజ్యములు కలిసియుండెను. ఈరాజ్యములు రెంటిని గలిపి హరిహరరాయల సోదరులలో నొకరు పాలించుచుండిరి. మూడవది ఆరగమలె రాజ్యము. ఇందు వనవాసి, చంద్రగుత్తి, గోవారాజ్యములు చేరియున్నవి. ఇందు గొంత బాగమును మారభూపాలకుడు గౌడబ్రాహ్మణుడగు మాధవమంత్రిని సచివునిగా నుంచుకొని నుంచికొని పాలించుచుండెను. షిమొగజిల్లాయను, ఉత్తరకన్నడ జిల్లాయును గలసి ఆకాలము నందు ఆరగమలెమండల మనుపేరుతో వ్యవహరింప బడుచుండెను. నాలుగవది ములువాయిరాజ్యము. ఇది మద్దభూపతి పరిపాలనమునం దుండెను. ఐదవది తుళురాజ్యము. ఇందు బరకూరు, మంగటూరు చేరియుండెను. దీనిని హరపాదగౌడ రా జనునాతడు మంత్రిగానుండి పాలించుచుండెను. ఆఱవది రాజగంభీర రాజ్యము. దీనిని బుక్కరాయల కుమారుడగు కుమార కంపరాయలు పాలించుచుండెను. ఈవిధముగా రాజ్యము ఆఱుఖండములుగా విభజింప బడుటచే బరిపాలనమునకు సుకరముగా నుండి విరోధులకు దుర్గమముగా నుండెను. వలసిన తావులకు విద్యానగరమునుండి సైన్యము, ధనము సకాలమునకు జేరునటుల నేర్పాటులు చేయబడెను. అందుచే జిన్నరాజులెవరును రాజ్యములోని భాగములనేని దేరిచూడ లేకపోయిరి. హరిహరరాయల జననకాలము గుర్తింపదగు

నవకాశములులేవు. ఆయన రాజ్యమునకువచ్చి విద్యానగరమునందు బట్టాభిషిక్తుడై క్రి.శ. 1336 నుండి క్రీ.శ. 1355 వఱకు పందొమ్మిది సంవత్సరములు పాలించి పరలోక మలంకరించెను. యువరాజుగ నుండి పేరొందిన బుక్కరాయలు అన్నగారు మరణించినవార్త వినినవెంటనే హొసపట్టణమునం దొక ప్రతినిధిని నిలిపి తాను విద్యానగరరాజ్యమునకు వచ్చి పట్టాభిషిక్తు డాయెను.

బుక్కరాయలు పరాక్రమాదికమున హరిహరరాయల కించుకేనియు దీసిపోవువాడు గాడు. విద్యానగర రాజ్యమున కీతడు పాలకుడుగా వచ్చుసరికి బహమనీసుల్తాను మహమ్మదుపాదుషా, ఓరుగల్లు ప్రాంతములను బరిపాలించు అనపోత భూపాలుని యేలుబడిలోనున్న భువనగిరి, గోలకొండ దుర్గములను వారించి కర్ణాటరాజ్యమును లోగొనుటకు సిద్ధముగా నుండెను. బుక్కరాయలు ముందున కడుగుబెట్టకుండ సరిహద్దుల నెన్నివిధముల గాపాడుచున్నను మహమ్మదుషా విజయనగరముమీదికి దండయాత్రకు అపరిమితబలముతో వచ్చి ఘోరసంగ్రామము గావించెను. కడకు బుక్కరాయలె జయించుటచే మహమ్మదీయులు నష్టావశేషమగు సైన్యముతో నింటిత్రోవ బట్టిరి. బుక్కరాయలు పరాజయము నెఱుంగక వీరవతంసమని పేరొంది ప్రతి సంగరమునందును జయమెవడ యుచు జిరకాలము రాజ్యము పాలించెను. కొంతకాలము గడచినమీదట మహమ్మదుషాహ బుక్కరాయలు సంధిగావించికొని ఒకరి రాజ్యముపైకి వేఱొకరు రాకుండ గట్టడి గావించుకొనిరి. అదిమొదలు బుక్కరాయలు సరిహద్దులను గాపాడు యత్నముమాని తిరుగబడిన సామంతరాజుల పైకిని నూతన రాజ్యములమీదికిని దండయాత్రలకు బయలువెడలి కర్ణాటరాజ్యమును మిగుల నభివృద్ధిలోనికి దెచ్చెను.

బుక్కరాయలు రాజ్యము పాలించుసమయమున నతని పెద్దకుమారుడగు కంపరాయలు పలుమాఱు విజయయాత్రల కేగి విజయలక్ష్మీ ద్వితీయుడై తిరిగివచ్చెను. దక్షిణదిశకు జైత్రయాత్రకేగుతఱి నీ నృపాలునివెంట గోపమంత్రియు, సాళువమంగరాజును సహాయులుగా నుండిరి. ద్రవిడదేశపాలకుడగు సాంపరాయలకును గంపభూపతి సైన్యమునకును గొప్పసంగరము జరిగెను. సాంపరాయ లమితబలముతో బాలేరు నాధారముచేసికొని ప్రతిపక్షసైన్యము నెదిరించెను. కంపరాయని సైన్యము సంగరమున నారితేరినదగుటచే ఉపాయాంతరములచే బాలేరుదాటి ఆకస్మికముగా బైనపడి ద్రవిడసైన్యమును దునుమాడెను. సాంపరాయలు వడవీడు దుర్గమునందు జేరెను. ధైర్యస్థైర్యములతో జిరకాలము పోరాడి కంపభూపాలుడు సాంపరాయలను వశపఱచికొని ఆతనిని సామంతునిగా నేర్పరచి సాంపరాయస్థాపనాచార్య బిరు దము వహించెను. మహమ్మదీయులు మధురజయించి దేవళములు రూపుమాపుచుంటచే అర్చకులు శ్రీరంగములోని విగ్రహమునుదెచ్చి తిరుపతిలో దేవస్థానమునందు దాచిరి. ఈ సంగతి కంపభూపతి సేనానాయకుడును జెంజీసీమాపాలకుడును విష్ణుభక్తుడునగు గోపనార్యుడువిని తురుష్కుల బాఱదోలువఱ కావిగ్రహమును శృంగవరపు గోటయందు జేర్చి పూజించునటుల గట్టడిచేసెను. దేవాలయ ధ్వంసకుడగు మహమ్మదీయసేనాని మధురనుండి శ్రీరంగమునకు వచ్చి దేవళముననే బసగావించి కొన్నిదినముల కనారోగ్యముగా నుండి సమయవరమను గ్రామమునకు స్వల్పపరివారముతో నేగెను. అతని దుర్బలస్థితిని గనిపెట్టి గోపనార్యుడు చెంజి నుండి బయలువెడలి సంహరించి శ్రీరంగములో మఱల విగ్రహమును బ్రతిష్ఠించెను. ఈ మహమ్మదీయునకు వెఱచి సత్యమంగలమునందు దలదాచు కొనుచున్న వేదాంత దేశికులు శ్రీరంగమునకు వచ్చి తనకవితా కల్పనలచే గోపమంత్రిని సంతోష పఱచెను. కంపరాయలు గడించిన ప్రతివిజయమునందును గోపమంత్రియే గాక సాళ్వమంగు గూడనుండి యుండెను. సాళ్వమంగు ఆకాలమున బేరెన్నిక గన్నవీరులలో నొకడు. బుక్కరాయలటుల బుత్రుని సహాయమునం గూడ సామ్రాజ్యమును మిగుల నభివృద్ధిలోనికి దెచ్చెను. ప్రసిద్ధి వహించిన వ్యాపార స్థలములను రేవు పట్టణములని పేరొందిన గోవా పట్టణ మాకాలమున విదేశ వ్యాపారమున కాస్పదముగా నుండెను. విజయనగర సామ్రాజ్యమునకు ద్రవిడదేశమునందలి చాలభాగము బుక్కరాయని కాలమున లోబడియుండెను. మళయాళము, సింహళము లోనగు దూరదేశములను బాలించు రాజులుసైతము బుక్కరాయల ధాటికి వెఱచి యెప్పు డెట్టియపాయము గలుగునోయని సామంతులవలె రాయబారులచే వస్తువాహన రత్న సువర్ణాదులు కానుకగా బంపు చుండువారు.

బుక్కరాయలు సర్వసమత్వము, పాపభీతి, దైవభక్తి, పరోపకారబుద్ధిగల ఉత్తమగుణసంపన్నుడు. ఈయన శైవమతమునం దాదరభావము గలవాడైనను అన్యమత ద్వేషము లేక కాలము గడపెను. వైదికమతమునం దెక్కుడు అభిమానము గలవాడుగ నుండి విద్వాంసులగు బ్రాహ్మణులకు విశేషించి వృత్తుల నొసంగి మిక్కిలి యాదరించెను. బుక్కరాయలు సముద్రము, నాగవ్వచెఱువు, బచ్చుప్ప చెఱువు లోనగు ప్రసిద్ధములగు తటాకముల నీనృపాలుడు నెలకొల్పి రాజ్యమునందు కఱవు లేకుండ జేసెను. బుక్కరాయలు కళింగదేశము, ఓఢ్రదేశము గూడ జయించి మహేంద్రగిరివఱకు దండయాత్ర గావించి నటుల గొన్నిచోటుల జెప్పబడెను. ఈయన మంత్రులలోనొకడగు మల్లినాథు డనబడు భోజనమల్లుడు యవనుల జయించిన మహావీరుడు. విద్యానగర సామ్రాజ్య నిర్మా తల పవిత్ర జీవితములను బఠించు సందర్భమున సామ్రాజ్య స్థాపకుడును వైదికమతాభిమానియు అపరశంకరుడని ప్రశంసింపదగిన వాడును నగు మాధవవిద్యారణ్యులవారి జీవితము నెఱుంగుట చాల నవసరము.

మాధావాచార్యులు, సాయణాచార్యు లను నిరువురు సోదరులుగలరు. వీరు జగద్విఖ్యాతులగు విద్వాంసులు. వీరిది యజుర్వేదము, బోధాయన సూత్రము, భారద్వాజగోత్రము. యవనవ్యాప్తిచే దేశమందు అరాజకము ప్రబలి వైదికమతమునకు విప్లవము కలుగనుంటచే మాధవాచార్యులు హరిహరరాయ బుక్క రాయల బ్రోత్సహించి విద్యానగర రాజ్యమును స్థాపింప జేసెను. పేరునకు రాజులుగ నాసోదరరాజుల నుంచి రాజ్యచక్రము నంతయు మాధవాచార్యులే స్వయముగా బొంగరమును ద్రిప్పినటులద్రిప్పి మతధర్మములను గాపాడుటకు దన జీవితమునంతయు ధారపోసెను. మాధవాచార్యులు, సాయణాచార్యులు సంస్కృతములో సమస్తవిషయములందును గ్రంథములను రచించి గీర్వాణభారతి కఖండమగు సేవ గావించిరి. మాధవాచార్యులు సన్యాసము స్వీకరించి విద్యారణ్య స్వామియను నామాంతరము వహించి శృంగేరీపీఠమున కధ్యక్షుడయ్యెను. సన్యాసాశ్రమమునందు సైతము విద్యారణ్యులు విద్యానగర సామ్రాజ్యక్షేమమునకు బాటుపడు చుండెను. మాధవ విద్యారణ్యులవారు విద్యానగరమును బరి పాలించిన ప్రథమ హరిహరరాయల బుక్కరాయలద్వితీయ హరిహరరాయల కాలములలో మంత్రిగ ధర్మోపదేశికుడుగా నుండి రాజ్యక్షేమమె వైదికమతక్షేమముగా భావించి ఆయారాజులను వైదికధర్మప్రపక్తులుగ నేర్పఱచి నూఱు సంవత్సరములకంటె నెక్కుడుకాలము జీవించి క్రీ.శ. 1386 లో సమాధిగతు డయ్యెను. తమ్ముడగు సాయణాచార్యులుగూడ సంగమరాజు నొద్ద మంత్రిగానుండి విద్యానగరమునకు దగినసేవ గావించి రాజ్యసహాయమున మతసంరక్షణమున నెక్కువ పాటుపడెను.

విద్యారణ్యులవారి యుపనిష ద్భాష్యములు, వేదాంత పంచదశి, వివరణ ప్రమయసంగ్రహము, బ్రహ్మవిదాశీర్వాద పద్ధతి లోనగు గ్రంథములు అద్వైతమతప్రవిష్టులగు విద్వాంసులు మిగుల బూజ్యభావముతో బఠించుట యీ మహామహుని ప్రశస్తికి దార్కాణము. తొలుత రాజ్యమును నిలువ బెట్టుకొన్నగాని మతధర్మముల గాపాడుకొన జాలవని మహా సామ్రాజ్యమును నెలకొల్పి దాని క్షేమమె తన క్షేమమని భావించిన విద్యారణ్యుల జీవితము నేటి పండితలోకమున కాదర్శప్రాయ మయ్యెనేని భరతఖండము సర్వవిధముల నభ్యున్నతికి రాకపోదు. మానవజీవితమునకు, మతమునకు విజ్ఞానమునకు, స్వరాజ్యమునకు సంబంధము కలుగజేయుట మహాత్ముడగు విద్యారణ్యుల యాశీర్వచనమున నాంధ్రులకు బట్టువడ బరమాత్మ డనుగ్రంచుగాత! హరిహర రాయలకు బుక్కరాయలకు ఉత్తరవయస్సు నందు మాధవమంత్రియను మఱియొక విద్వాంసుడు విద్యానగర సామ్రాజ్య ధూర్వహుడై మంత్రి పదవి యందుండి మిగుల బేరొందెను. కొందఱు మాధవవిద్యారణ్యులు మాధవమంత్రి యొకడని తలంచుట భ్రాంతిమూలము. ఇరువుర గోత్రము, తలిదండ్రుల పేరులు చూచిన వేఱువేఱు పురుషులని స్పష్టముగా దెలియుచున్నది. మాధవమంత్రి గీర్వాణము నందు బెక్కు గ్రంథముల రచించెను. నాస్తిక మతమును ఖండించెను. బుక్కరాయల ప్రభుత్వకాలమున నీతడు పశ్చిమదిశ కధిపతిగానుండి విరోధిరాజులకు వీరస్వర్గము ప్రసాదించు చుండెను. ఈ వీరుడు గోవాపట్టణమును జయించి యందు బాదుకొనియున్న మహమ్మదీయులను బోదోలి యాదవుల కారాజ్యము ప్రసాదించెను. ఈయన జీవిత చరిత్రము నింకను దెలిసికొనవలసి యున్నది. ఇంక నెందఱు స్వార్థత్యాగు లీ సామ్రాజ్య సహాయులైరో యెఱుంగనయితికాదు. విద్యారణ్యులవారు మకుటములేని చక్రవర్తియై విద్యానగర రాజ్యమును సర్వవిధముల నభ్యున్నతికి దెచ్చెను. ఆకాలమున గేవల విద్యావినోదములతో గాక సంగర

రంగములతో గాలయాపనము జేసిన మాధవమంత్రి, సాయణాచార్యులు, సాళ్వమంగు, గోపప్రధాని యొనరొంచిన మహత్తర సేవవలనను వైదికమత మింతవఱకు మనదేశమున నిలుచుట కవకాశము గలిగినది. ధర్మ సంరక్షణమునకై రాజ్యము స్థాపించి ప్రజా శాంతి కొఱకు సర్వస్వము ధారపోసి మతమునకు జాతికి జన సముదాయమునకు గల్పతరువువలె నున్న విద్యానగర రాజుల జీవితములు పఠనీయములు. విద్యానగర సామ్రాజ్యము నందలి యాదాయములో జాలభాగము ఆకాలమునం గవులకు, మఠాధిపతులకు, విద్వాంసులకు నుపయోగింపబడు చుండెడిది. ప్రతిపౌరుడు సామ్రాజ్య రక్షణమును గృహకృత్యముగా భావించు చుండువారు.

రాజన బ్రజలకు సేవకుడు. ప్రజాసౌఖ్యముల కాతడుత్తరవాది. సమస్త ధర్మముల నాచారణములో బెట్టి దేశమును సత్పథమున నడపుటకు రాజె బాధ్యుడు. ఇట్టి బాధ్యతల గురుతెఱింగి రాజ్యస్థాపనమునందు గాక రాజ్యాభ్యుదయ కాలమున గూడ స్వధర్మము మఱువని హరిహరరాయ బుక్కరాయల జీవితము అనంతరము విద్యా నగరరాజ్యము ఏలిన నృపులందఱకు నాదర్శప్రాయముగ బరిణమించెనేని పరాధీనత ఆంధ్రులకు దటస్థించునదికాదు. విద్వాంసులు సామ్రాజ్యాభ్యుదయమునకు బాటుపడుటయు సన్యాస స్వీకరణానంతరము మఠాధిపతిగా నుండియు దేశమునెడ ననురాగము వహించుటయు విద్యారణ్యుల జీవితమునందు గల పవిత్రాంశములు. మహామహుడగు విద్యారణ్యుని దైవభక్తి తో బూజించుటకంటె నా యనఘుని యాచరణముల నాదర్శముగా దీసికొనుటయే మనభావ్యభివృద్ధికి హేతువు.

అనపోతనాయడు.

ఇత డప్రతిమానశూరుడై యాంధ్రదేశములోని చాలభాగము మిగుల బరాక్రమముతో బాలించి విఖ్యాతి గాంచెను. శూరవర్యుడగు నీమహానుభావుని జీవితచరిత్రము పఠనీయమనుటలో సందియము లేదు. కాకతీయ వంశాలంకారుడగు ప్రతాపరుద్ర చక్రవర్తి యోరుగల్లు రాజ్యము పాలించుతఱి సింగమనాయడు సేనానాయకుడై ప్రతిఘటించిన సామంతరాజుల దర్పమడంచి యాంధ్రసామ్రాజ్యమును నిష్కంటకము గావించి స్వామిభక్తి వెల్లడించెను. ప్రతాపరుద్రచక్రవర్తి యవనులచే బంధితుడైన పిమ్మట నాంధ్ర సేనానాయకు లంద ఱాంధ్రసామ్రాజ్యమును విచ్చలవిడిగా బంచుకొని పాలించుచుండిరి. నిజాము దేశములోని యాంధ్రదేశము నాసమయమున సింగమనాయ డాక్రమించుకొనెను. ప్రస్తుత కధానాయకు డీశూరుని పుత్రుడె. ఇతడు రేచెర్ల గోత్రీయుడు. వెలమకుల భూషణుడు. ఈవీరుని చరిత్రమును దెలిసికొందము. అనపోతనాయకుని చరిత్రమును నరయుటకుముం దాతని జనకుడగు సింగమనాయనిచరిత్రము కొంతవఱకు దెలిసి కొనుట యావశ్యకము. సింగభూపాలుడు ప్రతాపరుద్రదేవుని యొద్ద సేనానాయకుడుగ నుండి మగతలయను గ్రామ సమీపమున భయంకరసంగ్రామ మొనరించి సామ్రాజ్యమునకు వ్యతిరేకించిన మచ్చకొమ్మనాయకుడను శూరుని వధించెను. జిలుగుపల్లి యొద్ద రుద్రనాయడను వీరుని ఘోరయుద్ధమున జయించి ప్రతాపరుద్రునిమన్ననకు బాత్రుడయ్యెను. ఇతడు మచ్చనాయకగండ, సామంతరాగోల యను బిరుదములనే కాక యెనుబది వరములనుసైతము ప్రతాపరుద్రుని వలన నొంది యసీతివరముల సింగమనాయడని విఖ్యాతి గాంచెను. ఆంధ్రకవు లనేకులు సింగమనాయని వీరజీవితము గానము గావించి కృతార్థులైరి. సింగమనాయనిచరిత్రము గ్రహింప నీక్రిందిపద్యములు సాయము కాగలవు.

"ఉ|| లాలితశౌర్యశక్తి నవలక్ష తెనుంగుదళంబు నాజిలో
దోలిన పాండ్యభూవిభునితోడి పెసంకువ కోర్చి సన్నుతిన్
వ్రాలి ప్రతాపరుద్రుసభ వర్ణనకెక్కిన యెఱ్ఱదాచ భూ
పాలసుతుండు సింగని కభంగుని కేబిరుదైన జెల్లదే||

ఉ|| దాచయ సింగభూవిభుని దాడికి నోడి యరాతిసంఘముల్
వే చని యారముల్ పొదలు వృక్షచయంబులుదూరమేను లన్
దోచిన కంటకక్షతులు తోయజలోచన లాగ్రహంబుతో
జూచి నిజేశులందలిగి చూతురు పాయక చూతురుగ్రతన్||"

సింగమనాయడు త్యాగశీలుడు దేవబ్రాహ్మణభక్తి పరుడునై యనేక ధర్మకార్యములు గావించుటయే కాక యేలేశ్వరమున ననేక బ్రహ్మప్రతిష్టలు గావించినటుల సర్వజ్ఞ సింగమనేడు "రసార్ణవ సుధాకరము" లో జెప్పియున్నాడు. సింగమనాయ డప్రతీప ప్రతాపంబున నాంధ్రదేశములోని రాచకొండ దేవరకొండ దుర్గముల స్వాధీనము గావించుకొని యాంధ్రదేశము బాలించుతఱి నితర దుర్గపాలకులకు నితనికి నంత:కలహములు పెచ్చరిల్లెను. సామంతులుగ నున్న జల్లిపల్లి దుర్గపు రాచవారు పలుమారు ప్రతిఘటించి యపజయము గడించి శూన్యసంకల్పులైరి.

వీరవర్యులగు జల్లిపల్లిరాచవారు పలుమాఱు సింగమనాయనితో బ్రతిఘటించి నష్టపడియు నిరుత్సాహము నొందక యొకానొక సంగ్రామములో నాతని బావమఱదియగు చింతపల్లి సింగమనాయ డనువీరుని బట్టి తమకోటలోని కారాగారమున బంధించిరి. సింగమనాయ డది తెలిసికొని యావీరుని వదలి పెట్టుడని యనేక పర్యాయములు రాచవారికి వర్తమానము చేసెను. ఫలములేకపోయెను. సింగమనాయడు మిగులగోపించి జల్లెలల్లి దుర్గము నిర్మూలము గావించి రాచవారి వధించి యెటులేని చింతపల్లి సింగమనాయని బంధ విముక్తుని గావింపదలంచి తన సైనికబలము నంతయు వెంటగొని దాడివెడలెను. జల్లెపల్లి రాచవారు సింగమనాయని

విజృంభణమునంతయు జూచి యపజయము తప్పదని నిశ్చయించుకొని వెఱపు వేఱుగానక దురాత్ముడు మాయాకుశలుడగు తమ్మళ దమ్మాజియను నొకవీరుని జల్లిపల్లి రాచవారు రాయబారమంపిరి. తమ్మళ దమ్మాజి తనరాకముందు రాజభటులచే సింగమనాయకున కెఱుంగజేసి యాతని సమ్ముఖమున కేగి చింతపల్లి సింగమనాయని యా క్షణముననె విడచిపెట్టుటయే గాక యపరాధముగూడ చెల్లింతుమనియు క్షమింపుమనియు వేడుకొనెను. సింగమనాయ డానందించి సైనికుల నందఱును రణోద్యోగము చాలింపు డని యాజ్ఞాపించెను. దమ్మాజి సింగమనాయనితో జాలసే పిష్టగోష్ఠిగ భాషించి భాషించి నమ్మిక పుట్టునటుల వర్తించి కాసెలోనున్న బాకుతో సింగమనాయని వక్షఃస్థలమున నిటునటు దిగునటుల గాఢముగ బొడిచి యావార్త బహిరంగము కాకముందె పాఱిపోయెను.

క్షణములో నీవార్త సైనికనివేశములో నల్లుకొనెను. వీరవర్యులు కొందఱు కోపమాపుకొనలేక దమ్మాజినిబట్టి తేవలయునని యున్నతాశ్వములనెక్కి బయలువెడలిరిగాని యాత డంతకంటె శీఘ్రముగ దుర్గముజేరెను. విచారకరమగు నీఘోరవార్తవిని సైనికులందఱు చాల విచారించిరి. సింగమ నాయనిపుత్రులగు అనపోతనాయడు, మాదనాయడు తండ్రి వెంట నా సంగ్రామమునకు వచ్చియె యుండిరిగాన నావార్త వినగనే తండ్రిసమ్ముఖమునకు జేరిరి. సింగమనాయ డాయుదముతో మరణశయ్యయందుండియు గొంచెమేని విచారము నొందక దుఃఖమునొందు తనయుల నిర్వుర జేరజీరి బుజ్జగించి విచారముతో నిటులనెను. “కుమారులారా! ఈబాధతో నింక బ్రాణముల గొంచెమునేపేని నిలుపజాలను. బాకు పెకలించిన వెంటనే నాప్రాణముపోవ సిద్ధముగనున్నది. పరమునందేని నాయాత్మ శాంతినొందుటయే మీయభిప్రాయమైనచో, మీరు నిజమైన పుత్రులగుచో, రేచర్లగోత్రీయుల పరాక్రమరక్తము మీరక్తనాళములలో బ్రవహించు చున్నచో జల్లెపల్లి రాచవారొనరించిన దురాగతమునకు బ్రతిఫలముగ వారలరక్తముచే నాకు దిలతర్పణముల నొసంగ గోరెదను. మీరిరువురు తడవుసేయక యంగీకారము నెఱింగించి యాయుధోత్పాటనము గావింపుడు.” సింగమనాయడు కన్నులు మూసికొనెను. భీమార్జునులకు దీసిపోని యాసోదర వీరు లిరువు రేకకంఠముగ ‘మీయాజ్ఞనెఱవేర్చి పితృఋణము నుండి విముక్తులమయ్యెద’ మనుచు జనకునిహృదయమున నాటికొనిన యాయుధము బెకలించిరి.

పితృమరణసందర్శనముచే బాలురగు ననపోత నాయనికి మాదానాయనికి బౌరుష మతిశయించెను. పితృవాక్య పరి పాలనము గావించుటయో, శక్తిలేకున్న ఘోరసంగ్రామమున శక్తియున్నంతవరకు బోరి మరణించుటయో కర్తవ్యమని వారికి దోచెను. బ్రతుకుపై నిరాశ జనించెను. పేరుజెందిన శూరలంద ఱాసమయమున నాకుమార రాజన్యుల సమ్ముఖమున కేతెంచి బుజ్జగించి ‘మేమందఱము చంపను జావను సర్వ సిద్ధముగా నున్నారము. సింగమనాయడు మీకు జనకుడు, మాకు బాలకుడుగావున నాతనియాజ్ఞపాటించుట మనయందఱకు సమానధర్మము గావున మీరు నాయకత్వము వహింపుడు. ఇపుడు రాచవారిమారణమున కుపక్రమింత’ మని హెచ్చరించిరి. కర్తవ్యము నారయు నాకుమారు లత్యుత్సాహముతో దండ్రికి దహనాది సంస్కారములు గావించి సైనికుల నందఱ సమావేశపఱచి పిత్రాజ్ఞ నివేదించిరి. స్వామిభక్తి పరాయణులగు నాయాంధ్రవీరు లందఱు కరవాలముల జళిపించుచు దమ యంగీకారములను వెల్లడించిరి.

స్వల్పకాలమునకె దేవరకొండ, రాచకొండలలో నున్న మూలబల మంతయు రప్పింపబడెను. జల్లెపల్లి ప్రాంత మంతయు వెలమవీరుల సైన్యముతో నేల యీనినటు లుండెను. జల్లెపల్లిలోని క్షత్రియులగుండె లదరెను. విజయముపై నాస తొలంగెను. ఐనను శక్తికొలది పోరాడి సంగ్రామరంగమున మరణించుటయే యిహపరసాధకమని భావించి వారును సంగరమున కాయితమైరి. సింగమనాయని యాజమాన్యము క్రింద నుండ నొల్లని స్వతంత్ర శీలురగు రాచవారు, కమ్మవారు, రెడ్డివారు జల్లెపల్లి రాచవారికి సైన్యముతో నేతెంచి తోడ్పడిరి.ఉభయ వీరులు సంగ్రామమునకు జెంజెర్ల ప్రాంతము రంగస్థలముగా నిర్ణయించు కొనిరి.

జల్లెపల్లి దుర్గాధీశ్వరులగు చంద్రవంశ చాళుక్య రాజుల పక్షమున గోన మల్లారెడ్డి, మంగళపూడి యిమ్మడిరెడ్డి, రావులవరపు మల్లారెడ్డి, పోలూరి పోలారెడ్డి, బండికోటారెడ్డి, వినుకొండ మారారెడ్డి, కుంట్లూరు మారారెడ్డి, అరవపల్లి గౌరిరెడ్డి, కొత్తపల్లికొండారెడ్డి, గౌరారెడ్డి, నాగారెడ్డి, కొలెచెలమకొండ మాచారెడ్డి మొదలగు రెడ్డిరాజులను రామగిరి దుర్గపరిపాలకులును అనంతగిరి,

కందికొండ, జమ్మిలోయలోనగు రెండువందలదుర్గముల బరిపాలించు సామంతులును సైన్యముతో వెలమసైనికుల బ్రతిఘటించుటకై తలపడిరి. జల్లెపల్లి రాచవారందఱు మూలబలముల నన్నింటిని మొగలూరు దుర్గమున సురక్షితముగ నుంచుకొని మిగుల సాహస విక్రమములతో వెలమవారి సైన్యమును బ్రతిఘటించిరి. ఇరువాగులవారి కింతయనరాని నష్టముకలిగెను. వీరవర్యులనేకులు గతించిరి. సంగరరంగ మంతయు రక్తప్రవాహముచే బంకిలమయ్యెను. ప్రతిపక్షుల హేతిఘాతములకు జంకక వెలమవారి సైన్యములు మృత్యు దేవతా వదనగహ్వరమును జొచ్చినటుల జగతుర సేనలో జొఱబడి నుగ్గు నూచము గావించిరి. రాచవారి సైనికులు వెలమసైనికుల కెందును దీసిపోక విక్రమముతో బ్రతిఘటించిరి. యుద్ధము చాల విరామముగ జరిగినను జయాపజయములు నిర్ణయింప నసాధ్యమయ్యెను. పిత్రాజ్ఞను నెఱవేర్ప కుండగనే యంతరించుట తమకు గర్తవ్యము కాదని యారాజుసోదరులు భావించి సైనికుల బేరు పేరు వరుసల బిల్చి బహుకరించి యిటులనిరి: 'పదాతులారా! మిమ్ము వేల్పులు స్వర్గద్వారములు తెఱచి సగౌరవముగ నాహ్వానించు చున్నారు. సూర్యమండలము మీకు స్వాగతము నొసంగుచు దన సారంగములనుండి మిమ్ము స్వర్గలోకము జేర్పగలదు. కాని రాచవారి రక్తముచే బితృదర్పణములు మేమొనరింపక ముందు బరమునసున్న సింగమనాయని సందర్శించుటకంటె నక్రమము వేఱులేదు. మీపై గర్తవ్యభారము మిక్కుటముగా గలదు. పగతురవధించి మా యుద్యమము గట్టెక్కింప వలయును. లేదా వంశాంకురమైన లేకుండ మనమందఱము గతింపవలయును." ఈవాక్యములు వినగనే ప్రతిపక్షులు చలించిరి. వెలమవారి సైనికు లినుమడించిన యుత్సాహముతో బ్రతిపక్షులబలములను జిందరవందర గావించుచు వీరవిహారము గావింపసాగిరి. సైనికులతో సమముగ రాజసోదరులుగూడ రణరంగమున కుఱికిరి.

కొంతకాలమునకు రాచవారి బలములన్నియు వినాశనము గావింపబడెను. పరాజయ భయముచేగొందఱు రాచ బలిగావించి అష్టదిగ్రాజ మనోభయంకర, సోమకులపరశురామాది' బిరుదములు గాంచి సమకాలిక రాజన్యులలో మిన్నయై యనపోతనాయడు మిగుల విఖ్యాతి నార్జించెను. అనపోతభూపాలుడు సోమకుల పరశురామాది బిరుదముల వహించినటుల నాతని శాసనములయందె గాక రసార్ణవసుధాకరమున సైత మీతనిపుత్రుడగు సర్వజ్ఞ సింగభూపాలుకు డీక్రింది విధముగా వ్రాసియుంటచే నీకథ విశ్వసనీయ మైయున్నది.

శ్లో॥ సోమకుల పరశురామే భుజబలభీమేధిభూమిగోపాలే
యత్రచ జాగ్రతి శాస్తరి జగతాం జాగర్తి నిత్యకళ్యాణం॥

(సోమకుల పరశురాముడు, భుజబల భీముడు, రణదేవేంద్రుడు మొదలగు బిరుదరాజములు గల యన్నపోత భూపాలుడు రాజ్యము పరిపాలించుచుండగా లోకములో శుభపరంపర వెలయసాగెను.)

అనపోతనాయకుడు జల్లెపల్లి క్షేత్రమున గావించిన ఘోర సంగ్రామముతో నాతనిప్రశస్తి దశదిశా పరివ్యాప్త మయ్యెను. ప్రతిఘటింపవచ్చిన రాజవంశీయు లందఱకు సంపూర్ణమైన పరాభవము కలిగెను. అనపోతనాయనిపౌరుష మా విజృంభణముతో నాటివారికి దెలియుటచే విద్వేషభావమును మానికొని ప్రతిపక్షులు శాంతమార్గగాములై సంచరించిరి. అనపోతనాయని విజయముల దెల్పునీక్రిందిగద్యమును నామన గల్లునివాసులగు బట్టులు నేటికి బఠింపుచున్నారు.
"బిరుదునకై వసించు నిందువంశపు రాజులు ఐదులక్షల యిరువదివేలు బలంబులతో ద్రిభువనరాయ బిరుదాంకుండని యెఱుంగక జిల్లెపల్లి వీరక్షేత్రంబున నెదిరించిన అఱువదివేల గుఱ్ఱంబులతోను, ఏనూరు మత్తేభంబుల తోడను, పదిలక్షల కాల్బలంబులతోను నెదురునడచిన పద్మజులకును తెనుంగులకును గంధ కస్తూరీ పరిమళద్రవ్యంబు లొసంగి తమ్మెదిరించిన యహంకార మహామానుష భార్గవులైన పద్మజులను రణరంగ దుర్జయులైన తెనుంగులను రణోత్సాహులై వీరసాహ సాహంకారంబులతోను మెఱయు రాజులను కమ్మనాయకులను రంకెలువైచు బిరుదురాహుత్తులను సముఖపు చరుపర్లతో గూడి కలహమందు నుగ్గునుగ్గాడి నూటొక్క రాజులశిరములు ఖండించి యెనుబది యొక్క రాజుల కీకసంబులుగా నుగలాడించి, పదియుమువ్వురు రాజుల రణబలిగావించి, ఆ రణక్షోణినర్చించి దిగంబరుడై కాళీ, మహాకాళీ, శాకినీ, డాకినీ భూతప్రేత పిశాచాలం దలంచి రణదేవ పోతరాజ కలహకంట కాది దేవతల నారాధించి ధ్యానించి రణరాజ రణశూర రణవీరాది నిజబలంబులకు జయంబు గలుగునట్లుగా

వైరిరాజులను బలిగావించి బట్టురాజును తానును రణంబు గుడిపి తనవిరాధివిర సాహసంబులు పొగడించుకొని తన ఖడ్గధారల దునిగినవారల స్వర్గంబున కనిపి, తన రేచర్ల గోత్రోద్భవుల కాచంద్రతారార్క మభ్యుదయాభివృద్ధి కలుగునట్లు దేవి వరంబుబడసి ......” అనపోతానాయ డొనరించిన జల్లెపల్లి క్షేత్రవీరవిహార మీగద్యమువలన విదితము కాగలదు.

క్షత్రియవీరులు సారెసారె కనపోతనాయనితో బ్రతిఘటించి వీరమరణము నొందుచుండిరి. ఆకాలమున నినుగుర్తియను నొక దుర్గమును పూసపాటివారి సంబంధులగు క్షత్రియులు పరిపాలించు చుండిరి. స్వతంత్ర శీలురగు నారాచవారు బలముల నాయితము జేసికొని యనపోతానాయకునితో బ్రతిఘటింప నెంచిరి. నాటివారినందఱ సామంతులను గావించికొని యావదాంధ్రదేశము నేకచ్ఛత్రముగ బరిపాలింప సంకల్పించిన యనపోతనాయడు రాచవారినడంప సంకల్పించి తమ్ముడైన మాదానాయకునకు సర్వసేనాధిపత్యము నొసంగి సంగరమునకు బయనమయ్యెను. మాదానాయకునితో 60000 కాల్బలములు, 20000 ఆశ్వికులు, 7000 ఏనుగులు, 10000 సేనానాయకులు రణమునకు బయనమైరి. సైన్యమును ముందు నడపుచు ననపోతానాయకు డొక యున్నత గజమునెక్కి పోవుచుండెను. వెలమసోదర వీరుల విజృంభణము నంతయు జారులవలన నాలకించి రాచవారందఱు యుద్ధమునకు సన్నద్ధులై బురుజులపై వీరవర్యులనిల్పి ద్వారముల కుభయపార్శ్వముల నాగ్నేయ యంత్రముల నెలకోల్పి ప్రతిపక్షులరాక కెదురు చూచుచుండిరి.

అనపోతనాయనికి సామంతులై యుండనోపని రెడ్డివారు, కమ్మవారు, రాచవారు, నినుగుర్తి దుర్గపాలకులకు దోడ్పడి సంగ్రామమున కాయితమైరి. అన్ని ప్రదేశములనుండి యరుదెంచిన యారాచవారిబలము 5,60,000కు మించి యుండెను. అనపోతనాయకుని ప్రభుత్వము విధ్వంసము గావింప వలయునని రాచవారును, రాచవారి విజృంభణము నశింపజేయ వలయునని వెలమవారు విక్రమించి ఘోర సంగ్రామమును గావింపనాయతమైరి.

విశ్వాస పాత్రులును స్వామిభక్తులునగు వెలమసేనా నాయకులు బహిరంగ స్థలమునందుండియు దుర్గములయందు దాగి యగ్నిగోళములను కుమ్మరించి సైన్యము నంతయు నురుముగావించుచున్న రాచవారికి లొంగక విజృంభించి దుర్గద్వారముల భేధింపదొడగిరి. రాచవారు బలముల నన్నింటిని దుర్గద్వారము చెంతజేరి ద్వారము పగిలిపోయినచో బ్రతిపక్షసైన్యమును బ్రతిఘటింపవచ్చునని సంగ్రామప్రయత్నముల గావించుచుండిరి. అనపోతానాయకుడు, మాదానాయకుడు మదగజంబుల నారోహించి ద్వారమును పొడిపింపసాగిరి. గజశిరోఘాతములచే ద్వారము భిన్నమగుచుండెను. గజముల శిర:ప్రదేశము లాద్వారపుగుబ్బలు తగులుటతోడనే వ్రయ్యలై రక్తము ప్రవహించెను. వెంటనే యావీరులు వేఱొక యేనుగులజంటను రప్పించి వానినారోహించి ద్వారభేదనమునకుదలపడిరి. ఇట్లు విశ్వప్రయత్నముమీద బద్మనాయక వీరులు ద్వారమును భేదించి ముందడుగువేసిరి. రాచవారు మూర్తీభవించిన ధైర్యమో యనునటుల స్థానము వదలక లోని కేతెంచు ప్రతిపక్షవీరుల నందఱ యథావిధి నురుమాడి దుర్గ సంరక్షణమున నప్రమత్తులై విక్రమించిరి. బురుజుల చెంత నున్నసైనికుల మాటిమాటికి బద్మనాయక సైన్యముతో దలపడి పోరుచు నాగ్నేయాస్త్రముల విచ్చలవిడిగా బ్రయోగించుచు నింతయనరాని విప్లవము ఘటించిరి. సంగరమర్మజ్ఞు డగు ననపోతనాయడు ప్రత్యర్థుల యొక్కయు దన యొక్కయు బలాబలములు విచారించి దుర్గములో నెటులేని ప్రవేశింపకున్నచో నపజయము తటస్థించి తీరునని నిశ్చయించి సైనికులనందఱి ద్వారమునుండి లోనికి జొఱబడ నాజ్ఞాపించెను. సముద్రమువలెనున్న పద్మనాయక సైన్యము ద్వారము గాపాడు రాచవారిబలముల నురుమాడుచు గొంచెముసేపటికి దుర్గములోని యన్నిభాగములకు బ్రవేశించి యాయుధశాలల నాక్రమించుకొని ప్రతిపక్షుల నెక్కడివారి నక్కడ నురుమాడిరి. కొన్నిదినంబు లుభయదళంబుల కింతయనరాని ఘోరసంగ్రామము జరిగెను. కడకు జయముపై నాసవదలి యుద్ధకార్యము నిర్వహించు రాచవారు ప్రాణభీతిచే దుర్గ శిఖరమునగల రహస్యగృహమున కేగి దాగికొనిరి. నాయకులు లేమిచే గొలదికాలము మాత్రము పోరాడి యుక్తాయుక్త మెఱుంగక రాచవారిసైన్యమంతయు వెలమవారికి వశమయ్యెను. హతశేషులగు సైనికులు బ్రతుకుము జీవుడా యని పిఱికి పందలై దొంగత్రోవలను బట్టి పారిపోయిరి. కొంతసేపటికి కినుగుర్తిదుర్గము రాజకులమువారి యధీనమునుండి తొలంగి పద్మనాయకుల హస్తగతమయ్యెను. రాచవారు కొందఱు శిఖరమున దాగియున్న సంగతి

రహస్యజ్ఞులచే ననపోతానాయకుదు, మాదనాయకుడు గ్రహించి శైలమునెక్కి యాగృహమునన్వేషించి ద్వారమును ముట్టడించి దొంగత్రోవలన్నింటి నరికట్టి సాహసించి లోనబ్రవేశించి యందున్న కొండ రాఘవరాజు, కొండ్రాజు, జగ్గరాజు, గోవిందరాజు, జూటూరు సూరరాజు, స్వర్ణనేనమరాజు, సాళ్వ రాఘవరాజు, తిరుమల ప్రోలరాజు, కుప్పరాజు, నరసరాజు, శ్రీనాధగౌతమీ భూనాధరాజు, శ్రీపతిరాజు, బాలదేవరాజు, మొదలగువారి నందఱను బంధించి యాక్రందనము గావించుచున్నను శరణుగోరినను, పాదములపై వ్రాలి క్షమార్పణము కోరుచున్నను వదలక దయాశూన్యులై వధించిరి.

బలవంతులగు ననపోతరాయునిచే మాదనాయనిచే ముం దెట్టియపాయములు వచ్చునోయని యాప్రాంతముల నాశ్రయించి జీవించు రాజవంశీయులందఱును దేశత్యాగము గావించి ప్రచ్ఛన్నముగ నటనట జీవింపసాగిరి. అనపోతనాయ డును దయాశూన్యుడై రాచపురుగును మిగుల్తు మేని యేనాటికైన నపాయము రాకమానదని తనయాజమాన్యమున గల దేశమంతటనుగల రాచవారలనందఱను బాలురనక వృద్ధులనక స్త్రీలనక శిశువులనక తెగటార్చి సోమకుల పరశురామ బిరుదము సార్థకము గావించుకొని శత్రుజనకంటకుడై రాజ్యము పాలించెను.

కాలక్రమమున దాదాపుగ నిజామురాష్ట్రములోని యాంధ్రదేశమంతయు ననపోతభూపాలకుని హస్తగతమయ్యెను. అతడు భువనగిరి, ఓరుగల్లు, రాచకొండ, రామగిరి, గోలకొండ, కంబముమెట్టు, దేవరకొండ దుర్గములు స్వాధీనముగావించుకొని విరోధియనువాని దలయెత్తనీయకుండ సర్వైశ్వర్య సంపన్నుడై వయ:కాలమునంతయు బరరాజ్యాకర్షణముతో విజయయాత్రలతో గడుపు చుండెను. విజయయాత్రల కేగుచు మార్గమధ్యముననున్న యయ్యనవోలు మైలారుదేవుని సందర్శించి యాగ్రామము నంగరంగ వైభవాదికములతో నుత్సవాదికములు జరుగుటకై దానమొనరించి యనపోతనృపుడట నొకశాసనము స్థాపించెను. ఈవీరవతంసుని విక్రమజీవితము చాలవఱ కాశాసమున లిఖింపబడియున్నది. అందు సోమకుల పరశురాముడగు నీ యనపోతరాజుపరాక్రమ మీవిధమున వర్ణింపబడి యున్నది.

"శ్లో॥ ముని రజనిపరశురామః
స్థానే వినియుజ్య వైష్ణవం తేజః
సోమకులపరశురామే
దరామవ త్యన్న పోతభూపాలే॥"

(తా॥ పరశురాముడు తన విష్ణుసంబంధమగు తేజము నంతయు సోమకుల పరశురాముడగు ననపోతభూపాలకుని స్థానమునం దుంచెను.)

అనపోతనాయకు డాంధ్రదేశమునంతయు వశము గావించుకొని రాచకొండ రాజధానిగ నొనరించుకొని శత్రు జనభీకరముగా రాజ్యము చిరకాలమేలెను. ఈరాచకొండ నిజామురాష్ట్రములో నల్లగొండమండలమున నున్నది. ఇది హైదరాబాదునకు దూర్పుగా 34 మైళ్ళదూరమున గలదు. అనపోతనాయని రాజ్యవిస్తృతి బలసామర్థ్యములు గ్రహింప నుద్దేశింతుమేని యీదుర్గచరిత్రము తెలిసికొనుట యావశ్యకము. గ్రామముచుట్టు మిగుల దృఢతరమైన కోటయు మిగుల లోతుగల యగడ్తయు గలవు. దుర్గమునకు నాలుగువైపుల నాలుగు ద్వారములు కలవు. అందు దూర్పుద్వారము మట్టివాడ దర్వాజాయనియు, దక్షిణద్వారమును భైరవునిగం'గ యనియు, బడమటి ద్వారమును నేనుగుల దర్వాజాయనియు, నుత్తర ద్వారమును భువనగిరి గండియనియు వ్యవహరింప బడుచున్నవి. ద్వారము లన్నింటిసమీపమున గండభేరుండ వీరాంజ జనేయ కాలభైరవాది వీరవిగ్రహములును వానిక్రింద ననపోతనాయకుని బిరుదములు సమగ్రముగ జిత్రింపబడి యున్నవి. కోటయొక్క యంతరాళమున రాచకొండ యనుగ్రామమును ధన్మధ్యమున రెండుకొండలు గలవు. అందొకటి రాచకొండనియు మఱియొకటి నాగనాయనికొండ యనియు బిలువబడుచున్నవి. రాచకొండ రాజువసించునది. ఇందు రాజనివాసోచితములగు చిహ్నాము లనేకములు నేటికి గానవచ్చు చున్నవి. రాచకొండపై శిలామయములును శత్రుజనాభేద్యములు నగు న్రాలుగుకోటలును నున్నతములగు బురుజులును దర్శనీయములై యలరారుచున్నవి. రెండవకొండయగు నాగనాయనికొండపై గూడ నొక దృఢతరమగు దుర్గముకలదు. నాగనాయడను శూరవర్యు డాదుర్గమును నాశ్రయించి యుంటచే దానికాపేరు వచ్చెను. నాగనాయనిచరిత్రము

ముందు బతింప నవకాశము కలదు. అనపోతానాయని సోదరుడగు మాదనాయకుడు దేవరకొండయను దుర్గమున నుండి యగ్రజుని యాజ్ఞాను సారముగ రాజ్యము పాలించుచుండెను. ఈయుభయ దుర్గములు 30 మైళ్ళదూరములో నుండెను. ఆకాలమున నాంధ్రదేశములో ననపోతానాయకుని యంతటి బలవంతుడగు రాజులేడు. డిల్లీ పాలించు నవాబుతక్క ననపోతనాయని నెదుర్కొను రాజు మధ్యదేశమున లేడనుట సహజోక్తియే. అగ్రజునకు సహాయముగ దేవరకొండదుర్గము పరిపాలించు మాదానాయని చరిత్రము పఠించుటయు మనకు బ్రకృతముకాదు. మాధవనాయకుడు పరిపాలించు దేవరకొండ దుర్గము సామాన్యమైనది కాదు. రాచకొండ దుర్గమును మించినదనియె చెప్పవచ్చును. దేవరకొండ దుర్గమున 360 బురుజులు 9 రాజద్వారములు 32 దొడ్డిత్రోవలు కలవు. దుర్గమున గొన్ని దేవాలయములు 32 పెద్దబావులు కలవు. అనపోతనాయని పరిపాలన కాలములో నీదుర్గమును జూపల్లివారు, వేనేపల్లివారు, కటికినేనివారు, మునుగోటివారు, గుమ్మడపువారు, క్రొత్తవారు, మిర్యాలవారు, పానగంటివారు, గుగ్గిలపువా రనుతొమ్మిదిమంది వెలమనాయకులు సైన్యాధ్యక్షులై సంగ్రామధర్మముల నిర్వహించుచుండిరి. మాధవనాయకుడు మిగులత్యాగశీలుడై విక్రమశాలియై యనేక ధర్మములు గావించి ప్రతిసంగ్రామమున నగ్రజునకు సాయపడి కృతకృత్యు డయ్యెను.

మాధానాయకుడు శ్రీశైలమున సోపానములు గోపురమండప ప్రాకారములు గట్టించిన శ్రీశైలోత్తర ద్వారమున నొకమండపము నిర్మించెను. ఇతడు సర్వవిధముల ననపోతరాజునకు సమానుడనుట కీపద్య మాధారము కాగలదు.

సీ|| "పరశురాముడు తండ్రి . పగ సాధ్యముగ జేసి
 తరతరము నృపుల . తలలు నఱకె
సగరుండు తండ్రికై . పగగిని రోషించి
 తాలజంఘాదుల . తలలు రాల్చె
దఱిమి యశ్వత్థామ . తండ్రికై యెంతయు
 నల పాండుసైన్యంబు . తలలుద్రుంచె
మహిమీద సింగయ . మాధవోర్వీశుడు
 తండ్రికై రాజుల . తలలుగోసె

గీ|| గాక యబ్బంగి సంగరాం . గణములందు
వైరివీరుల గెలువ నె . వ్వాడు చాలు
దనర భార్గవ నగరులు . ద్రౌణి రావు
మాధవుడుదక్క శూరులు . మఱియు గలరె||"

ఆకాలమున మహారాష్ట్రదేశములోని చాలభాగము, ఆంధ్రదేశములోని కొలది భాగమును తనయధీనమునందుంచుకొని అల్లాయుద్దీన్ షాహయను మహమ్మదీయుడు కలుబరిగి ముఖ్యపట్టణముగ రాజ్యముపాలింప దొడంగెను. విద్యానగరమునకు ననపోతనాయని రాజ్యమునకు దనరాజ్యము సరిహద్దులలో నుంటచే గాలము గనిపెట్టి యారెండురాజ్యములలోని దుర్గములను అల్లాఉద్దీను గొన్నింటిని స్వాధీనము గావించికొనెను. సరిహద్దులలోనుండి యామహమ్మదీయుడు గావించు దుర్నయము నంతయు విద్యానగరము బరిపాలించు బుక్కరాయలు, రాచకొండ పరిపాలించు ననపోతరాజు గ్రహించి సమీపముననున్న యవనుని మట్టుపెట్టుట కెంతయో యత్నించుచుండిరి.. ఇంతలో అల్లాఉద్దీన్ షాహ క్రీ.శ. 1358 లో గతించెను. అతని రెండవకుమారుడగు మహమ్మద్‌షాహ పిత్రృరాజ్యమునకు వచ్చెను. ఆనూతనుని పరిపాలనమున రాజ్యమం దశాంతి మెండయ్యెను. సేనానాయకులు రాజద్వేషముతో వర్తించుచుండిరి. ప్రజలుగూడ రాజుపై నసూయ జూపసాగిరి. ఈస్థితిలో నాతనితల్లి మల్లికాజెహాన్ విశేషముగ ద్రవ్యము సైన్యము దీసికొని మక్కా మదీనా యాత్రలు గావించుటకై తురుష్కదేశమున కేగెను. ఈ సందిగ్ధస్థితి గనిపెట్టి బుక్కరాయలు, అనపోతనాయడు నైకమత్యము వహించి మహమ్మదీయరాజ్యము నంతము నొందింప నిశ్చయించుకొని మహమ్మదుషాహ సంస్థానమునకు జెరియొక రాయబారిని బంపుచు 'మీతండ్రిహరించిన మాయాంధ్రదేశములోని భాగములు మాకు వదలివేయవలయును, లేకున్నచో మేమిరువురము మీరాజ్యముపైకి సంగ్రామమునకు రానున్నార' మను సందేశమును దెలుప బంపిరి.

రాయబారు లిరువురు కలుబరుగ జేరి మహమ్మదుషాహాను సందర్శించి తమరాజన్యుల సందేశమునంతయు నివేదించిరి. సందిగ్ధావస్థలోనున్న మహమ్మదుషాహ యేమియు బ్రత్యుత్తరము జెప్పజాలక 'యిదిగో అదిగో ప్రత్యుత్తరము నొసంగుదు' నని చాలకాలము గడపి రాజ్యమునం దశాంతి నెలకొల్పు నుద్యోగుల దొలగించి ప్రభుభక్తిపరాయణులు విశ్వాసవంతులు నగు నూతనోద్యోగుల కధికారపదవుల నొసంగి పౌరులపై గ్రొత్తపన్నులు విధించి బొక్కసము క్రమక్రమముగా వృద్ధిగావించి సైనికబలమును స్వల్పకాలములోనే మిగుల నభివృద్ధిలోనికి దెచ్చెను. వంచనోపాయముతో దనబలము సంగ్రామమునకు జాలినంత సమకూర్చికొని యాంధ్రులగు రాయబారుల జూచి 'మీరు స్వస్థానముల కేగ వచ్చును. కొలదికాలము సైనికులతో మేము స్వయముగా వచ్చి మీరాజన్యులకు బ్రత్యుత్తరము నొసంగెద' మని మహమ్మద్‌షాహ్ వారిని పంపివేసెను. 'పదునెనిమిది మాసములుంచికొని చెప్పవలసినసంగతి యిదియా' యని యా నవాబును దెప్పి చేయునదిలేక కలరూపునంతయు దమరాజన్యుల కెఱింగించి సంగ్రామప్రయత్నములో నుంట మేలని వా రిరువురు నిజనివాసములకు జేరిరి. అనపోతనాయడు మహమ్మదుషాహ్ దురంతము విని యాగ్రహించి సంగ్రామ ప్రయత్నములు చేయుచు బలముల నన్నింటి నొరంగల్లు దుర్గమునకు జేర్చెను. బుక్కరాయలు కొంత సైన్యమును ననపోతనాయని సహాయార్థమై యోరుగంటికి సకాలమునకు బంపెను.

మహమ్మదుఖాను ఓరుగల్లు ముట్టడించుటకై యమితమగు సైన్యము నొసంగి సైన్యాధిపతియగు బహదూరుఖానును బంపెను. దురాశయుడగు నాతడు గోలకొండ హద్దుజేసికొని మధ్యనున్న గ్రామము లన్నింటిని దోచుచు దురంతములు గావించుచు దేవాలయములను మత మందిరములను రూపుమాపుచు గొలదికాలమునకె ఒరంగల్లు సమీపించెను. మహమ్మదీయులబల మమితముగా నుండుటచేతను దమ సైనికులందఱు వ్యాధులచే గృశించియుంట వలనను సంగ్రామము గావింప నశక్తుండై యామహమ్మదీయవీరునితో ననపోతానాయకుడు సంధి కంగీకరించెను. సంధి నియమముల ప్రకారము రావలసిన రొక్కమునంతయు దీసికొని యవన నృపాలుడు గృహాభిముఖుడై త్రోవల గొట్టుచు నమితోత్సాహమున నిజనివాసంబున కేగి యేలికకు దన విజయ వార్త నంతయు నెఱింగించి యుచితసత్కారముల నొందెను.

'దినము మంచిదైన యూరెల్ల దొంగిలు' మన్నట్లు మహమ్మదుషాహ మఱల నేకశిలానగరమును ముట్టడింప వలయునని యుద్దేశించెను. ఇంతలో గొందఱు మహమ్మదీయులు మహమ్మదుషాహ సమ్ముఖమున కేగి యనపోతనాయకుడు తమయొద్ద గొన్ని యశ్వములను గొని సరియగు వెల నొసంగక యవమానించెననియు బ్రతిక్రియ గావించి యవమాన దు:ఖమును వారింపుమనియు ననేకవిధముల వేడుకొనిరి. మతావేశపరుడగు మహమ్మదుషాహ వారల కభయ హస్త మొసంగి యాంధ్రరాజన్యుని బంధించి తీరెదనని పకీ రులముందు వీరప్రతిజ్ఞ గావించెను. "మహమ్మదు సిరాజుద్దీన్" అనునొక భక్తుడు విజయము మనకు గలిగి తీఱునని పది దినము లేకధాటిగ ప్రార్థనములు గావించి పదునొకండవ దినమున యుద్ధమున కేగ మహమ్మదుషాహాను బ్రేరేపించెను. ఆ శుభముహూర్తమున మహమ్మదు షాహ్ సైయఫద్దీను గోరి యనువానికి రాజ్యము నొప్పగించి యమితమగు బలముతో ననపోతానాయకుని బ్రతిఘటింప బయలువెడలి కొంత కాలమునకు గల్యాణపురము జేరి యట ప్రయాణాయాసమును దీర్చికొని సైన్యము నెక్కువగా వెంటగొని పోయిన జాల కాలమగుటయే గాక వ్రయప్రయాసలు సైతము మిక్కుటముగ నగునని తలంచి వెంటవచ్చిన సైన్యములో జాలభాగము వెనుకకు బంపి నాలుగు వేలమంది యాశ్వికులను బదివేలమంది సైనికులను మాత్రము వెంటగొని యాంధ్ర నగరరాజమునకు జేరెను. మహమ్మదుషాహ కొంచెము ముందుగ నలువురు భటులనుబిల్చి ఓరుగల్లుద్వారముకడ నిల్చి ద్వారరక్షకులను బ్రమత్తులగావించి యేదియో వ్యవహారము బెట్టుకొని యున్నచో దా నాకస్మికముగ బలముతో వచ్చి ద్వారమును భేదింతునని చెప్పిపంపెను. నలువురు యవనులటులె యొరంగల్లు ద్వారముచెంత జేరి తాము గుఱ్ఱపు బేరగాండ్రమనియు ననపోతభూపాలుని కొఱకు గొన్ని యశ్వములను దూరదేశమునుండి కొనివచ్చితి మనియు భాషించు చుండగా ద్వారరక్షకు లావార్తలు నిజములని విశ్వసించి యుచితవిధుల మఱచి వారితో బ్రసంగించు చుండిరి. ఇంతలో నాకస్మికముగ మహమ్మదీయ సైన్యమువచ్చి ద్వారమును సమీపించి లోన బ్రవేశించెను. ద్వారపాలకు లులికిపడి ద్వారములు బంధింప బ్రయత్నించిరి. గాని దృఢతరములగు నాద్వారములు వేయుట యసాధ్యమయ్యెను. ప్రచ్ఛన్నముగ భాషింపుచున్న యానలువురు

యవనులు నిలువుటంగిలలో గుప్తముగనున్న కరవాలములబెఱికి ద్వారపాలకుల వధించిరి. ఆ యదనున మహమ్మదుషాహ బలములన్నింటిని ద్వారము నుండి పురములోనికి గొనిపోయెను. స్వామిభక్తుడును విక్రమశాలియునగు (నాగనాయడు) నాగయ రుద్రదేవుడు వారల నెదిరించి పురద్వారముచెంత నడ్డగించి సమీపమున గల బురుజునాశ్రయించి స్థిరముగ నిలువబడెను. మహమ్మదీయు లాధీరుని ధాటికాగజాలక బురుజునకన్నివైపులమంటలబెట్టి యీటెలతో బైనున్న నాగయ రుద్రదేవుని క్రుమ్మిరి. చాలసేపు ప్రతిపక్షుల దురంతములకు బ్రతిక్రియ గావించి కావించి యలసి జాఱి యగ్నిహోత్రమునబడి యావీరుడు వీరమరణము నొందెను.

ఎంతయో ప్రయాసపడి యవనసైనికులు పురములో బ్రవేశించిరి. ఆంధ్రవీరులు కోటగోడలమీదను బురుజులమీదను మేడలమీదను నిల్చి యవనదళములపై విచ్చుల విడిగ నాగ్నేయగుళికల గ్రుమ్మరింపసాగిరి. పేరుజెందిన యాంధ్రవీరు లనేకులు కరవాలము లుభయహస్తముల గీలించి మార్తుర బలములతో దలపడి ఘోరసంగ్రామము గావించిరి. ఆనాడాంధ్రులు చూపిన యద్భుతవిక్రమమున కనపోతరా జాశ్చర్యము నొంది తానొక యున్నతాశ్వము నెక్కి సైనికుల కుచితధర్మము నెఱింగించుచు బ్రతిపక్షసైన్యముల నురుమాడించుచుండెను. ఆంధ్రులధాటి కాగలేక యవనసైన్యమంతయు ఱాతిపైబడిన గోలికాయలవలె తలకొక త్రోవను బాఱిపోయిరి. అనపోతనాయడు స్వయముగ మహమ్మదుషాహ నెదిరించి యాతనితో జాలసేపు పోరాడెను. అనపోతనాయనిచే మరణముదప్పదని యాతడు నిశ్చయించి కొని ప్రాణముపై దీపిచే బాఱిపోయెను. ఆంధ్రసామ్రాజ్యమునకు విజయార్థమరుదెంచి పరాభవము గడించినందులకు గుర్తుగ మహమ్మదుషాహశరీరముపై ననపోతరాజన్యుడు రెండుమూడు బలమైనగాయములు చేసి పాఱిపోవువానిని వధించుట మగటిమికాదని వెనుకకుమరలెను. మహమ్మదుషాహ చావగామిగిలిన పదునైదువందల సైనికులతో దలప్రాణముతోక బట్టగా గలుబరగపురమునకు బరాభవరూపమగు నభాగ్యదేవతతో గూడ బ్రవేశించెను.

చెప్పరాని పరాభవముతో గలుబరగ జేరియు మహమ్మదుషాహ మఱల నాంధ్రనగరమును ముట్టడింప బలంబుల నాయితము చేయుచుండెను. కలుబరగ బహమనీవంశము నిర్మూలముగావింపకున్న నేసమయమున నేయపాయము కలుగునో యని యనపోతనాయడు చాలతడవు విచారించి డిల్లి చక్రవర్తిగానున్న ఫిరోజీషాహకడ కొకరాయబారము పంపెను. రాయబారులు డిల్లినగరమున కేగి ఫిరోజిషాహాను దర్శించి బహమనీ రాజ్యము నంతమొందించి కలబరగ డిల్లిలో గలుపుకొందురేని యనపోతభూపాలుడు మీకు సర్వబలములతో సహాయము రానున్నా" డనియు లేక మీ రుచితబలముల బంపుదురేని తనబలములతోగూడ ననపోతభూపాలుడు సంగరకార్యము నిర్వహించు'ననియు విన్నవించిరి. నవా బపుడు కుటుంబకలహములలో మగ్నుడైయుంటచే గర్తవ్యశూన్యుడై రాయబారులకు బ్రత్యుత్తరము నొసంగక ప్రకృతము తానా యుభయమార్గముల నంగీకరింప జాలడనియు బరులకు సహాయము గావింపదగినంతబలము తనచెంతలేదనియు దమరాజుతో దెలుపుమని మాత్రముచెప్పెను. రాయబారులు నిరుత్సాహముతో నాంధ్రనగరమునకేగి జరిగినయంశము నంతయు ననపోతభూపాలున కెఱింగించిరి.

అనపోతనాయడు డిల్లినవాబుతో మంత్రాంగము చేయుచున్న సంగతి గూడచారులవలన మహమ్మదుషాహ యాలకించి కోపము నొందినవాడై యనపోతరాయని రాజ్యచ్యుతుని గావించుటయో యతనిచే నంతరించుటయో కర్తవ్య మని యమితబలసమన్వితుడై యేకశిలానగరమునకు దాడి వెడల యత్నించి తనయావద్బలమును రెండుగా విభజించి యం దొకభాగమును "అజీము హుమాయూన్" అనువాని యాధిపత్యముతో విదర్భదేశమును ముట్టడింప బంపి మిగిలిన సగముబలమునకు సరదరుఖానుని యధ్యక్షునిగావించి యాతనివెంటనే తాను స్వయముగా నోరుగంటికి బయనమయ్యెను. ఈసమయమున మునుపటివలెనే సయఫియుద్దీనుగోరీయే సైన్యాదికముల స్వల్పముగా నుంచికొని కలబరగ దుర్గము గాపాడుచుండెను. మహమ్మదీయబలము కొంతకాలమునకు ఒరంగల్లుచేరెను.

యవనబలము లాకస్మికముగ నోరుగల్లు ప్రవేశించు వఱ కచట తగినంతమంది సైనికులు లేకుండిరి. ఒకపద్మనాయక వీరుడుమాత్రము ద్వారమును గొలదిబలముతో గాచుకొనియుండెను.

సైనికులందఱు ననపోతనాయనివెంట గొండవీటిరెడ్డిరాజుల బ్రతిఘటించుటకై ధరణికోటప్రాంతముల కేగియుండిరి. మహమ్మదీయులు స్వల్పబలముతోనున్న యేకశిలానగరము నవలీలభేదించి యేయాటంకము లేకుండ లోనబ్రవేశించిరి. మహమ్మదీయులు రాజ్యమునబ్రవేశించి యనేక దురంతముల గావించిరి. వేగులవా రీయుదంతము నంతయు ధరణికోట కేగి యనపోతనాయని కెఱింగించిరి. వెంటనే యనపోతనాయడులికిపడి రెడ్డివారితో నెటులో సంధిగా వించుకొని యేకశిలానగరము ప్రవేశించెను. మహమ్మదీయ సైన్యము విజయసూచకముగా గోటలో గుడారములో విడిసియుండిరి. ప్రతిఘటించినచో విజయ మసాధ్యమని సంగర మర్మజ్ఞుడగు ననపోతనాయనికి స్ఫురించెను. అదిగాక రెడ్డివారితో జాలకాల మెడతెగకుండ బోరాడుటచే నాంధ్రసైన్యమంతయు భిన్నభిన్నమై యుండెను. మహమ్మదీయ బలమంతయు జెక్కుజెదరక కోటలో స్థిరవాసము నేర్పఱచుకొని యేకశిలానగర రాజ్యమును మ్రింగివేయవలయునని బయలుపందిరులు వేయుచుండెను. దైవముకూడ వారలపక్షముననె యున్నటుల ననపోతనాయని కశుభసూచనము లనేకములు గోచరించెను.

పుట్టినదాదిగ ననపోతరా జపజయము నొందినవాడు కాడు. ఆకాలమున గల యాంధ్రరాజన్యులలో నాతడె పైచేయిగ నుండెను. అనపోతనాయ డొకసేనానాయకుని కుమారు డను నంశము మాపాఠకులు మఱచియుండరు. తన బాహుబలము, శక్తిసామర్థ్యములు, బలసాహసములు వ్యయము గావించి యాతడు నిరాటంకముగ నాంధ్రదేశములోని చాలభాగమును తన ఛత్రచ్ఛాయక్రిందకు జేర్చికొనెను. మొక్కవోని పరాక్రమముగల యనపోతరాజన్యుడు తనదైన్యమునకు విచారించి కొందఱు రాయబారులను మహమ్మదుషాహయొద్దకు బంపెను. అనపోతనాయడు రాయబారము లకు వచ్చినదెచాలునని మహమ్మదుషాహ సంతోషించి తన దుర్బలస్థితి దలంచుకొని గోలకొండ ప్రాంతముల నొసంగినచో వెనుక కేగెదనని వర్తమానమంపెను. కాల పరిస్థితులను గాడముగ యోజించి చేయునదిలేక కట్టకడ కనపోతభూపాలుడు కొంతద్రవ్యము, గోలకొండదుర్గము, దానికి సంబంధించిన గ్రామములు మహమ్మదుషాహ కొసంగ నంగీకరించెను. మధ్యవర్తులుచెప్పిన సరిహద్దులు వెంటనే యేర్పాటుచేసికొని సంధిరూపకముగ నొసంగిన యపరిమిత ధనమునుగొని గోలకొండరాజ్యముతొ దృప్తిపడి మహమ్మదుషాహ గృహముచేరెను. అనపోతనాయడు తన జీవితకాలములో నొందిన పరాజయ మిదియొకటియె యని చెప్పవచ్చును. అనపోతనాయకుని విక్రమజీవితము వెల్లడించు పద్యములు కొన్ని యాంధ్రజనులు పఠించుచున్నారు. చరిత్ర జిజ్ఞాసువుల యభిరుచి నుద్దేశించి యాపద్యములలో ముఖ్యములగువానిని గొన్నింటి నీక్రింద నుదాహరించి యాశూర వర్యుని విక్రమజీవిత గ్రంథము ముగించుచున్నారము.

ఉ|| ఆలములోన సింగవసుధాధిపనందను డన్నపోతభూ
పాలకమౌళి కోడి యని బారిన వైరుల నాలభంగినే
తోలునుగాని చంపడట దోసమటంచును నౌర రాయగో
పాలున కుర్విలోన బశువర్గము గాచుట సాజమేకదా!

మ|| చిరకాలవ్రతశీలుడై నరుడు కాశీతీర్థ నిర్మగ్నుడై
స్థిరలీలన్ వృషభంబునెక్కి రజతాద్రింజెంది ముక్కంటియౌ
టరుదే సింగయ యన్నపోత విభుబాహా ఖడ్గనిర్మగ్నుడై
యదివీరుండు గజంబునెక్కి సురరాజౌ టద్భుతంబెన్నగన్.

సీ|| అశ్వరేవంతుండు . హయమునునెక్కిన
దండిరాజులగుండె . తల్లడిల్లు
దరిని దద్భీకర . కరవాలహతికిని
గర్ణాటసేనలు . కళవళించు
సంగ్రామపార్థుని . చాపటాంకృతులకు
దెలుగురాజ్యంబెల్ల . దిగులుకొనును
బ్రథన నిశ్శంకకు . బల్లెంబు డాకకు
నుల్కుల్కు పడుచుందు . రొడ్డెరాజు

తే.గి|| లతడు దరిమినచో నుండు . వితములేక
సొరది సురధాని రాజులు . సొంపుదప్పి
యోటమందిరి సిందూరి . కోటబయల
సన్నుతఖ్యాతి యనపోత . మన్నెరాజు||

ఉ|| ఒక్కడు జారముఖ్యు డొకడూరకరోజు బరేతపాలకుం
డొక్కడొకండు రాత్రిచరు డొక్కడు చాల జడుండుచంచలుం
డొక్కడొకండు యక్షఘనుడొక్కడు భిక్షుకుడేటి దిక్పతుల్
దిక్కుల నన్నపోత జగతీతల నాధుడుదక్క మేదినిన్||

(అనపోత భూపాలుడు క్రీస్తుశకము 1344 మొదలు 1380 వరకు రాచకొండ ముఖ్యపట్టణముగ నాంధ్రదేశము ను బరిపాలించెను. ఇతనిశాసనములు నిజామురాష్ట్రము లోని యయ్యనవోలు, దేవరకొండ, రాచకొండ లోనగు చోటుల కానవచ్చు చున్నవి.)

సాళ్వ నరసింహరాజు.

బుక్కరాయల యనంతరము విద్యానగర సామ్రాజ్యమును(రెండవ) హరిహరరాయులు, మొదటి దేవరాయలు, ప్రౌఢ దేవరాయలు, మల్లికార్జునరాయలు, విరూపాక్షరాయలు వరుసగ బాలించిరి. వీరిలో బ్రౌఢరాయలు చిరకాలము రాజ్యము తన పూర్వులకు సమానముగా బాలించి మితిలేని ధనము భాండాగారమున జేర్చి క్రీ.శ. 1446 ప్రాంతమున మరణించెను. ప్రౌఢదేవరాయలకు పొన్నలదేవివలన మల్లికార్జునరాయలు, సింహలదేవి వలన విరూపాక్షరాయలు జనించిరి. మల్లికార్జునరాయలు తనపూర్వులు సంపాదించిన రాజ్యమును జాగరూకతతో గాపాడుకొనుచుండెను. ఒక్క ప్రక్కను మహమ్మదీయులు పూర్వ వైరమును బురస్కరించుకొని కర్ణాట సామ్రాజ్యమును కబళింప నుండిరి. కటకపాలకుడగు కపిలేంద్ర గజపతివిస్తారమగు బలమును సమకూర్చుకొని ఆంధ్రదేశమునందలి ప్రసిద్ధ దుర్గముల నన్నిటిని లోబఱచికొని విద్యానగరమును ముట్టడించెను. మల్లికార్జునరాయలు ఘోరసంగరము చిరకాలము గావించి గజపతి నెటులో తరిమివేసెను. గజపతి యంతతో బోళ చిక్కిన దుర్గములను జిక్కినటుల లోగొనుచు జంద్రగిరికి బోవగా సాళ్వనరసింహరాజు గజపతిని దన పాలనమునం దడుగిడనీయక సరిహద్దులవఱకు దరిమెను.

మల్లికార్జున రాయల తరువాత విరూపాక్ష రాయలు విద్యానగర సామ్రాజ్యపాలకు డయ్యెను. సహజముగా జంచల స్వభావుడును భోగపరతంత్రుడును నగు నీ రాజు రాజకీయ వ్యవహారములలో గొంచెమేని జోక్యము కలుగజేసి కొనక యెల్లపుడు భోగస్త్రీలతో గ్రీడించుచు సురాపానమత్తుడై యుండెను. ఈ యసమర్థుని తెలివితేటలు గమనించి మహమ్మదీయులు గోవాపట్టణము నాక్రమించికొనిరి. కపిలేంద్ర గజపతి యనంతరము విరోధిజన దుర్గమమని పేరొందిన విద్యానగర రాజ్యమును అతనికుమారు డగు పురుషోత్తమ గజపతి ముట్టడించి సైన్యమును నోడించి అపరిమిత ధనమును రత్న సమూహమును సింహాసనమునుగైకొని కటకము చేరెను. రాజ్యమునందు బరులు ప్రవేశించుట కిదియెమొదలు. తురుష్కుల దండయాత్రలతో గొంత రాజ్యభాగము గూడ బరాధీనము కానుండెను. గజపతి విద్యానగర సామ్రాజ్యమును గబళింప దగినంతబలమును సమకూర్చుచుండెను. ఏడులక్షల వఱకు దండ్రికాలమునం దున్న సైనికబల మంతయు దరిగిపోయెను. మూలధనముగా దండ్రి సేకరించిన ఎనుబదియైదు కోటుల వరహాలుగూడ నాశమయ్యెను. సర్వవిధముల మహోన్నతదశయందుండి ప్రకృతిసహజమగు శైలదుర్గములచేతను దుంగభద్రావాహినిచేతను సురక్షితముగానున్న విద్యానగర సామ్రాజ్యమును జేసేతుల విరూపాక్షరాయలు పాడుసేయుటజూచి సామంతులు సేనానులుగూడ దిరస్కారభావముతో నుండిరి. ఇంక నుపేక్షించినయెడల బరిస్థితులు విషమించునని రాజశేఖరురాయలు తన తండ్రియగు విరూపాక్షరాయలను జంపించెను. ఇతనిసోదరుడగు రెండవ విరూపాక్షరాయలు రాజశేఖరు రాయలను జంపించెను. భ్రాతృహంతయగు రెండవవిరూపాక్షరాయలయెడ బ్రజలహృదయములం దసంతృప్తిజనించెను. రాజ్యమునం దంతటను దిరుగుబాటు లభివృద్ధియయ్యెను. ఎవనికి వాడె స్వాతంత్ర్యమును బ్రకటింప యత్నించుచుండెను. ఉదయగిరిరాజ్యము అంతకుముందె గజపతు లావరించుకొనుటయు జంద్రగిరి, పెనుగొండ, గండికోట రాజ్యములు సాళ్వ నరసింహభూపాలుని స్వాధీనమునందుంటయు గర్నాటరాజ్య దుర్బలస్థితికి దార్కాణములుగ నుండెను. ఈ స్థితిగతులలో బహమనీ సుల్తానులు కర్ణాట రాజ్యమును హరింప సిద్ధముగా నుండియు సాళ్వ నరసింహ భూవిభునిధాటికి వెఱచి యూఱకుండిరి.

'విద్యానగర రాజ్యము నుపేక్షించినచో యవనులు హరింపక మానరు. విద్యారణ్యాది మహానుభావులు తమశక్తి ధారవోసి నెలకొల్పిన యీమహారాజ్యమును గోలుపోతిమేని ఆర్షధర్మము లంతరించి దేశమంతయు సంక్షోభ మొందకమానదు, అని సాళ్వనరసింహరాయడు తలంచి తనక్రింద దుర్గాధ్యక్షుడుగానున్న తుళువనరసరాయలను బిలువనంపి విద్యానగరరాజ్యమును ముట్టడింపుమని యాజ్ఞాపించి తనయొద్దనున్న సైన్యమునంతయు సహాయముగా బంపెను. నరసరాయడు తనబాలమిత్రుడును రాజ్యకార్య విశారదుడును సంగరకౌశలుడు నగు

తిమ్మరుసుమంత్రిని సహాయముగా గైకొని యొక శుభముహూర్తమున విద్యానగరమును ముట్టడించెను. సాళ్వనరసింహ భూపాలుని ధర్మపరిపాలనము నందు అభిమానముగల సేనానాయకులు నరసభూపాలునకు స్వాగతము నొసంగి విద్యానగర సామ్రాజ్యమును స్వాధీనపఱచిరి. తుళువనరసరాయలు మేళతాళములతో రాజవీధులలో నూరేగుచు నగరములోనికి వచ్చుచుండెను. ఒకభటుడు రాజమందిరములోనికి బోయి భోగపరాయణుడగు విరూపాక్షరాయలకు "సాళ్వనరసింహభూపాలునిపంపున దుళువ నరసరాజువచ్చి సామ్రాజ్యము నంతయు లోబఱచు కొనుచున్నాడు. వీలున్న బ్రతకృతి గావింపు"మని విన్నవింపగా సంతోషభంగకరమగు నిట్టి సందేశము దెచ్చితివాయని భటునవమానించి బైటికి బంపెను.నరసరాజు తానుసాధించిన నగరభాగముల నన్నింటిని భటులకప్పగించి రాజమందిరము ప్రవేశించెను. నరసరాజు దగ్గరకు రాగా నిక నుపేక్షింప దగదని యారాజమాత్రుడు అంత:పురకాంతలను రాజమందిరమును సంపదలను విడిచి ప్రాణభయముతో దొడ్డివాకిలి తెఱచికొని పారిపోయెను. నరసరాజు కోటను భాండాగారమును ధనకనకవస్తువాహనములను రక్తపాతము లేకుండ సాధించి యీవిజయవర్తమానము తన యజమానియగు సాళ్వ నరసింహరాజునకు దెలిపి పట్టాభిషిక్తుడగుటకు రమ్మని వర్తమాన మంపెను. ప్రజలందఱు మఱల సత్ప్రభువె తమకు లభించెనని మిగుల నానందించి పట్టాభిషేకమహోత్సవ మెపుడుజరుగునా యని నిరీక్షించు చుండిరి. నరసరాజు రాజకీయోద్యోగుల నందఱను బరిశీలించి పూర్వరాజ పక్షపాతు లగువారిని వెదకి యుద్యోగముల నుండి తొలగించి యాపదవులను విశ్వాసపాత్రులగు తన నౌకరుల కొసంగెను. విద్యానగర రాజ్యమునం దంతటను నూతనోద్యోగులను నరసరాజు నెలకొల్పి విప్లవోద్యమములకు దావేలేకుండ జేసెను.

శాస్త్రవేత్తలు పెట్టిన శుభముహూర్తమున బట్టాభిషేకమహోత్సవము జరుపుటకు నేర్పాటులు చేయబడెను. సామంతులకు రాజబంధువులకు గవులకు గాయకులకు సేనానాయకులకు ఉద్యోగులకు ఆహ్వానపత్రికలను నరసరాజు, తిమ్మరుసుమంత్రి స్వయముగా బంపిరి. సాళ్వ నరసింహభూపాలిని దామంద ఱంతకు మున్నె యెఱింగి యుంట రమునందలి ధనము విరివిగా నుపయోగించి పారశీదేశమునుండియు అరబ్బీ దేశమునుండియు ఉత్తమాశ్వములను దెప్పించెను. బ్రతికిన గుఱ్ఱమునకైనను మార్గమధ్యమున జచ్చిన గుఱ్ఱమునకైనను మూడు గుఱ్ఱములకు వేయివరహాల చొప్పున ధనమొసంగి అశ్వముల నెన్నింటినో కొని ఆశ్వికదళము నభివృద్ధి గావించెను. చచ్చిన గుఱ్ఱములతోకల జూపినంత మాత్రముననే విలువయొసంగు చుండుటచే యవనవర్తకులు ధారాళముగా అశ్వవ్యాపారముగావించి విజయనగర రాజ్యమును అశ్వబృందములతో నించివేసిరి. నరసింహరాజు ఆశ్విక దళసహాయమున దనశక్తి సామర్థ్యములు పూర్తిగా నుపయోగించి అన్యాక్రాంతములైన రాజ్యముల నన్నింటిని దిరుగ సంపాదించెను. ఉదయగిరి, రాయచూరు, కొండవీడు దుర్గములు సాధించుకొనుటకుగూడ యత్నించెను గాని యంతలో నాతడు కాలధర్మము నొందెను.

సాళువ నరసింహరాజు ఆంధ్రవాఙ్మయమున కెంతయు జేయూత నొసంగెను. పిల్లలమఱ్ఱి పినవీరభద్రుని సత్కరించి జైమిని భారతము నంకిత మొందెను. పలువురు కవు లీనరపాలుని గుణకీర్తనము గావించినటుల జాటువులవలన నెఱుంగ నగును. ఈయనయొద్ద మంత్రిగా నాదెండ్ల చిట్టిగంగనామాత్యు డను నియోగిబ్రాహ్మణుడుండెను. ఈయన విద్యానగరమును గృష్ణదేవరాయల కాలమునందు మంత్రిగానుండి పరిపాలించిన తిమ్మరుసుమంత్రికి మాతామహుడు. గొప్ప రాజకీయవేత్త యనియు మహాశూరు డనియు బేరొందెను.

నరసింహరాజు తన యంత్యకాలమున విశ్వాసపాత్రుడగు సేనానియు, విద్యానగరమును బట్టుకొనుటలో నెక్కువ సహాయపడినవాడును, తన అన్న మనుమడును నగు తుళువనరసరాజును బిలువనంపెను. ఆయనతో నిటుల జెప్పెను: "మిత్రమా! నా కంత్యకాలము సమీపించినది. నాకుమారు లిరువురు పసివాండ్రు. భాండారము, రాజ్యము నీచేతిలో నుంచుకొని పాలకుడవుగానుండి యుక్తవయస్సు వచ్చినపిమ్మట రాజ్యము నాకుమారుల కొసంగుము. ఈకార్యము నొనరించి సామ్రాజ్యము నుద్ధరించుటకు నీవుదక్క వేఱొకడు లేడు." నరసరాజు అంగీకరింపగనే నరసింహరా జతనికి బట్టాభిషేకము చేసి గతించెను. విశ్వాసవంతుడగు నరసరాజు చిరకాలము రాజప్రతినిధిగనే యుండి పరిపాలించెను. నరసరాజు అంతకుమున్ను కుంతలదేశంబు

నందును చోళమండలము నందును శ్రీరంగము నందును ఘోరసంగరము లొనరించి విజయము నొందిన పరాక్రమశాలి గావున బౌరు లీతనిపరిపాలనమున కనుకూలురై యుండిరి. ఆంధ్రభాషాభిమానియై యీ నరపాలతిలకుడు నంది మల్లయ్య, ఘంట సింగయ్యా అను జంటకవులచే వరాహపురాణమును రచింపజేసి అంకితమునొందెను. నరసరాజు సాళ్వ నరసింహరాజుపుత్రులలో బెద్దవానికి రాజ్యము నొసంగి తాను వ్యవహారముల జూచుచుండెను. నరసరాజువిరోధు లాతనియెడల నెపము గలిగింపనెంచి బాలరాజును జంపించి యాదురంతము నరసరాజునెడ నారోపించిరి. నరసరా జానింద దొలగించుకొనుటకు నరసింహరాజు రెండవ కుమారునకు విద్యానగర రాజ్యమును పట్టాభిషేకము గావించి రాజకీయ వ్యవహారములు తాను నవరించు చుండెను. నరసరాజు శ్రేయమునకు సహింపని దుష్టులగు కొందఱు రాజకీయోద్యోగులు బాలరాజునకు లేనిపోని కొండెములు చెప్పి “నీయన్నను జంపించినటుల నిన్నుంగూడ నరసరాజు చంపింప నున్నా” డని వీలువెంట నూరిపోసిరి. ప్రపంచజ్ఞానశూన్యుడగు నాబాలు డామాటల నమ్మి నరసరాజును ద్వేషింప మొదలు పెట్టెను. ఇంక నుపేక్షించిన బాలరాజు తన కపాయము చేయుటయేగాక విద్యానగరరాజ్యమును గూడ గొలుపోక మానడని తన పలుకుబడి నుపయోగించి సైన్యమునంతయు గూడగట్టుకొని యాతని బంధించి పెనుగొండదుర్గమున నుంచి ఆహారాదులకు స్వల్పభరణము నొసంగసాగెను. కొంతకాల మెటులో గడపి బాలరాజు మరణించెను. తుళువరాజు ప్రత్యర్థులగు నుద్యోగుల నందరను దొలగించి సామ్రాజ్యమును బునరుద్ధరించి యమితవిఖ్యాతి గడించెను.

సాళ్వనరసింహరాజు క్రీ.శ. 1490 ప్రాంతమున మరణించెను. ఈయన కాలమునుండి విద్యానగరము ఆంధ్ర సామ్రాజ్య మనదగి ఆంధ్రకవులకు ఆంధ్రులకు నభిమాన స్థలమయ్యెను. నరసింహరాయలు ధర్మపరిపాలనము చేయుతఱి నాతని పరిపాలనమునందున్న రాజ్యమునకు బరదేశీయులు నరసింగరాజ్యమని పేరిడిరి. ఈయన పరిపాలన కాలమున దురకలు శ్రీరంగము నాక్రమించుకొని వసతులన్నియు నూడలాగుకొనుటచే బ్రాహ్మణులందఱు లేచిపోయిరి. నరసింహరాజు తురకల బోదోలి నగరమును స్వాధీన పరచుకొని పూర్వవృత్తుల నన్నింటిని దిరుగనొసంగి శ్రీరంగస్థాపనాచార్య బిరుదము వహించెను. ఈయనచరిత్ర మంతయు సాళ్వాభ్యుదయమను సంస్కృత కావ్యమునందు విపులముగా వర్ణింపబడియున్నది. ఈయనకుగల చిత్రప్రబంధపరమేశ్వరుడు, అభినవనాటక భవభూతి, అష్టభాషా పరమేశ్వరుడు, రసికకవితా సామ్రాజ్య లక్ష్మీపతి మున్నగు బిరుదముల వలన గవియు రసికుడు గూడ నీనృపాలుడై యుండునని తెల్లమగుచున్నది. అదృష్టజాతకుడగు నీనృపుడు విద్యానగర సామ్రాజ్యోద్ధారకుడును, ఆంధ్రుడును గావున మనకెంతయు గణ్యుడు.

సోమనాద్రి రెడ్డి.

నిజాము రాష్ట్రములోని మహబూబునగరు మండలమున అమరవాది యను నగరముగలదు. ఆనగరముచెంత గల అచ్చమ్మపేట, రఘుపతిపేట యను గ్రామములను బాకనాటి రెడ్డిశాఖకు జేరిన తిమ్మారెడ్డి యను వీరుడు పాలించుచుండెను. ఈయనభార్య వీరవతంసుండని పేరొందిన మెదకు మండలపాలకు డగు సదాశివరెడ్డి తోబుట్టువు కేశవమ్మ. ఈదంపతులు పశుసమృద్ధియు, ధనసమృద్ధియు గలవారై సుఖముగా నుండ క్షామదేవత దేశమును బీల్చి పిప్పిచేయుచుండెను. పంటలు తగ్గిపోయెను. పశువులుమేతలేక మాడిచచ్చు చుండెను. ప్రజ లన్నమోరామచంద్రాయని యేడ్చుచుండిరి. చేరెడు గంజినీళ్ళకు జనులు మోమువాచి నశించుచుండిరి. తిమ్మారెడ్డిచెంత పుట్లకొలది ధాన్యము గలదు. కావలసినంత ధనముగలదు. ప్రజల ఘోషచూచి సహింపజాలక పాతరలుదీయించి తనయొద్దగల ధాన్యముదంపించి వచ్చినవారందఱికి నెలలకొలది అన్నము పెట్టించెను. ఎంతకును గఱవు తగ్గదయ్యెను. గరిసెలు పాతరలుకూడ రిత్తవయ్యెను. ప్రజలాకలిగొని చచ్చుచుంట జూచి తనభార్య వస్తువులను మంగళసూత్రము దక్క మిగిలిన వన్నియు నమ్మెను. అప్పటికిని బ్రజలబాధ తగ్గదయ్యెను. ఇక నిటనున్న లాభము లేదని తానుగూడ నాకలిచే మలమలమాడుచు గూలినాలియైన చేసి జీవించుదమని మల్లారెడ్డి తన భార్యయగు కేశవమ్మను వెంటబెట్టుకొని బయలుదేరి కొల్లాపురము, పెంట్లవెల్లి, మూరవకొండ లోనగు గ్రామములకు బోవ నెందును గూలి దొఱకకపోయెను. కడకు కొల్లిపోలూరను గ్రామమునకు బోయి యచట గూలినాలిచే జీవించుచుండెను. దొఱికిన కూలిధాన్యములో గొంచెము కొంచెము మిగిల్చికొని తిమ్మారెడ్డి కొంతధాన్యము సంపాదించి పాలికొక యెద్దును దీసికొని వ్యవసాయమును బెట్టెను. క్రమముగా గలసి వచ్చుటచే దిమ్మారెడ్డికొంతకాలమునకు గొప్ప రైతై ధనధాన్య సమృద్ధితో నుండెను. ఈశుభావసరమున వీరికొక కుమారుడు గలిగెను. సోమలింగేశ్వరుని యనుగ్రహమున జనించినవాడగుటచే నాబాలునకు సోమనాద్రియని నామకరణము గావించి సంతోషముగా గాలము గడుపుచుండిరి. వీరిశ్రేయముజూచి సహింపలేక గ్రామస్థులు కొందఱెటులేని యిబ్బంది పెట్టవలయునని తలంచి ఆప్రాంతములు పాలించు కర్నూలు నవాబగు దావత్ఖాను నొద్దకుబోయి తిమ్మారెడ్డి యను రైతు మీపై దిరుగుబాటు చేయుటకు బ్రయత్నించుచున్నాడు. వా డాయుధములు, ధనము, ధాన్యము సిద్ధము చేయుచున్నాడని విన్నవించిరి. నవాబు పలువురను బిలువనంపి యావార్త నిజమో కల్లయో దెలుపుమన వారంతకుమున్నే యీకుట్రలో జేరినవారగుటచే వారును నటులనే చెప్పిరి. దావత్ఖాను వెంటనే కొల్లిపోలూరునకు దండయాత్రకు బయలుదేరి తిమ్మారెడ్డిని బిలువనంపి చెట్టునకు గట్టించి దయాశూన్యుడై కొట్టించి యతనిధనము, పశువులు, ధాన్యములు కొనిపోయెను. దెబ్బలచే నొడలంతయువాచి తిమ్మారెడ్డి గతించెను. కేశవమ్మ, తనకుమారుడును ఏడెనిమిదేండ్లు నిండని కూనయగు సోమనాద్రిని వెంటబెట్టుకొని పుట్టినింటికి బోవుచుండెను. త్రోవలో రాజవోలనుగ్రామము గలదు. అచటగల కేశవాచార్యులను విద్వాంసుడు బాలురకు బాఠములు చెప్పుచు వీధిలో గూర్చుండి తల్లివెంట నేగుచున్న సోమనాద్రిని జూచి యీబాలుని ముఖమున మహారజుచిహ్నము లున్నవని గ్రహించి కేశవమ్మ వలన బాలకునిచరిత్రము నంతయు విని జాలిపడి యిటుల జెప్పెను. "అమ్మా! నీపుట్టినింటి గౌరవము, నీభర్తపేరుప్రతిష్ఠలు నేనెఱుంగనివి కావు. చెడి పుట్టినింటికి బోవుటకంటె బ్రమాద మింకొకటి యుండబోదు. కష్టములు కలకాల యుండబోవు. ఈబాలుడు లోకఖ్యాతి గడింపగల డని నాకు దోచుచున్నది. నాయొద్ద నుంచినచో నేను సమస్త శాస్త్రములు నేర్పెదను. నిన్ను, నీశిశువగు నీబాలకుని నేనున్నంతలో బోషింప గలుగుదును. ఇచటనే యుండుట నా కభిమతము." కేశవాచార్యులవాక్యములు వినినంతనే వివేకవతియగు కేశవమ్మ యచటనే నిలువ నంగీకరించి బాలుని సంతోషముతో సోమానాద్రిమాటలకు సంతోషపూర్వక మగు నంగీకారమును దెల్పిరి.

కేశవమ్మయు సోమనాద్రియు నొకబండి కట్టించుకొని మెదకు మండలమునకు బోవుచుండిరి. త్రోవలో వారికి పూనూరను గ్రామము తగిలెను. చరిత్రస్థలమును జిత్రదేవాలయావృతము నగు పూనూరులోనికి సోమనాద్రివెళ్ళి యంగడిలో దారిబత్తెమునకు వలయు వస్తువులుకొన్ని

మూటగట్టుకొని పోవుచుండ గ్రామాధికారియగు నాగిరెడ్డి యాబాలకుని జూచి దగ్గరకు బిలిచి యతనివృత్తాంతము విచారించెను. బాలుడు తనసంగతి, కులము, స్థలము నివేదించెను. ధనవంతుడును సంతానహీనుడునగు నా పాశము నాగిరెడ్డి తానును బొకనాటిరెడ్డి యగుటచే నాబాలకుని పెంచుకొన్నచో గులము తరించుననితలంచి యూరి బయటనున్న బండియొద్దకు బాలునితో బోయి కేశవమ్మను జూచి పూర్వబాంధవ్యము తెలిపి సోమనాద్రిని దనకు బెంచుకొనుట కొసంగుమని ప్రార్థించెను. ఆయమ యందులకు నంగీకరించి బాలునితో దానుగూడ నాగిరెడ్డియింట వసించెను. కొంతకాలము నాగిరెడ్డి తా నార్జించిన ధనకనకవస్తు వాహనములు సోమనాద్రి కొసంగి చెప్పవలసిన ధర్మములన్నింటిని జెప్పి మరణించెను. సోమనాద్రి పితృకార్యము లన్నింటిని శ్రద్ధాభక్తులతో నిర్వహించి ప్రత్యేకరాజ్యము నొకదానిని స్థాపించినగాని సోద దను సమీపించి గొల్లవాండ్రతో దనయవస్థయు వీరభటులు వెంబడించుటయు దెలిపి బ్రదికించిన గొప్పమేలు చేయుదునని బ్రతిమాలెను. వాండ్రు పెద్దగోయి తీసి అందు సోమనాద్రిని మెడవరకు బూడ్చి చుట్టును మేకపిల్లలనుంచి పైనిబుట్ట బోర్లించిరి. కొంతసేపటికి వీరభటులు వెదకుకొనుచు వచ్చి చుట్టుపట్టుగ్రామములు వెదకుచు గొఱ్ఱెలమందను గూడ బరిశీలించిరి. ఎందును సోమనాద్రి కనబడక పోవుటచే వీరభటులు విసిగి కృష్ణదాటి వెనుకకు వెళ్ళిపోయిరి. అనంతరము సోమనాద్రి బయటికివచ్చి గొల్లవాండ్రతో 'నాకు బ్రాణదానము గావించినందులకు మీరేమికోరుకొందురో తెలుపు' డనవారు నేటినుండి మీరు "ముష్టిపల్లి" యను మాగోత్రనామమును వహింపవలయునని కోరిరి. సోమనాద్రి యందులకంగీకరించి పూనూరునకు బోవుచుండ నొకచో భూగర్భమునందు బూర్వరాజులు నిక్షేపించిన ధనరాశి గోచరించెను. ఆధనము నంతయు బరిచారికులచే దెప్పించి పూనూరు సమీపమునందున్న యొక విశాలప్రదేశమున గోటకట్టింప నారంభించెను. ఆప్రదేశమునకు ఆమడదూరమునందున్న ఉప్పేడుకోటను బాలించు సయ్యదుదావూదుమియ్యాయను మహమ్మదీయుడు సోమనాద్రి కోటనుగట్టుచున్నసంగతి విని పరివారముతో నచటికి వచ్చి తనరాజ్యమున గోట గట్టవలదని నిర్భంధింపగా సోమనాద్రి పన్నుగట్టుచు సామంతుడుగా నుందునని యొప్పించి కోట సోమనాద్రి తన సహాధ్యాయులను సహాయముకోరి పిలువనంపగా వారు పరివారముతో ఆయుధపరికరములతో సంగరమునకు సహాయమువచ్చిరి. ఉభయదళములకు భయంకర సంగ్రామము జరిగెను. సమీపమునందున్న ఆంధ్రులందఱు స్వాతంత్ర్య సంగరమున సోమనాద్రికి సహాయపడిరి. మహారాష్ట్రులు, కర్ణాటులుగూడ సోమనాద్రి కనేకగతుల ధనమును, సైన్యమును సహాయముచేసిరి. మొక్కవోని బీరమున సోమనాద్రిబలము చిరకాలము పోరాడెను.

బసరుజంగు ఆంధ్రవీరులధాటి కాగజాలక గుఱ్ఱము నెక్కి పాఱిపోవసాగెను. వీరవతంసుడగు సోమనాద్రి యాతనిని వెంబడించి తరుముచు బోవ బ్రాణభీతితో నతడు రాయచూరు కోటలో దూరి ద్వారములు బిగించికొనెను. సోమనాద్రి కోటలోనికిబోవ యత్నించుచుండ గోటముందున్న యేనుగుప్రతిమలను జూచి గుఱ్ఱము బెదరెను. వెంటనే యా విగ్రహముల తుండములు దంతములు ఖండించి వెనుకకు మరలి సోమనాద్రి సంగరరంగ మలంకరించుసరికి ప్రాగుటూరి నవాబు గూడ పాఱిపోయెను. స్వల్పసైన్యముతో సయ్యదుమియ్యాయొక్కడు మాత్రము సంగరరంగమున మిగిలెను. ఆతడు హతశేషసైన్యమును ముందిడుకొని సోమనాద్రిపైకి మొండిచొరవతో రాదొడంగెను. సోమనాద్రి సైన్యమును భేధించి మియాను సమీపింపగ సమరాశ్వము తన ముందుకాళ్లు ఏనుగుమీదనుంచి నిలువబడెను. సోమనాద్రి తన కరవాలముతో సయ్యదుమియ్యాను జంపబోయెను. ప్రాణభయముతో సయ్యదు మియ్యా సలాములు చేయుచు, నీకు గప్పము గట్టుదును, రాజ్యములో గోరినంత భాగము నొసంగెదను రక్షింపు'మని ప్రార్థించెను. ఉదారశీలుడగు సోమనాద్రి కరుణించి యెత్తినకత్తి వ్రాల్చి మహమ్మదీయునితో "నీవు నన్ను గోటగట్టుకొన నిచ్చితివిగాన నీరాజ్యము నీకువదలుచున్నాను. నీకు నేనుగాని నాకు నీవుగాని సామంతులము గావలసిన పనిలేదు. నీవోడిపోయినటుల గుర్తుగా నుండుటకు యుద్ధమునకు గొనివచ్చిన నగారా, పచ్చజండా, ఏనుగును మాత్రము నాకిచ్చి పోవలయి"నన నవాబు సోమనాద్రి కవియెల్లయొసగి బ్రతుకుము జీవుడాయని తన కోటలోనికి బోయెను. సోమనాద్రి జయలక్ష్మితోబాటు సైదుమియ్యాయిచ్చిన విజయచిహ్నములు, బసరుజంగు విడిచి పోయిన ఫిరంగులు, హతులైన వీరభటుల ఆయుధములు దీసికొని గద్వాల జేరి నగరమధ్యంబునందు జయస్తంభము ప్రాతి నవాబునొద్ద గైకొన్న పచ్చజండా దానిపై గట్టించెను.

సయ్యదుమియ్యా తనరాజ్యము చేరినదాదిగా బరాభవ దు:ఖము కలచివేయుటచే గొన్ని దినములు బయటికె రాడయ్యెను. ఒకనాడు కోటబురుజుపై నెక్కగా గద్వాలలో జయస్తంభముపైన దన పచ్చజెండా కనపడెను. పరాభవ దు:ఖ మతిశయించెను. ప్రతిక్రియ గావించి యెటులేని సోమనాద్రిని బేరులేకుండ నెగురగొట్ట దలంచి హైదరాబాదునకు బ్రయాణమై నాలుగు మూడు దినములకుజేరి యా రాష్ట్రమును బాలించు నిజాము అలీకి దనరాక దెలియజేసెను. నిజాము ఆలి, యాతనిరాక విని తన గురుపరంపరకు జెందిన సయ్యదుమియ్యా సామాన్యునివలె వచ్చుటకు గారణమేమని యోచించి వెంటనే రమ్మని యాజ్ఞ యొసంగెను. మియ్యా నిజాము ఆలీని చూడగానే వంగివంగి సలాములుచేసి ఒంటికాలిమీద నిలుచుండి తన దురవస్థయు దన్ను సోమనాద్రి పరాభవించి వీరచిహ్నములు గొనిపోయిన విధము తెలిపి యెటులేని సోమనాద్రిని బంధించి తాను గోలుపోయిన జెండా, నగారా, ఏనుగు ఇప్పింపుమని ప్రార్థించెను. నిజాము ఆలీ సోమనాద్రి బలపరాక్రమములు నాలించినవాడగుటచే "నిది సంగరమున కదనుగాదు. సోమనాద్రి అప్రమత్తుడై మైమఱచి యున్నపుడు సంగర మొనరించినచో జయము సులభసాధ్యము. అంరవఱకు నిరీక్షింప" మని చెప్పెను. "ముందు సోమనాద్రిని బంధించి నా విజయచిహ్నముల నాకిప్పింతురా బ్రతుకుదును. లేదా, నేను జీవింప"నని వాడికత్తితో గంఠము వఱకుకొనబోవుచుండ నిజాముఆలి సయ్యదుమియ్యా నెటులో సమాధానపఱచి పదునేనుదినములలో సంగరమునకు దప్పక వచ్చెదనని వాగ్దానముచేసి పంపెను. నిజాముఆలీ ముందు సోమనాద్రిపయికి దండయాత్ర కేగుటకు ధైర్యముచాలక తన మిత్రుడును గర్ణాట దేశీయుడును నగు ఇరుపనగౌడు అను నొక వీరుని బిలువనంపి జరిగిన కథాంశమునంతయు నెఱింగించి సోమనాద్రిని వంచించుటకు కుపాయమున్నచో దెలుపుమని కోరెను. ఇరుపనగౌడు ఉభయపక్షముల బలాబలముల నెఱింగిన వాడుగాన చాలసేపు యోజించి 'హర్పనహల్లిలో నాఱుగురు క్షత్రియ కుమారులు దుర్గమమైన కోటగట్టుకొని రాజ్యము పాలించుచున్నారు. వారికి సోమనాద్రికి మిత్రభేదము కలుగజేసితిమేని సోమనాద్రి మడియగలడు. అపుడు గద్వాలకోటను సులభముగా లోగొనవచ్చు'నని సమాధానముచెప్పెను. నవాబు మిగుల సంతసించి యెటులనేని యాకార్యము నీవె సమర్థించుమని భారమంతయు ఇరుపనగౌడుపైన బెట్టి యాసబెట్టెను. ఇరుపనగౌడు తన గ్రామమగు కురిచేడునకు జేరి హర్పనహల్లిలోని క్షత్రియసోదరులు వ్రాసినటు లొక జాబువ్రాసి దూతలచే సోమనాద్రికి బంపెను. సోమనాద్రి యా జాబు చూడగా నందిటుల వ్రాయబడి యుండెను. "సోమనాద్రికి - నీవు సయ్యదు దావుదు మియ్యాను జయించినమాత్రమున లోకైకవీరుడవు కావు. నిజమైన మగవాడవేని మావంటి వీరులను గెలువుము. లేదా మూలబడి యాడుదానివలె బ్రదుకుము." ఈజాబు పఠింపగనే సోమనాద్రికి గోప మతి శయించెను. జాబుయొక్క పూర్వోత్తరములనేని విచారింపక సోమనాద్రి సంగరమున కాయితమై నగరరక్షణమునకు వలయుబలమునుంచి యొకశుభముహూర్తమున హర్పనహల్లికి బ్రయాణమయ్యెను. నిజాము ఆలి యావార్తవిని సోమనాద్రి కంత్యదినములు సమీపించెనని యానందించి యావార్త సయ్యదుకు గూడ దెలిపెను. సోమనాద్రి హర్పనహల్లి కోటను ముట్టడించెను. ఈవార్త క్షత్రియసోదరులు విని 'సోమనాద్రి యెవరు? అతని పేరైన వినియెఱుంగమే! మనపైకి దాడి వెడలవలసిన యవసరమేమి వచ్చినది? ఈ విరోధమునకు గారణమేమైయుండును?' శత్రుజనాభేద్యమగు మనకోటలో సురక్షితముగా మనముందము. అతడు జయించిన నాటికి జూచుకొంద' మని తలంచిరి. సోమనాద్రి ఆఱుమాసములు ముట్టడించి ఫిరంగులుప్రేల్చి యెంతప్రయత్నించినను హర్పనహల్లికోట చెక్కు చెదరకపోయెను. తరువాత సోమనాద్రి యుపాయాంతరములచే గోటబగులగొట్టి రాజసోదరులను బంధింపబోయెను. వారు సోమనాద్రిని జూచి యిటులనిరి. "రెడ్డివతంసా! ఏపాపము నెఱుంగని మమ్ము బంధించుట న్యాయముగాదు. మేము నిన్ను బ్రతిఘటింపక మాని కోటలోనే యుంటిమి. ఆ కారణముగ సాటివారిని శిక్షింప నెంచుట నీవంటి శూరవతంసునకు దగవుకాదు." క్షత్రియసోదరుల మాటలు వినినంతనే సోమనాద్రికి గోపమతి శయించి కపటవినయము జూపుచుండిరని తలంచి తనయొద్ద గల జాబు వారికి జూపించెను. వారందఱు నాజాబు చూచి యది తాము వ్రాసినది కాదనియు మధ్యవర్తులు గావించిన మోసమనియు క్షమింపుడనియు బలువిధముల వేడికొనిరి. సోమనాద్రి విచారించి క్షత్రియ సోదరులు నిర్దోషులని గ్రహించి వారివలన గప్పములు గొని, సంగరములందు సహాయము జేయునటుల వాగ్దానము గైకొని గద్వాల కేగెను. ఈవార్త సయ్యదువిని సోమనాద్రివిజయమునకు జాలపరితపించి హైదరాబాదు నవాబునొద్దకేగి విలంబనము జేయవలదనియు దనపరాక్రమచిహ్నములగు, నగారా,

ధ్వజము, ఏనుగు ఇప్పింపకున్న నాత్మహత్య గావించి కొందుననియు పట్టుబట్టెను. విధిలేక నిజాము ఆలీ సోమనాద్రిమీదికి సంగర సన్నద్ధుడై బయలుదేరెను. పూర్వపరాభవముతో నుడికి పోవుచున్న రాయచూరు పసరుజంగు పరిమితబలముతో నవాబునకు సహాయముగా వచ్చెను. — బ్లారి బహదూర్‌ఖాన్, ప్రాగుటూరు ఇదురుసాహెబు, ఆదోనినవాబు, గుత్తిటీకు సులతాను, కర్నూలు దావతుఖాను లోనగు నవాబులందఱు నిజాము ఆలీకి సహాయమై సోమనాద్రిపైకి సైనికబలముతో దండయాత్రకు జనుదెంచిరి. మహమ్మదీయ సైన్యమంతయు లక్షల కొలదియై నేలయీనినటు లుండెను. కర్నూలు మొదలుకొని పదిమైళ్ళ దూరముననున్న ఉల్చాలవరకు బడమట, మూడు క్రోసులు దూరమునందున్న నిడుదూరువరకు సేనలు నిండి పోయెను. సోమనాద్రి భటులను పనివాండ్రను నియోజించి శత్రువుల కబిముఖముగా నొక మట్టికోట గట్టించెను. సోమనాద్రి శుభముహూర్తమున అపరిమిత బలసమేతుడై తాను గట్టించినకోటచెంత దండువిడిసి సంగరమున కాయితమయ్యెను. ఉభయ సైన్యములకు భయంకర సంగరము జరుగుచుండెను.

సోమనాద్రిసహాధ్యాయులగు కురుమన్న, ధర్మన్న యోధవేషములు ధరించి కొంతసైన్యమును దీసికొని యవన సైనికుల నెదిరించిరి. కొంతబలమును వెంటగొని సోమనాద్రి స్వయముగా దాను నవాబులపైకి బయలుదేరెను. ఆనాడు జరిగిన జనమారణమునకు మితములేదు. మతావేశ పరవశులగు యవనులు నిలుకడగా బోరి హిందూభటుల నెందఱనో మడియించిరి. ఆంధ్రనాయకులు వ్రేటున కొకయవనుని బడగొట్టి యుద్ధరంగ మంతయు రక్తప్రవాహములతో నించివేసిరి. సోమనాద్రి సామాన్యదళములను విడిచి నవాబులపైకిబోయి ఘోరముగా బోరి ప్రాగుటూరి నవాబగు ఇదురు సాహెబును నఱికివేసెను. బళ్లారి బహద్దరుఖానుని జంపెను. ఆదోని నవాబు నంతమొందించెను. ఈ పరిస్థితులు గమనించి సోమనాద్రిధాటి కాగజాలక నిజాముఆలీ హతశేషసైన్యముతో కర్నూలుకోటకు బోయి తలదాచుకొనెను. సోమనాద్రి కర్నూలువఱకు శత్రుసైన్యమును దరిమి ప్రొద్దుగ్రుంకువఱకు దనస్కంథావారము జేరెను. సోమనాద్రి యెక్కినయశ్వము సంగర రంగములలో బాగుగా మెలగనేర్చినది. పిట్టవలె నంతలో విరోధిసైన్యములమధ్య వ్రాలును. ముందుకాళ్లెత్తి యేనుగులమీదికి బోవును. ఈయశ్వము నెటులేని బట్టి తెప్పించినచో సోమనాద్రి చిక్కగలడని నిజాము ఆలీ తలంచెను. తనసైనికులతో సోమనాద్రి గుఱ్ఱమును గొనివచ్చినవానికి గొన్నిగ్రామము లిచ్చెదనని చెప్పెను. ఎవరును సాహసించి యందుల కియ్యకొనరైరి. నిజాముఆలీ యశ్వపాలకు డందుల కంగీకరించి గాఢాందకారమున బయలుదేరి యెటులో యశ్వశాలకుబోయి గుఱ్ఱమును లాయమునుండి తొలగించి తన శిబిరము త్రోవ బట్టించెను. రెడ్డివీరులంద ఱిదిచూచి యెవడో మన భటుడె కార్యాంతరమున వేగునడుపుటకు బోవుచుండెనని యుపేక్షించిరి. అశ్వపాలకుడు కొలదిసేపటిలో నిజాము ఆలియొద్దకు జేరి యశ్వమునుజూపి తనవిజయవార్త నెఱింగించెను. నిజాము ఆలీ యశ్వమును లాయమున గట్టివేయించి వానిని సత్కరించెను.

నవాబు పట్టరాని యానందము నొంది సోమనాద్రిని బట్టుకొనుట యిక సులభమని ప్రజ్ఞలు కొట్టుచుండెను. సోమనాద్రి తెల్లవారిచూడగా అశ్వము లేదయ్యెను. చాలవిచారించి యడుగుజాడలవలన నిజాముఆలీ శిబిరము చేరినటుల గ్రహించి విచారపడెను. కొనివచ్చిన వానికి గోరినంత ధన మిచ్చెదనని పలుకగా హనుమప్ప నాయకుడను వీరుడు నేను కొనితెచ్చెదనని యంగీకరించి మహమ్మదీయసైన్యముచెంతకు బోయెను. సేనానివేశమునకు మధ్యనున్న విశాలమగు పాకలో గుఱ్ఱములుండెను. అందే, సోమనాద్రిగుఱ్ఱముగూడ నుండియుండునని చెప్పవిక్రయించువానివలె నాత డశ్వశాలజేరెను. మహమ్మదీయు లతనిని జొప్పవిక్రయించు వానిగానే భావించి యుపేక్షించిరి. ఆతడు మెల్లగా బ్రొద్దు క్రుంకువఱకు గడ్డియమ్మువానివలె బేరముచేయుచు వారితో భాషించుచు నుండి రాత్రికాగానే గుఱ్ఱముముందున్న గడ్డిలో దేహముదాచి పరుండెను. అంతలో నొకయవనుడు గుఱ్ఱమును వేఱొకస్థలమున గట్టివేయుటకు మేకు బ్రాతు చుండగా నందు హనుమప్పనాయకునిచేయి దిగబడెను. కదలినచో మహమ్మదీయుడు గ్రహించునని జనమునిద్రచే మాటుమడుగు వఱ కటులనేయుండి చేయి రాకపోవుటచే మణిబంధమువఱకు ఖండించి గుఱ్ఱమునెక్కి శిబిరాభిముఖుడై బయలుదేరెను. సైనికులు నిద్దురలో దలలెత్తిచూచి తమ యశ్వపాలకులె నీరుబెట్టుటకు గుఱ్ఱములను గొనిపోవుచున్నటుల దలంచి మిన్నకుండిరి. తెల్లవారుసరికి హనుమప్పనాయకుడు సోమనాద్రిచెంత గుఱ్ఱమును గట్టివేయించి తానొందిన కష్టములు తెలిపి మొండిచేయిని దార్కాణముగా జూపెను. సోమనాద్రి

హనుమప్పనాయకుని సాహస ధైర్యస్థైర్యముల కెంతయు నానం దించి యాతనికి గోరినతావుల నెన్నియో క్షేత్రరాజములొసంగి గౌరవించెను. తెల్లగ తెల్లవార గనే సోమనాద్రి తన స్కంధావారమునందు విజయభేరి మ్రోగించెను. ఆనాదమునాలింప యవనుల గుండె లదరెను. విధిలేక తమప్రభువుని యానతి దాటజాలక వారును సంగరసన్నద్ధులైరి.

సోమనాద్రి పరివారసహితముగ సంగర మొనరించి శత్రుసమూహమును నేలమట్టము గావించెను. ఇంతలో దనతండ్రినిజంపిన దావతుఖాను డెదురయ్యెను. సోమనాద్రి వాని బలమునంతయు దృటిలో దునుమాడి కంఠము ఖండింపబోయెను. ఆతడు సోమనాద్రిపాదములపై బడి శరణుగోరెను. తనతండ్రి నన్యాయముగా జంపి యావదాస్తిని హరించిన నాటికోపము మనసులోనుంచుకొని వాడెంతప్రార్థించినను విడువక తల ఖండించెను. శత్రుసైన్యము సోమనాద్రిధాటి కాగజాలక కర్నూలుకోటలో దాగికొనెను. సముచితసైనికబలముతో సోమనాద్రి కర్నూలుకోట భేధించి యవనుల నెందఱనో సంహరించి వెనుకకు మఱలెను. పేరుజెందిన మహమ్మదీయ సేనానులందఱు మరణించిరి. ప్రాగుటూరు, బళ్ళారి, ఆదోని, కర్నూలు నవాబులు గతించిరి. గుత్తి, రాయచూరు నవాబులు, వివాదకారణభూతు డగు సయ్యదమియ్యా ప్రాణములతో మిగిలిరి. సోమనాద్రి యకుంఠిత దీక్షతో సంగరప్రయత్నములు విరామము లేక చేయుచుండెను. మహమ్మదీయసైన్యము పలుచబడుటచే వారేమి చేయజాలక యెట్లు ముందుజరుపనగునో నిశ్చయించుటకు రాత్రివేళ నేకాంతసభ యొకటి యొనరించి సోమనాద్రితో సంధి జరుపుటయే నిరపాయమగు మార్గమని నిర్ణయించుకొనిరి.

నిజాము ఆలీ సోమనాద్రిని సయ్యదుమియ్యాను ఒకచోజేర్చి యిరువురకు సమాధానవాక్యములజెప్పి యైకమత్యము గలుగజేసి గతముమఱచిపొండని కోరెను. సోమనాద్రి సంధి కంగీకరించి తనవిజయమునకు సూచనగా నొకగొప్ప ఫిరంగిని బహుమతిగా గైకొని తననగరము జేరెను. సోమనాద్రి విజయలక్ష్మీద్వితీయుడై తనపట్టణముజేరి తనకు సహాయముగావచ్చి సంగరమున బ్రశంసాపాత్రముగా బనిచేసిన వీరులందఱకు ఆభరణములు, మాన్యములు,ఆయుధములు బహూకృతిగా నొసంగి తన విశ్వాసమును బ్రకటించెను. బ్రతికినంతకాలము సోమనాద్రి పరాజయము నెఱుంగక శత్రుసైన్యములదాకి విజయమునందుచు నమితవిఖ్యాతి గడించెను.

సోమనాద్రి భూపాలుడు తిరుపతియాత్రకు బయలుదేరి గనికోట, నంద్యాల పాలకులను జయించి ప్రతిసంవత్సరమును సుంకమును గట్టునటుల గట్టడి చేసెను. తిరుపతిక్షేత్రము జేరి సోమనాద్రి వేంకటేశ్వరస్వామిని దర్శించి విరాగియై యచటనే దేహయాత్ర చాలించెను.

సోమానాద్రినే సోమనాథభూపాలుడని కూడ వ్యవహరించుట గలదు. ఈ మహావీరుడు పెక్కుగ్రంథముల నంకిత మందెను. కవులను గాయకులను బోషించి చిత్రకళల నభిమానించెను. నాడుమొదలు నేటివఱకు గద్వాల సంస్థానము విద్యాభిమానమును దాతృతా రూపమున బ్రకటించుచునే యున్నది. సోమనాద్రి భూపాలుడు క్రీ.శ. 1700 మొదలు 1770 లోగ నుండి యుండును. ఈ సోమనాద్రి భూపాలునకు ఇరువురు ధర్మపత్నులు గలరు. ఇద్దఱు కుమారులు జనించిరి. వారు బాలురగుటచే సోమనాద్రి యనంతరము లింగాంబయను ప్రథమభార్యారత్నము కొంతకాలము రాజ్యము నేలి యుక్తవయస్సు రాగానే తన భారమునంతయు బెద్దకుమారునిపై బెట్టెను. జ్యేష్ఠపుత్రుడు తిరుమలరాయడు పితృసంపాదిత మగు రాజ్యమును జిరకాలము పాలించెను. సోమనాద్రి భూపాలుడు గతించి చిరకాలమైనను ఆయన కీర్తిమాత్ర మింతవఱకు మరుగుపడలేదు. ఆయన యంకితము నొందిన భారత విరాట పర్వాది గ్రంథరాజము లాతని కీర్తిని గొనియాడుచున్నవి. అత్యున్నతములగు దుర్గములు, గోట గోడలు గల నాటి గద్వాలనగర విభవము చెక్కుచెదరక నేటికిని పూర్వప్రశస్తిని జాటుచునే యున్నది. పౌరుషవంతములగు పూర్వరాజ్యములలో నేటివఱకు మిగిలి యున్నవి వ్రేళ్లతో లెక్కింపదగియున్నవి. ప్రాచీనవిద్యపట్ల గౌరవము జూపుచు బండితసన్మానములు గావించుచు బూర్వమర్యాదలు నిలువబెట్టుచున్న యీ సంస్థానరాజమునెడ నాంధ్రులకు, నాంధ్రేతరులకు నెంతయు గౌరవభావము గలదు. ఇంతటి ప్రశక్తికి గారకుడగు సోమనాద్రి సర్వజనవంద్యుడనుటలో సంశయ ముండదు.

విజయ రామరాజు.

తాండ్ర పాపరాయుడు బొబ్బిలిసంగరమునందు విజయనగర సంస్థానాధీశ్వరుడగు విజయరామరాజును జంపెను. అనంతర మాయనరాణి తన సమీపజ్ఞాతుల యొద్దనుండి పండ్రెండుసంవత్సరముల బాలునిగొనివచ్చి దత్తతజేసికొని విజయరామరాజు అని యాబాలునకు నామకరణ మొనరించెను. యుక్తవయస్సు వచ్చువఱకు రాణిగా రీబాలునకు సంస్కృతము, ఆంధ్రము, పార్సీలోనగుభాషలు నేర్పించి అనంతరము రాజ్యముగూడ నొసంగెను. విజయరామరాజునకు జనకస్థానము నందు అన్నయగు సీతారామరాజు కూడ విజయనరమునకు వచ్చి సోదరునకు సహాయముగా బరిపాలనా వ్యవహారములు చూచుచుండెను. క్రమముగా సీతారామరాజునకు విజయనగరరాజ్యము నందును అపుడు బలవంతముగా నున్న --- సువారియొద్దను బరిచయము మెండయ్యెను. రాజకీయ వ్యవహారము లన్నియు నాతడె మిగుల నేర్పుగా నిర్వహించుచుండెను. విజయరామరాజు తనయన్న పరిపాలనా చాక యములు విజయనగరమును ముట్టడించి పాళ్లు పంచుకొన జూచిరిగాని కార్యకౌశలుడగు సీతారామరాజు ఆప్రయత్నములన్నియు విధ్వంసము గావించి ఆంగ్లేయసైనిక సహాయమున బ్రతిపక్షరాజుల రూపుమాపి వారి రాజ్యములను గైకొనెను.

సీతారామరాజు పేరునకు మంత్రిగా నున్నను తానే రాజుగా వ్యవహరించి పూర్వులొసంగిన మాన్యక్షేత్రములు అగ్రహారములు ఆక్రమించి రైతులకు గౌలున కొసంగుచుండెను. దానిచే బ్రజలకు గూడ నీతనిపయి మిగుల నసహ్యము జనించెను. ఈదోషములన్నియు బ్రజలు విజయరామరాజువిగా భావించి యాతనినిగూడ విద్వేషించిరి. సీతారామరాజు ప్రజాభిప్రాయములు పాటింపక తనయిచ్ఛచొప్పున జరించుచుండెను. ఈ నూతనపరిపాలనమునకు మిగుల విసికి అడిదము సూరకవి "రామలింగేశ శతకము"మున సీతారామరాజును మనసునందుంచుకొని ధుష్టరాజులను దూలనాడెను. ఎవరెన్నివిధముల నాందోళనము జరుపుచున్నను సీతారామరాజు పాటింపక తనయిచ్ఛ వచ్చినటుల వ్యవహరించు చుండెను. విజయరామరా జెటుల జెప్పిన నేమివచ్చునో యని తటస్థముగా నుండెను. ఈపరిస్థితులలో గాలము గడపుట ప్రజలకు సాటివారికి గష్టమయ్యెను. అందుచేత విజయనగర రాజ్యము నెటులేని కంపెనీవారికి గట్టిపెట్ట వలయునని సాటి రాజులందఱు కుట్ర చేయుచుండిరి. సీతారామరాజు కంపెనీ వారితో గలిసి దూరాలోచనలు గావించి తమపై పితూరి చేయుచున్న జమీందారుల నందఱను జయించెను. జయపురపు కోట నాక్రమించుకొనెను. ఇంకను బ్రతికూలురని యనుమానముతోచిన రాజులనందఱను గారాగృహములం దుంచెను. చండశాసనుడై దండనీతిని దీవ్రముగా నుపయోగించు సీతారామరాజునెడ సమకాలికులయసూయ మిగుల వృద్ధియయ్యెను. ఆతనిసాహసకృత్యములు కంపెనీవారికి గూడ సహింపరానివిగా నుండెను. సాటిరాజులందఱు విజయరామరాజునకు 'సీతారామరాజును మంత్రిపదవినుండి తొలగింపవలయు, లేకున్నచో మేము ప్రతిపక్షులుగా నుందు'మని వర్తమానములంపిరి. ఇవియన్నియు మనస్సునం దుంచుకొని విజయరామరాజు సీతారామరాజున కేమేమియోచెప్పి మంత్రిపదవికి రాజీనామ యిప్పించెను. సీతారామరాజునకు గుమారులు గలరు. విజయరామరాజునకు బుత్రసంతానము లేదు. విజయరామరాజునకు బుత్రసంతానము కలుగకపోయినచో తన కుమారుడగు నరసింహ గజపతిరాజును బెంచుకొందునని వాగ్దానము గావించుటచేతనే సీతారామరాజు రాజీనామనుబెట్టి యుద్యోగము మానుకొనెనని కొంద ఱందురు.

క్రీ.శ. 1778 లో దొరతనమువారు జమీందారులకు భూస్థితియు ఆదాయము ఎంతయున్నదో నిర్ణయించుకొని పేష్కషులు పరిష్కరింపనెంచి యందఱ నాహ్వానించిరి. పలువురు పరిష్కారార్థము వచ్చిరి. సీతారామరాజు ఈనిర్ణయమునకు దానుగూడ మదరాసునకు వచ్చి దొరతనమువారి యాశ్రయమును సంపాదించుకొని మరల మంత్రియయ్యెను. సీతారామరాజు మంత్రియైనచో మఱలనేమి కల్లోలములు జనించునోయని విజయరామరాజు తొలుత సంశయించెనుగాని ఈనిర్ణయము కంపెనీవారు కావించినదిగాన నాయన యేమియు జెప్పజాలక యంగీకరించెను.

సీతారామరాజు నిరంకుశాధి కారముతో రాజ్యచక్రము త్రిప్పుచుండెను. హవేలి భూము లన్నియు నీయనకు గౌలుగా నుంటచే బలుకుబడి కూడ మిక్కుటముగా నుండెను. మరల బ్రజాపీడనము గావింప మొదలుపెట్టెను. అడ్డుపడిన తమ కెట్టి తిరుగుబాటు కలుగునోయని దొరతనమువారు తటస్థముగా నుండిరి. ఈ యవకాశమును బురస్కరించుకొని సీతారామరాజు మిక్కిలి చొరవజేయుచుండెను. దొరతనమువారు సీతారామరాజు విషయములో నుపేక్షించిన లాభములేదని క్రీ.శ. 1784 లో నొక ఉపసంఘము నేర్పఱచి ప్రకృత పరిపాలనా విధానమునందు బ్రజాభిప్రాయములు నివేదింప నాజ్ఞాపించిరి. వారు విచారించి యీక్రింది యభిప్రాయముగల నివేదికను బ్రచురించిరి. “విజయనగరము సంస్థానమువలన వచ్చు ఆదాయ మంతయు జమీందారులు తమ స్వంతఖర్చుల కే వ్యయము గావించుకొను చున్నారలు. రైతుల విషయములో నేమాత్రము శ్రద్ధగైకొనుట లేదు. ప్రజలు క్షామపీడితులై తినుట కన్నము లేక మలమల మాడుచున్నారు. నీటివసతు లేమాత్రము తృప్తికరముగా లేవు. సైన్యముకొఱకు బ్రతిసంవత్సరము ఐదు లక్షల రూపాయలు వ్యయముచేయుచుంటచే బొక్కసమందలి ధనమంతయు వ్యయమగుచున్నది. ఈవిషయములో ఆంగ్ల దొరతనమువారు శ్రద్ధపుచ్చుకొని విజయనగర సంస్థానమును కట్టుబాటులలో నుంచుట చాల నవసరము.” ఈ నివేదిక దొరతనమువారి సంకల్పమునకు దోడయ్యెను. పాలకొండ, జయపురము, గోలుకొండ, టెక్కలి, కిమిడిలోనగు సంస్థానముల ప్రభువులను సైన్య సహాయము చేయుమని యొత్తిడి చేయుటయు, గొందఱు జమీందారులకు ఖ్యాతి యొసంగి గ్రామముల గైకొనుటయు, సాలూరు, పాచిపెంట, విషమకోట, కాశీపురము, బొబ్బిలి లోనగు సంస్థానము లేలు ప్రభువులను జెరసాలలోబెట్టి సాధించుచుంటయు దొరతనమువారికి దుస్సహముగా నుండెను. బొబ్బిలి పరిపాలకుడగు వెంగళరంగారావు జయిలునుండి మాయోపాయములతో దప్పించుకొని హైదరాబాదునకు బాఱిపోయి తమ కష్టములు, కంపెనీవారి యుపేక్షయు దెలిపి నవాబును సహాయముకమ్మని కోరినట్లు, ఈయంశములు గూడ ఉపసంఘమువారు తెలిపిరి.

కంపెనీవారు విజయరామరాజునకు సైనికబలము కావలయుననియు సీతారామరాజును మంత్రిపదవి నుండి తొలగింప వలయుననియు వార్త బంపగా నందుల కంగీకరించెను. సీతారామరాజునకు విజయరామరాజుగారిచే నుపకార వేతన మిచ్చునట్లు దొరతనమువారు కట్టుబాటు చేసిరి. ఆకట్టుబాటు ప్రకారము సీతారామరాజునకు నెల యొకటికీ ఐదువేల రూపాయల నొసంగుచు మదరాసును విడిచి బయటికి బోవరాదని దొరతనమువా రాజ్ఞాపించిరి. ఇవియన్నియు జరిగిన పిదప విజయరామరాజు తాను స్వతంత్రముగా రాజ్యమును బాలించుకొనుచుండెను. పరిపాలనాకౌశల్యము గలవాడు గావున నమ్మకమగు నౌకరులను బెట్టి రాజ్యమున మంచి కట్టుబాటును జేసెను. దొరతనమువారు ఇతర రాజ్యములతో బాటు తనరాజ్యము గూడ హరించుటకె యెన్నో యత్నములు చేయుచున్నారనియు గనుగలిగి మెలగ కున్నచో విప్లవము తప్పదని తన విధులు సక్రమముగా నెరవేర్చు చుండెను. రాజ్యమునందు బంటలు మందగించుటచే సిస్తులు సకాలమున వసూలు కాకపోయెను. ఆకారణమున విజయరామరాజుచేయునది లేక దొరతనము వారికి నీయవలసియున్న పేష్కషు గూడ బకాయి పెట్టెను. కడకు విజయరామరాజు దొరతనము వారికి ఆఱులక్షల యిరువదియైదువేల రూపాయలు బాకిపడెను. అందుచే గంపెనీవారు విజయనగర రాజ్యమును దాము గైకొని ముప్పదివే లొక్కమాఱుగ నిచ్చునట్లును నెలనెలకు బండ్రెండు వందల రూపాయలు వ్యవయములకు ఇచ్చెద మని యును విజయరామరాజును బందరులో నుండవలసినదనియు నిర్బంధించిరి. కంపెనీవారు విజయనగరరాజ్యమును ఇతరులకు గౌలునకీయ యత్నించిరి. ఎవరునురాకపోయిరి. ఎటులేని భేదనీతితో విజయనగర రాజ్యము పరాధీనము గావింప నెన్నివిధముల యత్నించినను లాభము లేక పోయెను. విజయరామరాజు రాజ్యమునుంచి బందరుపోవుట కెంతమాత్ర మిష్టములేక పోయెను. ఆంగ్లేయుల యొత్తిడికి సహింపజాలక కడకు విజయరామరాజు బందరునకు బ్రయాణమయ్యెను. రాజ్యమును విడచి బందరులో బరాధీనముగా బడియుండ నాతనిమనస్సు ఒప్పుకొనకపోయెను. వెంటనే వెనుకకుమరలి తనరాజ్యమునందున్న సుప్రసిద్ధక్షేత్రరాజమగు పద్మనాభము జేరెను. అది యాంగ్లేయులు గ్రహించి విజయరామరాజును బందరునకు బొమ్మని మిగుల నొత్తిడిచేయుచుండిరి. ఆయన సమయమునకేదో ప్రత్యుత్తరము వ్రాయుచు బందరునకు బోడాయెను. కంపెనీవారి కిదియంతయు నవమానకరముగా నుంటచే విజయరామరాజునకు

ఇరువదినాలుగు గంటలలో బద్మనాభమును విడిచి బందరునకు బోవలసినదనియు అట్లు పోవనియెడల సైనికసహాయమున మేము పంపకమానమనియు వర్తమానమంపిరి. స్వతంత్రశీలుడు పరాక్రమశాలియునగు విజయరామరాజున కీసందేశము మిగుల నవమానకరముగ దోచి రాజ్యమునుండి తన్నంపుటకు కంపెనీవా రెవరిని తిరస్కార వాక్యముల నాడి తిరుగుబాటు చేయుటకు గొంతసైన్యమును సమకూర్చెను. పూర్వాభిమానము జ్యాతిభిమానముగల నాల్గువేలమంది రాచవారు స్వాతంత్ర్యసంగరమున బ్రాణముల వదలుటకు నిశ్చయించి విజయరామరాజు పక్షమున జేరిరి. రాచవారందఱను బద్మనాభస్వామి దేవళమున సంగరమున బ్రాణమున్నంతవఱకు బాల్గొన వాగ్దానము లొనరించి ప్రసాదమును స్వీకరించిరి. పైవారి యుత్తరువుచొప్పున ఆంగ్లేయ సైనికాధిపతియగు పెండరుగాష్టుగారు సుశిక్షితులగు నేడువందల యేబదిమంది భటులతో (క్రీ.శ. 1794 సం|| జూలయి 10 తేదికి) సూర్యోదయమగుసమయమునకు బద్మనాభమునకు జేరిరి. ఉభయులకు సంధికి వీలుకాకపోయెను. విజయరామరాజు స్వాతంత్ర్యము కోలుపోవుట కించుకేని యంగీకరింపక భటులను సంగరమునకు బురికొల్పి తానును ప్రతిపక్ష సైనికుల నెదిరింప బయలువెడలెను. ఉభయదళములకు ముప్పావుగంటసేపు ఘోరముగా యుద్ధముజరిగెను.

విజయరామరాజువెంట అంగరక్షకులుగా విజయగోపాలరాజు, వత్సవాయినరసరాజు, దాట్ల అప్పలరాజు, రావు జోగయ్య మొదలగు వీరులు పరివారముతోనుండి ఆంగ్లసైన్యమును భేధించుటకు ముందునకు ద్రోవతీయుచుండిరి. అందఱికంటె ముందు దావతుఖాన్ అను యవనుడు సైన్య ప్రేల్చిరి. విజయరామరాజు దేహమునందు బలుతావుల గాయములుపడెను. దానికిని లక్ష్యచేయక వాడికత్తితో విరోధిసేన నఱకుచుండెను. ఒడలినుండి రక్తము విశేషముగా గారుచుంటచే గొంతసేపటికి విజయరామరాజు పడిపోయెను. రాజుపడిపోయిన సంగతి వినినంతనే హతశేషులగు సైనికులు చెదరిపాఱిపోయిరి. రాజుస్థితి మిగుల దుస్తరముగా నుండెను. ఒడలంతయు గాయములతో నిండిపోయెను. ఇంతలో నాంగ్లసైనికులు నాలగైదుతుపాకుల నొక్కమాఱు ప్రేల్చిరి. విజయరామరాజు ఘోరమరణ మొందెను. కర్నలు పెండర్గాష్టు సంగరము నాపివేయించి యుద్ధప్రదేశమును దిలకించుటకు వచ్చెను. మూడువందల తొమ్మిదిమంది క్షత్రియసైనికులు వీరమరణము నొంది పడియుండిరి. విజయరామరాజు చుట్టును కోటగట్టినట్టుల నలువదిమంది క్షత్రియవీరులు తుపాకి దెబ్బలచే జచ్చిపడియుండిరి. వీరమరణమొందిన యాంధ్రవీరుల కళేబరములు ఆంగ్లసేనాధిపతికి మిగుల నాశ్చర్యము కలుగజేసెను. స్వతంత్రసంరక్షణము కొఱకు భటునివలె బోరాడి రణరంగమున నొఱగిన విజయరామరాజు త్యాగము పాశ్చాత్యులకు విస్మయము గూర్చెను. ఆంగ్లసైనికులు క్రమశిక్షణ గలవారగుటచేతను తుపాకులు ఫిరంగులు లోనగు మారణ పరికరములు సమృద్ధిగా నుంటచేతను విశేషనష్టమొందక జయించిరి. కంపెనివారిసేనలో బదుముగ్గురు మాత్రమె మర ణించిరి. అఱువదియొక్కరు గాయపడిరి. మహారాజును స్వాతంత్ర్యప్రియుడును ధర్మమూర్తియు నగు విజయరామరాజు మరణము విని దేశమంతయు నొక్కమాఱు పరితపించెను.

ఆంగ్లసైనికులు విజయరామరాజు దేహముపై నున్న అమూల్యరత్నాభరణములు, దుస్తులు లాగికొనిరి. బొబ్బిలి సంగ్రామములో దాండ్ర పాపారాయునిచే బెద్ద విజయరామరాజుగారు చంపబడిన పిదప ముప్పది తొమ్మిది సంవత్సరముల కీసంగరము జరిగెను. ఈ విజయరామరాజు గతింపగనే ఆంగ్లేయులు రాజ్యము నాక్రమించుకొనిరి. ఈ ఘోరసంగరవార్తవిని రాజ్యమున నున్న దనకేమి యపాయము వాటిల్లు నోయని విజయరామరాజుభార్య నారయణ బాబను నామముగల ఎనిమిది సంవత్సరముల బాలుని దీసికొని మన్నెములకు బోయెను. ఆంగ్లేయులు ఆబాలుని దల్లిని రప్పించి సంవత్సరమున కింతయని పన్ను గట్టునటుల నేర్పాటుగావించి రాజ్యము నాబాలున కప్పగించిరి.

విజయనగర రాజ్య విస్తృతియు నైశ్వర్యము స్వాతంత్ర్యాభిలాషయు విజయరామరాజు మరణముతో దగ్గిపోయెను. తరువాత నాకుటుంబమున స్వతంత్ర శీలుడగు రాజవతంసుడు జనించుట కవకాశములు లేక పోయెను. అతి విస్తృతమై యాంధ్రదేశమున కంతటికి నాయకరత్నము కాదగిన విజయనగర రాజ్యము క్రమముగా గొంతకొంత...